సోమవారం
29•1•2018
హైదరాబాద్
•వెల.5 రూ.
•సంపుటి 7 •సంచిక 232
•పేజీలు : 16 + (20/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

మిషన్ పెట్టుబడులు

రాష్ట్రానికి దుబాయ్ కంపెనీల రాక.. లూలూ, బీఆర్ షెట్టి గ్రూపుల పెట్టుబడులు రూ.3500 కోట్లు



యూఏఈ పర్యటనలో ఉన్న మంత్రి కే తారకరామారావు, అబూ ధాబీకి చెందిన ప్రముఖ సంస్థ లూలూ గ్రూపు చైర్మన్ యూసుఫ్ అలీ సమక్షంలో ఆ సంస్థ ప్రతినిధులు, తెలంగాణ పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ ఒప్పందాలు మార్చుకుంటున్న దృశ్యం

- రాష్ట్ర ప్రభుత్వంతో ఎంవోయూలు కుదుర్చుకొన్న కంపెనీలు
- మూడునెలల్లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన
- రాష్ట్ర ప్రజలకు ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం: మంత్రి కేటీఆర్
- కేటీఆర్ తపన ఆకట్టుకున్నదన్న దుబాయ్‌లోని భారత రాయబారి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించడంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. దుబాయ్‌కి చెందిన రెండు ప్రముఖ కంపెనీలు రాష్ట్రంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయి. రూ.3500కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో పలు ఒప్పందాలు కుదుర్చుకొన్నాయి. మూడునెలల్లో కంపెనీల నిర్మాణాలను సైతం ప్రారంభించేందుకు కార్యాచరణను సిద్ధం చేశాయి. ఈ కంపెనీల ద్వారా రాష్ట్రానికి చెందిన యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఆదివారం యూఏఈ పర్యటనలో ఉన్న మంత్రి కే తారకరామారావు, అబూ ధాబీకి చెందిన ప్రముఖ సంస్థ లూలూ గ్రూపు చైర్మన్ యూసుఫ్ అలీ సమక్షంలో ఆ సంస్థ ప్రతినిధులు, తెలంగాణ పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్.. మూడు ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందాల విలువ సుమారు రూ.2500 కోట్లు. మన రాష్ట్రంలో 18 లక్షల చదరపు అడుగుల్లో భారీ షాపింగ్ మాల్‌తోపాటు, ఫుడ్ ప్రాసెసింగ్, లాజిస్టిక్స్, కూరగాయల ఎగుమతుల యూనిట్లను లూలూ స్థాపిస్తుంది. వీటిద్వారా దాదాపు ఆరువేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. మరోవైపు డాక్టర్ బీఆర్ షెట్టి గ్రూప్స్ తెలంగాణలో మూడు ప్రాజెక్టుల నిర్మాణానికి సుమారు వెయ్యి కోట్ల రూపాయల మేర ఒప్పందాలను కుదుర్చుకొన్నది. మందుల తయారీ, పరిశోధన, వైద్య పరికరాలు, గ్రీన్‌ఫీల్డ్ వైద్యశాలలు, వైద్య, ఇంజినీరింగ్ విద్యాసంస్థల నిర్మాణాన్ని బీఆర్‌ఎస్ వెంచర్స్ చేపడుతుంది. మంత్రి కేటీఆర్, బీఆర్ షెట్టి గ్రూపుల చైర్మన్ బీఆర్ షెట్టిల సమక్షంలో రాష్ట్ర పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, బీఆర్‌ఎస్ వెంచర్స్ ప్రతినిధులు ఈ మేరకు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. రాబోయే మూడునెలల్లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా వీటి నిర్మాణం ప్రారంభమవుతుంది. మూడు నుంచి ఐదేండ్ల లోపు ఈ సంస్థలు తమ ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తిచేస్తాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ప్రపంచస్థాయి ప్రమాణాలతో సౌకర్యాలను కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా రిటైల్, ఆహార రంగాల్లో అత్యున్నత ప్రమాణాలు పాటించేందుకు

మిగతా 2వ పేజీలో

లూలూ కంపెనీ పెట్టుబడులు

- మొత్తం పెట్టుబడి 400 మిలియన్ డాలర్లు (రూ. 2,500 కోట్లు)
- 18 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మెగా షాపింగ్‌మాల్
- ఆహారశుద్ధి కర్మాగారం
- పండ్లు, కూరగాయల శుద్ధి, ఎగుమతులు, లాజిస్టిక్ యూనిట్
- దాదాపు ఆరువేల మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పన

బీఆర్ షెట్టి గ్రూప్ పెట్టుబడులు

- మొత్తం పెట్టుబడి రూ. 1000 కోట్లు
- 20 ఎకరాల్లో ఫార్మాస్యూటికల్ కంపెనీ, పరిశోధన- అభివృద్ధి యూనిట్
- సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో నెలకొల్పనున్న తెలంగాణ వైద్య పరికరాల పార్కులో దాదాపు 20 ఎకరాల్లో వైద్య పరికరాల సంస్థ (డయాలిసిస్ యంత్రాలు, దవాఖానల ఫర్నిచర్, ఇతర ఉపకరణాల తయారీ) ఏర్పాటు.
- 20 ఎకరాల్లో 500 బెడ్ల సామర్థ్యంతో గ్రీన్‌ఫీల్డ్ మల్టీ స్పెషాలిటీ వైద్యశాల
- 50 ఎకరాల భూమిలో వైద్య విద్య, ఇంజినీరింగ్, మేనేజిమెంట్ ఉన్నత విద్యాసంస్థ ఏర్పాటు

• జనమేడారం కౌంట్‌డౌన్ 2



14

ఆదివారం రాత్రి మేడారంలోని మంచె పైనుంచి సమ్మక్క-సారలమ్మల గద్దెలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

వనజాతర

భారీగా తరలివచ్చిన భక్తులు

అమ్మవార్లను దర్శించుకున్న డిప్యూటీ సీఎం కడియం, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. జాతీయ హోదా సాధిస్తామన్న ఎంపీలు

2న మేడారానికి ముఖ్యమంత్రి కేసీఆర్

నేటినుంచి బడ్జెట్ సమావేశాలు



రాష్ట్రపతి ప్రసంగంతో పార్లమెంట్ ప్రారంభం

అనంతరం ఉభయసభల్లో ఆర్థిక సర్వే నివేదిక

ఫిబ్రవరి 1న 2018 సాధారణ బడ్జెట్

ట్రిపుల్ తలాక్, ఓబీసీ బిల్లుల్ని నెగ్గించుకునేందుకు సర్కారు పట్టు

రెండు విడుతలుగా బడ్జెట్ సమావేశాలు

సహకరించాలని విపక్షాలను కోరిన ప్రధాని


5

ఫెదరర్ @ 20

20 గ్రాండ్‌స్లామ్‌లతో స్విస్ వీరుడి రికార్డు

ఆస్ట్రేలియన్ ఓపెన్ కైవసం

వయస్సు పెరిగినా..వన్నె తరుగలేదని స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెదరర్ మరోమారు నిరూపించాడు. కెరీర్‌లో 30వ గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడిన ఫెదరర్..20 టైటిళ్లతో చరిత్ర సృష్టించాడు. ఓపెన్ ఎరాలో ఎవరికీ సాధ్యం కాని రీతిలో సరికొత్త రికార్డును నెలకొల్పాడు. సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మారిన్ సిలిచ్‌పై ఉత్కంఠ విజయంతో రాయ్ ఎమర్సన్, జొకోవిచ్ రికార్డును సమం చేస్తూ ఆరోసారి విజేతగా నిలిచాడు.



వివరాలు ఆటలో

సిరాజ్‌కు 2.60 కోట్లు

హైదరాబాదీ క్రికెటర్‌కు బంపర్ ఆఫర్

సన్‌రైజర్స్ నుంచి ఆర్సీబీలోకి యువ పేసర్



హైదరాబాదీ యువ క్రికెటర్ మహ్మద్ సిరాజ్ ఐపీఎల్ వేలంలో మరోమారు మెరిసాడు. ఆదివారం జరిగిన వేలంలో రూ 2.60 కోట్లకు ఆర్సీబీ సొంతం చేసుకున్నది.. సాధారణ ఆటోరిక్షా డ్రైవర్ కొడుకైన సిరాజ్..అంచలంచెలుగా ఎదిగిన వైనం అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నది.

ఇక హామీలతో శాంతించేది లేదు

బీజేపీది మాటల ప్రభుత్వం.. మూడున్నరేండ్లు ఎదురుచూశాం

విభజన హామీలను నెరవేర్చాల్సిందే

లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్షనేత జితేందర్‌రెడ్డి ధ్వజం

రాష్ట్రానికి నిధుల కేటాయింపు, విడుదలపై బడ్జెట్ సమావేశాల్లో కేంద్రంపై ఒత్తిడి తెస్తామని వెల్లడి



2

యాసిడ్ దాడి బాధితులకు కోటా

- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పిస్తూ నిర్ణయం
- ఆటిజం, మానసిక రుగ్మతలు ఉన్నవారికి కూడా

న్యూఢిల్లీ, జనవరి 28:



యాసిడ్ దాడి బాధితులతోపాటు మానసిక సమస్యలు, ఆటిజం, మేధో వైకల్యం ఉన్నవారికి ఊరట కలిగించేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. వీరికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పిస్తూ ఆదేశాలు జారీచేసింది. ప్రత్యక్ష నియామకాల్లో ఏ, బీ, సీ గ్రూపులకు ప్రస్తుతం ఉన్న మూడు శాతం రిజర్వేషన్లను నాలుగు శాతానికి పెంచి నిర్దిష్ట వైకల్యం ఉన్న బాధితులకు రిజర్వేషన్ కల్పించనున్నారు. నిర్దిష్ట వైకల్యం అంటే ఒక వ్యక్తికి 40 శాతానికంటే ఎక్కువ వైకల్యం ఉండాలి. ఈ మేరకు సిబ్బంది, శిక్షణ వ్యవహారాలశాఖ (డీవోపీటీ) ఇటీవల కేంద్ర ప్రభుత్వంలోని అన్ని శాఖలకు ఓ లేఖ రాసింది. యాసిడ్ దాడి బాధితులతోపాటు చెవుడు, అంధత్వం, మరుగుజ్జులు, పాక్షిక పక్షవాతం, కుష్ఠు, కండరాల బలహీనత ఉన్నవారికి ఒక్కశాతం రిజర్వేషన్ కల్పించాలని తెలిపింది. దీంతోపాటు ఆటిజం, మేధో వైకల్యం, అభ్యాస వైకల్యం, మానసిక సమస్యలు ఉన్నవారికి ఒక్క శాతం రిజర్వేషన్ కల్పించాలని పేర్కొన్నది. నేర్చుకోవడం, సమస్యలు పరిష్కరించడం వంటి రోజువారీ మేధో కార్యకలాపాల్లో సమస్యలు ఉన్నవారిని మేధో వైకల్యం కలిగినవారిగా పరిగణిస్తారు. మానసిక సమస్యలు, యాసిడ్ దాడి బాధితులకు రిజర్వేషన్ కల్పించేందుకు దివ్యాంగుల హక్కుల చట్టం-2016 ప్రకారం నియమ నిబంధనలు రూపొందిస్తారు. 2005లో డీవోపీటీ జారీచేసిన ఆదేశాల ప్రకారం వివిధ రకాల వైకల్యాలు కలిగిన వ్యక్తులకు మూడుశాతం రిజర్వేషన్లు కొనసాగుతున్నాయి. ఇందులో

మిగతా 5వ పేజీలో

ఎంఆర్‌ఐ స్కానింగ్ యంత్రానికి యువకుడి బలి

ఆక్సిజన్ సిలిండర్‌తో ఎంఆర్‌ఐ గదిలోకి..

ఆకర్షించిన అయస్కాంతం యంత్రంలో ఇరుక్కుని మృతి

ముంబై దవాఖానలో ఘటన

5

ముస్లింల విద్యాదీపం

- సత్ఫలితాలిస్తున్న మైనారిటీ గురుకులాలు
- ఫలించిన సీఎం కేసీఆర్ సంకల్పం
- టెమ్రీస్ కృషితో మారిన ముస్లింల దృక్పథం

(మహ్మద్ సలీముద్దీన్, నమస్తే తెలంగాణ ప్రతినిధి)

'హర్ ఫర్ద్ పడేగా- ఘర్ ఘర్ బడేగా' (ప్రతివాడు చదివితే- ప్రతి ఇంట్లో అభివృద్ధి వస్తుంది).. నిరక్షరాస్యత ఎక్కువగా ఉండే ముస్లిం కుటుంబాల్లో విద్యాకాంతులు తీసుకువచ్చేందుకు రూపొందించిన నినాదమిది. ఇప్పటి వరకు హాస్టళ్ల విద్య అలవాటులేని ముస్లింల పిల్లలు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటుచేసిన మైనారిటీ గురుకులాలవైపు పెద్దఎత్తున ఆకర్షితులవుతున్నారు. ముస్లిం కుటుంబాల్లో బాలికలను హాస్టళ్లలో చేర్పించడానికి వారి తల్లిదండ్రులు ఏమాత్రం మొగ్గుచూపేవారు కాదు. అవసరమైతే చదువును మాన్పించేవారు. దీంతో ముస్లిం సమాజంలో రోజురోజుకు నిరక్షరాస్యత పెరిగిపోతూ ఆందోళన కలిగించే పరిణామంగా తయారైంది. ఈ సమస్యను అధిగమించడానికి తెలంగాణ ప్రభుత్వం చేసిన కృషి ఇప్పుడు సత్ఫలితాలు ఇస్తున్నది. ముస్లింలలో నిరక్షరాస్యతను దూరంచేసి వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే సంకల్పం, పట్టుదలతో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటుచేశారు. కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్య, వసతి, భోజనం, ఉచితంగా ఇతర సౌకర్యాలు కల్పించి ముస్లిం బాలబాలికలను గురుకులాలబాట పట్టించారు. 2016-17, 2017-18 విద్యాసంవత్సరాల్లో రాష్ట్రంలో మొత్తం 204 మైనారిటీ రెసిడెన్షియల్ స్కూళ్లు, రెండు రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేశారు. వీటిల్లో చదివే ఒక్కొక్క విద్యార్థిపై ప్రభుత్వం రూ.80 వేల వరకు ఖర్చుపెడుతున్నది. గురుకులాలు ఏర్పాటైన తొలి ఏడాది 2016-17లో 18వేల మంది గురుకులాల్లో చేరగా.. అందులో ఆరువేల మంది బాలికలు అడ్మిషన్లు తీసుకున్నారు. రెండో ఏడాది మొత్తం 48 వేల మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారు.



మైనారిటీ గురుకులంలో శ్రద్ధగా పాఠాలు వింటున్న బాలికలు (ఫైల్)

మైనారిటీ గురుకుల పాఠశాలలు	204
మైనారిటీ గురుకుల కళాశాలలు	2
గురుకుల పాఠశాలల్లో చదువుతున్న మొత్తం విద్యార్థుల సంఖ్య	48 వేలు
బాలికల సంఖ్య	22 వేలు
ఒక్కొక్క విద్యార్థి కోసం ప్రభుత్వం పెడుతున్న ఖర్చు	రూ.80 వేలు
వచ్చే విద్యాసంవత్సరానికి నియామకమయ్యే రెగ్యులర్ ఉపాధ్యాయులు	2,268 మంది

ముస్లింలలో చైతన్యానికి టెమ్రీస్ కృషి..

ప్రభుత్వపరంగా ఇన్ని సౌకర్యాలు కల్పించినా తమ పిల్లలను గురుకులాల్లో చేర్పించడానికి ముస్లింలు ఇంకా పూర్తిస్థాయిలో ముందుకు రావడంలేదు. ఈ సమస్యను అధిగమించేందుకు తెలంగాణ మైనారిటీల విద్యాసంస్థల సొసైటీ (టెమ్రీస్) చొరవతీసుకుంటున్నది. ముస్లింలు

మిగతా 12వ పేజీలో

తహసీల్దార్లకు తర్ఫీదు

- ఫిబ్రవరి మొదటివారం నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై శిక్షణ
- ప్రత్యేకంగా మూడు కమిటీల నియామకం
- మార్చి నుంచి మండల కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లకు చురుకుగా ఏర్పాట్లు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

రాష్ట్రవ్యాప్తంగా మండల రెవెన్యూ కార్యాలయాలలో వివిధ రకాల స్థిర, చరాస్తుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించడానికి తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. రిజిస్ట్రేషన్లు చేయడానికి అనుసరించాల్సిన విధివిధానాలపై తహసీల్దార్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఫిబ్రవరి మొదటివారంలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడానికి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు మూడు ప్రత్యేక కమిటీలను ఏర్పాటుచేశారు. ఎమ్మార్వో కార్యాలయాలన్నింటిలో రిజిస్ట్రేషన్లకు అవసరమైన సౌకర్యాలను కల్పించడంతోపాటు సాంకేతిక సహకారాన్ని అందించడానికి సన్నాహాలుచేస్తున్నారు. మార్చి నుంచి మండల రెవెన్యూ కార్యాలయాల్లో కూడా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. రిజిస్ట్రేషన్లలో అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా పారదర్శకతను పెంచాలన్న దృక్పథంతో తహసీల్దార్లకు రిజిస్ట్రేషన్ చేసే అధికారాలను ఇవ్వాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలలోనే కాకుండా అన్ని మండల

మిగతా 2వ పేజీలో

ఆస్తి కోసం తండ్రి, ఇద్దరు తమ్ముళ్ల దారుణ హత్య

తనకే భూమి దక్కాలన్న కసి సైకోగా మార్చింది

నాగర్‌కర్నూల్ జిల్లాలో ఘాతుకం.. పోలీసుల అదుపులో నిందితుడు

3

శ్రీనివాస్‌ది రాజకీయ హత్య కాదు

క్షణికావేశంలో ఘటన జరిగింది.. 11 మంది నిందితులను గుర్తించాం

8 మందిని అరెస్ట్ చేశాం.. నల్లగొండ ఎస్పీ శ్రీనివాసరావు వెల్లడి

ఫిబ్రవరి 1న మల్లోజుల స్మారక అవార్డు ప్రదాన సభ

- ప్రముఖ కవి వర్థుల శివకుమార్‌కు అవార్డు అందజేత
- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ఉద్యమ క్షేత్రంలో సుపరిచితుడైన మల్లోజుల సదాశివుడు స్మారక అవార్డు ప్రదాన సభ తెలంగాణ వికాస సమితి సారథ్యంలో ఫిబ్రవరి ఒకటిన హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరుగనున్నది. ఈ ఏడాది అవార్డును ప్రముఖ కవి వర్థుల శివకుమార్‌కు అందజేయనున్నట్టు సమితి ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి తన్నీర్ హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. 'ఏ మున్నదక్కో'.. 'పారాణి ఆరలేదు చెల్లెలా'.. 'తలాపున పారుతుంది గోదావరి'.. వంటి ప్రజాదరణ పొందిన గీతాలెన్నెన్నో రాసి ప్రజల్లో ఉత్తేజాన్ని నింపిన కవి మల్లోజుల సదాశివుడు. తెలంగాణ ప్రజాక్షేత్రంలో ఎగిసిపడిన ప్రజాఉద్యమాలతో మమేకమై జీవితంలో ఎన్నో ఘర్షణలను, ఆటుపోట్లను, చిత్రహింసలను, అణిచివేతలను ఎదుర్కొని నిలబడిన కవి. తెలంగాణ వికాస సమితి ఆయన జ్ఞాపకార్థం అవార్డును నెలకొల్పింది. ఇప్పటివరకు లబ్ధప్రతిష్ఠులైన కవులకు ప్రదానం చేసింది. ఫిబ్రవరి ఒకటిన సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ అవార్డు ప్రదాన సభలో మంత్రి హరీశ్‌రావుతోపాటు రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, సీఎంవో ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, తెలుగు వర్సిటీ వీసీ ఎస్వీ సత్యనారాయణ, సదాశివుడు కుటుంబసభ్యులు పాల్గొంటారు. గోదావరిఖని కళాకారులు సదాశివుని గీతాలను ఆలపించనున్నారు. పీ చంద్ రచించిన 'తలాపున పారే పాట' సదాశివుని జీవితకథ పుస్తకాన్ని సభలో ఆవిష్కరించనున్నారు.



జూబ్లీహిల్స్ ప్రశాంత్‌నగర్ బస్తీ దవాఖానలో ఆదివారం ఉదయం చిన్నారికి పోలియో చుక్కలు వేసి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్

99% పిల్లలకు పోలియో చుక్కలు

మిగిలిన చిన్నారులకు నేడు, రేపు వ్యాక్సిన్ పంపిణీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోలియోరహిత సమాజాన్ని నిర్మించేందుకు తెలంగాణ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కృషిచేస్తున్నది. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడుత పల్స్‌పోలియో కార్యక్రమం కింద 22,768 కేంద్రాల్లో 0-5 ఏండ్ల లోపు పిల్లలకు పోలియో వేయించింది. రాష్ట్రవ్యాప్తంగా 36,55,204 మంది పిల్లలకు పోలియో చుక్కల పంపిణీ లక్ష్యం కాగా సాయంత్రం వరకు 99 శాతం (36,22,981మంది) చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్టు ఆ శాఖ తెలిపింది. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ప్రధాన కూడళ్లతోపాటు అన్ని వైద్య, ఆరోగ్యశాఖ కేంద్రాల్లో వైద్యసిబ్బంది పోలియో చుక్కల పంపిణీ చేపట్టారు. ప్రభుత్వ ముందస్తు చర్యల కారణంగా చుక్కల పంపిణీ కార్యక్రమం సజావుగా సాగింది. పల్స్ పోలియో కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆ శాఖ 55 లక్షల వ్యాక్సినేషన్ డోస్‌లు అందుబాటులో ఉంచింది. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులకు సోమ, మంగళవారాల్లో ఇంటింటికి తిరిగి ఏఎన్ఎం, ఇతర వైద్యసిబ్బంది చుక్కలు పంపిణీ చేస్తారు. మార్చి 11న రెండోవిడుత పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించనున్నారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖతోపాటు మహిళా శిశు సంక్షేమశాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పాఠశాల విద్యాశాఖ, పంచాయతీరాజ్, ఐకేపీ, డిఫెన్స్, నేవీ, ఆర్టీసీశాఖల సమన్వయంతో పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించారు.

బడ్జెట్‌పై నేడు సీఎస్ సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం 2018-19 వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు తుది కసరత్తు చేస్తున్నది. ఆయాశాఖలవారీగా కొనసాగుతున్న అభివృద్ధి పనులు, కొత్తగా చేపట్టాల్సిన పనులు, సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధికి కేటాయించే నిధులకు సంబంధించి ఆయాశాఖలు ఇప్పటికే ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపించినట్టు సమాచారం. ఈ ప్రతిపాదనల ఆధారంగా.. జీఎస్టీ, పెట్రో ఉత్పత్తులపై వచ్చే పన్నులు, కేంద్రం వసూలు చేసే పన్నుల నుంచి రాష్ట్రానికి వచ్చే వాటా వీటన్నింటినీ బేరీజు వేసుకొని బడ్జెట్ అంచనాలను రూపొందిస్తారు. బడ్జెట్‌కు తుదిరూపు ఇచ్చేందుకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. శాఖలవారీగా వచ్చిన ప్రతిపాదనలను క్రోడీకరిస్తూ బడ్జెట్ అంచనాలు తయారుచేసి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పంపిస్తారు. సీఎం సూచనల మేరకు మార్పులు, చేర్పులు చేయనున్నట్టు సమాచారం.

జీఎస్టీ వసూలుకు మొబైల్ టీమ్‌లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జీఎస్టీ ఎగవేతదారులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించనున్నాయి. ఫిబ్రవరి ఒకటి నుంచి వే బిల్లు లేకుండా సరుకులను రవాణా చేసే వారికి భారీ జరిమానా విధించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర వాణిజ్యపన్నులశాఖ అధికారులు, కేంద్ర జీఎస్టీ అధికారులు సంచార బృందాలను రంగంలోకి దింపుతున్నారు. రాష్ట్రం నుంచి సరఫరా అయ్యే సరుకులకు సంబంధించి వాణిజ్య పన్నులశాఖ ప్రత్యేకంగా వే బిల్లులను ఇస్తున్నది. కానీ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే సరుకులకు జీఎస్టీ వే బిల్లులు ఇవ్వడం లేదు. దీనిని అవకాశంగా తీసుకుని కొందరు డీలర్లు పన్ను చెల్లించకుండా సరుకులను అడ్డదారిలో తరలిస్తున్నారు. ఫిబ్రవరి నుంచి జీఎస్టీ పోర్టల్‌లో వేబిల్లులు అందుబాటులోకి వస్తున్నందున కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్, కమిషనర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి నుంచి స్పెషల్ డ్రైవ్‌ల కోసం మొబైల్ టీములు రంగంలోకి దిగుతున్నాయి.

మిషన్ పెట్టుబడులు

మొదటిపేజీ తరువాయి...

కృషి చేస్తున్నామన్నారు. ఈ రంగాల్లో ప్రసిద్ధి చెందిన సంస్థ కాబట్టే లూలూ గ్రూప్ తమ సహజ ఎంపిక అయిందని కేటీఆర్ తెలిపారు. ఈ సంస్థకు ప్రభుత్వపరంగా అన్ని రకాలుగా మద్దతు, ప్రోత్సాహం ఉంటుందని, రాబోయే రోజుల్లో మరిన్ని ప్రాజెక్టుల్లో కలిసి పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లూలూ సంస్థ సీఈవో సైఫీ రూపావాలా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అష్రాఫ్ అలీ, సీవోవో సలీమ్, ఓమన్ ఇండియా డైరెక్టర్ అనంత్ ఏవీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తెలంగాణలో మంచి అవకాశాలు: లూలూ చైర్మన్ యూసుఫ్ అలీ

ఈ సందర్భంగా లూలూ గ్రూపు చైర్మన్ యూసుఫ్ అలీ మాట్లాడుతూ భారత్‌లో తమ కంపెనీ విస్తరణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవడానికి సంతోషిస్తున్నామని తెలిపారు. కొత్త రాష్ట్రమైనా రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంచి ప్రోత్సాహం, స్పందన లభించిందని కితాబిచ్చారు. తెలంగాణలో వ్యాపార విస్తరణకు మంచి అవకాశాలున్నాయన్నారు. తమకు భూమిని అప్పగించడానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రక్రియను ప్రారంభించిందని, మూడునెలల్లో పనులను ప్రారంభిస్తామని అలీ ప్రకటించారు.

ఐసీఏఐ సమావేశంలో..

ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఆధ్వర్యంలో 'తెలంగాణ-వ్యాపార, పెట్టుబడుల అవకాశాలు' అంశంపై దుబాయ్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు, వ్యాపార అవకాశాలను మంత్రి వారికి వివరించారు. టీఎస్ఐపాస్ చట్టం గురించి సవివరంగా తెలిపారు. 15 రోజుల్లో పరిశ్రమలకు అనుమతులు ఇచ్చే విధానం భారతదేశం సహా మరే ఇతర దేశాల్లోనూ లేదని స్పష్టంచేశారు. పరిశ్రమలకు అవసరమైన భూమి, నీరు, విద్యుత్ తెలంగాణలో కావాల్సినంతగా ఉన్నాయని వెల్లడించారు. పరిశ్రమలకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని, లక్ష ఎకరాలకు పైగా ల్యాండ్ బ్యాంకు సిద్ధంగా ఉన్నదని, మిషన్ భగీరథ ద్వారా నీటిని సరఫరా చేస్తామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. వీటన్నింటితోపాటు తెలంగాణలో మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఆయా రంగాలవారీగా పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ , ఐసీఏఐ దుబాయ్ చైర్మన్ నవీన్ శర్మ, వైస్ చైర్మన్ మహమూద్ బంగార, కార్యదర్శి అనిశ్ మెహతా, అనురాగ్ చతుర్వేది పాల్గొన్నారు.



ఆదివారం యూఏఈలో మంత్రి కే తారకరామారావు, అబుధాబీకి చెందిన బీఆర్ షెట్టి గ్రూపుల చైర్మన్ బీఆర్ షెట్టిల సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న రాష్ట్ర పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, బీఆర్ఎస్ వెంచర్స్ ప్రతినిధులు

కేటీఆర్ తపన ఆకట్టుకుంది: దుబాయ్‌లో భారత రాయబారి

తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొని వచ్చేందుకు రాష్ట్ర మంత్రి కేటీఆర్ చేస్తున్న ప్రయత్నాలు తనను ఎంతగానో ఆకట్టుకొన్నాయని దుబాయ్‌లోని భారత రాయబారి నవదీప్ సూరి ట్విట్టర్‌లో ప్రశంసించారు. దుబాయ్ పర్యటనలో ఉన్న మంత్రి కేటీఆర్ మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు రావడానికి సహకరించాలని సూరిని మంత్రి కేటీఆర్ కోరారు. పెట్టుబడుల ఆకర్షణకు మంత్రి చేస్తున్న ప్రయత్నాలు, తపన తనను ఆకట్టుకొన్నాయని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఆయన స్పందనపై మంత్రి కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.

తహసీల్దార్లకు తర్ఫీదు

మొదటిపేజీ తరువాయి...

కార్యాలయాలలో రిజిస్ట్రేషన్లు చేసుకొనే అవకాశం ఉంటుంది. రాష్ట్రంలో మొత్తం 584 మండలాలున్నాయి. ప్రస్తుతం 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ఈ 141 సబ్ రిజిస్ట్రార్ల పరిధి వారి కార్యాలయమున్న మండలానికే పరిమితమవుతుంది. మిగతా 443 చోట్ల ఎమ్మార్వోలకు సబ్‌రిజిస్ట్రార్ బాధ్యతలను అప్పగిస్తారు. భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు, భూరికార్డుల నిర్వాహణలో వందకు వంద శాతం పారదర్శకత సాధించడం, అవినీతిని నిరోధించడం, నకిలీ పాస్‌పుస్తకాలను అరికట్టడం కోసం ప్రభుత్వం ఈ సంస్కరణలను తీసుకొస్తున్నది.

మార్చిలో నవశకానికి నాంది

ఎంపిక చేసిన మండల కార్యాలయాలలో మార్చి నెలలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొదలవుతుంది. ఫిబ్రవరి నెలాఖరులోగా 443 మండలాలలో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌తోపాటు రిజిస్ట్రేషన్‌కు అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తి చేయనున్నారు. స్థిర, చరాస్తుల క్రయవిక్రయాల ప్రక్రియలో మార్చి నుంచి కొత్తశకం ప్రారంభమవుతుంది. భారత స్టాంపుల చట్టం 1899, రిజిస్ట్రేషన్ యాక్ట్ 1908 ప్రకారం దస్తావేజులను రిజిస్ట్రేషన్ చేయడం, మార్కెట్ విలువను అనుసరించి స్టాంపు, రిజిస్ట్రేషన్ ఫీజులను వసూలు చేసి క్రయ, విక్రయదారుల పరస్పర అంగీకారంతో ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసే అధికారం సబ్ రిజిస్ట్రార్లకు ఉంటుంది. వీటితోపాటు కోర్టు కేసులలో, ఇతర వ్యవహారాలలో ఒక వ్యక్తి వేరొక వ్యక్తికి లేదా సంస్థకు ఇచ్చే జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ, వివాహాల వంటివి రిజిస్ట్రేషన్ చేసే అధికారం కూడా ఉంటుంది. ఇంతవరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖకు చెందిన సబ్‌రిజిస్ట్రార్లు, జిల్లా రిజిస్ట్రార్లు మాత్రమే ఈ విధులను నిర్వర్తిస్తున్నారు. రిజిస్ట్రేషన్ యాక్ట్ సెక్షన్ 6 ప్రకారం ప్రభుత్వం ఏ శాఖ అధికారికైనా రిజిస్ట్రేషన్ బాధ్యతలను, హక్కులను కట్టబెట్టే అవకాశముండటంతో ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యంకోసం మండల రెవెన్యూ అధికారులకు కూడా రిజిస్ట్రేషన్ అధికారాలనివ్వాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే.

రెవెన్యూలో రిజిస్ట్రేషన్లకు మూడు కమిటీలు..

ఎంపికచేసిన మండల కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ల కోసం అవసరమైన సౌకర్యాలను కల్పించడానికి స్టాంపులు రిజిస్ట్రేషన్లశాఖ జాయింట్ కమిషనర్ వేముల శ్రీనివాసులు చైర్మన్‌గా టెక్నాలజీ కమిటీని నియమించారు. ఈ టెక్నాలజీ కమిటీ మండల రెవెన్యూ కార్యాలయాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అవసరమైన సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సదుపాయాలను కల్పిస్తుంది. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ ఇతర శాఖల వెబ్‌సైట్లను అనుసంధానం చేస్తుంది. మండల రెవెన్యూ అధికారులకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై తర్ఫీదునివ్వడానికి మేడ్చల్ జిల్లా డీఐజీ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కెపాసిటీ బిల్డింగ్ కమిటీని ఏర్పాటుచేశారు. ఈ కమిటీ ఫిబ్రవరి మొదటివారంనుంచి తహసీల్దార్లకు శిక్షణ ఇస్తుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాటించాల్సిన నియమాలు, నిబంధనలపై అవగాహన కల్పిస్తారు. నోటిఫికేషన్లు ఇతర వ్యవహారాలను పర్యవేక్షించడానికి రంగారెడ్డి జిల్లా డీఐజీ వీవీ నాయుడు చైర్మన్‌గా మరో కమిటీ ఏర్పాటైంది.

ఇకపై హామీలతో శాంతించేది లేదు

- బీజేపీది మాటల ప్రభుత్వం
- విభజన హామీలను నెరవేర్చాల్సిందే
- లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత జితేందర్‌రెడ్డి ధ్వజం
- రాష్ట్రానికి నిధుల విడుదలపై బడ్జెట్ సమావేశాల్లో కేంద్రంపై ఒత్తిడి తెస్తామని వెల్లడి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో డిమాండ్ చేస్తామని లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత ఏపీ జితేందర్‌రెడ్డి చెప్పారు. మూడున్నరేండ్లు ఎదురుచూశామని, ఇకపై హామీలతో శాంతించేది లేదని స్పష్టంచేశారు. బీజేపీది మాటల ప్రభుత్వమని స్పష్టమైందని ధ్వజమెత్తారు. ప్రజలు కూడా ఈ విషయాన్ని గ్రహించారని అన్నారు. సోమవారం నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, స్పీకర్ సుమిత్రా మహాజన్ వేర్వేరుగా ఏర్పాటుచేసిన అఖిలపక్ష సమావేశాలకు టీఆర్ఎస్ నుంచి ఎంపీలు జితేందర్‌రెడ్డి, కే కేశవరావు హాజరయ్యారు. అనంతరం జితేందర్‌రెడ్డి ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. హైకోర్టు, బయ్యారం ఉక్కుపరిశ్రమ, ఉద్యాన యూనివర్సిటీ, గిరిజన యూనివర్సిటీ, ఎయిమ్స్ నిధుల విడుదలపై స్పష్టమైన ప్రకటన వస్తుందని ఆశిస్తున్నామని తెలిపారు. అంశాలవారీగా తాము మద్దతు ఇస్తున్నా కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై శీతకన్ను వేసిందని విమర్శించారు. బడ్జెట్ సమావేశాల్లో తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధుల కేటాయింపు, విడుదలపైనే ప్రధానంగా కేంద్రంపై ఒత్తిడి తెస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిక పథకాల్లో కేంద్రం వాటాగా రాష్ట్రానికి దాదాపుగా రూ.5 వేల కోట్లు విడుదల చేయాల్సి ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరును మెచ్చి ప్రముఖ మీడియా సంస్థ ఇండియా టుడేతోపాటు అనేక సంస్థలు అవార్డులు ఇచ్చాయని గుర్తుచేశారు. కేంద్రం ఇచ్చిన నిధుల కంటే ఆయా పథకాలపై రాష్ట్ర ప్రభుత్వం రెట్టింపు ఖర్చు చేసిందని అన్నారు. ఇప్పటికైనా నిధులు విడుదల చేయకుంటే కేంద్రంపై తీవ్రంగా స్పందిస్తామని హెచ్చరించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులతోపాటు అదనపు నిధులు ఇవ్వాలని అనేకమార్లు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రధాని మోదీని కలిశారని గుర్తుచేశారు. రాష్ట్ర మంత్రులు ఢిల్లీకి వచ్చి కేంద్రమంత్రులను, అధికారులను కలిశారని, కానీ, నిధుల విడుదలలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇకపై దీనిని సహించబోమని స్పష్టం చేశారు. కొత్త రాష్ట్రమైనప్పటికీ దేశంలో అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా తెలంగాణలో అనేక పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. కానీ, కేంద్ర ప్రభుత్వ తీరు ప్రోత్సాహకరంగా లేదన్నారు. కేంద్రం నిధుల విడుదలలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా రాష్ట్ర ప్రభుత్వ పన్నులతోనే అనేక పథకాలను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నడిపిస్తున్నారని తెలిపారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.52 గంటలకు



సూర్యాస్తమయం: 6.06 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం ద్వాదశి తె. 5.19 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: మృగశిర తె. 1.43 వరకు తదుపరి ఆరుద్ర, అమృతఘడియలు: మధ్యాహ్నం 2.10 నుంచి 3.46 వరకు, రాహుకాలం: ఉదయం 8.17 నుంచి 9.41 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.07 నుంచి 12.52 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.06 నుంచి 3.51 వరకు, వర్జ్యం: ఉదయం 9.11 నుంచి 10.47 వరకు.

లోకం పోకడ




చెత్త వేసినందుకు జరిమానా అడిగితే ఎలా చెల్లిస్తుందో చూడు!

ప్రమాదరహిత ప్రయాణమే ధ్యేయం

- జీరోస్థాయికి తగ్గించేలా ప్రణాళికలు
- గతేడాది కంటే తగ్గిన ప్రమాదాల శాతం
- ఆక్సిడెంట్‌రహిత డ్రైవర్లకు ప్రోత్సాహకాలు
- కుటుంబసభ్యుల సమక్షంలో సన్మానాలు
- ప్రయాణికులకు మరింత భరోసా కల్పించేలా టీఎస్ఆర్టీసీ చర్యలు

హైదరాబాద్/ హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ప్రమాద రహితమే లక్ష్యంగా రయ్‌రయ్ మంటూ టీఎస్ఆర్టీసీ దూసుకుపోతున్నది. ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చేందుకు అన్నిచర్యలు చేపడుతున్నది. ఏండ్లుగా బస్సులు నడుపుతున్నా ప్రమాదమెరుగని డ్రైవర్లను కుటుంబ సభ్యుల సమక్షంలోనే గౌరవంగా సన్మానిస్తూ.. సేవలకు గుర్తింపునిస్తున్నది. ఉత్తమ సేవలకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నది. సిబ్బందిలో పని ఒత్తిడిని దూరం చేసేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నది. కౌన్సెలింగ్‌లు చేపడుతున్నది. ఈ ఏడాది చివరినాటికి ప్రమాదమెరుగని సంస్థగా మార్చాలనే లక్ష్యంతో పకడ్బందీగా ముందుకుసాగుతున్నది. దేశంలోని రోడ్డు రవాణా సంస్థల్లో అతి తక్కువ రోడ్డు ప్రమాదాల శాతాన్ని నమోదుచేసిన టీఎస్ఆర్టీసీ జాతీయస్థాయిలోనే ఉత్తమ రోడ్డు రవాణా సంస్థగా పేరు తెచ్చుకున్నది. అవార్డు పొంది ఆదర్శంగా నిలిచింది. బస్సులతో జరిగే ప్రమాదాలను సున్నా శాతానికి తీసుకురావడం ద్వారా 'ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం' అనే నమ్మకాన్ని ప్రజల్లోకి మరింత తీసుకెళ్లి సంస్థకు మంచిపేరు తెచ్చిపెట్టే బాధ్యత డ్రైవర్లు, సిబ్బందిదేనని గుర్తుచేస్తున్నది. ఏటా రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తూ డ్రైవర్లకు సన్మాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నది. ప్రతి డిపోలో ప్రమాద రహిత డ్రైవింగ్‌ను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా డిపోల్లో సంస్థ అధికారులు ఉత్తమ డ్రైవర్ల ఫొటోలను ఏర్పాటుచేస్తున్నారు. డ్రైవర్లకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. దూర ప్రాంతాలకు అనుభవజ్ఞులైన డ్రైవర్లనే పంపిస్తున్నారు. డిపో నుంచి బస్సు బయలుదేరే ముందు డ్రైవర్లకు ఆల్కాహాల్ పరీక్ష చేస్తున్నారు. దూర ప్రాంతాల డ్యూటీలకు వెళ్లే డ్రైవర్లకు విశ్రాంతి ఇస్తున్నారు. ప్రమాదం జరుగకుండా బస్సు లు నడిపేలా డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్నారు. సంస్థలో 30 ఏండ్లుగా ప్రమాదాలు చేయని డ్రైవర్లు 180 మంది ఉండగా, 20 ఏండ్లుగా ప్రమాదాలు చేయనివారు 1700 మంది, పదేండ్లుగా ప్రమాదాలు చేయని డ్రైవర్లు 3200 మంది ఉన్నారు.



హైదరాబాద్‌లోని హకీంపేట ట్రాన్స్‌పోర్టు అకాడమీలో కరాటే శిక్షణ పొందుతున్న టీఎస్ ఆర్టీసీ కండక్టర్లు (ఫైల్)



ప్రమాదరహితంగా బస్సు నడిపిన కరీంనగర్-2 డిపోకు చెందిన ఎండీ అమీనుద్దీన్ కుటుంబానికి చెక్కును అందజేస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి తదితరులు (ఫైల్)

కండక్టర్లకు, డ్రైవర్లకు నిరంతర శిక్షణ

హైదరాబాద్‌లోని హకీంపేట ట్రాన్స్‌పోర్టు అకాడమీతోపాటు జోనల్ ట్రైనింగ్ కళాశాల టీఎస్ఆర్టీసీ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నది. టీఎస్ఆర్టీసీ ఎండీ రమణారావు ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ కిరణ్‌రెడ్డి అత్యుత్తమ శిక్షణ ఇస్తూ డ్రైవర్లు, కండక్టర్లను మరింత ఉత్తములుగా తీర్చిదిద్దుతున్నారు. ఈ కేంద్రంలో నిత్యం ప్రాక్టికల్, థియరీ తరగతులతోపాటు కరాటే వంటి శిక్షణలు అందిస్తున్నారు. అధిక ట్రాఫిక్ ఉండే హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో రెప్పపాటులో ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇటువంటివి చోటు చేసుకోకుండా ట్రైనింగ్ కాలేజ్‌లో తరగతులు నిర్వహిస్తూ.. అకాడమీలో టెక్నిక్‌లు నేర్పించి సుశిక్షితులుగా తయారుచేస్తున్నారు. శిక్షణ వల్ల గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. 2016లో 7 శాతం ఉన్న ప్రమాదాలు.. 2017 నాటికి 5 శాతానికి తగ్గాయి.

మహిళా కండక్టర్లకు కరాటేలో శిక్షణ

నిత్యం ఒత్తిడితో కండక్టర్లు శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని గుర్తించిన సంస్థ మహిళా కండక్టర్లకు కరాటే శిక్షణను ప్రారంభించింది. దీనివల్ల కండక్టర్లు మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారవుతున్నారని, ఫిర్యాదులు సైతం తగ్గాయని పర్సనల్ విభాగం తెలిపింది.

తగ్గిన ప్రమాదాల శాతం

2014-15లో ఆర్టీసీ బస్సుల ద్వారా 0.08 శాతం (968) రోడ్డు ప్రమాదాలు జరుగగా, 2017-18 నాటికి అది 0.06 శాతానికి తగ్గిపోయే అవకాశం ఉన్నదని 2017 డిసెంబర్ నాటికి అందుబాటులో ఉన్న గణాంకాలు చెప్తున్నాయని అధికారులు తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమనడానికి ఈ గణాంకాలే నిదర్శనని చెప్తున్నారు. 2015-16లో ఆర్టీసీ బస్సులతో జరిగిన ప్రమాదాల్లో చనిపోయిన వారికి రూ.46 కోట్లు, 2016-17లో రూ.36 కోట్ల నష్టపరిహారాన్ని సంస్థ చెల్లించింది. ప్రమాదాల రేటు తగ్గి నష్టపరిహారం తగ్గినా.. ఇది సంస్థపై అదనపు ఆర్థికభారం మోపుతున్నదని అధికారులు అంటున్నారు.

ప్రమాదరహితంగా బస్సులు నడిపి సంస్థ నుంచి సన్మానం పొందిన డ్రైవర్ల వివరాలు

రాష్ట్రస్థాయి అవార్డు

1. ఎండీ అమీనుద్దీన్ (కరీంనగర్-2 డిపో, కరీంనగర్ జోన్) 31 ఏండ్ల ఒక నెల.
2. ఏ కృష్ణ (కరీంనగర్-2, కరీంనగర్ జోన్) 31 ఏండ్ల ఒక నెల.
3. బీ కేసయ్య (మహబూబ్‌నగర్, హైదరాబాద్ జోన్) 30 ఏండ్లు.

జోనల్‌స్థాయి ఉత్తమ అవార్డులు: బీ రాములు (హయత్‌నగర్-1, గ్రేటర్ హైదరాబాద్ జోన్.. 31 ఏండ్లు), షేక్ జహీర్ అహ్మద్ (నిర్మల్, కరీంనగర్ జోన్.. 30 ఏండ్ల 5 నెలలు), ఎండీజీ మొయినుద్దీన్ (నల్లగొండ, హైదరాబాద్ జోన్.. 30 ఏండ్ల నాలుగు నెలలు).

జోనల్‌స్థాయి ద్వితీయ అవార్డులు: జేటీరెడ్డి (కంటోన్మెంట్, గ్రేటర్ హైదరాబాద్ జోన్.. 30 ఏండ్ల 11 నెలలు), ఎండీ అబ్దుల్ రెహమాన్ (మహబూబ్‌నగర్, హైదరాబాద్ జోన్.. 30 ఏండ్ల ఒక నెల), వీ బాబు (సత్తుపల్లి, కరీంనగర్ జోన్.. 29 ఏండ్ల 8 నెలలు).

జోనల్‌స్థాయి తృతీయ అవార్డులు: ఎస్ విఠల్ (జీడిమెట్ల, గ్రేటర్ హైదరాబాద్ జోన్), కే జనార్దన్ (హైదరాబాద్-2, హైదరాబాద్ జోన్.. 30 ఏండ్లు), ఎన్ గంగాధర్ (నిర్మల్, కరీంనగర్ జోన్.. 29 ఏండ్ల 5 నెలలు).

తక్కువ రోడ్డు ప్రమాదాలు నమోదైన ఆర్టీసీ డిపోలు

క్యాటగిరీ-1 (65 లోపు బస్సులు ఉన్న డిపోలు):

1. మంథని (0.07 ప్రమాదాల శాతం) రూ.18 వేల నగదు పురస్కారం.
2. కొల్లాపూర్ (0.07) రూ.12,400 నగదు అవార్డు

క్యాటగిరీ-2 (66-120 బస్సులు కలిగిన డిపోలు):

1. పరిగి (0.04 ప్రమాదాల శాతం) రూ.26,000 నగదు అవార్డు
2. పికెట్ (0.04 ప్రమాదాల శాతం) రూ.17,200 నగదు అవార్డు


క్యాటగిరీ-3 (121 కంటే ఎక్కువ బస్సులు కలిగిన డిపోలు):

1. రాణిగంజ్-2 (0.04 ప్రమాదాల శాతం) రూ.33,000 అవార్డు
2. జీడిమెట్ల(0.05 ప్రమాదాల శాతం) రూ.21,400 అవార్డు

పట్టాదార్ పాస్‌పుస్తకానికి మరింత భద్రత

- 110 X 220 ఎంఎం మందంతో కవర్ పేజీ
- 20 ఎంఎం మందంతో లోపలి పేజీలు
- టెండర్ ప్రక్రియలో మార్పులు
- సీఎం కేసీఆర్ ఆదేశాలతో చర్యలు ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతులకు మార్చి 11వ తేదీన కొత్తగా ఇచ్చే భూ యజమాన్య హక్కు, పట్టాదార్ పాస్ పుస్తకానికి మరింత భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇచ్చిన ఆదేశాల మేరకు అధికారులు చర్యలు ప్రారంభించారు. ఈ నెల 7న విడుదలచేసిన టెండర్ షెడ్యూల్‌కు ఈ నెల 27న మార్పులు చేశారు. పట్టాదార్ పాస్ పుస్తకం సైజును 10.2 సెంటీమీటర్ల పొడవు, 16.2 సెంటీమీటర్ల వెడల్పు ఉండేలా రూపొందిస్తున్నారు. దీనిద్వారా పాస్‌పుస్తకాన్ని రైతు జేబులో పెట్టుకోవడానికి కూడా ఆస్కారం ఉంటుంది. పట్టాదార్ పాస్‌పుస్తకం కవర్ పేజీని 110X220 మందం, లోపలి పేజీలు 20 మిల్లీమీటర్ల మందంతోపాటు ప్రత్యేక ఫీచర్లతో ముద్రించాలని నిర్ణయించారు. పాస్‌పుస్తకాన్ని ముద్రించి గ్రామాలకు సరఫరా చేయాల్సిన బాధ్యతను కూడా ప్రభుత్వం బిడ్డర్లపైనే పెట్టింది. రోజూ అధికారులు పాస్‌పుస్తకం ముద్రణ నాణ్యతను తనిఖీ చేస్తారు. నాసికరంగా ఉన్నట్టు తేలితే వాటిని తిరస్కరిస్తారు. పట్టాదార్ పాస్‌పుస్తకానికి జీఎస్టీ ద్వారా అయ్యే అదనపు వ్యయాన్ని సీసీఎల్‌ఏ భరిస్తుందని సర్కారు బిడ్డర్లకు స్పష్టంచేసింది. సీఎం కేసీఆర్ ఆదేశాల ప్రకారం.. మార్చి 5వ తేదీ నాటికి పట్టాదార్ పాస్ పుస్తకాలు ముద్రించి, గ్రామాలకు పంపిణీ చేసేవారికే టెండర్ అప్పగించాలని నిర్ణయించారు.



అమెరికాలో సిద్దిపేట యువకుడి అనుమానాస్పద మృతి

సిద్దిపేట టౌన్: అమెరికాలోని డల్లాస్‌లో సిద్దిపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణం ప్రశాంత్‌నగర్‌కు చెందిన వెంకన్నగారి కృష్ణచైతన్య కాగ్నిజెంట్ సంస్థ ఆన్‌సైట్‌పై మూడున్నరేండ్ల క్రితం అమెరికా వెళ్లారు. మూడు నెలల క్రితమే డల్లాస్‌లోని సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్‌కు ఉద్యోగం మారటంతో అక్కడే ఓ ఇంట్లో పేయింగ్ గెస్ట్‌గా ఉంటున్నారు. శుక్రవారం ఉదయం అతను తన గది నుంచి బయటకు రాకపోవడంతో ఇంటి యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి తలుపులు తెరువడంతో మంచంపై విగతజీవిగా పడిఉన్నాడు. తెలంగాణ ఎన్‌ఆర్‌ఐ విభాగం ప్రతినిధులు గోలి మోహన్, శ్రీధర్ మాధవనేని ఆధ్వర్యంలో మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి హరీశ్‌రావు అక్కడి భారతదేశ రాయబారి కార్యాలయ అధికారులతో సంప్రదింపులు జరిపారు. గురువారం వరకు మృతదేహం వచ్చే అవకాశం ఉంది.

మేడారం జాతరకు రెండులక్షల నార సంచులు

- ఉచితంగా పంపిణీ చేస్తామన్న టీఎస్‌పీసీబీ
- భూపాలపల్లి ఇంచార్జి కలెక్టర్‌కు రూ.10 లక్షల చెక్కు అందజేత



ఆదివారం భూపాలపల్లి జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఆర్వీ కర్నన్‌కు రూ. 10 లక్షల చెక్కును అందజేస్తున్న ఎన్జీసీ ప్రాజెక్ట్ అధికారులు టీ రాధిక, కే సత్తయ్య

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: స్వచ్ఛ మేడారం, ప్లాస్టిక్ రహిత జాతర కోసం తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు (టీఎస్‌పీసీబీ) అడుగులు వేస్తున్నది. జాతరను పురస్కరించుకుని ప్లాస్టిక్ కవర్లను నిషేధించిన బోర్డు.. వీటికి బదులుగా రెండు లక్షల బట్ట సంచులు, జనుపనార సంచులను ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. ఇందుకోసం పీసీబీ సభ్యకార్యదర్శి పీ సత్యనారాయణరెడ్డి రూ.10 లక్షలు విడుదల చేశారు. ఈ చెక్కును నేషనల్ గ్రీన్ కార్ప్స్ (ఎన్జీసీ) ప్రాజెక్ట్ అధికారులు టీ రాధిక, కే సత్తయ్య ఆదివారం భూపాలపల్లి జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఆర్వీ కర్నన్‌కు అందజేశారు. ఈ నెల 30 నుంచి మేడారం జాతరలో బట్ట, నార సంచులను ఉచితంగా పంపిణీ చేస్తామని ఎన్జీసీ ప్రాజెక్ట్ అధికారి టీ రాధిక 'నమస్తే తెలంగాణ'కు చెప్పారు. జాతరలో వెలిసిన దుకాణాల్లో తనిఖీలు చేపట్టి.. ప్లాస్టిక్ సంచులను స్వాధీనం చేసుకుంటామని, నార సంచులను వినియోగించాలని కోరుతామని పేర్కొన్నారు.

రూ.3200 కోట్లతో నార్లాపూర్-డిండి అలైన్‌మెంట్

- 30 వేల ఎకరాలకు సాగునీరు
- డీపీఆర్ ఇవ్వాలని వ్యాప్కోస్‌కు సూచించిన నీటిపారుదలశాఖ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నల్లగొండ జిల్లాలోని ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలైన దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలతోపాటు మహబూబ్‌నగర్ జిల్లాలోనూ ఆయకట్టుకు సాగునీరు అందించనున్న డిండి ఎత్తిపోతల పథకం ప్రధాన అలైన్‌మెంట్ కొలిక్కి వచ్చింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుసంధానించేలా డిజైన్ రూపొందించాలని గతంలోనే ప్రభుత్వం వ్యాప్కోస్‌ను ఆదేశించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా నార్లాపూర్ నుంచి ఉల్పర మీదుగా డిండి ప్రాజెక్టు ప్రధాన కాలువకు నీటిని తరలించే అలైన్‌మెంట్‌ను రూ.3200 కోట్లతో చేపట్టవచ్చని వ్యాప్కోస్ ప్రాథమికంగా నివేదిక ఇచ్చింది. దీనిపై సంతృప్తి వ్యక్తంచేసిన నీటిపారుదల శాఖ సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) ఇవ్వాలని వ్యాప్కోస్‌ను ఆదేశించింది. డీపీఆర్ వచ్చిన తర్వాత ఈ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ వైపు అడుగులు పడనున్నాయి.

ఉల్పర అలైన్‌మెంట్‌కే ఓకే..

శ్రీశైలం జలాశయం నుంచి రోజుకు రెండు టీఎంసీలను తరలించేలా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రూపొందించారు. ఇందులో నుంచి అర టీఎంసీని డిండి ఎత్తిపోతలకు తరలించాలని గతంలోనే నిర్ణయించారు. ఈ మేరకు ప్రధాన కాల్వతోపాటు ఐదు రిజర్వాయర్ల నిర్మాణపనులకు టెండర్లు పూర్తయి, పనులు కూడా కొనసాగుతున్నాయి. అయితే కీలకమైన నీటిని సేకరించే అలైన్‌మెంట్ మాత్రం ఇప్పటివరకు ఖరారు కాలేదు. దీనిపై గతంలో వ్యాప్కోస్ ఐదు ప్రతిపాదనలు ఇవ్వగా.. భూసేకరణ, అటవీ భూముల సేకరణ వంటి క్లిష్టమైన అంశాలు ముడిపడి ఉండటంతో నీటిపారుదలశాఖ వాటిని అంగీకరించలేదు. తాజాగా ఉల్పర మీదుగా రూపొందించిన అలైన్‌మెంట్‌పై నీటిపారుదలశాఖ సుముఖత వ్యక్తంచేసింది. నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి ప్రధాన కాల్వ ద్వారా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నీటి తరలింపు జరుగుతుంది. ఇందులోనే సుమారు ఎనిమిది కిలోమీటర్ల వరకు రెండు టీఎంసీలను తరలించి.. అక్కడి నుంచి డిండి ఎత్తిపోతల పథకానికి అర టీఎంసీని మళ్లిస్తారు. నార్లాపూర్ ప్రధాన కాల్వ నుంచి మళ్లించిన నీటిని సుమారు అర కిలోమీటర్ వరకు ఓపెన్ కాల్వ ద్వారా తీసుకుపోతారు. తర్వాత దాదాపు 22.5 కిలోమీటర్ల మేర టన్నెల్ ద్వారా తరలించి.. 125-130 మీటర్ల మేర లిఫ్టు ద్వారా నీటిని ఎత్తిపోస్తారు. అనంతరం ఐదారు కిలోమీటర్ల ఓపెన్ కెనాల్ ద్వారా.. ఉల్పర వద్ద నిర్మించే చిన్న బ్యారేజీకి నీటిని తరలిస్తారు. అక్కడినుంచి డిండి ప్రాజెక్టు ప్రధాన కాల్వకు అనుసంధానిస్తారు. దీని ద్వారా కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని ఆయకట్టుకు నష్టం వాటిల్లక పోగా.. అచ్చంపేట, మాడుగుల మండలాల పరిధిలో అదనంగా 20-30 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ అలైన్‌మెంట్‌పై నీటిపారుదలశాఖ కూడా సంతృప్తి వ్యక్తంచేయడంతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక కోసం ఎదురుచూస్తున్నారు.

శ్రీనివాస్‌ది రాజకీయ హత్య కాదు



బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య కేసు నిందితులను ఆదివారం నల్లగొండలో మీడియా ఎదుట ప్రవేశపెట్టి వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

- క్షణికావేశంలో జరిగిన ఘటన అది
- 8 మంది అరెస్టు.. పరారీలో ముగ్గురు
- నల్లగొండ ఎస్పీ శ్రీనివాసరావు వెల్లడి

నల్లగొండ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: నల్లగొండ మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి భర్త, కాంగ్రెస్ పార్టీ నేత శ్రీనివాస్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. నల్లగొండ ఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య క్షణికావేశంలోనే జరిగిందని, దీని వెనుక ఎలాంటి రాజకీయ కోణం, వ్యూహం లేదని చెప్పారు. శ్రీనివాస్ భార్య, మున్సిపల్ చైర్మన్ లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టి 11 మంది నిందితులను గుర్తించామని వివరించారు. వారిలో 8 మందిని అరెస్టు చేశామని, మరో ముగ్గురు పరారీలో ఉన్నారని చెప్పారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు (ఏ1) చింతకుంట్ల రాంబాబు కాగా మాంద్ర మల్లేశ్, ఆలువాల శరత్‌రాజ్, భాషపాక దుర్గయ్య, కత్తుల కల్యాణ్ సామ్రాట్ అలియాస్ చక్రి, దామునూరి సతీశ్, మాంద్ర మహేశ్, మిట్టపల్లి సాయి, మెరుగు గోపి, మాతంగి మోహన్, ప్రసాద్‌లను ఇతర నిందితులుగా గుర్తించినట్టు పేర్కొన్నారు. వీరిలో మాంద్ర మహేశ్, మిట్టపల్లి సాయి, ప్రసాద్ ప్రస్తుతం పరారీలో ఉన్నారని, మిగిలిన ఎనిమిది మంది నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు. హత్య కేసు నిందితుల్లో దాదాపుగా అందరూ హతుడు శ్రీనివాస్‌తో సన్నిహిత సంబంధం కలిగి ఉన్న వారుకావడం గమనార్హం.

హత్య జరిగిన తీరు..

బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య జరిగిన రోజు రాత్రి 7 గంటలకు చింతకుంట్ల రాంబాబు, శరత్ జిల్లా కేంద్రంలోని ఆల్ఫా జూనియర్ కాలేజీ సమీపంలోని మిర్చి బండి యాదయ్యతో గొడవపడ్డారు. మాంద్ర మల్లేశ్ అక్కడికి చేరుకొని వారిని శాంతింపజేశాడు. తర్వాత రాంబాబు, శరత్, మాంద్ర మల్లేశ్ ముగ్గురూ మాంద్ర మహేశ్ ఇంటికి వెళ్లారు. గొడవ విషయం తన దృష్టికి రావడంతో మెరుగు గోపి (స్థానిక వార్డు కౌన్సిలర్ కుమారుడు) రాత్రి 10 గంటలకు రాంబాబుకు ఫోన్ చేశాడు. దీంతో రాంబాబు, శరత్, చక్రి, మల్లేశ్ ఒక్కొక్కరుగా మిర్చి బండి వద్దకు చేరుకున్నారు. అక్కడ కూడా గొడవ జరిగింది. రాంబాబు గోపిపై చేయి చేసుకున్నాడు. బొడ్డుపల్లి శ్రీనివాస్‌ను సైతం దూషించాడు. గోపి రాంబాబుపై తిరుగబడగా.. చక్రి గోపిని అక్కడి నుంచి పంపించేశాడు. అక్కడి నుంచి వెళ్లిపోయిన గోపి.. బొడ్డుపల్లి శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన రాత్రి 11.30 గంటలకు మాతంగి మోహన్‌తో కలిసి ఘటనాస్థలానికి చేరుకున్నారు. వస్తూ వస్తూనే గొడవ చేయడంపై రాంబాబును శ్రీనివాస్ ప్రశ్నించాడు. ఎందుకు న్యూసెన్స్ చేస్తున్నారంటూ రాంబాబు, శరత్‌లను గట్టిగా నిలదీశాడు. రాంబాబుపై చేయి చేసుకున్నాడు. వెంటనే రాంబాబు కూడా శ్రీనివాస్‌ను కొట్టాడు. రాంబాబు, శ్రీనివాస్ ఒకరినొకరు నెట్టుకుంటూ ఆపడానికి వెళ్లిన చక్రితో కలిసి కుడి వైపు డ్రైనేజీ కాల్వలో పడ్డారు. కాల్వలో నుంచి లేచిన వెంటనే.. రాంబాబు, శ్రీనివాస్ మరోసారి కలబడి ఎడమ వైపు ఉన్న మోరీలో పడిపోయారు. బొడ్డుపల్లి శ్రీనివాస్ తన గొంతును పిసుకుతున్న క్రమంలో చచ్చిపోతున్నానంటూ రాంబాబు వేసిన కేకతో పక్కనే ఉన్న సిమెంట్ రాయితో మాంద్ర మల్లేశ్ బొడ్డుపల్లి శ్రీనివాస్ తలపై గట్టిగా కొట్టాడు. నన్నే కొడుతావా నీ అంతు చూస్తానంటూ శ్రీనివాస్ హెచ్చరించడంతో మరో బునాది రాయిని శ్రీనివాస్ తలపై వేశాడు. బయటకు వచ్చిన రాంబాబు శ్రీనివాస్‌పై మరో రాయి వేశాడు. చివరగా మల్లేశ్ ఇంకో రాయి వేసి శ్రీనివాస్ చనిపోయాడని నిర్ధారించుకొని అక్కడినుంచి పారిపోయారు. మిగిలిన వారూ అక్కడి నుంచి తప్పించుకున్నారని ఎస్పీ వివరించారు. సమాచారాన్ని పోలీసులకు అందించని కారణంగా మెరుగు గోపి, మాతంగి మోహన్‌తోపాటు నిందితులకు హైదరాబాద్‌లో ఆశ్రయం కల్పించిన ప్రసాద్‌పైనా కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

ఆస్తి కోసం తండ్రి, తమ్ముళ్ల హత్య

- కత్తితో పొడిచి, రాళ్లతో మోది దారుణం
- నాగర్‌కర్నూల్ జిల్లాలో ఘటన
- పోలీసుల అదుపులో నిందితుడు



నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం మామిళ్లపల్లి గ్రామంలో అన్న చేతిలో హతమైన శ్రీశైలం మృతదేహాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

నాగర్‌కర్నూల్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: ఆస్తి కోసం కన్న తండ్రిని, తోబుట్టువులను హతమార్చిన దారుణ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో సంచలనం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని అచ్చంపేట నియోజకవర్గం ఉప్పునుంతల మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామానికి చెందిన సామ భాస్కరయ్య (63), లక్ష్మమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు మల్లేశం, రెండో కుమారుడు శ్రీశైలం(22), చిన్న కుమారుడు రామస్వామి (16)తో కలిసి తనకున్న మూడెకరాల భూమిలో భాస్కరయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. పెద్దకొడుకు మల్లేశం జులాయిగా తిరుగుతూ ఆస్తి కోసం నిత్యం గొడవపడేవాడు. ఈ గొడవలను భరించలేక భాస్కరయ్య భార్య లక్ష్మమ్మ ఇల్లు విడిచి వెళ్లింది. ఎలాగైనా ఆస్తిని దక్కించుకోవాలన్న కసి మల్లేశంను సైకోగా మార్చింది. చివరికి కన్న తండ్రిని, తోబుట్టువులను హతమార్చాలని పథకం పన్నాడు. శనివారం రాత్రి ఇంట్లో ఉన్న తమ్ముళ్లు శ్రీశైలం, రామస్వామిని పొలం పనుల కోసం వెళ్లమని చెప్పి వాళ్ల వెనకాలే వెళ్లి చీకట్లో తన వెంట తెచ్చుకున్న కత్తితో పొడిచి, రాళ్లతో మోది హతమార్చాడు. పొలం వద్ద బోరు వేయించేందుకు స్థలం చూపించాలని తండ్రిని నమ్మబలికి తీసుకెళ్లి కత్తితో పొడిచి చంపేశాడు. అనంతరం ఈ విషయాన్ని బంధువులకు ఫోన్‌లో చెప్పి గ్రామం నుంచి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం బంధువులు వెతుకగా తండ్రి, ఇద్దరు కుమారులు గ్రామశివారులో శవాలై కనిపించారు. తెలకపల్లి మండల కేంద్రంలో నిందితుడు టిఫిన్ చేస్తుండటాన్ని గుర్తించిన పలువురు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకొన్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ సంఘటన గురించి తెలుసుకొన్న జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ మామిళ్లపల్లికి చేరుకొని గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించారు. ఆస్తి, కుటుంబ తగాదాల నేపథ్యంలో హత్యలు జరిగాయని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి వివరాలు వెల్లడిస్తామని ఎస్పీ పేర్కొన్నారు.

వేసవినాటికి మిషన్‌భగీరథ పనులు పూర్తి

మార్చి 15కల్లా పనులు పూర్తిచేయాలని ఏజెన్సీలకు సీఎస్ ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రతిపల్లెకు రక్షిత మంచినీరు అందించే లక్ష్యంతో చేపట్టిన మిషన్ భగీరథ పథకాన్ని వేసవికాలం నాటికి పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే మెజారిటీ పనులు పూర్తికాగా, మిగిలిన పనులను మార్చి 15లోగా పూర్తిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్.. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఏజెన్సీలకు ఆదేశాలు జారీచేశారు. పనులు పూర్తిచేయని ఏజెన్సీలు, అధికారులపై తగిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. దేశ, విదేశీ ప్రముఖుల నుంచి విశేషంగా ప్రశంసలు రావడంతో ఈ పథకం ప్రతిష్ఠ మరింత పెరిగింది. దీంతో నిర్ణీత సమయంలో పూర్తిచేయాలన్న పట్టుదలతో పనులు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణలో వేగంగా పనులు పూర్తవుతున్నాయి. ప్రస్తుతం 4,744 గ్రామాలకు భగీరథ నీళ్లు చేరుతున్నా అంతర్గత పైప్‌లైన్లు పూర్తిచేసి ఇంటింటికీ నల్లాలు బిగిస్తే మంచినీరు అందుతుంది. 2,251 గ్రామాల్లో అంతర్గత పైప్‌లైన్ల పనులు 91 శాతం పూర్తయ్యాయని, వారం పది రోజుల్లో ఈ గ్రామాలకు తాగునీరు అందుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. ఈ పనులన్నీ పూర్తయితే రాష్ట్రంలో 6,995 గ్రామాలకు భగీరథ నీళ్లుచేరుతాయి. మార్చి 15 నాటికి అన్ని గ్రామాలకు తాగునీరందిస్తామమని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ధీమా వ్యక్తంచేస్తున్నారు.

మిషన్ భగీరథ పనుల పురోగతి వివరాలు..

పని	పూర్తయినవి..	పూర్తి కావలసినవి
పైప్‌లైన్ నిర్మాణం	49,323 కి.మీ.	4,861 కి.మీ.
నీటిశుద్ధి కేంద్రాలు	46	4
సంప్‌లు	403	22
గ్రౌండ్‌వాటర్ ట్యాంక్‌లు	144	5
ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు	474	92



రహదారి నిధులు రాబట్టేందుకు కృషి

- 2016-17లో కేంద్రం రాష్ట్రానికి మంజూరు చేసిన గ్రాంటు రూ.13వేల కోట్లు
- ఇందులో జాతీయ రహదారుల అభివృద్ధికి రూ.2,900 కోట్లు
- 2017-18 నిధులపైనా దృష్టి సారించిన ఆర్‌అండ్‌బీ శాఖ

2016-17లో వివిధ పథకాల కింద కేంద్రం నుంచి మంజూరైన నిధులు

జాతీయ రహదారుల అభివృద్ధి	నూతన జాతీయ రహదారుల నిర్మాణం	తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం
రూ.2900 కోట్లు.	రూ.8000 కోట్లు.	రూ.1290 కోట్లు.



కేంద్ర రహదారుల నిధి (సీఆర్‌ఎఫ్)	రహదారి భద్రతా ఇంజినీరింగ్ పనులు
రూ.1020 కోట్లు.	రూ.90 కోట్లు.

మొత్తం రూ. 13,300 కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధి, నూతన రోడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనుల కోసం కేంద్రం నుంచి రాష్ట్రానికి అందాల్సిన గ్రాంటును రాబట్టడంపై ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టి సారించారు. 2016-17కు సంబంధించి కేంద్రం నుంచి వివిధ పథకాల ద్వారా మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో రాబట్టేందుకు కృషిచేస్తున్నారు. 2016-17లో కేంద్రం వివిధ పథకాల కింద రాష్ట్రానికి రూ.13వేల కోట్లు మంజూరు చేసింది. ఇందులో జాతీయ రహదారుల అభివృద్ధి కోసం రూ.2900 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులను వెంటనే రాబట్టేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అదే విధంగా 2017-18కి సంబంధించి జాతీయరహదారుల అభివృద్ధికి మంజూరైన రూ. 3100 కోట్లు, ఎన్‌హెచ్‌ఏఐ కింద మంజూరైన రూ. 3,500 కోట్ల నిధులను కూడా రాబట్టేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు కృషిచేస్తున్నారు. 2016-17, 2017-18లలో కేటాయించిన మొత్తాన్ని వెంటనే తీసుకొచ్చి, వచ్చే బడ్జెట్‌పై దృష్టి పెట్టాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో రోడ్లు భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులను ఆదేశించారు. కేంద్ర సహాయ నిధులపై అక్కడి నుంచి వచ్చే గ్రాంటులపై సమీక్షలో సమగ్రంగా చర్చించారు. రాష్ట్రాలకు వచ్చే వాటాతోపాటు, ప్రత్యేకంగా తెలంగాణకు రావాల్సిన నిధులను కూడా రాబట్టేందుకు అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకుసాగుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ పథకాలు, గ్రాంట్లు, సహాయం రూపంలో, అప్పులు లేదా ఇతర స్కీంల ద్వారా వచ్చే వివిధ రకాల నిధులు మొత్తం సాధించేందుకు కృషిచేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఆర్‌అండ్‌బీ అధికారులు ఇప్పటికే కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నారు.

- గతంలో కేంద్రం మంజూరుచేసిన నిధుల విషయంలో ఆయా నిధుల జమ-ఖర్చు, యూసీలను ఎప్పటికప్పుడు కేంద్రానికి అందించి మలివిడుత మంజూరుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే కేంద్ర నిధుల విషయంలో ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలన, సమీక్షలు నిర్వహిస్తున్నారు.
- ప్రధానంగా హైదరాబాద్-కరీంనగర్ 'రాజీవ్ రహదారి', హైదరాబాద్- నాగార్జునసాగర్ రహదారులను జాతీయ రహదారులుగా ఆధునీకరించేందుకు ఆర్‌అండ్‌బీ శాఖ ప్రతిపాదనలను రూపొందించింది. ఆయా ప్రతిపాదనలకు కేంద్రం నుంచి అనుమతులు సాధించాలనే ప్రయత్నంలో అధికారులున్నారు.
- కేంద్రం 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను సుమారు రూ.5,217 కోట్లను రహదారి భద్రతా పనులకు కేటాయించింది. ఈ మొత్తాన్ని అన్ని రాష్ట్రాలకు సర్దుబాటు చేస్తారు. ఈ పథకంలో సింహభాగాన్ని చేజిక్కించుకునే విధంగా ప్రణాళికలు తయారుచేసి కేంద్రానికి పంపించారు.



ఆసక్తికరమైన ఇతర ప్రపంచాలను సృష్టించగలిగే నవలా రచయితలంటే నాకిష్టం.

కజువో ఇషిగురో

త్యాగబరిణె

అడవిబిడ్డల అమరత్వం
జంపన్న ప్రాణత్యాగం వాగై ప్రవహించింది,
తల్లీబిడ్డల త్యాగ రాశి
వనవాసుల పాలిట ఆశాజ్యోతిగ నిలిచి
చిలకల గుట్టన విడిది చేసింది
కుంకుమ బరిణెగ!!,
రెండేండ్లకోమారు
మాఘ పున్నమికి
వనదేవతై గద్దె చేరగ
దారులన్నీ 'మేడారం' తర్లిపోతాయి
కోరిమొక్కిన 'బెల్లంమొక్కులు'
బంగారమై భక్తులనెత్తి నెక్కగ
తులాదండం నిలువెత్తుగ తూస్తుంది,
కోవెలలేని కోయ దేవతలైతేనేమి?!
విగ్రహాలు అభిషేకాలు లేని
అచ్చమైన ఆదివాసీ అర్చనలతో
వనారణ్యాన్ని జనారణ్యం చేస్తాయి,



ఎడబండి నుంచి హెలికాప్టరై
ఎగురుతూ...!!
'త్యాగశక్తి'ని ప్రపంచానికి
చాటుతుంది
మన జన జాతర! మేడారం జాతర!!

– డాక్టర్ అమ్మిన శ్రీనివాసరాజు
77298 83223

అతడు తాజాగానే ఉన్నాడు

అతడు తాజాగానే ఉన్నాడు కొత్త తమాషాలు ప్రదర్శిస్తూ
జనం ఇక అలసిపోతున్నారు కరతాళధ్వనులౌతూ ఔతూ

జాగ్రత్తగా నడిచే అహం అంతా నీరుగారిపోయింది
అతడలాంటి మాటొకటన్నాడు వ్యక్తావ్యక్త ప్రేలాపనగా

ప్రజలు స్వయంగా తమ పాదాలను గాయపరుచుకున్నారు
తమ బాటలో తామే ముళ్ళను నాటుకుంటూ

నిజానికి అదొక చిన్న విషయమే కావొచ్చు
నమస్కరించడానికి జనం జంకుతున్నారు చెయ్యెత్తుకుంటూ

అతడిప్పుడు వికటాట్టహాసం చేస్తున్నాడు
ఎవడైతే చిరునవ్వులకే సంకోచిస్తాడో

వెలుగు రాగానే వాళ్ళ పేర్లను మనం మరచిపోయాము
దీపాలను ప్రదీపించడానికి వాళ్ళు ఆరిపోయారు

ఒక తరం యవ్వనానికికొచ్చింది గజల్ గానాలు వింటూ
మేం వృద్ధాప్యంలోకి జారిపోతున్నాం గజలాలాపిస్తూ..



– ఉర్దూ మూలం: అజహర్ ఇనాయ్‌తీ
తెలుగు అనువాదం: ఆచార్య ఎస్వీ సత్యనారాయణ

సోమన పేర్కొన్న సంగీత, నృత్య రీతులు



పాల్కుర్కి సోమనాథుని రచనలు, ప్రధానంగా అతని బసవపురాణం, మల్లికార్జున పండితారాధ్య చరిత్ర 12వ శతాబ్దం నాటి సామాజిక స్థితిగతులను తెలుసుకోవడానికి ఉపకరిస్తాయి. పాల్కుర్కి సోమన ఏ రాజులను ఆశ్రయించినవాడు కాదు. ప్రజాక్షేమాన్ని కోరి ప్రజల జీవితాన్ని గమనించి రాశాడు. ఆయనకు ఆరాధ్యులు సామాన్య ప్రజలు. శివభక్తి కలిగిన ప్రజలు ఏ సామాజికవర్గానికి చెందినవారైనా సరే, పేద, ధనిక ఆడ, మగ భేదం లేకుండా అందరినీ పూజించినాడు. శివ సమానులుగానే చూశాడు. కుల భేద నిర్మూలన కోసం పాటుపడిన బసవేశ్వరుని మార్గాన్ని అనుసరించిన సోమనకు ఆ భక్తజనుల ఆజ్ఞయే ప్రమాణం. అన్ని వర్గాలకు చెందిన ప్రజలను గురించి రాశాడు. కాబట్టే ఆయ న సాహిత్యం చరిత్రకు ఎక్కువగా ఉపకరిస్తుంది. ఇటువంటి రచనలు చేసింది సోమనాథుడే. ఈ మార్గంలో ఈ కవియే మొదటివాడు. ఈవిధంగా ప్రజా జీవితాన్ని చిత్రించిన కవి నాటి కాలంలో ఇతనొక్కడే.

మల్లికార్జున పండితారాధ్య చరిత్రలోని 'పర్వతప్రకరణం' ప్రత్యేకంగా ప్రజాజీవితాన్ని చిత్రించేది. శివరాత్రి నాడు మల్లికార్జున స్వామిని దర్శించుకోవడానికి భక్తులు సమూహాలుగా ఏర్పడి ప్రయాణం చేసిన విషయాలను సోమన కండ్లకు కట్టినట్టు వర్ణించాడు. జంగములు, శివయోగులు, పుణ్యాంగనులు, పిచ్చుకకుంట్లు, చెంచులు, ఆంధ్ర, కన్నడ ఆరె, అరవ దేశాల సమూహాలను పేర్కొన్నాడు. వారివారి వేష భాషలను చిత్రించాడు. వారి రూపం, ధరించిన వస్త్రాలు, ఆభరణాలు, చేతికర్రలు, గొడుగులు, చెప్పులు మొదలైన వాటిని బొమ్మగీయదగినట్టు గా వర్ణించాడు. నేటి కాలంలో రచయితలు కథ, నవలల్లో ఆయా పాత్రల రూప వర్ణాదులను చిత్రిస్తున్నారు. ఈ విధమైన చిత్రణకు మార్గం చూపినవాడు పాల్కుర్కి సోమనాథుడే.



సోమన తెలిపిన ఆయా అంశాలను పరిశీలిస్తే శాస్త్రజ్ఞులు నాటి దేశీ, మార్గ పద్ధతుల్లోని సంగీత, నృత్యరీతులను తెలుసుకోగలుగుతారు. ఈ దిశగా పరిశోధనలు సాగినట్లయితే 12 శతాబ్దం నాటి తెలంగాణలో పరిఢవిల్లిన సంగీత నృత్య పద్ధతులు, ఆనాటి వాటి వైభవం తెలుస్తుంది. నాటితరాల వారు అందించిన ఈ కళా సంపదలను తిరిగి భావితరాలకు అందించడం మనందరి బాధ్యత.

భక్తులందరూ శివరాత్రి నాడు దైవ దర్శనానంతరం ఆడిపాడినట్లు చెప్పాడు. చిందు, కోడంగి, పంచాంసి, పేరణి, బహురూ పం, వెడ్డంగం వంటి ఆటలు ఆడినారు. గడల మీద, తాళ్లమీద ఆడారు. చీర మరుగులుగా కట్టి బొమ్మలనాడించారు. నాటకలాడినారు. నెమలి వలె నటించారు. చిలుక వలె పలికినారు. హంస గా గతులు చూపినారు. కోతి వలె, మదగజం వలె, కేసరి వలె ప్రవర్తించారు. ఈ వివిధ రకాల ఆటలు వినోద, విజ్ఞానదాయకాలు.

సంగీత సంబంధమైన రాగ, తాళాదులను, వీణ మొదలైన వాద్యాలను సోమన విశదీకరించాడు. బ్రహ్మ వీణ, కైలాస వీణ, రావణ వీణ, పినాక వీణ, భుజంగవీణ, కిన్నరవీణ, సరస్వతి వీణ, మొల్ల వీణ మొదలగు నలభై పైబడిన వీణలను సోమన పేర్కొన్నాడు. ఇన్నిరకాల వీణలు నాడు వాడుకలో ఉన్నాయంటే సంగీతం నాటికాలంలో ఎంత ఉన్నతస్థితిలో ఉందో తెలుస్తుంది. వీణలకు ఆయా పేర్లు ఎందుకున్నాయో సంగీత శాస్త్రజ్ఞులకు తెలిసి ఉంటుంది. గీతానుగము, ఉభయానుగము మొదలైన తంత్రులను పేర్కొన్నాడు. ఇవి లక్షణశాస్త్రంలో చెప్పబడినవని అన్నాడు. దండి, చిత్రము, మృదువు మొదలైనవి ఏర్పడేట్లుగా, జన్యజనక విరచనాలు తళుకొత్తేట్లుగా వీణలు వాయించినారు అని అన్నాడు.

సమహస్తము, సైరణము మొదలుగా గల పెక్కు బంధములను పేర్కొన్నాడు. చంచుపుట, గచ్ఛపుట మొదలైన ఏడు తాళాలను, ఇరువై ఏడు శుద్ధ తాళాలను, 108 'ప్రథమశుద్ధాది విభంగ వినుత భంగాభంగ తాళములను, జాతివాస, విజాతివాస మొదలైన 18 'వాసనాదములను' సోమన పేర్కొన్నాడు. ఆలాప, హేలన వ్యాప్తి మొదలైన ఇరువై రెండు గతులను, ఇట్లే వివిధ గమకములను, ప్రత్యేక గమకములను, రాగ ప్రభేదాలను, స్త్రీ, పురుష, నపుంసక రాగాలను సోమన పేర్కొన్నాడు. సంగీత సంబంధమైన విశేషాలను అనేకం చెప్పాడు. ఈ అన్నింటిని గమనించినట్లయితే రూపొందే సంగీతం ఎటువంటిదో తెలుస్తుంది. ఇది దేశీ, మార్గ పద్ధతుల్లో సాగినట్లు సోమన తెలిపాడు. ఇదంతా పాట.

నృత్య సంబంధమైన వివిధ అంగ హారాదులను వక్ర, భూలత, చక్షు పరమైన ఆయా విభ్రయాదులను, దృష్టులను, నూరు అలంకారాలను, నూటా ఎనిమిది కరణాలను సోమన పేర్కొన్నాడు. వీటిని బట్టి నాటి నృత్య పద్ధతులు ఏ విధంగా ఉండేవో నాట్య శాస్త్రజ్ఞులు తెలుపగలుగుతారు.

సోమన తెలిపిన ఆయా అంశాలను పరిశీలిస్తే శాస్త్రజ్ఞులు నాటి దేశీ, మార్గ పద్ధతుల్లోని సంగీత, నృత్యరీతులను తెలుసుకోగలుగుతారు. ఈ దిశగా పరిశోధనలు సాగినట్లయితే 12 శతాబ్దం నాటి తెలంగాణలో పరిఢవిల్లిన సంగీత నృత్య పద్ధతులు, వాటి వైభవం తెలుస్తుంది. నాటితరాల వారు అందించిన ఈ కళా సంపదలను తిరిగి భావితరాలకు అందించడం మనందరి బాధ్యత.

– అనుమాండ్ల భూమయ్య, 88970 73999

21వ శతాబ్దం

మట్టి మహత్మ్యం నుంచి గుడిసెలు,
గుడిసెల గుండెల్లోంచి భవనాలు,
భవనాల ఒడిలోంచి యంత్రాలు,
అసలూ... జీవితమే యాంత్రీకరణైంది.
బతుకుబాట ఇబ్బందుల్లో
జీవన గమనం ఇరుక్కున్నప్పుడు
కష్టసుఖాల గోదీలో మొదట
బొటనవేలి ముద్రలతికించేవారు
ఆధునిక యుగ యానములో
విద్యావంతుల బొటనవేళ్ళు గూడా
మార్పులు–చేర్పుల్లో మునిగి తేలి
వేలిముద్రల వైపే గురిపెడుతున్నై.
వేలిముద్రలు వేసే వైఖరి మారింది,
మేజాబల్ల మారింది,
వేలిముద్రల ప్రాధాన్యం పెరిగింది
తప్పనిసరి పరిస్థితిలో
వేలిముద్రలనాశ్రయించిన పరిస్థితులు



ఎక్కడ వేసిన గొంగడి అక్కడే, లాగున్నై.
వివశత, విశ్వాసము, పరాధీనత
జీవచ్ఛవాలైపోయినై
ఇప్పుడు బొటనవేళ్ల అస్తిత్వం
గుర్తింపు గురిలోకొచ్చింది
ఈ బొటనవేలు
ఉదయమే కార్యాలయ ద్వారాలు తెరుస్తుంది,
సాయంత్రం హృదయ ద్వారాలు మూసేస్తుంది.
అదేమిటో గాని– ఈ బొటనవేలు
ఆనాటి ఏకలవ్యుడి కాలం నుండి
ఈనాటి కాకారాయుళ్ల కాలం దాకా
కోతలకు గురవుతూనే వుంది.
కాపోతే
ఒక్కోసారి తన పేరున,
మరోసారి
కులము, వర్ణము, వర్గము పేరున
మరి ఈ బొటన వేలునేం చేద్దాం?
ఇది అందరినీ గొర్రెలుగా మార్చేస్తుంది.
గొర్రెల మందలు
ఉదయం నుండే ఉరుకులు–పరుగులు
పగలంతా కార్యాలయ జనారణ్యంలో
సంచరిస్తుంటాయి,
సూరీడు పడమటి కొండల్లోకి జారుతూంటే
తిరిగి ఇంటి దొడ్డికి చేరుకుంటాయి
ఈ బొటన వేలు
మనిషిని మనిషిగా మననీయకుండా
వింత జంతువులా నడిపిస్తుంది
ఇరవయ్యొకటో శతాబ్దములో మనిషి
అత్యంత సోఫెస్టికేటెడ్ జంతువై
దిశానిర్దేశం కానరాని పరుగుల్లో
తన గుర్తింపును తానే పోగొట్టుకుంటున్నాడు.

గుజరాతీ మూలం: శ్రీ భరత్ ఠాకోర్
అనుసరణ: ఐతా చంద్రయ్య, 93912 05299

తెలంగాణ సంస్థానాల్లో మహిళల పాత్ర



హైదరాబాద్ రాజ్యంలోని తెలంగాణలో 14 సంస్థానాలు ఉన్నాయి. కొన్ని సంస్థానాలు కాకతీయుల కాలంలో, కొన్ని కుతుబ్‌షాహీల కాలంలో, మరికొన్ని అసఫ్ జాహీల కాలంలో ఆవిర్భవించాయి.14వ శతాబ్ది ఆరంభంలోనే తెలంగాణలో సంస్థానాలు నెలకొన్నాయి. సంస్థానాల చరిత్రలో కొన్ని 18వ శతాబ్ది వరకు, మరికొన్ని 1948 సెప్టెంబర్ 17 వరకు కొనసాగాయి.

సంస్థానాలన్నీ నిజాం రాజుకు సామంత రాజ్యాలుగానే ఉండేవి. సంస్థానాధీశులలో స్త్రీలు కూడా ఉండటం తెలంగాణ వైభవానికి తార్కాణం. పరిపాలనా, సాహిత్యరంగాల్లో వనపర్తి, ఆత్మకూరు, గద్వాల, పాపన్నపేట, జటప్రోలు, సిర్నాపల్లి, పాల్వంచ, దోమకొండ సంస్థానాలను పాలించిన రాణులు అమ్మక్కమ్మ, లింగమ్మ, మంగమ్మ, చొక్కమ్మ, వెంకటలక్ష్మమ్మ, ఆదిలక్ష్మీదేవమ్మ, సరళాదేవి, భాగ్యలక్ష్మమ్మ, వెంకటరత్నమాంబ, శంకరమ్మ, మల్లాంబ, ఎల్లాంబ, లచ్చవ్వ దొరసాని, లక్ష్మీనరసాయమ్మ, గిరియమ్మ, జానకీబాయి మొదలగు మహిళామణులను చెప్పుకోవచ్చు.

నాటి కాలంలో తెలుగు సాహిత్యమంతా చక్రవర్తులు, వారి సామంతుల ఆశ్రయంలోనే వ్యాప్తి చెందింది. సంస్థానాలను పాలించిన మహిళలు కవి పండిత, కళాపోషకులుగా ఉండటమే కాకుండా కృతికర్తలుగాను, కృతి భర్తలుగాను వ్యవహరించిన తీరు నేటి మహిళా సాహితీ మూర్తులెందరికో ఆదర్శప్రాయం. వీరు సంస్థానాలలో సంస్కృతాంధ్ర కవులనే కాక, ఇతర భాషాకవులను కూడా ప్రోత్సహించి, కళారాధకులుగా ప్రశస్తికెక్కారు. వీరిలో కొందరు అనేక ప్రజాసంక్షేమ కార్యక్రమాలను చేపట్టి సామాజికాంశాలలో సాటిలేని మేటి మహిళలుగా నిలిచారు. రాణి రుద్రమ ఏలిన కళల కాణాచియైన తెలంగాణ వీరగడ్డపై ఆవిర్భవించిన సంస్థానాలలో మహిళల ప్రాతినిధ్యం 16వ శతాబ్ది నుంచి 19వ శతాబ్ది పూర్వార్థం వరకు కొనసాగినట్లు తెలుస్తున్నది.

గద్వాల సంస్థానం: ఈ సంస్థానం మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్నది. గద్వాల సంస్థానాధీశులు పాకనాటిరెడ్లు. ముష్టిపల్లి వంశానికి చెందినవారు. గద్వాల సంస్థాన మూల పురుషుడైన బుడ్డారెడ్డి కాకతీయ ప్రతాపరుద్రుని కాలంలో (1290) రాయచూరు, అలంపుర, వెజ మొదలగు ఏడు సీమలపై నాడగౌడరికం పొందాడు. అప్పటినుంచి అతని సంతతివారు ఐజనాడగౌడులని ప్రసిద్ధి పొందారు. 17వ శతాబ్ది ప్రారంభంలో వీరి వంశానికి చెందిన పెద్దనృపతి అనే అతడు ఐజ, కందనూలు (కర్నూలు) సీమలకు నాడగౌడుగా ఉన్నాడు. ఇతను 'పూడూరు' సీమ నాడగౌడు అయిన వీరారెడ్డి కుమార్తె బక్కాంబికను పెండ్లి చేసుకొని ఆ సీమకు కూడా అధిపతి అయ్యాడు. పెద్దనృపతి, బక్కాంబికల కుమారుడే శోభనాద్రి. అలియాస్ సోమనాద్రి (1663–1712) ఇతడే గద్వాల కోట నిర్మాత.

ఇతని తర్వాత అతని పెద్ద భార్య అమ్మక్కమ్మ క్రీ.శ.1725 వరకు పాలించింది. తదనంతరం ఇతని రెండవ భార్య రాణి లింగమ్మ 1725 నుంచి 1738 వరకు పాలించింది. ఈమె బీచుపల్లి వద్ద కృష్ణానది మధ్యలో ఉన్న ఎత్తయిన కొండపై దుర్గ నిర్మాణాన్ని ప్రారంభించింది. ఈమె సంగాల, తాండ్రపాటి చెరువులను, లింగమ్మ బావిని నిర్మించింది. ఈమె ముండ్ల దిన్నెలోని నాగన్న కుమారుడైన తిరుమల రాయని దత్తత తీసుకున్నది. రాజా తిరుమలరావు (క్రీ.శ.1738–1742) పెద్దభార్య రాణి మంగమ్మ 1742లో కొంత కాలం మాత్రమే సంస్థాన పాలనను నిర్వహించింది. అనంతరం ఇతని చిన్నభార్య రాణి చొక్కమ్మ 1742–1747 వరకు గద్వాల సంస్థాన పరిపాలనాబాధ్యతను సమర్థవంతంగా నిర్వహించింది. ఈమె బీచుపల్లిలోని నిజాంకోటలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించింది. బోరవెల్లి గిరెమ్మ దత్తపుత్రుడైన రామారావు చొక్కమ్మకు మరిది. ఇతను చొక్కమ్మ కోరిక ప్రకారం ఆమె కుమారులైన రాజా చిన్న సోమభూపాలుడు, చిన్న రామభూపాలురను దత్తత తీసుకొని తన గ్రామాలను గద్వాల సంస్థానంలో చేర్చాడు. కార్యదక్షత గల చొక్కమ్మ ముందుచూపుతో తన కుమారుల సంరక్షణా బాధ్యతను సంస్థానపాలనా వ్యవహారాలను ఇతనికి అప్పగించింది.

రాజా చిన్న రామభూపాలుని కుమార్తె భర్త అయిన సీతారాం భూపాలుని మూడవ భార్య రాణి వెంకటలక్ష్మమ్మ (క్రీ.శ. 1840–1845). ఈమె గద్వాలలో 1849లో కేశవాలయ గోపురాన్ని, మహాద్వారాన్ని నిర్మించింది. ఈమె వెంకటాపురానికి చెందిన కృష్ణారెడ్డి కుమారుడైన రామన్నను నిజాం అనుమతితో దత్తత తీసుకున్నది. ఇతనికి రామరాజ భూపాలుడని నామకరణం చేసి పాలకునిగా నియమించింది. గద్వాల సంస్థానాన్ని పాలించిన చివరి పాలకురాలు ముష్టిపల్లి సీతారామ భూపాలుని (1912–24) భార్యయైన ఆదిలక్ష్మి దేవమ్మ 1948 వరకు జనరంజకమైన పాలన చేశారు. ఈమె కాలంలో సంస్థానంలో బులుసు అప్పన్నశాస్త్రి, పుల్లగుమ్మి వేంకటాచార్యులు, మేడవరం గంగనాథ సిద్ధాంతి మొదలైన పండితవర్గం ఉండేది. అంతేకాకుండా పోకూరి కాశీపత్యవధాని, గాడేపల్లి వీర రాఘవశాస్త్రి శతావధాని, సహస్రావధాని జంధ్యా వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, చెమికెల చెన్నారెడ్డి, పెద్దమంది వేంకటకృష్ణకవి మొదలైన కవులు, సంగీత విద్వాంసులు, ఆస్థానకవులు, అవధానులెందరో ఆశ్రయం పొందారు.

పోకూరి కాశీపత్యవధాని ఆశుకవితాధురీణులు. వీరు రచించిన 'సారంగధరీయము' త్ర్యర్థి కావ్యము (ప్రతి పద్యమునకు మూడర్థములు కలిగి, పార్వతీకళ్యాణ, తారాశశాంక ప్రణయ, సారంగధర చరిత్ర కథలను వివరించుకావ్యము), అచ్చతెలుగు హరిశ్చంద్రోపాఖ్యానం వంటి రచనలు గద్వాల రాణి ఆదిలక్ష్మీదేవి తోడ్పాటుతో అచ్చువేయబడినవి. సీతారామ సిద్ధాంతి గారి 'జ్యోతిసిద్ధాంత తత్త్వ ప్రదీపిక' అనే గ్రంథం, పాలగుమ్మి వెంకటాచార్యుల 'ఆదిలక్ష్మీ కర్ణపూర' మనే గ్రంథాలు రాణిగారి సాయంతోనే ప్రకటించడమైనవి. ఆనాడు పెక్కుమంది కవులు, గ్రంథకర్తలు తమ గ్రంథాలను ప్రకటించుకోవడంలో రాణి సహకారం నిరుపమానమైనది. తిరుపతి వేంకటకవులు కూడా ఆదిలక్ష్మీదేవి గారిచే సన్మానం పొందారు.

సంస్థానాలను పాలించిన మహిళలు కవి పండిత, కళాపోషకులుగా ఉండటమే కాకుండా కృతికర్తలుగాను, కృతి భర్తలుగాను వ్యవహరించిన తీరు నేటి మహిళా సాహితీ మూర్తులెందరికో ఆదర్శప్రాయం. వీరు సంస్థానాలలో సంస్కృతాంధ్ర కవులనే కాక, ఇతర భాషాకవులను కూడా ప్రోత్సహించి, కళారాధకులుగా ప్రశస్తికెక్కారు. వీరిలో కొందరు అనేక ప్రజాసంక్షేమ కార్యక్రమాలను చేపట్టి సామాజికాంశాలలో సాటిలేని మేటి మహిళలుగా నిలిచారు.

ఏటా గద్వాల సంస్థానంలో జరిగే మాఘ పూర్ణిమ సభలలో కవులు ఈ రాణిగారిని కీర్తిస్తూ చెప్పిన పద్యాలు కోకొల్లలు. అవన్నీ నేడు అలభ్యం. బలిజేపల్లి లక్ష్మీకాంతం రాణి గారిని స్తుతిస్తూ..

'అరవిందాసన సుందరీకర సరోజాంచద్విపంచీ విక
స్వరపైక స్వర భాస్వర స్వరలయ ప్రసారధారా విరా
జి రసోద్వేజిగవీ కవిత్వయుత లక్ష్మీకాంత విద్వత్కవీ
ట్కరుణాశీర్మణి పద్యహార మిదుగో! గద్వాల రాజ్ఞీమణీ..!'

అని ఆశీర్వదించి రాణిగారి చేత రూ.116లు, సంస్థాన శాలువలతో సన్మాన సత్కారములు పొందారు. ఈ విధంగా అవిరళ సాహితీసేవలో తరించినది రాణి ఆదిలక్ష్మీ దేవమ్మ.1948 సెప్టెంబర్ 17న గద్వాల సంస్థానం హైదరాబాద్ రాష్ట్రంలో చేర్చబడింది. గద్వాల సంస్థానంలో మహిళామణులు పాలనలోను, సాహితీ పోషణలోను చూపిన ప్రతిభ అసమానమైనది.

వనపర్తి సంస్థానం: వనపర్తి సంస్థానాధీశుల తొలిరాజధాని నూగురు. మొదట దీనిని నూగురు సంస్థానంగా వ్యవహరించేవారు. సంస్థానాన్ని పాలించిన మొదటి రామకృష్ణారావు తన రాజధానిని నూగురు నుంచి వనపర్తికి మార్చడం వలన వనపర్తి సంస్థానంగా పేరుగాంచింది. మొదటి రామకృష్ణారావుకు సంతానం లేనందున ఫకీర్‌రెడ్డి, రమణమ్మల కొడుకైన మొదటి రాజారామేశ్వర్రావును దత్తత తీసుకున్నాడు. మొదటి రామాకృష్ణారావు తదనంతరం నాంచారమ్మ, రమణమ్మలు సంస్థానాన్ని పాలించారు. ఈ సంస్థానాధీశుల గృహనామం జనుంపల్లివారు. వీరు మోటాటిరెడ్డి వంశీయులు. ఈ వంశమూల పురుషుడు వీరకృష్ణభూపతి.

వనపర్తి సంస్థానాధీశుడైన రాజారామేశ్వర్రావుకు ఇద్దరు కుమారులు. వారిలో పెద్ద కుమారుడైన శ్రీకృష్ణదేవరాయలు, భార్య సరళాదేవి. చిన్న కుమారుడైన శ్రీ రామదేవరాయలు, భార్య కుముదినీదేవి. రాజాకృష్ణ దేవరాయల మరణానంతరం రాణి సరళాదేవికి, రాజారామ దేవరాయలకు సంస్థాన పరిపాలనా విషయాల్లో భేదాభిప్రాయాలు ఏర్పాడ్డాయి. సన్నిహితుల చొరవతో పరిస్థితులు చక్కబడ్డాయి. రాణి సరళాదేవి చక్కని పాలనాదక్షత గలది. అంతేకాకుండా ఆమె కవిపండిత పోషణలో తనదైన ప్రత్యేకతను కనబరచేది. వనపర్తి ఆస్థానంలో సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రిగారు 'పువ్వులతోట' అనే ఖండకావ్యాన్ని రాసి రాజా స్వర్గీయ శ్రీకృష్ణదేవరాయల ఆత్మకు అంకితమిచ్చాడు. ఈ గ్రంథ ముద్రణకు సరళాదేవి సహకారం అందించింది.

అమరచింత (ఆత్మకూరు) సంస్థానం: మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆత్మకూరు సంస్థానం అమరచింత సంస్థానంగా వర్ధిల్లింది. ఈ సంస్థానాధీశుల తొలి రాజధాని తివుడంపల్లి. తరువాత ఆత్మకూరు కేంద్రంగా పాలించారు. ఈ సంస్థానం అమరచింత, వడ్డెమాను పరగణాలుగా ఉండేది. పాకనాటి రెడ్డి వంశానికి చెందిన ఈ సంస్థానాధీశులు ముక్కర వారని పిలువబడ్డారు. ఈ సంస్థాన పాలన గోపాల్‌రెడ్డి నుంచి భాగ్యలక్ష్మమ్మ దాకా సాగింది. ఈ సంస్థానాధీశుల్లో ఏడవతరం వాడైన పెద్ద వెంకటరెడ్డి మనుమడైన సోమభూపాలుని కుమారుడు రాజాసీతారామభూపాలరావు. ఈయన ఆత్మకూరు సంస్థానాన్ని అభివృద్ధి పథంలో నడిపించాడు. ఈయన మరణానంతరం ఇతని భార్య రాణి భాగ్యలక్ష్మమ్మ 1933లో నిజాం ద్వారా అమరచింత సంస్థానానికి పట్టాభిషిక్తురాలైంది. ఈ సంస్థానానికి ఈమె చివరి పాలకురాలు. తదనంతరం ఈ సంస్థానం హైదరాబాద్ రాష్ట్రంలో చేర్చబడింది. భాగ్యలక్ష్మమ్మ భాషా సాహిత్యాల అభివృద్ధికి కృషిచేసింది. ఈమె గోలకొండ కవుల సంచిక ప్రచురణకు సహకరించింది. తిరుమల బుక్కపట్నం కృష్ణమ్మ ఆత్మకూరు సంస్థాన విద్వాంసురాలు. ఈమె బుచ్చి వేంకటాచార్యుల కూతురు. జ్యోతిష పండితురాలైన బాలసరస్వతికి కూడా ఈ ఆస్థానంలో ఆదరణ లభించింది. ఈ సంస్థానంలో ఏటా ఫాల్గుణ, శుక్ల, తదియ, చవితి తిథులలో పండిత కవిగాయక సభలు జరిగేవి. రాణీ భాగ్యలక్ష్మీ దేవి కూడా తన పాలనాకాలమందు ఎలాంటి లోపం లేకుండా నిర్వహించేది.

జటప్రోలు (కొల్లాపూర్) సంస్థానం: ఇందులో 9 గ్రామాలుండేవి. ఈ సంస్థానాధీశులు విజయనగర పాలకులకు, గోల్కొండ సుల్తానులకు, అసఫ్‌జాహీలకు సామంతులుగా వ్యవహరించేవారు. సంస్థానాధీశులు జటప్రోలు నుంచి తమ రాజధానిని కొల్లాపూర్‌కు మార్చడం వల్ల ఈ సంస్థానం కొల్లాపూర్ సంస్థానంగా వ్యవహరించబడింది. జటప్రోలు సంస్థానాధీశులు పద్మనాయక వంశీయులు. వీరి ఇంటి పేరు సురభి. రేచర్ల గోత్రీకులు. వీరి మూలపురుషుడు చెవ్విరెడ్డి. భేతాళ నాయకునిగా ప్రసిద్ధుడు.

ఈ సంస్థానాధీశులు సురభి వేంకట లక్ష్మారావు బహదురు. వీరి మరణానంతరం వీరి ధర్మపత్నియైన రాణి వేంకటరత్నమాంబ సంస్థాన మహారాణిగా కొల్లాపురమును జగద్విఖ్యాతముగా పాలించింది. ఈమె కాలమున కవి పండిత పోషణకు కొదవలేకుండేది. వనం సీతారామశాస్త్రిగారు ఆస్థాన పండితులుగా ఉండేవారు. అలాగే సింగపట్నం ఓరుగంటి లక్ష్మీనారాయణశాస్త్రి, కౌతేపల్లి పల్లా చంద్రశేఖర శాస్త్రి, శ్రీధరకృష్ణశాస్త్రి, అల్లాడి రామశాస్త్రి గారు ముఖ్యులు.

రాణిగారి సహాయంతో కావ్యము రచించినవారిలో సరస్వతీ రామాయణమును రచించిన శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి, వాజపేయ యాజల రామసుబ్బారాయుడు మొదలగువారున్నారు.

ఈ విధంగా కొల్లాపూరు సంస్థానమందు వేంకటరత్నమాంబ గారి పాలనాదక్షత, ఔదార్యం, వైదుష్య వైభవముల ద్వారా జటప్రోలు సంస్థాన కీర్తి జగద్విఖ్యాతమొందినది.

– డాక్టర్ నమిలకొండ సునీత, 99084 68171



బతుకు మూట

పొద్దున్నే
బతుకు మూటాను భుజమ్మీదేసుకొని
ఇంటిదాని పెదాల మీది నవ్వుల్ని
పసిపిల్లల ముఖాల కలల్ని కళ్ళనిండా
నింపుకొని
గల్లీ నుండి పట్నం నడి బొడ్డుకు
పయనమవుతాడు

దారి మధ్యలో ఊట చెలిమెలా
కొన్ని ఆత్మీయ పలకరింపుల్ని గుండెల్లో
దాచుకుంటూ
బతుకు మూటాను విప్పుతుంటాడు

అమ్మా అక్కా చెల్లీ అంటూ
ప్రేమగా వరసల్ని కలుపుతూ
ఏడు రంగుల చీరల్ని మురిపముగా ఏరి
ఏరి చూపుతూ
వాళ్ళ ముఖాల్లో రంగుల్ని పూయిస్తాడు

కొసిరి కొసిరి
బేరమాడుతున్న ఆడబిడ్డల్ని చూసి
పదో పరకో మిగిల్చుకొని పండుగలకు
తోబుట్టవుతాడు

పొద్దూకగానే
గల్లీ వైపునకు మెల్లగా అడుగులేస్తూ
అడుగు అడుగుకు జేబులోని కాయితపు
నోట్లను
తడిమి తడిమి చూసుకుంటూ లెక్కలేమో
కట్టుకుంటాడు

రోజు మూట విప్పితేనే
ఆ బతుకుకు వెలుగు పాట..
లేకపోతే రోజంతా చీకటి పూత..!!

– బిల్ల మహేందర్, 91776 04430

డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్
సాహిత్య స్వర్ణోత్సవ సదస్సు

ప్రముఖ కవి, సాహితీకారుడు డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ సాహిత్య స్వర్ణోత్సవం, సప్తతి సందర్భంగా సాహితీ సదస్సు 2018 ఫిబ్రవరి3 మధ్యాహ్నం 2 గంటల నుంచి హైదరాబాద్ రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరుగుతుంది. వేణు సంకోజు అధ్యక్షతన జరుగు ప్రారంభ సమావేశంలో అతిథులుగా డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, డాక్టర్ తిరునగరి హాజరవుతారు. డాక్టర్ ఎం. రంగయ్య, వి.ఆర్.విద్యార్థి, డాక్టర్ నోముల సత్యనారాయణ, ఎలనాగ, డాక్టర్ తిరునగరి దేవకీదేవి, డాక్టర్ అంపశయ్య నవీన్, ఎస్. నారాయణరావు, ఆచార్య టి మహన్‌సింగ్, డాక్టర్ జలంధర్‌రెడ్డి పాల్గొంటారు. బి.నరసింగరావు అధ్యక్షతన జరుగు ముగింపు సమావేశంలో గౌరవ అతిథులుగా డాక్టర్ నందిని సిధారెడ్డి, డాక్టర్ కె.వి.రమణాచారి, ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, మామిడి హరికృష్ణ, ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ, కె.పి.అశోక్‌కుమార్ హాజరవుతారు. అందరికీ ఆహ్వానం.

– కె.గోవిందు, 94908 05046
తెలంగాణ సాహిత్య కళావేదిక

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

హిందూమతానికి పూర్తి వక్రీకరణ హిందుత్వ

జైపూర్ సాహితీఉత్సవంలో నయన్‌తారా సెహ్గల్ విమర్శ



జైపూర్, జనవరి 28: హిందుత్వ అంశం మనలను హిందువులుగానూ, ఇతరులుగానూ విభజించిందని ప్రముఖ రచయిత నయన్‌తారా సెహ్గల్ అన్నారు. ఆదివారం జైపూర్ సాహితీ ఉత్సవంలో ఆమె మాట్లాడుతూ 'హిందూమతానికి పూర్తి వక్రీకరణ హిందుత్వ' అని పేర్కొన్నారు. తనకు తాను సగం ముస్లింనని పేర్కొన్న ఆమె.. దేశంలో నెలకొన్న అసహన వాతావరణాన్ని నిరసిస్తూ రెండేండ్ల క్రితం తన సాహితీ అకాడమీ అవార్డును వెనుకకు ఇచ్చేశారు. తాను రాసిన 'ది మూన్ షైన్స్ బై డే' అనే పుస్తకంలో ఇటీవలి కాలంలో వెలుగు చూసిన అంశాలను ప్రస్తావించారు. హిందుత్వతో తనకు సమస్యలు ఉన్నాయన్నారు. 'మన దేశానికి స్వాతంత్ర్యం పొందినప్పుడు హిందుత్వ గుర్తింపును నిరాకరించాం. ఇక్కడ పలు మతాల వారు జీవిస్తుండటమే కారణం' అని అన్నారు. ప్రస్తుతం దేశంలో వాతావరణం ఆధునిక భారతావనిని నిర్వీర్యం చేసేలా ఉన్నదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతదేశంలో 13 భాషలను అధికారిక భాషలుగా చేర్చినా.. ఉర్దూకు అందులో ఎందుకు చోటు దక్కలేదని ఒక అధికారిని పండిట్ నెహ్రూ ప్రశ్నించారన్నారు. అప్పుడు నెహ్రూకు సమాధానమిచ్చిన ఆ అధికారి 'సర్, ఉర్దూ ఏ ఒక్కరి మాతృభాష కాదు' అని చెప్పారన్నారు. అప్పుడు నెహ్రూ ప్రతిస్పందిస్తూ 'అది నా మాతృభాష' అని అన్నారని ఆమె గుర్తు చేశారు. దళితులపై దాడులకు వ్యతిరేకంగా గట్టిగా వాణి వినిపించాలన్నారు.

సతీసహగమనాన్ని కీర్తిస్తారా?

- శీలం కాపాడుకోవడమే జీవిత లక్ష్యం కాదు
- 'పద్మావత్'పై నటి స్వరాభాస్కర్ ఫైర్
- దర్శకుడు భన్సాలీకి ఘాటుగా లేఖ



స్వరా భాస్కర్

న్యూఢిల్లీ, జనవరి 28: పద్మావత్ చిత్రంపై బాలీవుడ్ తారాగణం ప్రశంసల జల్లు కురిపిస్తుంటే, నటి స్వరాభాస్కర్ మాత్రం దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రస్తుతం మనమంతా 13శతాబ్దంలో లేమని, 21వ శతాబ్దంలో ఉన్నామని గుర్తెరుగాలని సూచించారు. సతీసహగమనాన్ని, జౌహర్‌ను కీర్తించేలా సినిమా ఉందంటూ మండిపడ్డారు. కామపిశాచిగా మారిన అల్లావుద్దీన్ ఖిల్జీ చేతికి చిక్కడం ఇష్టం లేక రాణి పద్మావతి తనను తాను మంటల్లో ఆత్మార్పణ చేసుకోవడం పద్మావత్ చిత్రంలోని ప్రధాన కథాంశం. ఈ నేపథ్యంలో దర్శకుడు భన్సాలీని ఉద్దేశించి రాసిన బహిరంగ లేఖను స్వరాభాస్కర్ విడుదల చేశారు. 'అత్యాచారానికి గురైన మహిళలకూ సమాజంలో జీవించే హక్కు ఉన్నది. భర్త చనిపోయిన మహిళకూ స్వతంత్రంగా బతికే హక్కు ఉంది. ముసలివాళ్లు, గర్భవతులకు కూడా అంతేస్థాయిలో హక్కులున్నాయి. మహిళ జీవితం పూర్తిగా శీలంపైనే ఆధారపడి ఉండదు. దాన్ని రక్షించుకుని, స్వచ్ఛంగా ఉండటమే వాళ్ల జీవిత లక్ష్యం కాదు. తన పరిరక్షకుడు లేకపోతే మహిళ బతుకకూడదన్న మాటలు 13వశతాబ్దం నాటివి. కానీ, ఇప్పుడు మనం 21వ శతాబ్దంలో ఉన్నాం. కొన్నిసార్లు అనుకోని సంఘటనల వల్ల మహిళల ప్రమేయం లేకుండా లైంగిక వేధింపులను ఎదుర్కోవాల్సి వస్తుంది. అంతమాత్రాన ఆమె ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం లేదు. జీవితాన్ని కొనసాగించాలి. శీలమే జీవితం అనుకోకుండా ఉంటే.. అత్యాచార బాధితులు వారికి జరిగిన అన్యాయం తర్వాత కూడా జీవించగలరు. 'పద్మావత్' సినిమా ద్వారా మీరు ఎలాంటి సందేశాన్ని ఇవ్వాలనుకుంటున్నారు? సతిని, ఆత్మార్పణను, పరువు హత్యల్ని కీర్తిస్తారా?' అని స్వర తన లేఖలో ప్రశ్నించారు. తను వెడ్స్ మను, నిల్‌బట్టే సన్నాటా వంటి ప్రజాదరణ పొందిన చిత్రాల్లో నటించిన స్వరాభాస్కర్ దర్శకుడు భన్సాలీ సినిమా 'గుజారిష్'లోనూ చిన్న పాత్రలో నటించారు.

నారీశక్తిదే కీలక భూమిక

పారదర్శకంగా పద్మ అవార్డుల ఎంపిక

సమాజ మార్పునకు శ్రమించిన సామాన్యులనూ గౌరవించాం

2018 తొలి 'మన్‌కీ బాత్'లో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, జనవరి 28: మహిళలు అన్ని రంగాల్లో ముందువరుసలో నిలుస్తున్నారని, ప్రపంచవ్యాప్తంగా మహిళాశక్తి కీలక భూమిక పోషిస్తున్నదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 'మన్ కీ బాత్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలిండియా రేడియోలో ప్రసంగించిన మోదీ మహిళాసాధికారత అవసరాన్ని మరోసారి గుర్తుచేశారు. పద్మ అవార్డుల ఎంపిక పారదర్శకంగా సాగిందని, సమాజంలో మార్పుకోసం శ్రమిస్తున్న సామాన్యులను గౌరవించామని మోదీ తెలిపారు. 'మన్‌కీబాత్'లో ప్రధాని మాట్లాడటం ఇది 40వసారి కాగా, 2018లో మొదటిసారి.

ఈసారి మన్‌కీబాత్‌లో మోదీ ప్రధానంగా నారీశక్తి ప్రాధాన్యాన్ని ప్రస్తావించారు. మహిళలను గౌరవించడం మన సంస్కృతిలో భాగమని, ఒక మహిళ పదిమంది పురుషులతో సమానమని మన పూర్వీకులే చెప్పారని ఆయన తెలిపారు. అంతరిక్షంలో అడుగుపెట్టిన తొలి భారత వ్యోమగామి కల్పనాచావ్లా దేశానికి ఎంతో కీర్తిప్రతిష్ఠలు తెచ్చారని, పిన్న వయసులోనే ఆమెను దేశం కోల్పోయిందని ఆయన గుర్తుచేశారు. చత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు ప్రభావిత దంతేవాడలో ఈ-రిక్షాలు నడుపుతున్న ఆదివాసీ మహిళలను ఈ సందర్భంగా ప్రధాని ప్రశంసించారు. అక్కడ మావోయిస్టు ప్రాబల్యమున్నప్పటికీ, ఆదివాసీ మహిళలు ధైర్య, సాహసాలు ప్రదర్శిస్తున్నారని చెప్పారు. ముంబైలోని మాతుంగ రైల్వేస్టేషన్ 'ఆల్ వుమెన్ రైల్వేస్టేషన్'గా పేరుతెచ్చుకుందని, అక్కడ నిర్వహణా వ్యవహారాలన్నీ మహిళా అధికారులే చూసుకుంటుండటం ప్రశంసనీయ పరిణామమని అన్నారు. ప్రపంచ నేతలుగా కూడా మహిళలు ఎదుగుతున్నారని, దృఢ సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్నారని ప్రధాని ప్రశంసించారు. భావనాకాంత్, మోహనసింగ్, అవని చతుర్వేది.. సుఖోయ్ యుద్ధవిమాన పైలట్లుగా ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు.

సమాజం కోసం శ్రమించిన సామాన్యులకూ 'పద్మం'

ఈ ఏడాది పద్మ అవార్డుల ప్రకటన విధానం పారదర్శకంగా జరిగిందని ప్రధాని స్పష్టంచేశారు. అవార్డు గ్రహీతలను కూడా ఈ సందర్భంగా మోదీ అభినందించారు. కేరళకు చెందిన టీచర్ లక్ష్మి కుట్టి ఇప్పటికీ పూరిపాకలో నివసిస్తూ పాము కాటుకు విరుగుడుతోపాటు 500 రకాల ఆయుర్వేద మందులు తయారు చేశారని ప్రధాని కొనియాడారు. పద్మశ్రీకి ఎంపికైన అరవింద్‌గుప్తాను కూడా ప్రధాని ప్రస్తావించారు. వ్యర్థ పదార్థాల నుంచి పిల్లల కోసం బొమ్మలు సృష్టించడానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని చెప్పారు. మరో అవార్డు గ్రహీత సితావా జోడట్టి.. కర్ణాటకలోని బెల్గావ్ జిల్లాలో దేవదాసీల కోసం మూడుదశాబ్దాలుగా శ్రమిస్తున్నారని వెల్లడించారు. పలువురి ఇండ్లలో పనిమనిషిగా పనిచేసిన, కూరగాయలమ్మి సంపాదించిన డబ్బుతో పశ్చిమబెంగాల్‌కు చెందిన సుభాషిణి మిస్త్రీ పేదల కోసం దవాఖాన నిర్మించిందని ఆయన వివరించారు. పెద్ద పెద్ద నగరాల్లో నివసించేవాళ్లను, రోజూ టీవీలు, పత్రికల్లో కనిపించేవారిని కాకుండా సమాజంలో మార్పు కోసం శ్రమించిన సామాన్యులను పద్మ అవార్డులతో గౌరవించుకున్నామని తెలిపారు. ఈ పురస్కారాల ఎంపిక ప్రక్రియను ఆన్‌లైన్‌కు మార్చడం ద్వారా అర్హులైన వారిని ప్రజలే నామినేట్ చేసేందుకు వీలైందని చెప్పారు.

అవినీతి వ్యతిరేక పోరాటంలో పాల్గొనండి

యువతకు ప్రధాని మోదీ పిలుపు

అవినీతికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో యువత భాగస్వాములు కావాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో అవినీతిపరులెవరినీ ఉపేక్షించబోమని, ఇప్పటికే ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులు జైళ్లలో మగ్గుతున్నారని అన్నారు. ఢిల్లీలో ఆదివారం జరిగిన నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్సీసీ) ర్యాలీలో మోదీ మాట్లాడారు. ఆధార్‌తో ప్రభుత్వ వ్యవస్థ మరింత బలపడిందని చెప్పారు. రూ.60వేల కోట్ల ప్రజాధనాన్ని ఆధార్ ఆదా చేసిందని, నిజమైన పేదలకే లబ్ధి చేకూరేందుకు ఉపయోగపడిందని చెప్పారు. ధనవంతులు, అధికారంలో ఉన్నవారు ఎంతటి అవినీతికి పాల్పడినా చర్యలుండవని గతంలో ప్రచారంలో ఉండేదని, కానీ తమ ప్రభుత్వం అవినీతిపరులు ఎంతటివారైనా ఉపేక్షించడం లేదని చెప్పారు. ప్రస్తుతం జైలుశిక్ష అనుభవిస్తున్న మాజీ ముఖ్యమంత్రులు లాలూప్రసాద్ యాదవ్, జగన్నాథ మిశ్రా (బీహార్), ఓపీ చౌతాలా (హర్యానా) పేర్లను ప్రస్తావించకుండానే మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. నగదురహిత సేవల ద్వారానే అవినీతిని అరికట్టవచ్చని, డిజిటల్ కరెన్సీని ప్రోత్సహించే దిశగా కలిసిరావాలని ఎన్సీసీ కేడెట్లను ప్రధాని కోరారు.

నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

రాష్ట్రపతి ప్రసంగంతో ప్రారంభం

అనంతరం ఉభయసభల్లో ఆర్థిక సర్వే నివేదిక

ఫిబ్రవరి 1న 2018-19 సాధారణ బడ్జెట్

ట్రిపుల్ తలాక్, ఓబీసీ బిల్లుల్ని నెగ్గించుకునేందుకు సర్కార్ పట్టు

సహకరించాలని అఖిలపక్షాన్ని కోరిన ప్రధాని

న్యూఢిల్లీ, జనవరి 28:

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత తొలిబడ్జెట్.. ఎన్నికలకు ముందు రానున్న ప్రజాకర్షక బడ్జెట్.. ఇలా ఎన్నో విశేషాలున్న బడ్జెట్-2018 ఈ సమావేశాల్లోనే ప్రజల ముందుకు రానున్నది. ఫిబ్రవరి 1న వార్షిక సాధారణ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 2019 ఎన్నికల దృష్ట్యా ఈసారి బడ్జెట్‌లో పేదలకు, రైతులకు ప్రభుత్వం పలు రాయితీలు, పథకాలను ప్రకటించే అవకాశముందని భావిస్తున్నారు. అలాగే కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు కూడా సమీపిస్తున్నందున బడ్జెట్‌లో ఆ దిశగా మార్పులు కనిపించవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గత సమావేశాల్లో ప్రవేశపెట్టినప్పటికీ రాజ్యసభ ఆమోదించని ట్రిపుల్ తలాక్ బిల్లును ఈసారి ఎలాగైనా గట్టెక్కించుకోవాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నది. దీంతోపాటు ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా బిల్లును కూడా సభ ఆమోదం పొందేలా చూడాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. సమావేశాలు సజావుగా సాగేందుకు లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, కేంద్ర ప్రభుత్వం ఆదివారం సాయంత్రం వేర్వేరుగా అఖిలపక్ష సమావేశాలు నిర్వహించి, వివిధ పార్టీలతో చర్చించారు. మరోవైపు జీఎస్టీ, ట్రిపుల్ తలాక్‌తోపాటు దేశవ్యాప్తంగా నమోదవుతున్న అత్యాచారాలు, రాజ్యాంగ సంస్థలపై దాడి వంటి అంశాలతో ప్రభుత్వ తీరును ఐక్యంగా ఎండగట్టాలని విపక్ష పార్టీలు భావిస్తున్నట్లు సమాచారం. ఈమేరకు వివిధ పార్టీల నేతలు సోమవారం సమావేశమై చర్చించే అవకాశముంది. 'ఈసారి సమావేశాల్లో చర్చకు రానున్నవి కీలకమైన అంశాలు. ప్రభుత్వం ప్రతిపక్షాల అభ్యంతరాలనూ వింటుందని ఆశిస్తున్నాం' అని కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ తెలిపారు. మరోవైపు బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీ కూడా నేడు జరుగనున్నది.

ఈసారి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు రెండు విడుతలుగా జరుగనున్నాయి. జనవరి 29 నుంచి ఫిబ్రవరి 9 వరకు మొదటి విడుత, మార్చి5 నుంచి ఏప్రిల్ 6వరకు రెండో విడతగా పార్లమెంట్ భేటీ కానున్నది. ఆనవాయితీ ప్రకారం ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగించడంతో సోమవారం బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. ఆర్థికాభివృద్ధి, వ్యవసాయరంగ సంస్కరణలతోపాటు, పలు అంశాలపట్ల ప్రభుత్వ వైఖరిని రాష్ట్రపతి ప్రసంగం ప్రతిబింబించవచ్చని భావిస్తున్నారు. అనంతరం 2017-18 సంవత్సరానికి సంబంధించి ఎకనామిక్ సర్వేను ప్రభుత్వం లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రవేశపెట్టనుంది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చ.. సమావేశాల్లో ప్రభుత్వ, ప్రతిపక్ష పార్టీల వైఖరిని స్పష్టంచేయనున్నది. మోదీ ప్రభుత్వ ఐదవ సాధారణ బడ్జెట్, ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వ చివరి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ఉదయం 11 గంటలకు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంటులో ప్రవేశపెడుతారు. ఆనవాయితీకి భిన్నంగా గత ఏడాది నుంచి ఫిబ్రవరి 1నే కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న విషయం తెలిసిందే.

ఒకటిన 11 గంటలకు జైట్లీ బడ్జెట్ ప్రసంగం



అఖిలపక్ష సమావేశంలో ప్రధాని మోదీ, మంత్రులు అనంత్‌కుమార్, రాజ్‌నాథ్‌సింగ్, జైట్లీ.. చిత్రంలో టీఆర్‌ఎస్ ఎంపీలు జితేందర్ రెడ్డి, కే కేశవరావు ఉన్నారు

సహకరించాలని అఖిలపక్షాన్ని కోరిన ప్రధాని

ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదానికి అన్ని పార్టీలతో సంప్రదింపులు జరుపుతామని కేంద్రమంత్రి అనంత్‌కుమార్ తెలిపారు. ఆదివారం సాయంత్రం ఢిల్లీలోని పార్లమెంట్‌హౌస్‌లో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ప్రధాని మోదీతోపాటు హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు. సమావేశం అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. ఈసారి బడ్జెట్ అత్యంత కీలకమైనందున పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని ప్రధాని మోదీ వివిధ పార్టీలను కోరారని చెప్పారు. రాజకీయపక్షాలతో చర్చలు ఫలవంతమైనట్లు ఆయన చెప్పారు. వివిధ పార్టీలతో ఏకాభిప్రాయం దిశగా ప్రయత్నిస్తున్నామని, ట్రిపుల్ తలాక్ బిల్లును ఏకాభిప్రాయంతో ఆమోదింపజేయాలని ప్రభుత్వం భావిస్తున్నదని అనంత్‌కుమార్ తెలిపారు. బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలన్న పలు పార్టీల డిమాండ్‌ను ప్రస్తావించగా, బిల్లు ప్రస్తుతం రాజ్యసభలో ఉందని, సెలక్ట్ కమిటీకి పంపాలా వద్దా? అనేది నిర్ణయించేది సభ మాత్రమేనని కేంద్రమంత్రి చెప్పారు. ఈ సమావేశంలో అన్ని పార్టీల పార్లమెంటరీ పార్టీ నేతలు పాల్గొన్నారు. మల్లికార్జున ఖర్గే, గులాంనబీ ఆజాద్, జ్యోతిరాదిత్య సింధియా (కాంగ్రెస్),కే కేశవరావు, జితేందర్‌రెడ్డి (టీఆర్ఎస్), డీ రాజా(సీపీఐ), ములాయంసింగ్ యాదవ్ (ఎస్పీ), కనిమొళి (డీఎంకే)ఇతర పార్టీల నేతలు ఈ భేటీకి హాజరయ్యారు.

బంద్‌తో స్తంభించిన జనజీవనం

సైనికులపై కశ్మీర్ పోలీసుల ఎఫ్‌ఐఆర్



బంద్‌తో నిర్మానుష్యంగా మారిన శ్రీనగర్ వీధి

శ్రీనగర్/ జమ్ము, జనవరి 28: జమ్ముకశ్మీర్ రాష్ట్రం షోపియాన్ జిల్లా పరిధిలో సైన్యం జరిపిన కాల్పుల్లో ఇద్దరు యువకులు మృతి చెందడంతో నాలుగు జిల్లాల పరిధిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సైన్యం వైఖరిని నిరసిస్తూ వేర్పాటువాదుల పిలుపు మేరకు ఆదివారం కశ్మీర్ లోయలో జన జీవనం స్తంభించింది. శ్రీనగర్‌లో నిషేధాజ్ఞలు విధించారు. పుల్వామా, అనంత్‌నాగ్, కుల్గాం, షోపియాన్ జిల్లాల పరిధిలో ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. సైన్యం ఎటువంటి హెచ్చరికలు లేకుండానే కాల్పులు జరిపిందని స్థానికులు ఆరోపించారు. కానీ తాము ఆత్మరక్షణ కోసమే కాల్పులు జరిపామని సైన్యం వాదిస్తున్నది. కాగా, షోపియాన్ జిల్లాలో ఇద్దరు వ్యక్తుల మృతికి కారణమైన సైన్యానికి చెందిన గర్వాల్ యూనిట్ ఆర్మీ మేజర్‌తోపాటు జవాన్లపై పోలీసులు కేసునమోదు చేశారు. జమ్ములోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ పాక్ జరిపిన కాల్పుల్లో గాయపడిన మహిళ బీమ్లాదేవి (35) ఆదివారం మరణించడంతో మొత్తం మృతుల సంఖ్య 14 మందికి చేరుకున్నది.

సెన్సార్ బోర్డును రద్దు చేయాలి

కేంద్ర మాజీ మంత్రి మనీశ్ తివారి

న్యూఢిల్లీ: కేంద్ర సెన్సార్‌బోర్డు (సీబీఎఫ్‌సీ)ని రద్దు చేయాలని కేంద్ర మాజీ మంత్రి మనీశ్‌తివారి డిమాండ్ చేశారు. కర్ణిసేన హెచ్చరికలతో సెన్సార్ బోర్డు చైర్మన్ ప్రసూన్ జోషి జైపూర్‌లో నిర్వహించిన సాహితీ ఉత్సవాలకు హాజరు కాకపోవడంతో ఆయన స్పందించారు. పద్మావత్ చిత్రానికి సర్టిఫికెట్ జారీచేసిన సీబీఎఫ్‌సీ చైర్మన్‌కు బెదిరింపులు రావడం ఏమిటని ప్రశ్నించారు. అటువంటప్పుడు సెన్సార్ బోర్డును రద్దు చేసి ముద్గల్ కమిటీ సిఫారసుల ప్రకారం నూతన బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. అప్పటి వరకూ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ బాధ్యతలు నిర్వర్తించాలని కోరారు.

సైబర్ నేరాల అడ్డుకట్టకు కేంద్రం కసరత్తు

అత్యున్నత సమన్వయ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళికలు

న్యూఢిల్లీ: ఆర్థిక మోసాలు, మతపరమైన, అశ్లీలమైన విషయాల విస్తరణకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. అత్యున్నత సమన్వయ కేంద్రం (అపెక్స్ కోఆర్డినేషన్ సెంటర్) ఏర్పాటుకు కేంద్ర హోంశాఖ ప్రణాళికలు వేస్తున్నది. ప్రతి జిల్లాలో వీటిని ప్రారంభించాలని రాష్ట్రాలకు సూచించింది. ప్రతి రాష్ట్రంలో పోలీసు అధికారులకు సైబర్ ఫోరెన్సిక్ ట్రైనింగ్ ల్యాబరేటరీ, శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటుచేసేందుకు రూ.83కోట్లను విడుదల చేసింది. భారత సైబర్ నేర సమన్వయ కేంద్రాన్ని ఢిల్లీలో ఏర్పాటుచేస్తారు. ఇది రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలను సమన్వయం చేసుకుంటూ సైబర్ నేరాలపై దృష్టి పెడుతుంది. భారత చట్టాలను అవహేళన చేసే, చైల్డ్ పోర్న్‌ను విస్తరించే, మత, జాతిపరమైన సున్నితమైన అంశాలను తెలిపే వెబ్‌సైట్లను తొలిగించనున్నది. దేశంలో 2014-16 మధ్య 1,44,496 సైబర్ సెక్యూరిటీ దాడులు జరిగిన నేపథ్యంలో కేంద్రం ఈ మేరకు ముందుకొచ్చింది. దేశంలో 2013 - 2015 మధ్య వరుసగా 5,693, 9,622, 11,592 సైబర్ నేరాల కేసులు నమోదయ్యాయని నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో తెలిపింది.

బిక్షాటన కూడా కొలువేనా..?


ప్రధాని మోదీని ఎద్దేవా చేసిన కాంగ్రెస్ నేత చిదంబరం



న్యూఢిల్లీ: ఉద్యోగాల కల్పనపై ప్రధాని నరేంద్ర మోదీ అసంబద్ధ ప్రకటనపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చిదంబరం మండిపడ్డారు. 'ఒకవేళ పకోడాల విక్రయం కూడా ఒక ఉద్యోగం అయితే.. బిక్షాటన కూడా ఉద్యోగమే' అని ఆదివారం వరుస ట్వీట్లతో నిప్పులు చెరిగారు. మూడేండ్లుగా ఉపాధి కల్పనలో మోదీ ప్రభుత్వం విఫలమైందన్న మాట వాస్తవమని చెప్పారు. మూడేండ్లలో ఉపాధి రహిత ప్రగతి సాధించారన్నారు. భవిష్యత్‌లో ఉద్యోగాలతో కూడిన అభివృద్ధి సాధిస్తామంటున్న ప్రభుత్వంపై దాడి చేసేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారన్నారు. గత యూపీఏ ప్రభుత్వ హయాంలో అమలులోకి తెచ్చిన జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఉద్యోగాలు పొందిన వారిని మోదీ ప్రభుత్వం తాము కల్పించిన ఉద్యోగాల జాబితాలో చేర్చుకోవచ్చునని ఎద్దేవా చేశారు. కొన్ని రోజుల క్రితం ఒక టీవీ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ మాట్లాడుతూ 'ఒకవేళ ఒక వ్యక్తి పకోడాలు (స్నాక్స్) అమ్ముకుంటే రోజుకు రూ.200 సంపాదిస్తున్నారు. ఇది ఉపాధి కిందకు రాదా?' అని ప్రశ్నించారు. మోదీ వ్యాఖ్యలను ఎద్దేవా చేసిన చిదంబరం.. ఉద్యోగాల కల్పనపై గణాంకాలతో ప్రభుత్వం బయటకు రావాలని డిమాండ్ చేశారు. స్వయం ఉపాధికి, ఉద్యోగానికి మధ్య ప్రత్యేకత ఉన్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ నేత చిదంబరం వ్యాఖ్యలను బీజేపీ తప్పుబట్టింది. కాంగ్రెస్ పార్టీ పేదలను, ఉద్యోగార్థులైన భారతీయుల ఆకాంక్షలను కించపరుస్తున్నదని ఆరోపించింది.

ఎంఆర్‌ఐ స్కానింగ్ యంత్రానికి యువకుడి బలి

- ఆక్సిజన్ సిలిండర్‌తో ఎంఆర్‌ఐ గదిలోకి..
- ఆకర్షించిన స్కానర్‌లోని అయస్కాంతం
- యంత్రంలో ఇరుక్కుని మృతి
- వైద్యుడు, వార్డుబాయ్ అరెస్టు.. ముంబై దవాఖానలో ఘటన



రాజేశ్ మారు (ఫైల్)

ముంబై, జనవరి 28: బంధువుకు దవాఖానలో ఎంఆర్‌ఐ స్కానింగ్ చేయించేందుకు తోడుగా వచ్చిన ఓ వ్యక్తి.. అదే స్కానింగ్ యంత్రానికి బలయ్యాడు. దవాఖాన సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా నిమిషాల్లోనే ప్రాణాలు వదిలాడు. రోగిని ఆక్సిజన్ సిలిండర్‌తో సహా ఎంఆర్‌ఐ స్కానింగ్ గదిలోకి తీసుకెళ్లిన వ్యక్తి.. స్కానింగ్ యంత్రం ఆకర్షించడంతో అందులో ఇరుక్కుని మృత్యువాతపడ్డాడు. ముంబైలోని బీవైఎల్ నాయర్ చారిటబుల్ దవాఖానలో శనివారం ఈ ఘటన చోటుచేసుకున్నది. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు.. ఇద్దరిని అరెస్టు చేశారు. బంధువైన మహిళకు స్కానింగ్ తీయించేందుకు రాజేశ్ మారు(32) శనివారం సాయంత్రం బీవైఎల్ నాయర్ దవాఖానకు వచ్చారు. ఏవైనా లోహపు వస్తువులు.. బంగారం, జిప్‌లు, బటన్‌లు తదితరాలు వెంట ఉంటే ఎంఆర్‌ఐ గదిలోకి అనుమతించరు. కానీ, రాజేశ్‌తోసహ ఆక్సిజన్ సిలిండర్ పెట్టుకుని ఉన్న రోగిని స్ట్రెచర్‌పై వార్డుబాయ్ స్కానింగ్ గదిలోకి పంపించాడని బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. 'లోహపు వస్తువులను ఎంఆర్‌ఐ గదిలోకి తీసుకెళ్లేందుకు అనుమతించరు కదా అని బాయ్‌ని అడిగాను. కానీ మేము రోజూ ఇలాగే పని చేస్తాం, నడిచిపోతుందిలే అని సమాధానం చెప్పాడు. అదేవిధంగా స్కానింగ్‌యంత్రం ఆఫ్ చేసి ఉన్నదని తెలిపాడు. దీనికి వైద్యుడు, టెక్నీషియన్ ఏమీ మాట్లాడలేదు' అని రాజేశ్ బంధువు హరీశ్ సోలంకి తెలిపారు. సిలిండర్‌తో గదిలోకి ప్రవేశించగానే, స్కానింగ్ యంత్రం ఆన్‌లో ఉందని చెప్పారు. 'సిలిండర్‌ను స్కానింగ్ యంత్రంలోని అయస్కాంతం బలంగా ఆకర్షించింది. సిలిండర్‌తోపాటు పక్కనున్న రాజేశ్ కూడా వెళ్లి యంత్రానికి అతుక్కుపోయాడు. అతని చెయ్యి యంత్రంలో ఇరుక్కుపోయింది. ఈ సమయంలో సిలిండర్ మూత ఊడిపోయి ద్రవ రూపంలో ఆక్సిజన్ విడుదలైంది' అని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. స్కానింగ్ యంత్రంలో ఇరుక్కుపోయిన రాజేశ్‌ను వార్డుబాయ్‌తో కలిసి సోలంకి బయటకు తీయగా, అప్పటికే అతని శరీరం ఉబ్బిపోయి తీవ్రంగా రక్తస్రావమైంది. వెంటనే అత్యవసర విభాగానికి తరలించగా పది నిమిషాల్లోనే రాజేశ్ మృతిచెందాడు. దవాఖాన సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే రాజేశ్ చనిపోయాడని సోలంకి ఆరోపించారు. వైద్యుడు, వార్డుబాయ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వైద్యుడు సిద్ధాంత్ షా, వార్డుబాయ్ విట్టల్ చవాన్, వార్డు సహాయకురాలు సునీత సుర్వేపై కేసు నమోదుచేశారు. వీరిలో వైద్యుడు, వార్డుబాయ్‌ని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఘటనపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని దవాఖాన డీన్ డాక్టర్ రమేశ్ భర్మాల్ తెలిపారు.

తక్కువ ఖర్చుతో బతుకొచ్చు!

- జీవన వ్యయం తక్కువగా ఉన్న దేశాల్లో భారత్‌కు రెండోస్థానం
- మొదటి స్థానంలో దక్షిణాఫ్రికా
- సర్వే వివరాలు వెల్లడించిన 'గో బ్యాంకింగ్ రేట్స్' సంస్థ



హ్యూస్టన్: ప్రపంచంలోనే అత్యంత తక్కువ జీవన వ్యయ దేశాల్లో భారత్ రెండో స్థానంలో నిలిచింది. అమెరికాకు చెందిన 'గోబ్యాంకింగ్ రేట్స్' సంస్థ ఆన్‌లైన్ డేటాబేస్ సేవల సంస్థ 'నుంబియో' సాయంతో ప్రపంచవ్యాప్తంగా 112 దేశాల్లో సర్వే నిర్వహించింది. తాజా జాబితాలో దక్షిణాఫ్రికా మొదటి, భారత్ రెండో స్థానంలో నిలిచాయి. ప్రజల కొనుగోలు శక్తి, ఇంటి అద్దెలు, సరుకులు, నిత్యావసర వస్తువులు, రెస్టారెంట్లు, రవాణా తదితర సేవల ధరలను పరిగణనలోకి తీసుకొని ఈ సర్వే నిర్వహించింది. ఆయా దేశాల్లోని జీతభత్యాల ఆధారంగా కొనుగోలు శక్తిని, ధరల సూచీని నిర్ణయించింది. ఈ జాబితాలో పాకిస్థాన్ 14వ స్థానంలో నిలువగా, నేపాల్ 28, బంగ్లాదేశ్ 40వ స్థానంలో నిలిచాయి.

- తక్కువ అద్దె గల 50 దేశాల్లో నేపాల్ తొలి, భారత్ రెండో స్థానంలో నిలిచింది.
- నిత్యావసరాలు, ఇతర సరుకుల ధరలు భారత్‌లో చాలా తక్కువగా ఉన్నాయన్నది. భారత్‌లో టెక్స్‌టైల్, రసాయన, ఆహార శుద్ధి పరిశ్రమలు ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణమని చెప్పింది. కోల్‌కతాలో ఒక వ్యక్తి నివసించడానికి నెలకు రూ.18 వేలు వెచ్చిస్తే సరిపోతుందని తెలిపింది.
- తొలి 50 స్థానాల్లో నిలిచిన దేశాల్లో అత్యధిక జనాభా భారత్‌లోనే ఉన్నది.
- తాము సర్వే చేసిన నగరాల్లో భారత్‌లోనే కొనుగోలు శక్తి ఎక్కువగా ఉన్నట్టు పేర్కొన్నది.
- న్యూయార్క్‌తో పోలిస్తే భారతీయుల కొనుగోలు శక్తి 20.9%, అద్దెలు 95.2%, సరుకుల ధరలు 74.4%, నిత్యావసరాలు, సేవల ధరలు 74.9 శాతం తక్కువగా ఉన్నట్టు సర్వే వెల్లడించింది.
- న్యూయార్క్‌తో పోల్చినప్పుడు తొలి 50 స్థానాల్లో నిలిచిన దేశాల్లో అద్దె 70 శాతం తక్కువగా ఉండగా, నిత్యావసరాల ధరలు 40 శాతం, సరుకులు, సేవల ధరలు 30 శాతం తక్కువగా ఉన్నాయి.
- కొనుగోలు శక్తి విషయంలో దక్షిణాఫ్రికా న్యూయార్క్‌ను దాటేసింది. దక్షిణాఫ్రికాలో ప్రపంచంలోనే అత్యధికంగా ప్లాటినం, బంగారం, క్రోమియం ఉత్పత్తి చేయడంతో సంపద ఎక్కువగా ఉన్నది. దీంతో ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. దీనికితోడు నిత్యావసరాలు, సరుకుల ధరలు అందుబాటులో ఉన్నాయి. ఒక వ్యక్తి కేప్‌టౌన్‌లో బతుకాలంటే నెలకు రూ.25 వేల వరకు వెచ్చిస్తే సరిపోతుందన్నది. సింగిల్ బెడ్‌రూం అద్దె రూ.18వేల వరకు ఉన్నదని, స్విట్జర్లాండ్ (109వ ర్యాంకు), హాంకాంగ్ (110), బహామస్ (111), బెర్ముడా (112)తో పోల్చితే తక్కువని వివరించింది.

ప్రధాని విదేశీ పర్యటనల వివరాలివ్వండి

పీఎంవోకు సీఐసీ ఆర్కే మాథుర్ ఆదేశం

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ విదేశీ పర్యటనల్లో ఆయన వెంట వెళ్లే ప్రతినిధి బృందం సభ్యుల వివరాలను నెల రోజుల్లో తెలియజేయాలని ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో)ను ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ) ఆర్‌కే మాథుర్ ఇటీవల ఆదేశించారు. జాతి భద్రత దృష్ట్యా ప్రధాని మోదీ పర్యటన వివరాలు వెల్లడించలేమన్న పీఎంవో అభ్యంతరాన్ని మాథుర్ తోసిపుచ్చారు. ఈ విషయమై నీరజ్ శర్మ, అయూబ్ అలీ అనే ఆర్టీఐ కార్యకర్తలు తమ పిటిషన్లకు పీఎంవో నుంచి సరైన సమాచారం రాకపోవడంతో వారు సీఈసీని ఆశ్రయించారు. ప్రధాని భద్రతతో సంబంధం ఉన్న వ్యక్తుల పేర్లను మినహాయించి ఇతర ప్రతినిధుల వివరాలు అందజేయాలని పీఎంవోకు సీఐసీ మాథుర్ సూచించారు.

యాసిడ్ దాడి బాధితులకు కోటా

మొదటిపేజీ తరువాయి...

ఒక్కశాతం రిజర్వేషన్లు చెముడు, అంధత్వం, మరుగుజ్జులు, పాక్షిక పక్షవాతం, కుష్ఠు, కండరాల బలహీనత ఉన్నవారికి వర్తింపజేస్తున్నారు. తాజాగా ఇందులో యాసిడ్ దాడి బాధితులను చేర్చారు. కొత్త నిబంధనల ప్రకారం అన్ని ప్రభుత్వశాఖలు ఫిర్యాదుల పరిష్కార సిబ్బందిని నియమించాలని డీవోపీటీ కోరింది. ఈ అధికారులు ఫిర్యాదులకు సంబంధించిన అన్ని వివరాలను క్రమ పద్ధతిలో నిర్వహించాలని పేర్కొన్నది. ఉద్యోగ నియామకాల్లో వివక్ష ఎదుర్కొంటున్నట్టు వైకల్యం కలిగిన వ్యక్తులు భావిస్తే ఆయా ప్రభుత్వ విభాగాల్లోని గ్రీవెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది. ప్రతి ఫిర్యాదును రెండు నెలల్లో పరిష్కరించి తీసుకున్న చర్యల గురించి ఫిర్యాదుదారునికి తెలియజేయాలి. వివిధ రకాల దివ్యాంగులకు ఇస్తున్న రిజర్వేషన్లు ఎస్సీలు, ఓబీసీలకు సంబంధించిన కోటా నుంచి సర్దుబాటు చేయడం లేదని డీవోపీటీ ఉత్తర్వుల్లో పేర్కొన్నది.



బుక్‌ఫేర్ ముగింపు సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే కే లక్ష్మణ్, బుద్ధవనం ప్రాజెక్టు ఓఎస్డీ మల్లేపల్లి లక్ష్మయ్య, రాష్ట్ర భాషా సంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్, బుక్‌ఫేర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ తదితరులు

పుస్తకం రుణం తీర్చుకోలేనిది

- తెలంగాణ ఉద్యమంలో సాహిత్యానికి కీలకపాత్ర
- సీఎం కేసీఆర్‌ను పుస్తకాలే నడిపిస్తున్నాయి
- బుక్ ఫేర్ ముగింపు సభలో మంత్రి హరీశ్‌రావు

కవాడిగూడ: హైదరాబాద్ పుస్తక ప్రదర్శన చూస్తుంటే ప్రపంచ విజ్ఞానాన్ని ఒకే చోట కట్టగట్టి ఉంచినట్టున్నదని భారీ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. పుస్తకం విలువ ఎప్పటికీ తగ్గదని, పుస్తకం రుణాన్ని మనిషి ఎప్పటికీ తీర్చుకోలేడని చెప్పారు. తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం) మైదానంలో ఆదివారం నిర్వహించిన పుస్తక ప్రదర్శన ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచ తెలుగు మహాసభల మాదిరిగానే హైదరాబాద్ బుక్ ఫేర్‌లో ప్రజలు పెద్దఎత్తున భాగస్వాములు కావడం సంతోషించదగ్గ విషయమన్నారు. సీఎం కేసీఆర్ పుస్తక ప్రియుడని గుర్తుచేశారు. సీఎంను పుస్తకాలు నడిపిస్తుండగా, మనల్ని సీఎం నడిపిస్తున్నారని చెప్పారు. దివంగత ఆర్ విద్యాసాగర్‌రావు రచించిన నీళ్లు-నిజాలు అనే పుస్తకం తనపై ఎంతో ప్రభావం చూపిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో సాహిత్యం, పుస్తకాలు కీలకపాత్ర పోషించాయని గుర్తుచేశారు. మొబైల్‌ఫోన్, సోషల్ మీడియా అన్ని రంగాలపై ప్రభావం చూపినా పుస్తకంపై మమకారాన్ని తగ్గించలేదన్నారు. అన్ని జిల్లాల్లో బుక్‌ఫేర్ ఏర్పాటు చేయాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కే లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీలో కంటే తెలంగాణ రాష్ట్రంలో బుక్‌ఫేర్‌కు విశేష స్పందన లభిస్తున్నదన్నారు. డిజిటల్ సంస్కృతి విస్తరిస్తున్నా తెలంగాణలో పుస్తక ప్రదర్శనలకు, పుస్తక పఠనానికి ఇంత ఆదరణ లభించడం శుభపరిణామమన్నారు. మనుషుల్లో మంచి ప్రవర్తన పెంచడానికి పుస్తకాలు సహకరిస్తాయని బుద్ధవనం ప్రాజెక్టు ఓఎస్డీ మల్లేపల్లి లక్ష్మయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర భాషా సంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్, బుక్‌ఫేర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, కోశాధికారి రామేశ్వర్‌రావు, నిర్వాహకులు సదాశివరావు, విజయకుమార్, శోభన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ బుక్‌ఫేర్‌కు సందర్శకుల తాకిడి

బాలలకు బహుమతుల ప్రదానం

బుక్‌ఫేర్‌లో 10 రోజులుగా బాలలకు నిర్వహించిన ఒక్క నిమిషం తెలుగు పాటలు, ఉపన్యాస పోటీల విజేతలకు సినారె వేదికపై బహుమతులు అందజేశారు. సీపీఎం జాతీయ కార్యదర్శి బీవీ రాఘవులు, డొక్కాపు వెంకటరమణ ముఖ్య అతిథులుగా హాజరై పిల్లలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ డిజిటల్ టెక్నాలజీ పెరుగుతున్నా పుస్తకం జీవించి ఉంటుందన్నారు. పిల్లలు సెల్‌ఫోన్లు, టీవీలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలని, పుస్తకాలవైపు వారి దృష్టిని మళ్లించాలని సూచించారు. పాఠశాలల్లో జీవన విలువలు నేర్పాలన్నారు.

ఆదివారమూ నంబర్ ప్లేట్ల బిగింపు

ఉద్యోగుల కోసం ప్రత్యేక సదుపాయం

పైలట్ ప్రాజెక్టు కింద ఖైరతాబాద్‌లో ప్రారంభం

త్వరలో రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తాం: జేటీసీ పాండురంగనాయక్



ఆదివారం ఖైరతాబాద్ రవాణాశాఖ కార్యాలయంలో హై సెక్యూరిటీ నంబర్‌ప్లేట్‌ను బిగిస్తున్న అధికారులు

హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ల బిగింపును ఇకపై ఆదివారాల్లోనూ కొనసాగించాలని రవాణాశాఖ నిర్ణయించింది. నగరంలోని ఉద్యోగులను ముఖ్యంగా ఐటీ ఉద్యోగులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆదివారం ఖైరతాబాద్‌లోని జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కార్యాలయం పరిధిలో ఆర్‌టీవోలు సీ రమేశ్, దుర్గాప్రసాద్ కలిసి ప్రారంభించారు. జేటీసీ పాండురంగనాయక్ ఆదేశాల మేరకు దశల వారీగా ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని అన్ని కార్యాలయాలకు విస్తరించనున్నారు. మొదటిరోజు 10 ద్విచక్ర వాహనాలు, 2 త్రీ వీలర్స్, నాలుగు చక్రవాహనాలు 4 మొత్తం 16 వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లను బిగించారు. నిబంధనల ప్రకారం యజమాని తన వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించిన వారం రోజుల్లోగా హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ బింగిచుకోవాల్సి ఉంటుంది. అయితే వివిధ కారణాల వల్ల నగరంలోని రవాణాశాఖ కార్యాలయాల్లో నంబర్‌ప్లేట్లు కుప్పలుగా పడి ఉన్నాయి. ప్రతిరోజు దాదాపు 30 నుంచి 50 మంది వాహనదారులు రావడం లేదని, కార్యాలయాల్లో నంబర్‌ప్లేట్లు గుట్టలుగా పేరుకుపోయాయని అధికారులు చెబుతున్నారు. ఈ విషయంపై ఈ నెల 3వ తేదీన 'నమస్తే తెలంగాణ' పత్రికలో 'హై సెక్యూరిటీ ప్లేట్లపై అనాసక్తి' పేరిట వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన జేటీసీ పాండురంగనాయక్ ఆదివారం సైతం నంబర్‌ప్లేట్ల బింగిపు నిర్ణయం తీసుకున్నారు.

ఉద్యోగులకు సదవకాశం

2014 జూన్ 8వ తేదీ నుంచి రాష్ట్రంలో హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ల బిగింపు మొదలైంది. వాహనం రిజిస్ట్రేషన్ చేయించుకున్న నాలుగు రోజుల్లో సంబంధిత వాహనదారుడి మొబైల్ నంబర్‌కు ఎస్ఎంఎస్ ద్వారా హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్‌ను ఎప్పుడు బిగించుకోవాలో సమాచారం అందుతుంది. అయితే ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు పనిదినాల్లో వచ్చి నంబర్‌ప్లేట్లు బిగించుకోవడం కష్టంగా మారింది. అనుకున్న సమయానికి రాలేకపోతున్నవారు కూడా ఉన్నారు. దీంతో సెలవు దినమైన ఆదివారాల్లో నంబర్ ప్లేట్ల బిగింపునకు అవకాశం కల్పించాలని రవాణాశాఖ అధికారులకు చాలారోజుల నుంచి విన్నపాలు కూడా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర రవాణాశాఖ ఉన్నతాధికారులు పైలెట్ ప్రాజెక్టును ఆదివారం ఖైరతాబాద్‌లో ప్రారంభించారు. కార్యక్రమంలో టీఎన్జీవో రవాణాశాఖ నగర అధ్యక్షుడు శామ్యూల్‌పాల్ పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తాం: పాండురంగనాయక్, జేటీసీ

వాహనదారుల విజ్ఞప్తి మేరకు ఆదివారం కూడా హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ల బిగింపు చేపట్టనున్నాం. పైలట్ ప్రాజెక్టు కింద ఖైరతాబాద్ రవాణాశాఖ కార్యాలయంలో ప్రారంభించాం. త్వరలో హైదరాబాద్‌లోని అన్ని కార్యాలయాల్లో ప్రారంభిస్తాం. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా డిమాండ్ ఉన్న అన్ని రవాణాశాఖ కార్యాలయాలకు విస్తరిస్తాం.

నాగోల్-కొర్రెముల నాలుగు లేన్ల రహదారి

డీపీఆర్ రూపకల్పనకు టెండర్లు ఆహ్వానించిన హెచ్ఎండీఏ • మూసీ వెంట 15.5 కి.మీల మేర రేడియల్ రోడ్డు నిర్మాణం

ఏడాదిలోగా అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రణాళిక • ఉప్పల్ రింగ్ రోడ్‌లో ట్రాఫిక్ ఇబ్బందుల నుంచి ఊరట

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

ఉప్పల్ రింగ్ రోడ్‌పై పడుతున్న ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించేందుకు మూసీ వెంట నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి హెచ్ఎండీఏ శ్రీకారం చుట్టింది. నగరం నలువైపుల నుంచి ఔటర్ పైకి ప్రయాణం సాఫీగా సాగించాలనే ఉద్దేశంతో 35 రేడియల్ రోడ్లను నిర్మించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే 17 రోడ్లను పూర్తి చేయగా, నాలుగు రోడ్లను ఆర్ అండ్ బీ శాఖ చేపట్టింది. ఈ క్రమంలో నాగోల్ బ్రిడ్జి నుంచి ప్రతాపసింగారం, గౌరెల్లి మీదుగా కొర్రెముల వరకు 15.5 కిలోమీటర్ల మేర రేడియల్ రోడ్ నంబర్ 20 పనులను వెంటనే చేపట్టాలని మంత్రి కే తారక రామారావు ఇటీవల హెచ్ఎండీఏ కమిషనర్ చిరంజీవులును ఆదేశించారు. ఈ మేరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి డీపీఆర్ రూపకల్పన కోసం హెచ్ఎండీఏ టెండర్లను ఆహ్వానించింది. ఫిబ్రవరి 10వ తేదీలోగా ఆసక్తి గల ఏజెన్సీల నుంచి దరఖాస్తులను కోరింది. నిబంధన ప్రకారం అర్హత కలిగిన ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించనున్నారు. ఏజెన్సీ మూడు నెలల పాటు సర్వే జరిపి డీపీఆర్‌ను హెచ్ఎండీఏకు ఇవ్వనున్నది. ఈ డీపీఆర్ ఆధారంగా అధికారులు రోడ్డు నిర్మాణానికి టెండర్లను ఆహ్వానించనున్నారు. నిర్మాణ పనులను తొమ్మిది నెలల్లోగా పూర్తి చేసి రహదారిని వినియోగంలోకి తీసుకువచ్చేలా కార్యాచరణను సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టుకు రూ.300 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈ మేరకు జైకా నిధులను వెచ్చించనున్నారు.



ట్రాఫిక్ చిక్కులకు చెక్

ఉప్పల్ భగాయత్ ప్రాజెక్టు రైతుల ప్రయోజనాల దృష్ట్యా రేడియల్ రోడ్ నంబర్ 20లో ఇప్పటికే మూడు కిలోమీటర్ల మేర పనులు చేపట్టి తుది దశకు చేర్చారు. ప్రస్తుతం ఇక్కడి నుంచి కొర్రెముల వరకు డీపీఆర్ రూపొందించనున్నారు. ఈ రోడ్‌తో ఉప్పల్ రింగ్ రోడ్‌పై పడుతున్న ట్రాఫిక్ ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగనున్నది. ప్రస్తుతం నగరం నలువైపుల నుంచి ఘట్‌కేసర్ ప్రాంతానికి వెళ్లే వాహనదారులు, వరంగల్‌వైపు వెళ్లే వాహనాలు ఉప్పల్ మీదుగా వెళ్తున్నాయి. ఓవైపు వరంగల్‌వైపు భారీ సంఖ్యలో వాహనాలు వెళ్తుండటం, ఘట్‌కేసర్ పరిసర ప్రాంతాల్లో విద్యాసంస్థలు ఎక్కువగా ఉండటం, మరోవైపు యాదాద్రికి వెళ్లేందుకు ప్రధాన రహదారి కావడంతో నిత్యం ట్రాఫిక్ విపరీతంగా ఉంటున్నది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో గంటలపాటు ట్రాఫిక్‌జాం అవుతూ వాహనాదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రేడియల్‌రోడ్ నంబర్ 20 తెరపైకి వచ్చింది. ఈ రోడ్ పూర్తయితే నగరం నలువైపుల నుంచి వరంగల్ వెళ్లే వాహనదారులు నేరుగా నాగోల్ బ్రిడ్జి మీదుగా కొర్రెముల (ఘట్‌కేసర్) వరకు చేరుకోవచ్చు. వరంగల్ జాతీయ రహదారి నుంచి ఎల్బీనగర్ వైపు వెళ్లే ప్రయాణికులు ఉప్పల్‌కు చేరకుండా కొర్రెముల (ఓఆర్ఆర్) నుంచి నాగోల్ వరకు చేరుకోవచ్చు. తద్వారా ఉప్పల్ రింగ్ రోడ్‌లో ట్రాఫిక్ కష్టాలు తొలిగిపోనున్నాయి. ఈ రోడ్‌తో ప్రతాపసింగారం, పార్వతీపురం, కొర్రెముల, గౌరెల్లి గ్రామాల ప్రజలకు ప్రయోజనం కలునున్నది. సమీప ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలు రానున్నాయి.



టీఎఫ్‌టీయూ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, యూనియన్ అధ్యక్షుడు కాచం సత్యనారాయణ గుప్తా తదితరులు

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

క్యాలెండర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

బషీర్‌బాగ్: తెలంగాణ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే వీ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ కార్మిక సంఘాల సమాఖ్య (టీఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో రూపొందించిన-2018 క్యాలెండర్‌ను ఆదివారం ఆయన యూనియన్ అధ్యక్షుడు కాచం సత్యనారాయణ గుప్తాతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు అన్ని విధాలుగా కార్మికులను అణగదొక్కారని, సీఎం కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీలు, వీఆర్ఏల సమస్యలతోపాటు అనేక సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. ఐకేపీ, గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలే తప్ప, విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు. కొంతమంది కార్మిక సంఘాల నేతలు విమర్శలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, ఇకనైనా విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలని సూచించారు. సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే కేసీఆర్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ఖలీల్, టీయూసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ శివ శంకర్, కార్యదర్శి బండా సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం హైదరాబాద్ టీజీవో కార్యాలయంలో రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

బాలుడి కిడ్నాప్‌నకు విఫలయత్నం

మాసబ్‌ట్యాంక్ ఒవైసీ పురాలో కలకలం



మహ్మద్ అబ్దుల్‌హాది

మెహిదీపట్నం: స్నేహితులతో కలిసి ఆడుకుంటున్న ఓ 11 ఏండ్ల బాలుడిని కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించిన ఘటన హైదరాబాద్ హుమాయున్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి కలకలం రేపింది. బాలుడు కేకలు వేయడంతో అతడిని బైక్‌పై నుంచి తోసివేసి దుండగులు పారిపోయారు. మాసబ్‌ట్యాంక్ ఒవైసీ పురాలో నివసిస్తున్న మహ్మద్ అబ్దుల్‌గౌస్ కుమారుడు మహ్మద్ అబ్దుల్‌హాది(11) స్థానిక తులసి హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. శనివారం రాత్రి ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఇతడిని మధ్యలో కూర్చోపెట్టుకొని వెళ్తుండగా బాలుడు కేకలువేశాడు. దీంతో భయపడిన దుండగులు బాలుడిని కిందపడేసి పారిపోయారు. విషయం తెలుసుకున్న నైట్‌డ్యూటీ ఏసీపీ నరేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. బాలుడికి స్వల్పగాయాలు కావడంతో దవాఖానకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

చేవెళ్ల సమీపంలో అదుపుతప్పి మర్రిచెట్టును ఢీకొన్న కారు • మృతులంతా హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

చేవెళ్ల, నమస్తే తెలంగాణ: కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న మర్రిచెట్టును ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు మృతి చెందిన ఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో ఆదివారం జరిగింది. చేవెళ్ల సీఐ గోపగాని గురువయ్యాగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ ఉప్పల్‌లోని జెన్‌ప్యాక్ట్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్న కే ప్రవీణ్(26), అర్జున్‌కుమార్(24), శ్రావణ్(28), నగరంలోని మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న డేవిడ్ జాన్సన్(34) స్నేహితులు. వీరంతా శ్రావణ్ కారులో ఆదివారం తెల్లవారుజామున వికారాబాద్‌కు బయలుదేరారు. చేవెళ్ల మండలం మీర్జాగూడ స్టేజీ సమీపంలో కారు అదుపుతప్పి మర్రిచెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రవీణ్, అర్జున్, జాన్సన్ అక్కడికక్కడే మృతిచెందారు. ప్రవీణ్‌ది మహబూబ్‌నగర్ జిల్లా కాగా, భార్య షారాపర్వాణితో కలిసి బర్కత్‌పురలో, మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన జాన్సన్ మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ రాజేంద్రనగర్‌లో నివాసముంటున్నారు. జీడిమెట్లలోని పద్మానగర్‌లో నివాసముంటున్న అర్జున్‌కుమార్‌కు ఇంకా పెండ్లి కాలేదు.



ప్రవీణ్, అర్జున్‌కుమార్, శ్రావణ్ మృతదేహాలు

సినిమా చూపించారు!

- సినీ ప్రముఖులు తెలుసంటూ పరిచయాలు
- విదేశాల్లో ఉద్యోగాల పేరుతో రూ.14 లక్షలు టోకరా

చార్మినార్: 'మాకు చాలా మంది పెద్దవాళ్లు తెలుసు. సినీ ప్రముఖులతో పరిచయాలున్నాయి. వాళ్ల ఇండ్లల్లో ఏ శుభకార్యం జరిగినా మేము ఉండాల్సిందే. మాకున్న పరిచయాలతో విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తాం' అంటూ ఇద్దరు మోసగాళ్లు అమాయకులను నిండా ముంచారు. రూ.14 లక్షల మేర టోకరా వేశారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్ బహదూర్‌పుర పోలీస్‌స్టేషన్ పరిధిలోని కిషన్‌బాగ్‌కు చెందిన తారిక్, సల్మాన్ స్నేహితులు. వీరు కిషన్‌బాగ్‌లో 'జే7' పేరుతో ఓ స్టూడియో తెరిచారు. సినిమా, ఉద్యోగావకాశాలు ఇప్పిస్తామని కరపత్రాలు తయారుచేసి రాష్ట్రంతోపాటు, ఇతర రాష్ట్రాల్లోని బంధువులు, స్నేహితులు, తెలిసినవారికి చేర్చారు. వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించిన వారికి తాము మెగాస్టార్ చిరంజీవికి అత్యంత సన్నిహితులమని, వారికి ఎక్కడ ఏ పనైనా తామే చేస్తుంటామని నమ్మబలికేవారు. అందుకు తగ్గట్టు హంగు, ఆర్భాటాలు చేసేవారు. కృష్ణాజిల్లా మైలవరం ప్రాంతానికి చెందిన రాంబాబు, అతని కూతురు సాయి స్వరూప, పఠాన్ రబ్బానీ, సాయిద పఠాన్ వారి వలలో పడ్డారు. ప్రపంచంలో ఎక్కడైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని వారిని నమ్మించాడు. తారిక్, సల్మాన్ మాటలను నమ్మిన బాధితులు దాదాపు రూ.14 లక్షలు అందించారు. కరేబియన్ దీవుల్లోని ఓ రెస్టారెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి నలుగురు బాధితులను విజయవాడ నుంచి ఢిల్లీకి తీసుకెళ్లారు. అక్కడ విమానాశ్రయంలో వారిని వదిలి తప్పించుకొని పారిపోయారు. తాము మోసపోయామని తెలుసుకున్న బాధితులు బహదూర్‌పుర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న సీసీఎస్ డీసీపీ అవినాశ్ మహంతి బహదూర్‌పుర పీఎస్‌కు వచ్చి బాధితుల నుంచి వివరాలు సేకరించారు. కేసును వేగవంతంగా దర్యాప్తు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. దక్షిణ మండల డీసీపీ సత్యనారాయణ సైతం బాధితుల నుంచి వివరాలు సేకరించారు.

నటి తమన్నాపైకి బూటు విసిరిన యువకుడు

ఇటీవల తెలుగు సినిమాల్లో నటించడంలేదని ఆగ్రహం!



కరీముల్లా

హిమాయత్‌నగర్: ప్రముఖ సినీనటి తమన్నాకు చేదు అనుభవం ఎదురైంది. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో ఆదివారం మలబార్ నగల దుకాణాన్ని తమన్నా ప్రారంభించారు. తిరిగి వెళ్తూ అభిమానులకు అభివాదం చేసి జనం మధ్యలో సెల్ఫీ తీసుకుంటున్న సమయంలో ఆమెపైకి ఓ యువకుడు బూటు విసిరాడు. ఆ బూటు తమన్నాకు తగలకుండా మలబార్ సేల్స్‌మన్‌కు తగిలింది. పోలీసులు ఆ యువకుడిని అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం. ముషీరాబాద్‌కు చెందిన షాదుల్లా సలీం కుమారుడు కరీముల్లా(31) బీటెక్ పూర్తి చేసి ఖాళీగా ఉన్నాడు. తాను తమన్నాకు వీరాభిమానినని, ఆమె నటించిన అన్ని సినిమాలు చూస్తానని, ఇటీవల ఆమె తెలుగు సినిమాల్లో నటించడం లేదనే కోపంతో బూటు విసిరినట్టు కరీముల్లా ఒప్పుకున్నాడు. అతనిపై సెక్షన్ 324 కింద కేసు నమోదు చేశామని సీఐ రవీందర్ తెలిపారు.

గాయపడిన ఆక్టోపస్ కానిస్టేబుల్ మృతి



లక్‌పతినాయక్ (ఫైల్)

మన్సూరాబాద్/ఆదిబట్ల: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని ఔటర్ రింగ్ రోడ్ వద్ద ఈనెల 23న మాక్‌డ్రిల్ నిర్వహిస్తుండగా జరిగిన ప్రమాదంలో గాయపడిన ఆక్టోపస్ కానిస్టేబుల్ రమావత్ లక్‌పతినాయక్(40) ఆదివారం మృతి చెందారు. నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం తుమ్మచెట్ల పరిధిలోని ఏనెమీదితండాకు చెందిన రమావత్ లక్‌పతినాయక్ ఇబ్రహీంపట్నం సమీపంలోని ఆక్టోపస్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 23న బొంగుళూర్ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో మాక్‌డ్రిల్ చేసే క్రమంలో ఆక్టోపస్‌కు చెందిన బస్సు సడన్ బ్రేక్ పడింది. వెనుకాల వచ్చిన కారు బస్సును వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న లక్‌పతినాయక్ తీవ్రంగా గాయపడగా, ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. లక్‌పతినాయక్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. లక్‌పతినాయక్ మృతదేహాన్ని ఆక్టోపస్ ఐజీ శ్రీనివాస్‌రెడ్డి నివాళులర్పించారు.

మీడియా మరింత బాధ్యతగా వ్యవహరించాలి

- ప్రముఖ పాత్రికేయుడు, ఇండియాటుడే గ్రూప్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయి
- ముగిసిన హైదరాబాద్ లిటరసీ ఫెస్టివల్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో జరుగుతున్న హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ 8వ ఎడిషన్ ఆదివారంతో ముగిసింది. చివరిరోజు చర్చల్లో ప్రముఖ పాత్రికేయుడు, ఇండియా టుడే గ్రూప్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయి, ప్రముఖ రచయిత పెరుమాళ్ మురుగన్ ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ముగింపు వేడుకల్లో దేశ, విదేశాల నుంచి వచ్చిన సాహితీ ప్రియులు సందడి చేశారు. 'మీడియా ఇన్ ది ఏజ్ ఆఫ్ బ్రేకింగ్ న్యూస్' అనే అంశంపై రాజ్‌దీప్ సర్దేశాయి మాట్లాడుతూ సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాల్సిన మీడియా, ద్వేషాన్ని పెంచేలా, దేశాన్ని విభజించే ఎజెండాతో పనిచేస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. అందుకే జర్నలిజం ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నదని వాపోయారు. ఇలాంటి దశలో యువత ప్రత్యామ్నాయం వైపు ఆలోచించాలని, తక్కువ ఖర్చుతో నిర్వహించగలిగే వెబ్‌సైట్లను వేదిగా మార్చుకొని వ్యవసాయంలో మెళకువలు, ఆరోగ్యం, సైన్స్ వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అప్పుడే బెటర్ ఇండియా, బెటర్ మీడియా మిగులుతుందన్నారు. అట్టడుగు జీవితాల గురించి రాయడమంటే తనకు ఆసక్తి అని ప్రముఖ రచయిత పెరుమాళ్ మురుగన్ తెలిపారు. ప్రతి 50 కిలోమీటర్లకూ ప్రజలు మాట్లాడే యాసలో మార్పు ఉంటుందని, అలాగే వాళ్ల జీవితాల్లో, అనుభవాల్లో ఎన్నో కదిలించే అంశాలుంటాయన్నారు. తన కథల్లో వాటినే చెప్పే ప్రయత్నం చేశానన్నారు. సమాజంలో మీడియా పాత్ర కీలకమైందని, అయితే ప్రస్తుతం కార్పొరేట్ శక్తుల నియంత్రణలో ఉన్నదని కేంద్ర సమాచార శాఖ కమిషనర్ మాడభూషి శ్రీధర్ పేర్కొన్నారు. ఆర్‌టీఐ కింద పాలనావ్యవహారాలు, అధికారుల పనితీరు సమాచారం అడిగితే వ్యక్తిగతం అనేవాళ్లే ఆధార్ పేరిట 100 కోట్ల మంది సమాచారాన్ని సేకరించారని విమర్శించారు. సామాజిక కార్యకర్త అరుణరాయ్ మాట్లాడుతూ సమాజంలో విశ్వసనీయత లేని కథనాలే ఎక్కువగా ప్రచారం పొందుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు స్టోరీ టెల్లింగ్ వర్క్‌షాప్, నన్హా నుక్కడ్ కార్యక్రమాల్లో విద్యార్థులు సందడి చేశారు. సాయంత్రం ప్రదర్శించిన 'ది ప్రోఫిట్ అండ్ ది పోయెట్' నాటకం ప్రేక్షకుల్ని కట్టిపడేసింది.



స్టోరీ టెల్లింగ్ వర్క్‌షాప్‌లో చిన్నారులు, యువత సందడి. (ఇన్‌సెట్) 'మీడియా ఇన్ ది ఏజ్ ఆఫ్ బ్రేకింగ్ న్యూస్' అనే అంశంపై మాట్లాడుతున్న ఇండియా టుడే గ్రూప్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయి

నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
సోమవారం 29 జనవరి 2018

WWW.NTNEWS.COM


వారసత్వంగా వచ్చిన వ్యాపారాన్ని వృద్ధి చేయడంతో పాటు క్లిష్ట పరిస్థితుల్లో కష్టాలను ఎదుర్కొని అనుభవాలనే పాఠాలుగా చేసుకొని అంచెలంచెలుగా ఎదిగారామె. సంకల్పం ఉంటే సాధించలేనిదంటూ ఏదీ ఉండదని నిరూపించారు. స్థాపించిన నాటి నుంచే అగ్రస్థానంలో నిలుస్తూ వస్తున్న కంపెనీ స్థానాన్ని కొనసాగిస్తూ లాభాల బాట పట్టించారామె. కంపెనీ ఇండియా, అమెరికాతో పాటు గ్లోబల్‌గానూ ఎదగడంలో ఆమె కృషి మహోన్నతమైనది. ఆ కృషి ఫలితంగా ప్రపంచ ధనవంతుల జాబితాలో పేరు కూడా సంపాదించారు. మల్టీనేషనల్ ఫార్మాస్యూటికల్స్ కంపెనీ నిర్వహణలో కొత్త ట్రెండ్ సృష్టిస్తున్న లుపిన్ లిమిటెడ్ సీఈఓ వినీతా గుప్తా సక్సెస్‌మంత్ర.



ఫార్మా రంగంలో పదునైన కెరటం

సక్సెస్ మంత్ర

వినీతా గుప్తా



ఫోర్బ్స్‌లో చోటు

లుపిన్ సంస్థ సాధారణ జెనరిక్ నుంచి బ్రాండెడ్ జెనరిక్స్‌గా రూపాంతరం చెందింది. ప్రత్యేకమైన, సంక్లిష్టమైన జెనరిక్స్‌ను తయారు చేయడంలో సంస్థ కేంద్రీకృతమై పనిచేస్తున్నది. 2018 నాటికి 5 బిలియన్ డాలర్ల టర్నోవర్ లక్ష్యంగా లుపిన్ పనిచేస్తుంది. 'లుపిన్ రానున్న మూడేండ్లలో అమెరికాలో 100-120 ఉత్పత్తులను ప్రారంభించగల సామర్థ్యం కలిగి ఉంది. ఇక మూడు సంవత్సరాలలో 3.75 బిలియన్ డాలర్ల నుంచి 4 బిలియన్ డాలర్లు ఆర్గానిక్ ఆదాయం సాధించగలదని అంబిట్ విశ్లేషకులు ఆదిత్య ఖేమ్కా, పరేష్ దేవ్ అభిప్రాయపడుతున్నారు. ఆ లక్ష్యాన్ని చేరుకోగలనన్న ఆత్మ విశ్వాసాన్ని వినీతా కలిగి ఉంది. వినితా ఈ ఏడాది ఫోర్బ్స్ ప్రకటించిన ఇండియా రిచెస్ట్ లిస్ట్‌లో కంపెనీని 40వ స్థానంలో నిలిపారు.

దేశబంధు గుప్తా.. ఈ పేరు ఫార్మాస్యూటికల్ కంపెనీలకు సుపరిచితమే. రసాయనశాస్త్ర ప్రొఫెసర్ అయిన దేశబంధు గుప్తా లుపిన్ అనే మల్టీనేషనల్ ఫార్మాస్యూటికల్స్ కంపెనీని 1968లో స్థాపించారు. ప్రారంభించిన రెండవ సంవత్సరమే ఫార్మాస్యూటికల్స్ రంగంలో దేశంలోనే రెండవ స్థానంలో నిలిచింది. 2013లో గుప్తా కంపెనీని పూర్తిగా తన పిల్లలకు అప్పగించాడు. అప్పట్నుంచి సోదరుడు నీలేష్‌తో కలిసి సీఈవో బాధ్యతలు నిర్వర్తిస్తూ సంస్థను అభివృద్ధి చేసింది ఆయన పెద్ద కూతురు వినితా గుప్తా.

వారసత్వంగా..

వినితా 1968లో ముంబైలో జన్మించారు. తండ్రి దేశబంధు గుప్తా అదే ఏడాది లుపిన్ ఫార్మా కంపెనీని స్థాపించాడు. ఆమె ఫార్మాసీలో బ్యాచిలర్ డిగ్రీ ముంబై యూనివర్సిటీలో చేశారు. ముంబైలోని కెల్లాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో వ్యాపార మెళకువలు నేర్చుకున్నారు. ఆ తర్వాత ఆమె 1993లో వ్యాపార రంగంలోకి అడుగుపెట్టారు. యూఎస్, యూరప్‌లలో లుపిన్ కంపెనీ మార్కెటింగ్ వ్యవహారాలు వినితా చూసుకుంటారు. వినితా ఆధ్వర్యంలో లుపిన్.. గ్లోబల్‌గా ఎంతో ఎత్తుకు ఎదిగింది. ముఖ్యంగా యూఎస్ మార్కెట్లో లుపిన్ బలపడింది. ఈ మొత్తం వ్యవహారంలో వినీతా గుప్త పాత్ర కీలకం.

తండ్రిబాటలో..

అనుకున్నది సాధించడంలో వినితా పట్టుదలతో పనిచేస్తారు. తన తండ్రి పేరును నిలబెట్టే లక్ష్యంలో భాగంగా లుపిన్ సంస్థను భారతీయ ఔషధ మార్కెట్లో మూడవ అతిపెద్ద కంపెనీగా తీర్చిదిద్దారు వినితా. అమెరికాలోనూ అత్యధిక వేగంగా అభివృద్ధి చెందుతున్న టాప్ 10 పెద్ద కంపెనీలలో ఆసియాకు చెందిన లుపిన్ ఒకటి మాత్రమే ఉండడం విశేషం. ప్రపంచ వ్యాప్తంగా విక్రయిస్తున్న ఔషధాల ప్రాతిపదికగా ఐఎంఎస్ హెల్త్ ఈ విషయాన్ని ధృవీకరించింది. దీని వెనుక వినీతా కృషి వెలకట్టలేనిది. 2003-2013 దశాబ్ధంలో లుపిన్ గ్లోబల్‌గా ఎదిగింది. ముఖ్యంగా యూఎస్, యూరప్‌తో పాటు ఇతర పశ్చిమ మార్కెట్లకు విస్తరించింది. పలు సంస్థల విలీనాలు, సముపార్జన మూలంగా సంస్థ ఆదాయం 5 శాతం నుంచి 47 శాతానికి చేరుకుంది.

అందనంత ఎత్తుకు..

అమెరికా, యూరోపియన్ వ్యాపార బాధ్యతలు స్వీకరించేందుకు 2005లో వినితా యూఎస్‌కు వెళ్ళినప్పుడు లుపిన్ మొత్తం ఆదాయం 5 శాతం కన్నా తక్కువగా ఉంది. దాన్ని 270 మిలియన్ డాలర్లకు చేర్చడంలో వినితా విజయం సాధించారు. ఇప్పుడు లుపిన్ యూఎస్ డివిజన్‌లో రూ .12,770 కోట్ల టర్నోవర్‌తో 45 శాతం వాటా కలిగి ఉంది. అక్కడ వ్యాపారం గతంతో పోలిస్తే 16 శాతం పెరిగి 5,657 కోట్ల రూపాయలుగా ఉంది. అంతేకాక యూఎస్‌లో ఒకే ఏడాది 12 కొత్త ఉత్పత్తులను లాంచ్ చేయడం విశేషం. ప్రస్తుతం అమెరికాలో ఈ రంగంలో 77 కంపెనీలతో 31 మంది మార్కెట్ నాయకులు ఉన్నారు. వారిలో వినితా ఒకరు. యూరోప్, లాటిన్ అమెరికా, ఆఫ్రికా, పశ్చిమ ఆసియాలో ఔషధాల మార్కెట్లను పర్యవేక్షించేందుకు వినితా చాలా కష్టపడ్డారు. ఆమె ప్రత్యక్ష మార్కెటింగ్ కార్యక్రమాలతో పాటు తమ బ్రాండ్ పేరును విస్తరించేందుకు దూకుడుగా వ్యవహరిస్తారన్న పేరుంది.



ఈ ఏడాది 2017/18 ఆర్థిక సంవత్సరంలో యూఎస్‌లో లుపిన్ వ్యాపారం 300 మిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఎడెల్వీస్ విశ్లేషకులు అన్షుమన్ గుప్తా ,రాహుల్ సోలంకి అభిప్రాయపడుతున్నారు. 'లుపిన్ వ్యూహాత్మక సలహా మండలిలో చేరినప్పటి నుండి నాకు వినీతా తెలుసు. ఆమె వ్యూహాత్మక సామర్థ్యాలు,దృష్టి స్పష్టత నన్ను ఆకట్టుకున్నాయి. ఆమె తీసుకునే వేగవంతమైన, ప్రభావవంతమైన నిర్ణయాలు అద్భుత ఫలితాలనిచ్చాయి. దానితో పాటు ఆమె ప్రజలకు అవసరమైన రీతిలో తన వర్క్‌ను కొనసాగించడం విశేషం. అని వార్బర్గ్ పిన్‌కస్‌కు చెందిన సీనియర్ సలహాదారు ఫ్రాన్సిస్కో గ్రానాటా చెప్పారు.

ప్రపంచ విస్తరణలో భాగంగా..

వినితా నాయకత్వంలో లుపిన్ జర్మనీలో టెమ్లర్ ఫార్మా ప్రత్యేక ఉత్పత్తులను కొనుగోలు చేసింది. ఆస్ట్రేలియాలో గోవా బ్రాండ్ ప్రీమియం చికిత్స నూనెలు, రుబెస్, లేపనాలు. అంతేకాకుండా, సౌత్ ఆఫ్రికాలో ఫార్మా డైనమిక్స్, ఫిలిప్పైన్స్‌లో మల్టీకర్ ఫార్మా, నెదర్లాండ్‌లోని నానోమి, మెక్సికోలోని గ్రిన్ ఎస్ డి డి సివి, బ్రెజిల్‌లో మెడక్విమికా, రష్యాలో బయోకామ్ వంటి డజన్ల కొద్ది సంస్థలను కొనుగోలు చేయడం ద్వారా లుపిన్‌ను ప్రపంచస్థాయికి విస్తరించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు.

వ్యక్తిగతం-కుటుంబం

వినీతా పని-జీవితాన్ని ఏకకాలంలో బ్యాలెన్స్ చేస్తున్నారు. తన కొడుకు క్రిష్‌కు అవసరమైన అన్ని పనులు తనే స్వయంగా చూస్తారు. 'ఈ విషయంలో నా భర్త సహాయకారిగా ఉన్నాడు' అని ఆమె చెప్తారు. ప్రతిరోజూ తన తమ్ముడు, లుపిన్ మేనేజింగ్ డైరెక్టర్ నిలేష్‌తో వ్యాపార అభివృద్ధి, వ్యూహాలను గురించి వినీతా చర్చిస్తారు. 'మేం ప్రతిరోజు వ్యాపార ఆలోచనలను చర్చిస్తాం. పది భిన్నమైన ఆలోచనలలో తొమ్మిది సార్లు ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటాం. దాన్ని కూడా నేను మళ్ళీ మళ్ళీ ఆలోచించి సరైన నిర్ణయం తీసుకుంటాను' అంటారు వినీతా. 'వినీతాకు చాలా సహకార గుణం ఉంది, కష్టపడి పనిచేస్తుంటుంది. పనిలో ఎన్నో భావాలను వ్యక్తీకరిస్తుంది' అని నిలేష్ చెప్తాడు.



గావిస్ కంపెనీ డీల్ విలువ రూ.5,610 కోట్లు

అమెరికాలో ఇప్పటికే పాగా వేసిన ఔషధ దిగ్గజం లుపిన్ న్యూజెర్సీ కేంద్రంగా ఉన్న గావిస్ కంపెనీని కొనుగోలు చేసింది. 88 కోట్ల డాలర్లు (రూ.5,610 కోట్లకు పైగా) వెచ్చించి ఈ కంపెనీని కొనుగోలు చేసింది. అంతర్జాతీయ ఫార్మాస్యూటికల్ మార్కెట్లో తన ఉనికిని మరింతగా విస్తరించుకొనే లక్ష్యంతో గావిస్ హస్తగతం చేసుకున్నట్టు కంపెనీ వెల్లడించింది. ఈ మేరకు గావిస్ ఫార్మాస్యూటికల్స్ ఎల్ఎల్సి, నావెల్ లాబొరెటరీస్ ఇంక్ (గావిస్)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఫార్ములేషన్స్ అభివృద్ధి, మాన్యుఫ్యాక్చరింగ్, ప్యాకేజింగ్, సేల్స్, మార్కెటింగ్, ఫార్మాస్యూటికల్స్ ఉత్పత్తుల పంపిణీ వంటి విభాగాల్లో గావిస్ ప్రముఖ సంస్థగా ఉంది. ఈ కంపెనీని కొనుగోలు చేయడం వల్ల 66 జెనరిక్ ఔషధాలు లుపిన్ జాబితాలో చేరుతాయి. అమెరికాలో భారత కంపెనీ చేపట్టిన అతిపెద్ద డీల్ ఇదే.

వినీతా తీసుకునే నిర్ణయాలు చాలా సందర్భాల్లో తప్పు కాలేదు. ఉద్యోగం విషయంలో గానీ, వ్యాపార విషయంలో కానీ ఆమె నిర్ణయాలు చాలా హుందాగా ఉంటాయి. గతంలో వ్యాపార నిర్ణయాలు తీసుకునే తన తండ్రిని ఒప్పించి పలు నిర్ణయాలు తీసుకుని విజయం సాధించారు. ముఖ్యంగా సంస్థల కొనుగోళ్లు, పెద్ద పెట్టుబడుల విషయంలో ఆమె జోక్యం తప్పక ఉండేది. 'వినీతా, నీలేష్ ఇద్దరూ తమ ఆలోచనల విషయంలో చాలా స్పష్టంగా ఉంటారు. నిర్ణయాలు తీసుకోవడంలో చాలా వేగంగానూ, దూకుడుగానూ వ్యవహరిస్తారు. అలాగే లుపిన్‌లో ఏ ఇతర వృత్తినైన వారు చాలా సులభంగా చేయగలరని' వారి గురువు, లుపిన్ వైస్ ఛైర్మన్ కమల్ శర్మ చెప్పారు.



మంచి పనికోసం.. ఒంటరి ప్రయాణం!

మార్పు మంచిదైతే.. అది ఒక్క అడుగుతోనే మొదలవుతుంది. ప్రియంవద కూడా ఒక మంచి పనికోసం ముందడుగు వేసింది. తనతో పాటు ఇప్పుడు వందల అడుగులు కలిశాయి. 143 యేండ్ల ఒక రాజభవనాన్ని బాగు చేసే పనిలో పడ్డారు వాళ్లంతా.

రాజస్థాన్‌లోని బిల్వారా జిల్లాలో మెజా అనే చిన్న గ్రామం ఉంది. పదివేల మంది అక్కడి జనాభా. మగవాళ్లు దాదాపుగా పొలం పనులు చేసి, పక్కనే ఉన్న టెక్స్‌టైల్ కంపెనీలో లేబర్లుగా పనిచేస్తారు. ప్రియంవద సొంతూరు అదే. కానీ వాళ్ల నాన్న ఉద్యోగరీత్యా ముంబై వెళ్లిపోయాడు. తాతానానమ్మలను కలువడానికి అప్పుడప్పుడూ ఆమె అక్కడికి వచ్చేది. ప్రియంవద ముంబైలో కొన్ని షోలు ఆర్గనైజ్ చేస్తుండేది. ఒకసారి ఆమె ఆ ఊరికి వచ్చినప్పుడు అక్కడి కోట ఆమెను కట్టిపడేసింది. కానీ కోట చుట్టు పరిసరాలు మాత్రం ఆమెను కలిచివేసింది. 143 సంవత్సరాల చరిత్ర గల ఆ కోటను చెత్త కుప్ప చేశారు స్థానికులు. దాన్ని ఎలాగైనా బాగు చేయాలని ముంబై నుంచి పూర్తిగా చేరుకోవాలనుకుంది. కానీ అప్పటికే ఆ ఊరిలో ఆమెకు నా అన్నవాళ్లు కరువైపోయారు. దాంతో చేసేదేమీ లేక ఆ కోటనే ఆవాసంగా చేసుకుంది. ఒంటరిగా ఆ చీకటి కోటను శుభ్రం చేస్తూ కొన్ని నెలలు కాలం గడిపింది. చుట్టు పక్కన ఉన్న వాళ్లు అది గమనించి ఆ కోటను శుభ్రం చేయడానికి సహకారం చేశారు. ఆ కోటను శుభ్రం చేస్తున్నప్పుడు పుస్తకాలు, కళా సంపద బయటపడ్డాయి. వాటన్నిటినీ కలిపి అదే కోటలో లైబ్రెరిని ఏర్పాటు చేసింది. అదే కోటలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసింది. ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేపట్టడానికి కార్యచరణ రూపొందిస్తున్నది. ఎన్నో యేండ్లుగా పాడుబడిన ఆ కోట ఇప్పుడు పూర్వ వైభవం సంతరించుకున్నది.



ఆరోగ్య చిట్కాలు..



- ఉదయం, రాత్రి భోజనం తర్వాత ఆపిల్, దానిమ్మ, అరటి వంటివి తింటే మంచిది.
- పడుకునేముందు గ్లాసు గోరువెచ్చని పాలల్లో ఒక స్పూన్ నెయ్యి కలుపుకొని తాగాలి.
- పాల మీగడతోటి కలకండను తీసుకుంటే శరీరానికి బలాన్నిస్తుంది.
- బాదం పప్పును అరగతీసి పాలల్లో కలుపుకొని తాగితే శక్తి పెరుగుతుంది.

నూడుల్స్ ప్రమాదమే?



నూడుల్స్.. పిల్లల నుంచి పెద్దవారి వరకు అందరూ ఇష్టంగా తినే ఆహారం. రెడీమేడ్‌గా తక్కువ సమయంలో పూర్తయ్యే అహారంగా దీన్ని తీసుకుంటారు. మార్కెట్లో అనేక రకాల కంపెనీలకు చెందిన నూడుల్స్‌తో పాటు స్థానికంగా తయారయ్యేవి మార్కెట్లో లభిస్తున్నాయి. దీంతో చాలా మంది వాటిని ఇండ్లలోనే తయారు చేసుకుని మరీ తింటున్నారు. అయితే ఎలా తిన్నా, ఏ నూడుల్స్ తిన్నా అవి మన ఆరోగ్యానికి హానికరమే అంటున్నారు వైద్యులు.

- అధిక బరువు సమస్యతో బాధపడే వారు నూడుల్స్ అస్సలు తినకూడదు. తింటే బరువు ఇంకా పెరుగుతారు. ఎందుకంటే వీటిలో ఫైబర్ అస్సలు ఉండదు. నూడుల్స్ అంటే ప్రాసెస్డ్ ఫుడ్స్ జాబితా కిందకు వస్తాయి. కనుక వీటిని తింటే ఫైబర్ ఏ మాత్రం అందకపోగా వీటివల్ల మన శరీరంలో గ్లూకోజ్ నిల్వలు పెరుగుతాయి. అది కొవ్వుగా మారి అధిక బరువుకు కారణమవుతుంది.
- నూడుల్స్ రెగ్యులర్‌గా తినే వారికి మెటబాలిక్ సింద్రోమ్ వస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. ఇది వస్తే శరీరం క్యాలరీలను సరిగ్గా ఖర్చు చేయలేదు. జీవక్రియలు మందగిస్తాయి. ఫలితంగా థైరాయిడ్ గ్రంథుల పనితీరుపై ప్రభావం పడుతుంది. బరువు పెరుగుతారు.
- నూడుల్స్‌ను మైదాతో తయారు చేస్తారు. అందువల్ల ఎలాంటి పోషకాలు ఉండవు. కనుక ఇది జంక్ ఫుడ్డే అవుతుంది. దీంతో నూడుల్స్ తింటే మనకు ఎలాంటి లాభాలు కలుగవు. ఒక వ్యర్థ పదార్థాన్ని తిన్నట్టే అవుతుంది.
- నూడుల్స్‌లో మన శరీరానికి చెడు చేసే కొవ్వులు ఉంటాయి. ఇవి గుండె జబ్బులను తెచ్చి పెడుతాయి.
- నూడుల్స్‌లో మోనోసోడియం గ్లూటమేట్ అనే పదార్థం ఉంటుంది. ఇది మన శరీరంలోకి అధిక మోతాదులో చేరితే ఫలితంగా బీపీ, తలనొప్పి, వికారం, అధిక బరువు వంటి సమస్యలు వస్తాయి.
- నూడుల్స్‌లో సోడియం కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా అది ఒంట్లో అధికంగా నీరు చేరేందుకు కారణమవుతుంది. దీంతో పాదాలు, చేతులు ఉబ్బినట్టు వాపులు వస్తాయి.
- నూడుల్స్ తిని ఇతర ఆహారాలు తింటే వాటిల్లో ఉండే పోషకాలను శరీరం గ్రహించకుండా నూడుల్స్ అడ్డుకుంటాయి. దీంతో పోషకాహార లోపం వస్తుంది.
- గర్భిణీలు నూడుల్స్ అస్సలు తినకూడదు. తింటే గర్భస్రావం అయ్యే ప్రమాదం ఉందని పరిశోధనలు చెబుతున్నాయి.

పొడిబారిన జుట్టు కోసం

ఈ కాలంలో చాలామంది ఎదుర్కొంటున్న సమస్య జుట్టు పొడిబారడం. ఎందుకంటే సరైన రీతిలో జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఇలా జరుగుతుంటుంది. ఈ సమస్య పరిష్కారం కావాలంటే చిట్కాలు ప్రయత్నించండి.

- బాదం పాలు, కొబ్బరి పాల మిశ్రమంలో కాస్త నిమ్మరసం కలిపి వెంట్రుకలకు పట్టించాలి. ఓ గంట తర్వాత కడిగితే కురులు మృదువుగా ఉంటాయి.
- బాగా తరిగిన అరటిలో ఒక టేబుల్ స్పూన్ తేనె కలుపాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి, ఓ గంట తర్వాత కడుగాలి.
- మందార పువ్వులను ముద్దగా చేసి, దాన్ని కొబ్బరి నూనెలో కలపి జుట్టుకు పట్టించాలి.
- కొబ్బరి పాలను తలకు పట్టించి రాత్రంతా అలాగే ఉంచి, ఉదయాన్నే చల్లటి నీటితో కడుగాలి. ఇలా చేస్తే ఆరోగ్యవంతమైన జుట్టు మీ సొంతం అవుతుంది.
- ఈ చిట్కాలను వారంలో మూడుసార్లు ప్రయత్నిస్తే.. మీ శిరోజాలు అందంగా, కాంతివంతంగా, బలంగా ఉంటాయి.





షుగర్ కంట్రోల్‌లో ఉండాలంటే..

- డయాబెటిస్ ఉన్నప్పటికీ, ఆరోగ్యంగా జీవించాలంటే ముఖ్యంగా ఫాలో అవ్వాల్సింది గ్లూకోజ్ కంట్రోల్. గ్లూకోజ్ లెవల్స్ నార్మల్‌గా ఉన్నంత వరకూ, ఎలాంటి కాంప్లికేషన్స్ రావు. షుగర్ పేషెంట్లకు చాలా ముఖ్యమైనది ఫుడ్ ఛేంజ్. షుగర్ ఉన్నప్పటికీ, అది లేని వారితో పోటీపడి ఆహారం తీసుకుంటే, హెల్త్ రిస్క్ మరింత ఎక్కువవుతుంది. మందులు సక్రమంగా వేసుకుంటూనే, సమయానికి ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం.
- ముఖ్యంగా ఆహారంలో లిపోయిక్ యాసిడ్ ఉన్న ఆహారపదార్థాలను ఎక్కువగా తీసుకుంటుండాలి. పాలకూర, క్యారెట్స్, బంగాళాదుంప, టొమాటో, పచ్చ బటానీ లాంటి పదార్థాల్లో లిపోయిక్ యాసిడ్ ఉంటుంది. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం ఆరోగ్యానికి చాలా మంచిది. లిపోయిక్ యాసిడ్ న్యూరోపతీని తగ్గించడమే కాక, కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచడానికి ఉపయోగపడుతుంది. శరీరంలోని ఇన్సులిన్ శాతాన్ని పెంచి, మధుమేహాన్ని కంట్రోల్‌లో ఉండేలా చూస్తుంది.
- ఇక షుగర్ కంట్రోల్‌లో పెట్టాలనుకున్నప్పుడు కొన్ని పదార్థాలు ఖచ్చితంగా తీసుకోవాల్సి ఉంటుంది. ఈ కింద చెప్పబోయే సలాడ్‌ను మూడు పూటలా, బ్రేక్ ఫాస్ట్ కు ముందు, లంచ్ కు ముందు, డిన్నర్ కు ముందు తీసుకుంటే, షుగర్‌పై మంచి ప్రభావం చూపిస్తుంది. మధుమేహం ఉన్న వాళ్ళు ప్రత్యేకంగా చేసుకొని తినాల్సిన వెజిటబుల్ సలాడ్ ఇది.
- అర కప్పు కీరా ముక్కలు, పావు కప్పు టొమాటో ముక్కలు, పావు కప్పు క్యారెట్ ముక్కలు, కొత్తిమీర, నిమ్మరసం, ఉప్పు, మిరియాల పౌడర్, సన్నగా తరిగిన రెండు వెలుల్లి రేకలు, చిటికెడు మెంతి పౌడర్, చిటికెడు అవిసె గింజల పౌడర్. వీటన్నింటినీ బాగా కలుపుకొని, సలాడ్ గా తయారుచేసుకుని ప్రతీసారి ఏదైనా తినేముందు తీసుకుంటే, గ్లూకోజ్ లెవల్స్ ఎప్పుడూ సాధారణ స్థాయిలో మెయింటెన్ అవుతాయి. విటమిన్ లోపం ఉంటే తగ్గుముఖం పడుతుంది.

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 29 జనవరి 2018



ఐఐటీల్లో బాలికలకు సూపర్‌న్యూమరీ సీట్లు

లింగ సమతుల్యత సాధించడంలో భాగంగా ఐఐటీల్లో బాలికలకు ఈ ఏడాది 14 శాతం సీట్లను ప్రత్యేకంగా కేటాయించనున్నారు. దీనికి సంబంధించిన నిర్ణయాన్ని ఐఐటీ కౌన్సిల్ తీసుకున్నది. కేంద్ర మానవ వనరుల శాఖ సూచనల మేరకు బాలికలకు సూపర్‌న్యూమరీ ద్వారా కొత్తగా సీట్లను ఏర్పాటుచేస్తారు. ప్రస్తుతం ఉన్న సీట్లకు లేదా కోటాల్లో ఎటువంటి మార్పులు లేకుండానే 2018-19 సంవత్సరానికి బాలికలకు 14 శాతం సీట్లను ప్రత్యేకంగా కేటాయిస్తారు. అయితే అభ్యర్థినులు తప్పనిసరిగా ఐఐటీ అడ్వాన్స్‌డ్ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా మాత్రమే ప్రవేశాలు కల్పిస్తారు. ఈ సీట్లలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తారు. గతేడాది బాలికల కోసం 8 శాతం అదనపు సీట్లను కేటాయించగా ఈసారి కోటాను 14 శాతానికి పెంచారు.

న్యాక్ 'ఏ' ఉంటేనే అటానమస్

ఉన్నతవిద్యా కాలేజీలు స్వయం ప్రతిపత్తి (అటానమస్) హోదా పొందాలంటే నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) ఏ గ్రేడ్ పొంది ఉండాలని యూజీసీ స్పష్టం చేసింది. దీనికోసం కాలేజీల గుర్తింపు నిబంధనల్లో మార్పులు చేసింది. గతంలో న్యాక్ బీ గ్రేడ్ ఉన్న కాలేజీలకు కూడా అటానమస్ ఇచ్చేవారు. కానీ ఇప్పటినుంచి న్యాక్ ఏ గ్రేడ్ లేదా కనీసం మూడు కోర్సులకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు ఉంటేనే అటానమస్ హోదాను ఇవ్వనున్నారు.

ఇంటిగ్రేటెడ్ ప్రిపరేషన్



బ్యాంకింగ్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నుంచి ఏటా వేలాది ఉద్యోగాలు.. కానీ చాలామందికి అందని ద్రాక్ష. కారణం మ్యాథ్స్, రీజనింగ్, ఇంగ్లిష్, జీఎస్. ముఖ్యంగా నాన్ మ్యాథ్స్ అభ్యర్థులకు మ్యాథ్స్ సంబంధిత అంశాలపై, సైన్స్ అభ్యర్థులకు జీఎస్, ఇంగ్లిష్ సబ్జెక్టుల ఆందోళన. నిజానికి వీటిని ప్రణాళికాబద్ధంగా చదివితే చాలు.. సులభంగా అర్థం చేసుకోవచ్చు. కేవలం పదోతరగతిస్థాయిలో సిలబస్. కామన్‌సెన్స్ ఉపయోగిస్తే చాలు. అన్ని సమస్యలను అధిగమించవచ్చు. ఆయా సబ్జెక్టుల్లోని ప్రాథమిక సూత్రాలను అవగాహన చేసుకొని సమస్యలను సాధనచేస్తే కచ్చితంగా జాబ్ సాధించవచ్చు. ఐబీపీఎస్, ఎస్‌బీఐ, ఎస్ఎస్‌సీ పరీక్షలకు కామన్ ప్రిపరేషన్ చేస్తే సమయం ఆదాతో పాటు ఏదో ఒక ఉద్యోగాన్ని సొంతం చేసుకోవచ్చు. అన్ని పరీక్షల్లో కామన్‌గా ఉండే జీఎస్, అర్థమెటిక్, రీజనింగ్ అంశాలను ఎలా చదవాలి? ఏ కోణంలో చదివితే సులభంగా అర్థం చేసుకోవచ్చు అంశాలపై నిపుణుల సూచనలు...

అన్ని పరీక్షల్లో రీజనింగ్, అర్థమెటిక్ ప్రిపరేషన్ ఇలా...!

ఏ పోటీ పరీక్షలో అయినా, అర్థమెటిక్, రీజనింగ్ చాలా ముఖ్య విభాగాలు. అభ్యర్థుల మానసిక సామర్థ్యం, పరిశీలనా శక్తి, విశ్లేషణా పరిజ్ఞానం, సాధారణ గణిత సామర్థ్యాలను అంచనా వేయడానికి ఈ రెండు విభాగాలను ఉపయోగిస్తారు. సివిల్స్ మొదలు రైల్వేలో అతిచిన్న ఉద్యోగాల భర్తీలోనూ ఈ విభాగాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ముఖ్యంగా బ్యాంకింగ్ పరీక్షల్లో కూడా ఈ రెండు విభాగాలే కీలకం. అలాగే ప్రశ్నల కఠిన స్థాయిని పరిశీలిస్తే, బ్యాంకింగ్ పరీక్షల్లో ఇవి చాలా కష్టంగా ఉంటాయి. ఆ పరీక్షకు సిద్ధమైన విద్యార్థులు, అర్థమెటిక్ లేదా రీజనింగ్ విభాగాలకు సంబంధించి అన్ని పరీక్షలను సులువుగా ఎదుర్కొంటారు. అర్థమెటిక్‌లో సాధారణంగా కనిపించే అంశాలు బోడ్‌మాస్ ఆధారిత ప్రశ్నలు, సరాసరి, శాతాలు, సరళ, చక్రవడ్డీలు, పని-కాలం, పని-దూరం, వైశాల్యాలు, చుట్టు కొలతలు.

అన్ని పరీక్షలకు ఒకేవిధంగా సిద్ధం కావడం సబబు కాదు. బ్యాంకింగ్ రంగ పరీక్షల్లో సమయం చాలా తక్కువగా ఉంటుంది. కాబట్టి, ఆ పరీక్షలకు సిద్ధమయ్యేవాళ్లు కాన్సెప్ట్ నేర్చుకోవడం, అలాగే షార్ట్‌కట్స్ తెలుసుకోవడం, ప్రాక్టీస్ చేయడం వంటి మూడు దశల్లో ప్రిపరేషన్ కొనసాగించాలి. అలాగే రాష్ట్రంలో నిర్వహించే ఎస్సై పరీక్షలోనూ అర్థమెటిక్ విభాగానికి సంబంధించి సమయం చాలా తక్కువగా ఉంటుంది. ఈ పరీక్షకు సిద్ధమవుతున్నవాళ్లు కూడా వేగంగా సమాధానం కనుగొనేలా ప్రాక్టీస్ చేయాలి. ఇక సీ-శాట్, గ్రూప్ పరీక్షలకు సిద్ధమవుతున్నవాళ్లు షార్ట్‌కట్స్ తెలుసుకోకున్నా పర్వాలేదు, కాన్సెప్ట్ తెలుసుకోవడం, ప్రాక్టీస్ చేయడం వరకు పరిమితమైతే చాలు. ఇవే అంశాలు రీజనింగ్‌కు కూడా వర్తిస్తాయి. బ్యాంకింగ్ రంగంలో ప్రశ్నల స్థాయి కఠినంగా ఉంటుంది. ఈ విభాగానికి సంబంధించి కూడా కాన్సెప్ట్‌ను తెలుసుకోవడం, షార్ట్‌కట్స్, ఆ తర్వాత ప్రాక్టీస్ చేయడం మంచిది.

- **కాన్సెప్ట్ బిల్డింగ్ ఎలా:** 'కామన్ లాజిక్' ఆధారంగా కాన్సెప్ట్‌లను నిర్మించుకోవాలి. అర్థమెటిక్ ప్రశ్నలనే పరిశీలిస్తే శాతాలు, లాభ-నష్టాలు (ప్రాఫిట్ అండ్ లాస్) అంశాలకు సంబంధించి దాదాపుగా ఒకే తరహా తార్కిక పరిజ్ఞానం అవసరం. జవాబులను ఎక్కువ మేర శాతాల్లో కనుగొనాల్సి వస్తుంది. శాతం అంటే ప్రతి 100కు అని అర్థం. సాధారణంగా చాలామంది విద్యార్థులు అంశాన్ని అవగాహన చేసుకోకుండా కేవలం బట్టీ విధానంలో సిద్ధమవుతారు. అలాంటివాళ్లు ప్రశ్న విభిన్న కోణాల్లో ఇస్తే జవాబును గుర్తించలేరు.
- **ఉదా:** ఒక వస్తువును రూ. 20కి కొని, రూ. 25కి అమ్మితే లాభ శాతం ఎంత?
- వస్తువు ధర రూ. 20, అమ్మింది రూ. 25కు, అంటే రూ. 5 లాభం. ఇదే శాతంలో చెప్పాలంటే, దాని అర్థం ఏమిటంటే ఒకవేళ వస్తువు ధర రూ. 100 అయితే, అమ్మిన వెల ఎంత?
- రూ. 20 వస్తువు రూ. 100 అయితే ఎంత శాతం.. అంటే రూ. 20ని 5తో గుణిస్తే, 100 వస్తుంది. అలాంటప్పుడు రూ. 25ని కూడా 5తో గుణించాలి. అప్పుడు 25x5=125, 100 కంటే 125, 25 ఎక్కువ ఉంది. కాబట్టి లాభ శాతం 25 శాతం.
- చాలామంది శాతాలను కనుగొనేటప్పుడు 5/20 వేయాలా లేదా 5/25 వేయాలా అన్న మీమాంసలో ఉంటారు. కేవలం సూత్రాల ప్రాతిపదికన వెళ్లేవాళ్లకు ఇలాంటి ఇబ్బందులు తప్పవు. పైన చెప్పినట్లు కాన్సెప్ట్‌ను అర్థం చేసుకుంటే 100కు కనుగొనాలి. కాబట్టి ఆ రీతిన సమీకరణాన్ని వేసుకుంటాం.
- పని-కాలం, పైప్స్-సిస్టర్న్, కాలం-దూరం, రైళ్లు, నిష్పత్తులు, భాగస్వామ్యం, సరళవడ్డీ, చక్రవడ్డీ ఇలా అన్ని అధ్యాయాలు ఒక దానితో ఒకటి ముడిపడి ఉంటాయి. అలాగే ఒకటి కంటే ఎక్కువ అధ్యాయాలపైన కూడా సారూప్య ప్రిపరేషన్ అవసరం. ఉదాహరణకు సరాసరి, భాగస్వామ్యం, నిష్పత్తులు ఈ మూడింటికి ఒకేతరహా తార్కిక జ్ఞానం అవసరం. అలాగే అలిగేషన్ అండ్ మిక్సర్, లాభ-నష్టాలు అధ్యాయాలకు సంబంధించి కూడా ఒకే తరహా గణిత, తార్కిక పరిజ్ఞానం అవసరమవుతుంది.
- రీజనింగ్ విభాగానికి సంబంధించి కూడా బ్యాంకింగ్ రంగ పరీక్షల్లో కఠినంగా ఉంటుంది. ఇందులో ఆల్ఫాబెట్ బేస్డ్ ప్రశ్నలు, బ్లడ్ రిలేషన్స్, కోడింగ్-డికోడింగ్, పజిల్స్, సిట్టింగ్ అరేంజ్‌మెంట్, సిలాజిసం, డైరెక్షన్ వంటి అంశాలు ఉంటాయి. ఇవి సాధారణంగా అన్ని పోటీ పరీక్షల్లో వస్తాయి. ఈ అంశాలకు సంబంధించి కూడా కాన్సెప్ట్ సిద్ధం కావడంతో పాటు ఎన్నో ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే పరీక్షల్లో ఎక్కువగా బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్, పజిల్ టెస్ట్, సిట్టింగ్ అరేంజ్‌మెంట్ అంశాల నుంచే ప్రశ్నలు వస్తున్నాయి. అయితే బ్యాంకింగ్ పరీక్షలకు సంబంధించి ఇన్ని తక్కువ అంశాలు సరిపోవు. బ్యాంకింగ్ పరీక్షల్లో ఎలిజిబిలిటీ టెస్ట్, కోడెడ్ ఇన్‌ఈక్వాలిటీస్, కోర్స్ ఆఫ్ యాక్షన్, స్టేట్‌మెంట్స్-ఆర్గ్యుమెంట్స్, స్టేట్‌మెంట్-అసంప్షన్స్, కాజ్ అండ్ ఎఫెక్ట్ తదితర అంశాల నుంచి కూడా ప్రశ్నలు వస్తాయి. వీటిని కూడా విస్తృతంగా ప్రాక్టీస్ చేయాలి.

... కేశవపంతుల వేంకటేశ్వరశర్మ



- రీజనింగ్ విభాగానికి సంబంధించి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే పరీక్షలో జనరల్ ఇంటలిజెన్స్ పేరుతో నిర్వహిస్తున్నారు. ఇందులో నాన్ వెర్బల్ రీజనింగ్ కూడా ఉంటుంది.
- ఒకప్పుడు బ్యాంకింగ్ పరీక్షల్లో సైతం నాన్ వెర్బల్ రీజనింగ్ అంశాల నుంచి ప్రశ్నలు వచ్చేవి. అయితే పరీక్ష ఆన్‌లైన్‌గా మారినప్పటి నుంచి రావడం లేదు.
- సీ-శాట్, గ్రూప్-1, 2 తదితర పరీక్షల్లో అలాగే ఎస్సై పరీక్షలో గతంలో నాన్ వెర్బల్ రీజనింగ్ నుంచి ప్రశ్నలు ఇస్తున్నారు.
- నాన్ వెర్బల్‌కు సంబంధించి బేసిక్స్ అంటూ ఉండవు. కేవలం ప్రాక్టీస్‌పైనే ఆధారపడాలి.
- రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్-4లో సెక్రటేరియల్ ఎబిలిటీలో ప్రశ్నలు రీజనింగ్, అర్థమెటిక్ అంశాల నుంచి వస్తాయి.

జనరల్‌స్టడీస్ సిద్ధం కండిలా...

బ్యాంకింగ్‌రంగ పరీక్షల్లో జనరల్ అవేర్‌నెస్‌పై దృష్టి సారిస్తారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్, హయ్యర్ సెకండరీ లెవల్ తదితర పరీక్షల్లో జనరల్ స్టడీస్ ఉంటుంది. రెండింటికి ప్రిపరేషన్ భిన్నంగా ఉండాలి. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలకు హిస్టరీ, ఎకానమీ, పాలిటీ, సైన్స్, జాగ్రఫీ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. బ్యాంకింగ్ పరీక్షల్లో కరెంట్ అఫైర్స్, బ్యాంకింగ్ అవేర్‌నెస్ అంశాలకు సంబంధించి ప్రశ్నలు ఉంటాయి.

జనరల్ స్టడీస్‌లోని వివిధ అంశాలకు సంబంధించి పూర్తిగా ప్రాథమిక అంశాలపై పట్టు సాధించాలి. ఉదాహరణకు పాలిటీ అంశాన్ని ఎంచుకొంటే శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలు అంటే ఏమిటి? వాటి విధులు, అలాగే ఆయా వ్యవస్థల్లో ఉండే వివిధ వ్యవస్థల విధులు (అంటే శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల్లో రాష్ట్రపతి భాగం, ఆయన విధులు), అధికారాలను నేర్చుకోవాలి. పౌరులకు ఉన్న ప్రాథమిక హక్కులు, విధులు, వివిధ ఆర్టికళ్లు, షెడ్యూళ్లను తెలుసుకోవాలి.

- **కరెంట్ ట్రెండ్‌తో లింక్:** పాలిటీ, ఎకానమీ, కొంతవరకు జాగ్రఫీ, సైన్స్ అంశాలు తాజా సంఘటనల ఆధారంగా సిద్ధం కావాలి. ఉదాహరణకు ఇటీవలే రాష్ట్రపతి ఢిల్లీ శాసనసభలో 20 మంది ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన శాసన సభ్యులను అనర్హులుగా ప్రకటించారు. దీనిని కేవలం చిన్న వార్తాంశంగా చదవకుండా లోతుగా అధ్యయనం చేయాలి. అసలు శాసన సభ్యులను అనర్హులుగా ప్రకటించేందుకు రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలను క్షుణ్ణంగా చదవాలి. ఈ సందర్భంలో ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951ని కూలంకషంగా చూడాలి. ఇదే కాకుండా రాజ్యాంగంలో ఫిరాయింపు నిరోధక చట్టాన్ని రాజ్యాంగంలో పదో షెడ్యూల్‌లో చేర్చారు. దీన్ని ఉపయోగించి కొద్దిరోజుల క్రితం తమిళనాడులో 18మంది శాసనసభ్యులపై అనర్హత వేటు వేశారు. వీటి పూర్వాపరాలను పూర్తిగా అధ్యయనం చేయాలి. ఏ పరీక్షలో ఏ రీతిలో ఈ అంశాలపై ప్రశ్న వస్తుందో పరిశీలిస్తే..

బ్యాంకింగ్‌రంగ పరీక్షలు

- ఇటీవల ఏ రాష్ట్ర శాసనసభకు సంబంధించి 20మంది సభ్యులను అనర్హులుగా రాష్ట్రపతి ప్రకటించారు? (ఢిల్లీ)
- ఏ కారణంగా ఢిల్లీలో 20 మంది శాసన సభ్యులను అనర్హులుగా ప్రకటించారు? (లాభదాయక పదవులు కలిగి ఉన్నారని)

చరిత్ర

- ఈ అంశానికి సంబంధించి బ్యాంకింగ్‌రంగంలో పెద్దగా ప్రశ్నలు ఉండవు. అయితే మిగతాపరీక్షల్లో మాత్రం ప్రాధాన్యం ఉంటుంది. ప్రాచీన, మధ్యయుగాలు, ఆధునిక భారత దేశంలో ఆయా కాలంలో భారత సమాజం, వర్ణ వ్యవస్థ, రాజకీయ, ఆర్థిక అంశాలు, అధ్యయనం చేసేందుకు ఉపయోగపడుతున్న పుస్తకాలు, రచయితలు (ఉదాహరణకు మౌర్యుల పాలనకు సంబంధించి అర్థశాస్త్రం), అలాగే వాస్తు నిర్మాణశైలి, సాంస్కృతిక అంశాలను అధ్యయనం చేయాలి.

ముఖ్యంగా చదవాల్సిన అంశాలు

- అంతర్జాతీయ అంశాలు (భారత్‌పై వాటి ప్రభావం) ఉదాహరణకు ఇటీవలే అమెరికా వీసా నిబంధనల్లో మార్పులను తీసుకొస్తుంది. పాత, కొత్త నిబంధనలు ఆ నిర్ణయంతో భారత్‌పై పడే ప్రభావం
- జాతీయ అంశాలు, ద్వైపాక్షిక అంశాలు (ఇటీవలే ఇజ్రాయెల్ ప్రధాని భారత్‌కు వచ్చారు. ఈ సందర్భంగా కుదిరిన ముఖ్య ఒప్పందాలు)

ఆర్థికాంశాలు

- వివిధ సంస్థలు, సూచీలు (ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్, వరల్డ్ ఎకనామిక్ ఫోరం)
- సైన్స్ అండ్ టెక్నాలజీ (ఇందులో అంతరిక్ష, రక్షణ రంగ, జీవ-సాంకేతిక, పర్యావరణ అంశాలను అధ్యయనం చేయాలి), క్రీడలు, వార్తల్లో వ్యక్తులు (నియామకాలు, మృతులు, అవార్డులు). ఈ కరెంట్ అఫైర్స్ ముఖ్యంగా బ్యాంకింగ్, గ్రూప్స్ పరీక్షల్లో కీలకపాత్ర పోషిస్తాయి.

ఎకానమీ అంశానికి సంబంధించి..

- ఇటీవల కాలంలో జీఎస్‌టీ (వస్తు, సేవల పన్ను)కి సంబంధించి తరుచూ వార్తలు చూస్తున్నాం. బ్యాంకింగ్ రంగ పరీక్షలకు సిద్ధమయ్యేవాళ్లు జీఎస్‌టీలో ఎన్ని స్లాబులు ఉన్నాయి, సేవలు ఏ స్లాబులోకి వస్తాయి, లేదా ముఖ్యమైన వస్తువులు ఏ స్లాబులోకి వస్తాయి? ఇలా తాజా సంఘటనలు తెలుసుకుంటే చాలు.

అదే ఇతర పరీక్షలకు సిద్ధమయ్యే వాళ్లు..

1. జీఎస్‌టీని ప్రవేశపెట్టడానికి ఎందుకు రాజ్యాంగ సవరణ చేయాల్సి వచ్చింది? (పన్నుల్లోని సమాఖ్య విధానాన్ని మార్చింది)
2. జీఎస్‌టీ ఏ తరహా పన్నుల స్థానంలో వచ్చింది? (పరోక్ష పన్నులు)
3. జీఎస్‌టీ తేవడానికి ఎన్నో రాజ్యాంగ సవరణ చేశారు? (101)
4. పరోక్ష పన్నులు అంటే ఏంటి? లేదా ప్రత్యక్ష పన్నులు అంటే ఏంటి? (పన్ను బదిలీ సాధ్యం కాకుంటే ప్రత్యేక్ష, బదిలీ అయితే పరోక్ష)
5. భారత్‌కు ఆదాయం అతి ఎక్కువగా ఏ పన్ను ద్వారా వస్తుంది (కార్పొరేట్ పన్ను).

- ఇలా జనరల్ స్టడీస్ అంశాల లోతుల్లోకి వెళ్లి చదవాల్సి ఉంటుంది. అయితే తాజా సంఘటనలు లోతుగా అధ్యయనం చేయాలంటే అన్ని సబ్జెక్టులపై పూర్తిస్థాయి అవగాహన అవసరం.

చదవాల్సిన పుస్తకాలు

- ప్రాథమిక అంశాలకు సంబంధించి తెలుగు మీడియం అభ్యర్థులు తెలుగు అకాడమీ, పాఠశాల స్థాయి పుస్తకాలు చదవాలి. ఆ తర్వాత డిగ్రీ స్థాయిలో తెలుగు అకాడమీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పుస్తకాలను అధ్యయనం చేయాలి.
- ఇంగ్లిష్ మీడియం అభ్యర్థులు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను ప్రాథమిక అంశాల కోసం చదవాలి.
- కేవలం పుస్తకాలు చదవడం మాత్రమే కాకుండా గత సంవత్సరాల్లో అడిగిన ప్రశ్నలను పరిశీలించాలి (వివిధ వెబ్‌సైట్లలో గతంలో అడిగిన ప్రశ్నలు అందుబాటులో ఉన్నాయి).

గ్రూప్స్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌లో రాదగిన ప్రశ్నలు

- ఏ కారణంతో ప్రజా ప్రాతినిధ్య చట్టం- 1951 ప్రకారం సభ్యులను అనర్హులుగా వేటు వేయవచ్చు (వివిధ కారణాలు ఇచ్చి, ఏది సరైంది? లేదా ఏది సరైంది కాదు? అని అడగొచ్చు. కారణాలను పరిశీలిస్తే లాభదాయక పదవులు కలిగి ఉంటే ఎన్నికల వ్యయం పరిమితి దాటి చేస్తే, అనర్హులుగా ప్రకటిస్తారు)
- అలాగే తమిళనాడు శాసనసభ్యులు ఫిరాయింపు నిరోధక చట్టం కింద అనర్హతకు గురయ్యారు. ఇది ఎన్నో రాజ్యాంగ సవరణ ద్వారా భారత రాజ్యాంగంలో చేర్చారు? అని అడగవచ్చు (జవాబు: 52వ)
- ఇదే సందర్భంలో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ)కు సిద్ధమయ్యే అభ్యర్థులు లోతుగా చదవడంతో పాటు అన్ని షెడ్యూళ్లను చదివితే సబ్జెక్టుపై పట్టు రావడంతో పాటు తాజా సంఘటనలకు ముడిపెట్టే పరిజ్ఞానం అలవడుతుంది.

మరో ఉదాహరణ పరిశీలిద్దాం..

- ఇటీవల కొత్తగా కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌ను నియమించారు. బ్యాంకింగ్ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు అతను ఎవరో తెలుసుకోవడంతో పాటు ఎన్నికల సంఘం తొలి కమిషనర్ ఎవరో తెలుసుకుంటే చాలు, అదే ఎస్ఎస్‌సీ పరీక్షలకు సిద్ధమయ్యేవాళ్లు తెలుసుకోవాల్సిన అంశాలు.
- ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌ను ఎవరు నియమిస్తారు?, అర్హతలు, పదవీకాలం, తొలగింపు విధానం, సంబంధించిన ఆర్టికళ్లు ఇలా పూర్తిగా అన్ని కోణాల్లోంచి చదవాలి. ఇదేతరహా విధానాన్ని అటు ఎకానమీ, జాగ్రఫీ, సైన్స్ అంశాలకు వర్తింపజేయాలి.

ఉదాహరణలతో పరిశీలిద్దాం..

- ఇటీవల సరిహద్దుకు సంబంధించి భారత్, చైనాల మధ్య వివాదాలు చోటుచేసుకున్నాయి. బ్యాంకింగ్‌రంగ పరీక్షలో తాజా సంఘటనలు తెలుసుకుంటే చాలు. అదే ఎస్ఎస్‌సీ, గ్రూప్స్‌కు సిద్ధమయ్యే వాళ్లు

1. అసలు భారత్‌కు ఎన్ని దేశాలతో సరిహద్దు ఉంది? అవి ఏమిటి ? (7, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, చైనా, మయన్మార్, ఆఫ్ఘనిస్థాన్)
2. ఏ దేశాలతో వివాదం ఉంది? (పాకిస్థాన్, చైనా)
3. భారత్‌కు చెందిన ఎన్ని రాష్ట్రాలు వివిధ దేశాలతో సరిహద్దును కలిగి ఉన్నాయి? (17 రాష్ట్రాలు)
4. మూడు దేశాలతో సరిహద్దును కలిగి ఉన్నరాష్ట్రం? (పశ్చిమబెంగాల్)
5. ఏ దేశంతో అతి ఎక్కువ సరిహద్దును భారత్ కలిగి ఉంది? (బంగ్లాదేశ్)
6. ఏ దేశంతో భారత్ అతి తక్కువ సరిహద్దును కలిగి ఉంది? (ఆఫ్ఘనిస్థాన్).

- ఇలా అన్ని కోణాల్లో సిద్ధమైతే జాగ్రఫీ అంశంపై మంచి పట్టు వస్తుంది. ప్రశ్న ఏ కోణం నుంచి వచ్చినా తేలికగా సమాధానం గుర్తించవచ్చు.



వి. రాజేంద్రశర్మ
జనరల్ స్టడీస్ ఫ్యాకల్టీ
9849212411

చారిత్రక కట్టడాలు

తాజ్‌మహల్

- ప్రపంచ ఏడు వింతల్లో ఒకటైన ఇది ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఆగ్రాలో యమునా నది ఒడ్డున ఉన్నది.
- దీన్ని తన భార్య ముంతాజ్ మహల్ జ్ఞాపకార్థంగా షాజహాన్ నిర్మింపజేశారు. దీనిని 1632లో ప్రారంభించారు.
- 1643లో ప్రధాన సమాధి పూర్తికాగా, 1653లో మిగతా నిర్మాణాలు పూర్తయ్యాయి.
- దీని ఎత్తు 73 మీ. (240 అడుగులు).
- దీని ఇంజినీర్ ఉస్తాద్ అహ్మద్ లహోరి.
- ఇది పర్షియా, భారతీయ, ఇస్లాం నిర్మాణశైలిలో ఉంది.

ఖజురహో ఆలయాలు

- హిందూ, జైన మతాలకు చెందిన ఈ ఆలయాలు మధ్య ప్రదేశ్ రాష్ట్రంలోని ఛాత్రపూర్‌లో ఉన్నాయి.
- వీటిలో ఎక్కువభాగం చందేలుల రాజవంశ పాలనా కాలం 950 - 1050 మధ్యకాలంలో నిర్మించారు.
- నగర నిర్మాణశైలిలో నిర్మించిన ఈ ఆలయాలు శృంగార శిల్పాలకు ప్రసిద్ధిచెందాయి.

సాంచి స్థూపం

- ఇది మధ్యప్రదేశ్ రాష్ట్రం రాయ్‌సేన్ జిల్లాలోని సాంచి పట్టణంలో ఉంది.
- దీనిని క్రీ.పూ. 3వ శతాబ్దంలో అశోకుడు నిర్మింపజేశారు.
- దీని కేంద్రభాగంలో అర్ధగోళాకారంలోని ఇటుకలతో కట్టిన కట్టడంలో బుద్ధుడి అస్తికలను ఉంచారు.
- 1818లో బ్రిటిష్ అధికారి జనరల్ టేలర్ ఈ స్థూపాన్ని కనుగొన్నారు.

రాణీకి వావ్ (మెట్ల బావి)

- సరస్వతి నది ఒడ్డున నిర్మించిన మెట్ల బావి గుజరాత్‌లోని పాటన్‌లో ఉంది.
- దీనిని 11వ శతాబ్దంలో మొదటి భీమ (1022-64) అనే రాజు జ్ఞాపకార్థం, అతని భార్య ఉదయమతి నిర్మింపజేశారు.
- మారు-గుర్జరా నిర్మాణ శైలిలో నిర్మితమైన దీనిలో 500కి పైగా శిల్పాలు ఉన్నాయి.
- ఉదయమతి నిర్మించిన ఈ మెట్ల బావి ప్రస్తావన జైన సన్యాసి మెరుంగా సూరి రచించిన 'ప్రబంధ చింతామణి' పుస్తకంలో ఉంది.

మహాబోధి టెంపుల్

- ఇది బీహార్‌లోని బుద్ధగయలో ఉన్నది.
- బుద్ధుడు ఇక్కడ ఉన్న బోధి వృక్షం కింద తపస్సు చేసి జ్ఞానం పొందాడు.
- దీనికి గుర్తుగా ఇక్కడ ఆలయాన్ని అశోకుడు క్రీ.పూ. 3వ శతాబ్దంలో నిర్మించాడు.
- ఇది బుద్ధ మతస్తులకు పవిత్రమైన స్థలం.

కోణార్క్ టెంపుల్

- ఒడిశా రాష్ట్రంలో ఉన్న ఈ ఆలయాన్ని సూర్య దేవాలయం, బ్లాక్ పగోడా అని పిలుస్తారు.
- 13వ శతాబ్దానికి చెందిన దీనిని తూర్పుగాంగ రాజవంశానికి చెందిన మొదటి నరసింహదేవ నిర్మింపజేశారు.
- ఈ ఆలయం ఎత్తు 230 అడుగులు. ఏడు గుర్రాలతో రథాన్ని లాగుతున్న సూర్యభగవానుడి రాతిశిల్పం చూపరులను ఆకట్టుకుంటుంది.

సుడోకు

డైలీ సుడోకు 113 సమాధానం

6	4	8	5	9	3	7	2	1
3	5	7	6	1	2	4	8	9
2	1	9	8	4	7	6	5	3
8	7	6	2	3	5	9	1	4
1	2	3	4	7	9	8	6	5
4	9	5	1	8	6	2	3	7
7	3	2	9	5	8	1	4	6
5	8	1	7	6	4	3	9	2
9	6	4	3	2	1	5	7	8

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు - 114

	6				5			
5				7		9		
7	4	3	1	6				
		4		8				7
	1						8	
2				5		1		
				3	4	2	9	8
		6		9				1
			5				4	

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 29 జనవరి 2018



నాలుగు ఐఐటీలకు 456 కోట్లు

దేశంలోని నాలుగు ఐఐటీల్లో ప్రాజెక్టుల అభివృద్ధికి కేంద్రం రూ. 456 కోట్లను మంజూరుచేసింది. ఐఐటీ ఖరగ్‌పూర్, ఢిల్లీ, మద్రాస్, బాంబే ఐఐటీలకు ఈ నిధులు విడుదల చేస్తున్నట్లు కేంద్రమానవ వనరుల మంత్రిత్వశాఖ ప్రకటించింది.

- ఈ నిధులతో ల్యాబ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పరికరాలు తదితరాలను కొనుగోలు చేస్తారు. రూ. 456 కోట్లలో ఖరగ్‌పూర్‌కు రూ. 151.9 కోట్లు, ఢిల్లీ ఐఐటీకి రూ. 105 కోట్లు, మద్రాస్‌కు రూ. 103.41 కోట్లు, బాంబే ఐఐటీకి రూ. 96.5 కోట్ల నిధులను ఇవ్వనున్నారు.
- ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన విద్యానిపుణులను, పోస్ట్ డాక్టోరల్ ఫెలోస్‌ను ఆకర్షించడానికి ఐఐటీ ఖరగ్‌పూర్ దృష్టిపెట్టింది. ప్రపంచస్థాయి ప్రయోగశాలలు, పరికరాలును ఏర్పాటుచేసి అత్యంత నాణ్యమైన పరిశోధనల కోసం ఈ నిధులను ఉపయోగించనున్నట్లు ఐఐటీ ఖరగ్‌పూర్ డైరెక్టర్ పీపీ చక్రవర్తి పేర్కొన్నారు. అదే సమయంలో క్యాంపస్‌లో మెరుగైన వసతి సౌకర్యాలను కల్పించనున్నారు. ఇప్పటికే ల్యాబ్ నిర్మాణానికి సంబంధించిన బ్లూప్రింట్ తయారుచేసినట్లు ఆయన తెలిపారు. మ్యానుఫ్యాక్చరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్, వీఎల్‌ఎస్‌ఐ డిజైన్, క్లౌడ్ కంప్యూటింగ్, స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యసేవలు తదితరాలకోసం అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయనున్నట్లు డైరెక్టర్ వెల్లడించారు. విద్యార్థులకు సంబంధించి మెరుగైన వసతి సౌకర్యాల ఏర్పాటు. క్రీడల కోసం సుమారు రూ. 10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నారు.

సీఏ-ఆర్టికల్‌షిప్



ప్రస్తుతం సీఏ, సీఎంఏ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో ఇంటర్న్‌షిప్ చేయటం తప్పనిసరిగా మారింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా జాబ్‌రెడీ స్కిల్స్, రియల్ టైం ఎక్స్‌పీరియన్స్ అందించేవి ఆర్టికల్‌షిప్, ప్రాక్టికల్ ట్రైనింగ్. తరగతిగదుల్లో బోధించిన అంశాలను వాస్తవ పరిస్థితులకు అన్వయించగలిగే అవకాశం ఆర్టికల్‌షిప్ ద్వారా లభిస్తుంది. సంబంధిత రంగాల్లోని ఆధునిక ధోరణులపై అవగాహన ఏర్పడుతుంది. కోర్సు పూర్తయ్యే నాటికి ఇండస్ట్రీ రెడీగా తీర్చిదిద్దుకునేందుకు ఆర్టికల్‌షిప్ మంచి వేదిక. అందుకే ఆర్టికల్‌షిప్‌ను ఉద్యోగానికి మొదటి మెట్టుగా భావిస్తున్నారు. కెరీర్‌పరంగా నిర్ణయాత్మక మలుపుగా నిలుస్తున్న ఆర్టికల్‌షిప్ గురించి తెలుసుకుందాం..

సీఏ కోర్సుని మూడు దశల్లో పూర్తి చేయాలన్న విషయం తెలిసిందే. ముందుగా సీపీటీ (కొత్తపేరు సీఏ ఫౌండేషన్) పూర్తిచేసినవారు 9 నెలలకు రెండో దశ అయిన ఐపీసీసీ (కొత్త పేరు సీఏ ఇంటర్) పూర్తి చేయాలి. ఐపీసీసీలోని మొదటి గ్రూపు కానీ, రెండో గ్రూపు కానీ ఏదో ఒక గ్రూపు పూర్తిచేసినవారు లేదా రెండు గ్రూపులూ పూర్తిచేసినవారు మూడేండ్ల పాటు ఆర్టికల్‌షిప్ చేయాల్సి ఉంటుంది. ఈ మూడేండ్ల ఆర్టికల్‌షిప్‌లో రెండున్నరేండ్లు పూర్తయ్యాక సీఏ ఫైనల్ పరీక్ష రాయవచ్చు.

- **ఆర్టికల్‌షిప్ అంటే:** సీఏ చదువుతున్న విద్యార్థులు చదువుతో పాటు భవిష్యత్తులో చేయబోయే ప్రాక్టీస్ లేదా ఉద్యోగాలకు సంబంధించిన విషయ పరిజ్ఞానం, ప్రాక్టికల్ నాలెడ్జ్, వృత్తినైపుణ్యం, ఆచరణాత్మకత, ఎక్స్‌పోజర్ వంటి అంశాల పట్ల ముందుగానే అవగాహన ఏర్పర్చుకోవడమే ఆర్టికల్‌షిప్ ఉద్దేశం.
- **ఆర్టికల్‌షిప్ ఎక్కడ చేయాలి:** ఐపీసీసీ కోర్సులో రెండు గ్రూపులు లేదా ఏదైనా ఒక గ్రూపు పూర్తిచేసిన తర్వాత మూడేండ్ల పాటు ఒక సీఏ దగ్గర కానీ, ఒక ఆడిట్ సంస్థలోకానీ ఆర్టికల్‌షిప్ చేయాల్సి ఉంటుంది.
- **ఆర్టికల్‌షిప్‌నకు రిజిస్ట్రేషన్ చేయించాలా:** ఐపీసీసీ రెండు గ్రూపులు పూర్తిచేసినవారు లేదా ఏదైన ఒక గ్రూపు పూర్తిచేసిన వారు ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ద్వారా నమోదు చేయించుకోవాలి. మనం ఎవరి వద్ద ఆర్టికల్‌షిప్ చేయబోతున్నాం, ఎప్పటి నుంచి ఆర్టికల్‌షిప్ ప్రారంభించాం తదితర విషయాలు ఐసీఏఐ వారికి ముందుగానే తెలియజేయాలి.
- **మౌఖిక పరీక్ష (ఇంటర్వ్యూ):** కొన్ని పెద్ద ఆడిట్ సంస్థలు తమ వద్ద ఆర్టికల్‌షిప్ చేయాలనుకునే విద్యార్థులకు ఇంటర్వ్యూ సైతం నిర్వహిస్తున్నాయి. అటువంటి సంస్థల్లో ఇంటర్వ్యూకు వెళ్లే విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు.
- ఇంటర్వ్యూకి వెళ్లేముందు సీఏ ఐపీసీసీలోని అన్ని సబ్జెక్టులను మరోసారి రివైజ్ చేసుకొని వెళ్లాలి.
- ఇంటర్వ్యూలో వారు అడిగిన ప్రశ్నకు మీకు సమాధానం తెలియకపోతే నిజాయితీగా తెలియదని చెప్పండి. అంతేకాని ఏదో ఒక సమాధానం చెప్పి మభ్యపెట్టవద్దు.
- మీరు ఇంటర్వ్యూకి వెళ్తున్న ఆడిట్ సంస్థ పూర్తి సమాచారాన్ని ముందుగానే తెలుసుకోవడం మంచిది. ఎందుకంటే ఇంటర్వ్యూలో ఇంటర్వ్యూ చేసేవారు వారి సంస్థ పట్ల మీకున్న అభిప్రాయాన్ని తెలియజేయాలని అడిగే అవకాశం ఉంది.
- ఇంటర్వ్యూలో అడిగే ప్రశ్నలకు కంగారు పడకుండా సమాధానం చెప్పండి. ధరించే దుస్తుల విషయంలో కూడా జాగ్రత్త వహించాలి. మీరు ధరించే దుస్తుల విధానం ప్రొఫెషనల్‌గా ఉండాలి.
- ఇంటర్వ్యూలో సమాధానాలు ఇచ్చేటప్పుడు మీరు పని చేయాలనుకుంటున్న ఆడిట్ సంస్థ నియమ నిబంధనలకు లోబడి మీరు పనిచేస్తారనేవిధంగా మీ సమాధానాలు ఉండాలి.

ఆర్టికల్‌షిప్-ప్రయోజనాలు


- ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా వారు సీఏ కోర్సును మొదలుపెట్టిన దగ్గర నుంచే ఈ ప్రాక్టికల్ ట్రైనింగ్ అనే విధానాన్ని ఎంతో ముందుచూపుతో తీసుకువచ్చారు. సీఏ చదివే విద్యార్థులు సీఏ చదువుతో పాటు ఈ ప్రాక్టికల్ ట్రైనింగ్‌కి కూడా సమప్రాధాన్యతను ఇచ్చి సీఏ సర్టిఫికెట్‌తో పాటు సీఏగా రాణించడానికి అవసరమయ్యే అన్ని మెళకువలు నేర్పించడానికే ఐసీఏఐవారు ఈ ఆర్టికల్‌షిప్ విధానాన్ని ప్రవేశపెట్టింది.

చదువుతూనే సంపాదన

- చదువుతూనే సంపాదన అనే విధానం ఈ ఆర్టికల్‌షిప్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. అంటే చదువుతో పాటే విద్యార్థికి సంపాదన కూడా ఉంటుంది. ఏ ఆడిట్ సంస్థలో అయితే జాయిన్ అవుతామో ఆ ఆడిట్ సంస్థవారు విద్యార్థికి ఐసీఏఐ నిబంధనల ప్రకారం స్టయిఫండ్ కూడా ఇవ్వడం జరుగుతుంది. దీంతో విద్యార్థులు తమ చదువుకు ఉపయోగించుకొని తల్లిదండ్రుల మీద ఆధార పడకుండా చదువుకునే అవకాశం కలుగుతుంది. అంతేకాదు డబ్బు విలువ కూడా విద్యార్థులకు చదువుకునే సమయంలో తెలుస్తుంది. ఈ విధానంలో ఉన్న గొప్ప విషయం అదే.

ప్రాక్టికల్ ట్రైనింగ్‌లో గుర్తుంచుకోవాల్సినవి

- ఆర్టికల్‌షిప్ చేసే సమయంలో శిక్షణ ఇచ్చే సంస్థ/ఆడిట్ ఆఫీస్‌వారు విద్యార్థులతో రకరకాల సంస్థ ఆడిట్ వర్క్ చేయించడం జరుగుతుంది. ఆడిట్ చేసే సమయంలో విద్యార్థులు కింది అంశాలపై నిశితంగా గమనించాలి.
- సంస్థకి సంబంధించిన పుస్తకాలు ఎలా తయారు చేస్తున్నారు.
- సంస్థ వ్యాపార లావాదేవీలను ఎలా జరుపుతున్నారు.
- వ్యాపార సంస్థకు సంబంధించిన మంచి, చెడులు, వారి వ్యాపార సూత్రాలు, మెళకువలను గమనించాలి.
- వ్యాపార పద్ధతులను నిశితంగా పరిశీలించాలి.
- తయారీ సంస్థలైతే గనుక వస్తు తయారీలోను వివిధ దశల గురించి తెలుసుకోవడం మంచిది.



- ప్రాక్టికల్ ట్రైనింగ్ తీసుకోవడం వల్ల విద్యార్థి ఒక సీఏ పనినైతే చేయగలడో ఆ పని మొత్తం నేర్చుకొనే వీలుంటుంది.
- **ఉదా :** అకౌంటింగ్ స్టాండర్డ్స్ గురించి అవగాహన, ఆడిటింగ్ స్టాండర్డ్స్ గురించి అవగాహన, టాక్స్ అమెండ్‌మెంట్స్ గురించి అవగాహన పొందవచ్చు.

ఆర్టికల్‌షిప్ ట్రైనింగ్‌లో చేరేముందు ఎలాంటి సంస్థని ఎంచుకోవాలి: నైపుణ్యాలు, ప్రతిభను మెరుగుపర్చుకొనేందుకు ఎక్కువ అవకాశాలను కల్పించే ఆడిట్ సంస్థలను ఎంపిక చేసుకోవాలి. అప్పగించిన బాధ్యతలను పూర్తిచేసేందుకు నూతనంగా ఆలోచించాలి. సమస్యను పరిష్కరించే క్రమంలో ఏవైనా సందేహాలు వస్తే ఎటువంటి సంకోచం లేకుండా సీనియర్ల సహాయం తీసుకోవాలి. ఆర్టికల్‌షిప్‌లో ఎన్నో కార్యకలాపాలు ఉంటాయి. కాబట్టి చిన్న, పెద్ద అని తేడా లేకుండా ఇచ్చిన బాధ్యతలను నిర్వర్తించడానికి ప్రయత్నించాలి. ఆర్టికల్ స్టూడెంట్ ఆర్టికల్ అసిస్టెంట్ రోజువారీగా నిర్వహించిన కార్యకలాపాలను రికార్డు చేసుకుంటే మంచిది. ఇంటర్‌పర్సనల్ బిహేవియర్, కమ్యూనికేషన్ స్కిల్స్ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఆర్టికల్‌షిప్ అవకాశాలను అందిపుచ్చుకొనేందుకు సీనియర్ల సహకారం తీసుకోవాలి. స్టయిఫండ్ గురించి ఆలోచించకుండా మంచి సంస్థలో ఆర్టికల్‌షిప్ అవకాశం ఉంటే చేసేందుకు సిద్ధంగా ఉండాలి.

- విద్యార్థులు ఆర్టికల్‌షిప్ ఎలాంటి ఆడిట్ సంస్థలో అయినా చేయవచ్చు. ఎంచుకొనే ఆడిట్ సంస్థను బట్టే (అది చిన్న సంస్థ అయినా, పెద్ద సంస్థ అయినా) మనం నేర్చుకొనే నైపుణ్యం మీద ఆధారపడి ఉంటుందని మరిచిపోకూడదు.
- చాలామంది విద్యార్థులు తాము ఉన్న ఊరు, సిటీ చిన్నవని పెద్ద పెద్ద ఆడిట్ సంస్థలు లేవని అలాంటి సంస్థల్లో ఆర్టికల్‌షిప్ చేస్తేనే పరిజ్ఞానం, ఎక్స్‌పోజర్ వస్తుందని భావిస్తుంటారు. కానీ అది అపోహ మాత్రమే. మనం ఏ ఆడిట్ సంస్థలో ఆర్టికల్‌షిప్ కోసం చేరినా వ్యవహరించే విధానం మనలో ఉన్న తపనను బట్టి పరిజ్ఞానం వస్తుందని మరిచిపోకూడదు.
- కొంతమంది ఆర్టికల్‌షిప్ చేయడం కోసం ఉన్న నగరాలను వదిలేసి మెట్రో నగరాలకు వెళ్తున్నారు. దీంట్లో తప్పేమీ లేదు కానీ ఆర్టికల్‌షిప్‌కోసం అటువంటి ప్రాంతాలకు వెళ్లిన కొంతమంది విద్యార్థులు మెట్రోకల్చర్‌కి ఆకర్షితులై తమ దిశమారి తప్పటడుగులు వేస్తున్నారు. అక్కడ వారు ఏవైనా తప్పటడుగులు వేస్తే మందలించడానికి తల్లిదండ్రులుకానీ, బంధువులుకానీ ఉండరు కాబట్టి మరిన్ని తప్పులు చేసే అవకాశం ఉంది. చాలామంది విద్యార్థులు తాము ఏ ఉద్దేశంతో వచ్చారో మరిచి క్రమశిక్షణ తప్పి అటు ఆర్టికల్‌షిప్ సరిగ్గా చేయక ఇటు సీఏ కోర్సు పూర్తిచేయలేకపోవడంతో పాటు కోర్సు నుంచి విరమించుకున్న సందర్భాలూ లేకపోలేదు. కాబట్టి మెట్రో నగరాలకు వెళ్లి ఆర్టికల్‌షిప్ చేయాలనుకునే విద్యార్థులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకోవాలి.
- విద్యార్థులు ఏ ఆడిట్ సంస్థలో అయితే చేరాలనుకుంటున్నారో ఆ ఆడిట్ సంస్థలో ఆర్టికల్‌షిప్ పూర్తిచేసిన సీనియర్లని, అక్కడ ఆర్టికల్‌షిప్ కొనసాగిస్తున్నవారితో మాట్లాడి నిర్ణయం తీసుకోవడం మంచిది.
- విద్యార్థులు ఆడిట్ సంస్థను ఎంచుకునేటప్పుడు పెద్ద పెద్ద భవనాలు, కార్పొరేట్ హంగులు, ఆర్భాటాలు చూసి ఎంచుకోకూడదు. కొంతమంది విద్యార్థులైతే ఆయా సంస్థలో ఉండే ప్రత్యేక సౌకర్యాల కోసమే ఆడిట్ సంస్థలను ఎంచుకుంటున్న దాఖలాలూ ఉన్నాయి. కానీ ఇది సరైన విధానం కాదు. విద్యార్థి ఒక ఆడిట్ సంస్థను ఎంచుకునేముందు ఆ సంస్థకి ఉన్న క్లయింట్స్ ఎవరు, వృత్తి నైపుణ్యాలు ఎలా ఉంటాయి?, అన్ని రకాల ఆడిట్‌లు నేర్పిస్తారా? వంటి పలు అంశాలను బేరీజు వేసుకొని నిర్ణయం తీసుకోవాలి.
- కొంతమంది విద్యార్థులు ఆడిట్ సంస్థలో చేరేటప్పుడు అవసరమైన అంశాలను పరిశీలించకుండా ఆయా సంస్థల్లో చేరుతుంటారు. తర్వాత అక్కడ తమకు సరైన ఎక్స్‌పోజర్ రావడం లేదని, ఆడిట్ సంస్థవారు చదువుకోవడానికి సమయం ఇవ్వడం లేదని ఇలా రకరకాల కారణాల వల్ల పదే పదే ఆడిట్ సంస్థలు మారుతుంటారు. ఇది గమనించి సీఏ ఇన్‌స్టిట్యూట్ ఆడిట్ సంస్థల బదిలీ ప్రక్రియను కఠినతరం చేసింది. ఇప్పుడు విద్యార్థులు ఒక ఆడిట్ సంస్థ నుంచి మరో ఆడిట్ సంస్థకు మారడం అంతసులభం కాదు. అందుకే ఆడిట్ సంస్థలో ఆర్టికల్‌షిప్‌లో చేరేముందు అన్ని కోణాల్లో ఆలోచించి నిర్ణయం తీసుకోవడం మంచిది.

- సీఏ కోర్సు పూర్తిచేసినవారు ఉద్యోగానికైనా వెళ్లవచ్చు లేదా సొంతంగా ప్రాక్టీస్ కూడా ప్రారంభించవచ్చు. ప్రాక్టీస్‌గానీ, ఉద్యోగం చేయాలన్నా ఈ ఆర్టికల్‌షిప్ ద్వారా నేర్చుకునే మెళకువలు ఎంతగానో ఉపయోగపడతాయి.
- ఆర్టికల్‌షిప్ ద్వారా విద్యార్థి తరగతిగదిలో నేర్చుకున్న విజ్ఞానం ఆచరణాత్మకంగా ఎలా అమలు చేయాలో నేర్చుకుంటాడు.
- సీఏ కోర్సులోని అన్ని దశల్లో ప్రత్యేకించి సీఏ ఫైనల్ పరీక్షలకు సన్నద్ధమయ్యేటప్పుడు ఫైనల్‌లోని అన్ని అంశాలపై లోతైన అవగాహన చాలా అవసరం. ఆర్టికల్‌షిప్ ట్రైనింగ్‌ను నిబద్ధతతో పూర్తిచేసినవారు సీఏ ఫైనల్‌లోని అన్ని అంశాలపై పూర్తి అవగాహన ఏర్పడి పరీక్షలు చక్కగా రాసే వీలుంటుంది.
- సీఏ ఫైనల్‌లో అడిగే ప్రశ్నల్లో కొన్ని మన ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని కూడా ప్రశ్నించేలా ఉంటాయి. కాబట్టి ప్రాక్టికల్ ట్రైనింగ్‌లో ఉన్నప్పుడు ఏ విషయాన్నీ వదలకుండా అన్ని విషయాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి.
- ఆర్టికల్‌షిప్ ట్రైనింగ్ పొందే సమయంలో సహచర విద్యార్థులతో సఖ్యతగా ఉంటూ వారికి తెలిసిన విషయాలను కూడా అడిగి తెలుసుకుంటూ ఉండాలి. దీనివల్ల తెలియని అంశాలను కూడా అర్థం చేసుకునే వీలుంటుంది.
- ఆర్టికల్‌షిప్ ట్రైనింగ్ సమయంలో మనం వివిధ అధికారులు, సీనియర్లను అనేక రకాల విభాగాల ప్రతినిధులతో కలిసి పనిచేయాల్సి ఉంటుంది. అటువంటి సమయంలో వారి నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటూ పనిచేస్తే కావాల్సిన పరిజ్ఞానంతో పాటు భావవ్యక్తీకరణ నైపుణ్యాలను పెంచుకోవచ్చు.
- ఆర్టికల్‌షిప్ ట్రైనింగ్ నిబద్ధతతో పూర్తిచేసినవారికి వారిపైన నమ్మకం పెరుగుతుంది. ఆత్మవిశ్వాసం కలిగి తమ కెరీర్‌పై స్పష్టతను ఏర్పర్చుకొని తమ గమ్యాలను సరైన దిశలో నిర్దేశించుకొని అటువైపు పయనం కొనసాగిస్తారు.
- రోజువారీ బాధ్యతల కారణంగా డిపార్ట్‌మెంట్ హెడ్స్/మేనేజర్లు వారికి వచ్చిన వినూత్న ఆలోచనలను అమలుచేయటం ఒక్కోసారి సాధ్యం కాదు. అలాంటి ఆలోచనలపై పనిచేయటం, వాటి ద్వారా ఎదురయ్యే పరిస్థితులను పరిశీలించడానికి ఆడిట్ సంస్థలు ఆర్టికల్ అసిస్టెంట్‌గా చేరినవారి సేవలను వినియోగించుకుంటాయి. అంతేకాకుండా ఆర్టికల్‌షిప్ చేసేవారు ఫ్రెష్ మైండ్‌తో ఉంటారు. కాబట్టి సంబంధిత రంగాల్లో సృజనాత్మకత ఆలోచనలు చేసే అవకాశం ఉంటుంది. ఇవి నూతన ఆవిష్కరణలకు దోహదం చేస్తాయి. కాబట్టి ఆడిట్ సంస్థలు ఆర్టికల్‌షిప్స్‌ను ప్రోత్సహిస్తాయి.
- తమకు కావాల్సిన ప్రతిభావంతులను రిక్రూట్ చేసుకొనే క్రమంలో ఆర్టికల్‌షిప్‌ను ఆడిట్ సంస్థ ఒక మార్గంగా భావిస్తాయి. అవసరమైన నైపుణ్యాలు, ఆర్టికల్‌షిప్ సమయంలో పనితీరు, దృక్పథం చురుగ్గా కంపెనీ సంస్కృతిలో కలిసిపోవడం వంటి అంశాలను ఆడిట్ సంస్థలు ఆర్టికల్‌షిప్ సమయంలో నిశితంగా గమనిస్తాయి. ఈ సమయంలో తమ స్కిల్స్‌తో ఆకట్టుకునేవారికి ఉద్యోగ అవకాశం కూడా కంపెనీలు కల్పిస్తాయి.



మట్టపల్లి మోహన్‌రావు
మాస్టర్ మైండ్స్
హైదరాబాద్. 9248 733 323

సివిల్స్ ఇంటర్వ్యూలో గత ప్రశ్నలు



1. What should we choose, environment or development? How should we strike a balance between both?
2. What is india's Nuclear doctrine? Should there be first use policy considering the turbulent neighbourhood in which we are living?
3. Does india want a nuclear free world?if yes, then don't you think there exits a contradiction in india's nuclear doctrine.
4. What is the difference between MOU and Agreement which one is legally binding ?
5. What is the difference between exclusive economic Zone and maritime economic Zone?
6. Where are wheeler island and chandipur Range located?
7. If someone is very poor, his parents have mortgaged jewelry to fund his education and he fails in the exit exam. what will be his future? don't you think this proposed exit exam is unnecessary?
8. Recently, the areca nut yield is suffering due to insufficient irrigation and electricity, prices have come do because the karnataka govt. has banned gutka ad supari due to which their prices have steppe. don't you think it is good that such a thing (gutka & supari which are made from areca nut) which cause cancer should be banned? can't we encourage areca nut farmers to go for alternative crops?
9. What is Regional Planning? what are its benefits?
10. What is the difference between urban planning and rural planning?
11. Tell something about the national knowledge park what is the use of this network?
12. What is CNG? why is it compressed?
13. Tell something about the bermuda triangle and the countries that have a coastline along it.
14. What is flood plain zone?
15. Tell something about any good innovations in agriculture or irrigation or drinking water in rural areas.
16. Tell something about the recent political developments in myanmar.
17. How many languages are there in india recognized by the constitution? are all those languages spoken ?
18. What is social media? what are its advantages and disadvantages isn't it also that today's youth spend a lot of time in it?
19. This is a hypothetical situation. suppose Gandhiji, Chandrashekar Azad, Bhagath Singh and Netaji S.C. Bose were alive today. who would you choose to lead our country and why? whom would you choose as the second?
20. Speak about some animal welfare organization
21. What is micro finance?
22. What were the recommendations made by justice verma committee report? do you support death penality? why?
23. How can the relations between india and pakisthan improve?
24. What is climate change? Russians are saying climate change is good as there will be more land an arctic and thus more resources will be available. what is your opinion on this?
25. Tell about Anglo- sikh wars.
26. Tell something about UPSC. when was is founded? why was it founded?
27. What is difference between information technology and information & communication technology?
28. In western rajasthan, there are border problems. what is the government doing to resolve this.
29. What is the devas multimedia controversy?
30. Talk about any challenge for national security is the recent past.



M. Balalatha
Civils Faculty

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
సోమవారం 29 జనవరి 2018


చిరంజీవి

సుకుమార్ దర్శకత్వంలో చిరు?

ప్రస్తుతం 'సైరా' చిత్రీకరణలో బిజీగా వున్నారు చిరంజీవి. తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత కథ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సురేందర్‌రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఇదిలావుండగా 'సైరా' అనంతరం చిరంజీవి నటించబోయే తదుపరి సినిమా గురించి ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్‌నగర్ వర్గాల్లో వినిపిస్తున్నది. సుకుమార్ దర్శకత్వంలో చిరంజీవి ఓ చిత్రానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం రామ్‌చరణ్ కథానాయకుడిగా సుకుమార్ 'రంగస్థలం' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ సందర్భంగా పలుమార్లు సెట్స్‌ను సందర్శించారు చిరంజీవి. ఈ క్రమంలో సుకుమార్ చెప్పిన ఓ కథ చిరంజీవి విని బాగా ఆకట్టుకుందని, దాంతో సినిమా చేయడానికి ఆయన సుముఖత వ్యక్తం చేశారని అంటున్నారు. 'సైరా' పూర్తయిన తర్వాత చిరంజీవి-సుకుమార్ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడుతుందని తెలిసింది.


సుకుమార్


శ్రియ, విష్ణు, రఘురామకృష్ణంరాజు, సుబ్బిరామిరెడ్డి, నిర్మల, మోహన్‌బాబు, లక్ష్మి, మదన్, అనసూయ

సినిమా తప్ప మరో వ్యాపకం లేదు!

'సినిమా అనేది చాలా కష్టమైన వ్యాపారం. నాకు తెలిసిన వృత్తి ఇదొక్కటే. సినిమా తప్ప మరో వ్యాపకం లేదు. నటుడిగా, నిర్మాతగా ఇన్నేళ్ల ప్రయాణంలో ఏనాడు విజయం వచ్చిందని విర్రవీగలేదు. అపజయం వచ్చినపుడు కృంగిపోలేదు' అని అన్నారు మోహన్‌బాబు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తూ స్వీయ నిర్మాణ సంస్థ లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్ పతాకంపై రూపొందిస్తున్న చిత్రం 'గాయత్రి'. మదన్ రామిగాని దర్శకత్వం వహిస్తున్నారు. మంచు విష్ణు, శ్రియ, అనసూయ భరద్వాజ్, నిఖిలా విమల్ ప్రధాన పాత్రలను పోషించారు. ఫిబ్రవరి 9న ఈ చిత్రం విడుదలకానున్నది. తమన్ స్వరాలను సమకూర్చిన ఈ చిత్ర గీతాలు ఆదివారం హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. మోహన్‌బాబు ఆడియో సీడీలను విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఏడాది పాటు కష్టపడి చేసిన సినిమా ఇది. నిర్మాతల బాధ్యతలు చాలా కష్టసాధ్యమైనవి. ఐదు సినిమాలు విజయవంతమై ఒక సినిమా పరాజయం పాలైతే అప్పటి వరకు పడిన కష్టం వృథా అవుతుంది. తల్లిదండ్రులు నాకు జన్మనిస్తే నటుడిగా దాసరి నారాయణరావు పునర్జన్మనిచ్చారు. ఎన్నో మంచి సినిమాలు, పాత్రలు ఇచ్చారాయన. దాసరి లేకపోవడం నాకో పెద్దలోటు. మహానటుడు ఎన్టీఆర్ తర్వాత అంతా అద్భుతంగా సంభాషణలు చెప్పగలడని నాకు పేరు రావడానికి దాసరి గొప్పతనమే కారణం. దర్శకుడు మదన్ ఈ సినిమాను గొప్పగా తెరకెక్కించారు. బాపుగారి చిత్రం మాదిరిగా సర్వేష్ మురారి సినిమాను అందంగా మలిచారు. సినిమా కోసం ఒక్క పైసా పారితోషికం తీసుకోకుండా సంభాషణల్లో సహకారం అందించారు పరుచూరి బ్రదర్స్. నాకు మంచి సక్సెస్‌ను ఇవ్వాలని నటీనటులు, సాంకేతిక నిపుణులు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేశారు. విష్ణు, శ్రియ పోటీపడి నటించారు. వారి నటన చూసి కన్నీళ్లు వచ్చాయి. భగవంతుడు, ప్రేక్షక దేవుళ్ల ఆశీస్సులతో సినిమా పెద్ద విజయవంతం కావాలని కోరుకుంటున్నాను' అని చెప్పారు. మంచు విష్ణు మాట్లాడుతూ 'నా కెరీర్‌లో టర్నింగ్ పాయింట్‌గా నిలిచే చిత్రమిది. తొలుత మదన్, రత్నబాబు ఈ కథను వినిపించినపుడు వారి దృష్టిలో వేరే నటుడు ఉన్నారు. నా మనసుకు నచ్చిన పాత్ర కావడంతో నేనే చేస్తానని చెప్పాను. నా కెరీర్‌లో మంచి పాత్రగా నిలుస్తుంది. ఓ తండ్రి, కూతురు మధ్య జరిగే కథ ఇది. భావోద్వేగ ప్రధానంగా సాగుతుంది' అని తెలిపారు. సినిమాలతో బిజీగా ఉండి కూడా మాతో లేరనే లోటు లేకుండా నాన్న తమను పెంచారని, ఎన్ని జన్మలెత్తినా ఆయన రుణం తీర్చుకోలేమని, ఇప్పటికీ ఆయనే మా బలమని మంచు మనోజ్ చెప్పారు. పౌరాణికం, చారిత్రకం ఇలా మోహన్‌బాబు స్పృశించని కథాంశం లేదని, 'గాయత్రి' సినిమాలో రెండు పాత్రల్లో మోహన్‌బాబు నటవిశ్వరూపాన్ని చూస్తారని, ఆయన కెరీర్‌లో మైలురాయిగా నిలిచే చిత్రమిదని బ్రహ్మానందం చెప్పారు. మంచు లక్ష్మి మాట్లాడుతూ 'నాన్న గురించి మాట్లాడటం మొదలుపెడితే సమయమే తెలియదు. రోజంతా మాట్లాడుతూనే ఉంటాను. గొప్ప నటుడి కూతురిగా పుట్టడం, ఆయన నుంచి నటన నేర్చుకునే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను' అని తెలిపింది. మోహన్‌బాబుతో కలిసి నటించే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని, ఆయనో నట శిక్షణాలయమని అనసూయ భరద్వాజ్ చెప్పింది. ఈ కార్యక్రమంలో మదన్, గిరిబాబు, రామజోగయ్యశాస్త్రి, పృథ్వీ, సుబ్బిరామిరెడ్డి, ఛాముండేశ్వరినాథ్, రఘురామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.


లావణ్య త్రిపాఠి, సాయిధరమ్‌తేజ్, ప్రభాస్, వి.వి.వినాయక్, సి.కల్యాణ్

వినాయక్‌తో చేయడం లక్కీ!

సాయిధరమ్‌తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఇంటిలిజెంట్'. వి.వి.వినాయక్ దర్శకుడు. లావణ్య త్రిపాఠి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని సి.కల్యాణ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం కోసం చంద్రబోస్ రాసిన 'లెట్స్ డూ..' గీతాన్ని ఆదివారం హైదరాబాద్‌లో హీరో ప్రభాస్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సాయిధరమ్‌తేజ్ 'సాహో' షూటింగ్‌కు వస్తే వినాయక్‌తో సినిమా చేయడం చాలా లక్కీ అని చెప్పాను. ఈ చిత్రంలో నాకు అత్యంత ఇష్టమైన పాట 'చమకు చమకు చాం...'. చిరంజీవిగారి పాటల్లో ది బెస్ట్ సాంగ్ ఇది. ఆయన అద్భుతంగా డ్యాన్స్ చేశారు. ఈ పాటలో సాయిధరమ్‌తేజ్ ఎలా చేశాడో అని ఆతృతగా ఎదురుచూస్తున్నాను. వినాయక్ బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌తో వస్తున్నారు. ఈ సినిమా టీమ్ అందరికి బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ కావాలి' అన్నారు. వి.వి.వినాయక్ మాట్లాడుతూ 'ప్రభాస్ అంటే స్నేహానికి నిలువెత్తు రూపం. స్నేహితులు వుంటే చాలు అనుకునే వ్యక్తి. ఇలాంటి వ్యక్తి సినిమా ఇండస్ట్రీలో వుండటం చాలా అరుదు. చిన్న చిన్న విషయాలకు కూడా ఆనందపడుతుంటాడు. అదే ఆనందాన్ని మాకు పంచడానికి వచ్చాడు. సాయిధరమ్‌తేజ్ టీజర్‌లో చిరంజీవిలా వున్నాడని అంటుంటే ఆనందంగా వుంది. లావణ్య కమర్షియల్ కథానాయికగా కనిపించింది. తనకు ఈ సినిమా మంచి పేరు తెచ్చిపెడుతుంది' అన్నారు. 'ప్రభాస్‌ను మా ఫ్యామిలీ మెంబర్‌గా ఫీలవుతాం. సినిమాలోని తొలి పాటను విడుదల చేసినందుకు ప్రభాస్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అందరం కలిసి మంచి సినిమా చేశాం. ఫిబ్రవరి 9న సినిమా చూసి మమ్మల్ని ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నాను' అని సాయిధరమ్‌తేజ్ అన్నారు. సి.కల్యాణ్ మాట్లాడుతూ 'మంచి మనసున్న ప్రభాస్ చేతుల మీదుగా చంద్రబోస్ రాసిన 'లెట్స్ డూ..' గీతాన్ని విడుదల చేయడం ఆనందంగా వుంది. ఈ సినిమాతో లావణ్యకు మంచి పేరొస్తుంది. ఫిబ్రవరి 9న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేస్తున్నాం' అన్నారు. ఈ కార్యక్రమంలో లావణ్య త్రిపాఠి, సి.వి.రావు తదితరులు పాల్గొన్నారు.

ఓపికతో ఎదురు చూశాను!

వయసు గురించి తాను అస్సలు పట్టించుకోనని, తన దృష్టిలో అదొక నంబర్ మాత్రమేనని చెప్పింది చెన్నై సొగసరి శృతిహాసన్. అమెరికాలోని లాస్‌ఏంజిలస్‌లో తన 32వ జన్మదిన వేడుకల్ని జరుపుకుంది. కొందరు సన్నిహితులు, శ్రేయోభిలాషుల సమక్షంలో ఆనందంగా గడిపానని శృతిహాసన్ పేర్కొంది. ఈ సందర్భంగా తన కెరీర్‌కు సంబంధించిన పలు ఆసక్తికరమైన విషయాల్ని వెల్లడించింది. 'కెరీర్ ఆరంభంలో వరుస అపజయాలు పలకరించాయి. ఒకానొక దశలో సినిమాల్లో కొనసాగడం కష్టమనుకున్నాను. అయితే నా ప్రయత్నాల్ని ఏమాత్రం విరమించకుండా ఓపికతో విజయం కోసం ఎదురుచూశాను. ఇప్పుడు కెరీర్ విషయంలో చాలా ఆనందంగా ఉన్నాను. సక్సెస్‌కు ఓర్పు చాలా ప్రధానమనే విషయం నాకు అవగతమైంది. వృత్తిపరమైన, వ్యక్తిగత విషయాల్ని సమన్వయం చేసుకుంటూ కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటున్నాను' అని తెలిపింది. నటనతో పాటు సంగీతం అంటే తనకు ప్రాణమని..ఈ ఏడాది మ్యూజిక్ ఆల్బమ్ చేసే ఆలోచనతో వున్నానని చెప్పింది. ప్రస్తుతం శృతిహాసన్ తన తండ్రి కమల్‌హాసన్ నటిస్తున్న 'శభాష్‌నాయుడు' చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నది.


శృతిహాసన్

32 భాషల్లో కర్ణ


విక్రమ్

ప్రస్తుతం పురాణ గాథలపై దక్షిణాది చిత్ర వర్గాలు ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. రామాయణం, మహాభారతంతో పాటు పలు పురాణ కథల్ని వెండితెరపై ఆవిష్కరించే ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా కర్ణుడి పాత్ర ఆధారంగా విక్రమ్ కథానాయకుడిగా ఓ సినిమా రూపొందనున్నది. 'కర్ణ' పేరుతో తెరకెక్కనున్న ఈ చిత్రానికి మలయాళ చిత్రసీమకు చెందిన ఆర్.ఎస్. విమల్ దర్శకత్వం వహించనున్నారు. దాదాపు మూడు వందల కోట్ల వ్యయంతో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని తమిళం, హిందీతో పాటు 32 భాషల్లో విడుదల చేయనున్నారు. రెండు భాషల్లో ఏకకాలంలో తెరకెక్కించే ఈ సినిమాను మిగతా భారతీయ, విదేశీ భాషల్లో అనువాద రూపంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఏడాది అక్టోబర్‌లో సినిమా చిత్రీకరణ ప్రారంభంకానున్నది. వచ్చే ఏడాది డిసెంబర్‌లో విడుదలచేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది.

నారా రోహిత్ కొత్త చిత్రం



వైవిధ్యమైన చిత్రాలతో నటుడిగా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ను సృష్టించుకున్న నారా రోహిత్ తాజాగా ఓ కొత్త చిత్రానికి అంగీకారం తెలిపారు. ఈ.ఎం.వి.ఈ స్టూడియోస్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. ఈ సినిమా ద్వారా ఎస్.డి.చక్రవర్తి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. గ్రామీణ నేపథ్య కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కనుంది. నారా రోహిత్ పాత్ర చిత్రణ, గెటప్ వైవిధ్యంగా వుంటుందని..మార్చిలో రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుందని చిత్ర బృందం వెల్లడించింది. ఈ సినిమాకు సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో తెలియజేస్తారు. ఈ చిత్రానికి సంగీతం: సాయికార్తీక్, సమర్పణ: వడ్డేపల్లి సత్యనారాయణ, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: ఎస్.డి.చక్రవర్తి, నిర్మాణం: ఈ.ఎం.వి.ఈ. స్టూడియోస్.

కథే హీరో...


కొవెర, హిమాన్సి

కొవెరా క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం 'యు. కథే హీరో'. కొవెర, హిమాన్సి జంటగా నటిస్తున్నారు. ఈ చిత్ర మోషన్ పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు సుకుమార్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 'ఈ సినిమా లైన్ వినగానే ఆసక్తికరంగా అనిపించింది. మోషన్ పోస్టర్‌ను కూడా కథానుగుణంగా వినూత్నంగా తీర్చిదిద్దారు' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'సుకుమార్ చేతుల మీదుగా మోషన్‌పోస్టర్‌ను లాంచ్ చేయడం ఆనందంగా వుంది. నేను విజయేంద్రప్రసాద్ దగ్గర పనిచేశాను. కొన్ని సినిమాలకు రచయితగా కూడా పనిచేశాను. అందరిని ఆకట్టుకునే వినూత్న కథా చిత్రమిది. కథ చాలా కొత్తగా వుంటుంది..అందుకే 'కథే హీరో' అనే క్యాప్షన్ పెట్టాం. త్వరలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం' అన్నారు. తనికెళ్ల భరణి, శుభలేఖ, సుధాకర్ తదితరులు కీలక పాత్రల్ని పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రాకేష్‌గౌడ్, సంగీతం: సత్య మహావీర్, స్క్రీన్‌ప్లే: మధు విప్పర్తి, కొవెర, మాటలు: మహి, ఇల్లింద్ర, కరుణ్ వెంకట్, నిర్మాతలు: విజయలక్ష్మి కొండా, రచన, దర్శకత్వం: కొవెర.

భవంతిలో దయ్యం


కౌండిన్య, సంధ్య

అజయ్ కౌండిన్య ప్రధాన పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఎన్ హెచ్ 47లో బూత్ బంగ్లా'. అంజనేయులు కొమ్మగోని, రాసం బట్టి అరుణాచలం గౌడ్ నిర్మాతలు. సంధ్య, అనూష కథానాయికలు. ఈ చిత్ర గీతాలు ఇటీవల హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. అజయ్ కౌండిన్య మాట్లాడుతూ 'హారర్, థ్రిల్లర్ చిత్రమిది. భవంతి నేపథ్యంలో సాగుతుంది. అందులో అడుగుపెట్టిన కొందరు యువతీయువకులకు ఎలాంటి అనూహ్య పరిణామాలు ఎదురయ్యాయి? క్లిష్ట పరిస్థితులను నుంచి వారు ఏ విధంగా బయటపడ్డారన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. తప్పకుండా తెలుగు ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే నమ్మకముంది' అన్నారు.

పెద్దారెడ్డి వినోదాలు


సతీష్‌రెడ్డి, మౌర్యాని

సతీష్‌రెడ్డి, మౌర్యాని, ముంతాజ్ నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'నెల్లూరి పెద్దారెడ్డి'. వీజే రెడ్డి దర్శకుడు. సీ హెచ్ రాఘునాథరెడ్డి నిర్మాత. గురురాజ్ సంగీతాన్ని అందించిన ఈ చిత్ర గీతాలు ఇటీవల హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. సీనియర్ దర్శకులు సాగర్, రేలంగి నరసింహారావు ఆడియో సీడీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో సాగే చిత్రమిది. నెల్లూరు నుంచి ఖమ్మంలోని సీతారాంపురం అనే గ్రామానికి వలస వచ్చిన పెద్దారెడ్డి అనే వ్యక్తి కథే ఈ చిత్ర ఇతివృత్తం. . ఊరంతా గౌరవించే అతడి జీవితం ఓ అమ్మాయి కారణంగా ఎలాంటి మలుపులు తిరిగిందనేది ఆసక్తికరంగా ఉంటుంది. వినోదం, భావోద్వేగాలతో ఆద్యంతం ఆహ్లాదభరితంగా సాగుతుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు తుది దశకు చేరుకున్నాయి. సెన్సార్ పనులను పూర్తిచేసి ఫిబ్రవరిలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు. ప్రస్తుతం ప్రేక్షకులు వినోదాన్నే కోరుకుంటున్నారని, వారు ఆశించే హాస్యంతో కూడిన మంచి సినిమా ఇదని రేలంగి నరసింహారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్‌రెడ్డి, సాయివెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బంగారి బాలరాజు లవ్‌స్టోరీ!


కోటేంద్ర, సురేందర్‌రెడ్డి, రఫీ

రాఘవ్, కరాణ్య కత్రీన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'బంగారి బాలరాజు'. కోటేంద్ర దుద్యాల దర్శకుడు. కె.ఎండి.రఫీ, రెడ్డం రాఘవేంద్రరెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్ర గ్లిట్టర్‌ను ఇటీవల దర్శకుడు సురేందర్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ''బంగారి బాలరాజు' చిత్ర టీజర్ చూశాను. చాలా బాగుంది. సరికొత్త నేపథ్యంలో రూపొందిస్తున్న ఈ సినిమా దర్శకనిర్మాతలతో పాటు చిత్ర బృందానికి మంచి విజయాన్ని అందించాలని కోరుకుంటున్నాను' అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'సురేందర్‌రెడ్డి వంటి దర్శకుడు మా చిత్ర టీజర్‌ను విడుదల చేయడం ఆనందంగా వుంది. ఓ ప్రేమ జంట నేపథ్యంలో సాగే అందమైన ప్రేమకథా చిత్రమిది. కథ, కథనం కొత్తగా వుంటాయి. యువతరానికి నచ్చే అంశాలన్నీ వున్న చిత్రమిది. తప్పకుండా ఆకట్టుకుంటుందనే నమ్మకం వుంది' అన్నారు. ప్రేమికుల రోజైన ఫిబ్రవరి 14న ఈ చిత్ర ట్రైలర్‌ను, మార్చిలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని సన్నాహాలు చేస్తున్నాం. కొత్త పంథాలో సాగే ప్రేమకథా చిత్రమిది' అని దర్శకుడు తెలిపారు.

పారితోషికం ఎక్కువే...

'పద్మావత్' చిత్రంలో పద్మావతి పాత్రలో అసమాన అభినయంతో ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నది బాలీవుడ్ సొగసరి దీపికా పదుకునే. వివాదాల నడుమ విడుదలైన ఈ చిత్రం మంచి వసూళ్లను సాధిస్తున్నది. ముఖ్యంగా దీపికా పదుకునే, రణవీర్‌సింగ్‌ల అభినయానికి ప్రశంసలు లభిస్తున్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన అంశాన్ని వెల్లడించింది దీపికా పదుకునే. ఓ టీవీ షోలో పాల్గొన్న ఆమె ఈ సినిమా కోసం రణవీర్‌సింగ్, షాహిద్‌కపూర్‌ల కంటే తానే ఎక్కువ పారితోషికాన్ని తీసుకున్నట్లు వెల్లడించింది. అయితే ఎంత మొత్తం పారితోషికాన్ని స్వీకరించిందనేది చెప్పడానికి నిరాకరించింది. 'పద్మావత్' విజయాన్ని వర్ణించడానికి మాటలు కూడా రావడంలేదని, సినిమాలో నటించినందుకు గర్వపడుతున్నానని పేర్కొన్నది. సంజయ్‌లీలా భన్సాలీ తెరకెక్కించిన ఈ చిత్రం త్వరలో వందకోట్ల మైలురాయిని దాటనుంది. ప్రస్తుతం 83కోట్ల వసూళ్లను సాధించింది.



దీపికా పదుకునే

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
కుమ్రంభీం ఆసిఫాబాద్	34.7	6.2
ఆదిలాబాద్	35.0	8.8
మంచిర్యాల	34.6	9.1
నిర్మల్	33.6	9.6
కామారెడ్డి	33.6	9.7
జయశంకర్ భూపాలపల్లి	35.1	10.0
నిజామాబాద్	36.0	10.2
జగిత్యాల	34.6	10.3
రాజన్న సిరిసిల్ల	34.9	10.4
పెద్దపల్లి	34.8	10.8
మేడ్చల్	34.6	10.9
మహబూబాబాద్	35.5	11.1
సిద్దిపేట	33.4	11.2
కరీంనగర్	35.3	11.7
సంగారెడ్డి	34.6	11.9
మహబూబ్‌నగర్	34.6	11.9
మెదక్	34.6	12.5
వికారాబాద్	35.0	12.6
జనగామ	35.7	12.7
రంగారెడ్డి	34.6	12.8
భద్రాద్రి కొత్తగూడెం	35.1	12.8
వరంగల్ అర్బన్	33.7	12.9
వరంగల్ రూరల్	35.0	13.1
యాదాద్రి భువనగిరి	34.6	13.2
నాగర్‌కర్నూల్	34.8	13.3
నల్లగొండ	34.6	13.4
జోగుళాంబ గద్వాల	34.8	14.1
హైదరాబాద్	35.6	14.9
ఖమ్మం	35.1	15.2
వనపర్తి	34.4	15.6
సూర్యాపేట	34.6	16.5



పెరిగిన చలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతున్నది. చలిగాలుల కారణంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా అత్యల్పంగా కుమ్రం భీం ఆసిఫాబాద్‌లో 6.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు టీఎస్‌డీపీఎస్(తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ) అధికారులు తెలిపారు. ఆదిలాబాద్‌లో 8.8 డిగ్రీలు, మంచిర్యాలలో 9.1 డిగ్రీలు, కామారెడ్డిలో 9.7 డిగ్రీల చొప్పున కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి.. సదనంలో రాత్రి నిద్ర

చంపాపేట: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. సమస్యలను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. వసతి గృహాల్లో రాత్రి నిద్రలో భాగంగా ఆయన ఆదివారం చంపాపేట దివ్యాంగుల బాలికల వసతిగృహానికి చేరుకొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం చంపాపేట రెడ్డికాలనీలో ఉన్న బాలుర దివ్యాంగుల సదనంలో 'నిద్ర' కార్యక్రమం చేపట్టారు. చైర్మన్‌గా తాను బాధ్యతలు చేపట్టాక దివ్యాంగుల సంక్షేమానికి రూ.33 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో దివ్యాంగుల సదనాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని ఆరోపించారు. చంపాపేట బాలికల వసతిగృహం విద్యార్థినులు సమస్యలపై వాసుదేవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎస్ సదన్ కార్పొరేటర్ సామ స్వప్న సుందర్‌రెడ్డి, ఏడీ మల్లారెడ్డి, తెలంగాణ వికలాంగుల జాగృతి సంస్థ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు నారా నాగేశ్వరరావు, అందె రాంబాబు, సుధాకర్‌వర్మ, రాంచందర్, సామాజికసేవా సంస్థ నిర్వాహకుడు గురుమూర్తి పాల్గొన్నారు.



హైదరాబాద్ చంపాపేట రెడ్డికాలనీలో ఉన్న బాలుర దివ్యాంగుల సదనంలో నిద్రిస్తున్న దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి తదితరులు

బెజవాడలో భారీ భూస్కాం

రూ.40 కోట్ల విలువైన భూమి కబ్జా
టీడీపీ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు భార్య సుజాతపై కేసు

హైదరాబాద్/ అమరావతి, నమస్తే తెలంగాణ: ఏపీలోని విజయవాడలో రూ.40 కోట్ల విలువైన స్వాతంత్ర్య సమరయోధుల భూమిని కబ్జా చేశారు. టీడీపీ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు అనుచరులు తప్పుడు పత్రాలతో తనఖా చేయించుకున్నారని ఆరోపిస్తూ బాధితులు సీఐడీని ఆశ్రయించారు. దీంతో బోండా ఉమ భార్య సుజాతతోపాటు ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. స్వాతంత్ర్య సమరయోధులకు చెందిన సుమారు రూ.40 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని కబ్జా చేసేందుకు టీడీపీ ఎమ్మెల్యే కుటుంబం యత్నించింది. ఆ భూమికి నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు తయారుచేయించి రామిరెడ్డి కోటేశ్వరరావు అనేవ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు ఆధారాలు సృష్టించింది. కోటేశ్వరరావును రిజిస్ట్రేషన్ కార్యాలయానికి తీసుకెళ్లి మరీ సంతకాలు చేయించింది. కబ్జా విషయం తెలిసిన వెంటనే సమరయోధుల కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించారు. ఈ కేసును సీఐడీ దర్యాప్తు చేయగా విచారణలో ఎమ్మెల్యే భూదందా బట్టబయలైంది. దీంతో కొనుగోలుదారైన బోండా సుజాతపై కేసు నమోదైంది. సీఐడీ దర్యాప్తులో భూ కబ్జా గుట్టురట్టు కావడంతో భూవిక్రేతగా వ్యవహరించిన కోటేశ్వరరావు ఇరకాటంలో పడ్డాడు. సీఐడీ అధికారుల సోదాలతో బెదిరిపోయిన ఆయన టీడీపీ నాయకుల నుంచి ప్రాణరక్షణ కల్పించాలంటూ విజయవాడ పోలీసు కమిషనర్‌ను ఆశ్రయించాడు. ఐదు లక్షల అప్పుకోసం కార్పొరేటర్ గండూరి మహేశ్ (బోండా అనుచరుడు) దగ్గరకి వెళ్లానని, అందుకోసం కొన్ని కాగితాలపై సంతకాలు చేయించారని, తీరా సీఐడీ పోలీసులు తమ ఇంట్లో సోదాలు చేసేదాకా భూ వ్యవహారం గురించి తనకు తెలియదన్నారు. గతంలో విజయవాడలో ఓ భూ ఆక్రమణ వ్యవహారంలో కూడా బోండా ఉమ ఆరోపణలు ఎదుర్కొన్నారు. తాజాగా మరో వ్యవహారంలో ఆయన భార్యపై కేసు నమోదు కావడం విశేషం.



టీడీపీ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, సతీమణి బోండా సుజాత

అగ్రిమెంట్ రద్దు చేసుకున్నాం: బోండా ఉమ

విజయవాడ భూ వివాదంపై ఎమ్మెల్యే బోండా ఉమ స్పందించారు. రవితేజ బయోపిక్ కంపెనీ డైరెక్టర్ బోండా సుజాత పేరిట 2017లో అగ్రిమెంట్ చేసుకుంది వాస్తవమేనని అంగీకరించారు. దీనిపై సివిల్ వివాదం ఉండటంతో రిజిస్టర్ డాక్యుమెంట్ ద్వారా అగ్రిమెంట్ రద్దు చేసుకున్నామన్నారు. గతంలో దీనిపై సీఐడీకి ఫిర్యాదు చేశామన్నారు. కొందరు రాజకీయ లబ్ధి కోసమే వివాదం చేస్తున్నారని బోండా తెలిపారు.

సీపీఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం అండ

- రిటైరైన ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లింపునకు సుముఖత
- మరణించిన ఉద్యోగులకు డెత్ కమ్ రిటైర్మెంట్ గ్రాట్యుటీ
- చెల్లించాల్సిన మొత్తం రూ.14 కోట్లు
- రాష్ట్రప్రభుత్వం సానుకూలంగా ఉన్నదన్న ఉద్యోగ సంఘాల జేఏసీ
- జాతీయస్థాయిలో కొట్లాడుతామంటున్న పాత పెన్షన్ స్కీం ఉద్యమ నేతలు

హైదరాబాద్, నమస్తేతెలంగాణ:

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) ఉద్యోగుల సుదీర్ఘపోరాటానికి ఫలితం దక్కనున్నది. 2004 నుంచి పాత పెన్షన్ విధానం కోసం పోరాడుతున్న ఉద్యోగులకు చేయూతనివ్వటానికి ప్రభుత్వం తన వంతు భారాన్ని మోసేందుకు సిద్ధపడుతున్నది. వారి సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తున్నట్టు సమాచారం. 2004 సెప్టెంబర్ 1 నుంచి అమలైన సీపీఎస్ విధానంలో భాగస్వాములైన 998 రిటైరైన ఉద్యోగులకు, మరణించిన 263 మంది ఉద్యోగుల కుటుంబాలకు గ్రాట్యుటీ, డెత్ కమ్ రిటైర్మెంట్ గ్రాట్యుటీని చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్టు తెలుస్తున్నది. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యే వీ శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి.. ఇప్పటికే పలుదఫాలు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపారు. సీపీఎస్ విధానం రద్దును కోరుతూ, అసెంబ్లీ, మండలిలో తీర్మానం చేయాలని విజ్ఞాపనచేశారు. రిటైర్ అయిన ఉద్యోగుల పట్ల సానుభూతితో వ్యవహరించి వారికి రావలసిన ఆర్థిక ప్రయోజనాలను కల్పించడానికి ప్రభుత్వం సన్నద్ధమైంది. ఇందుకోసం రూ.14 కోట్ల మేర భారం భరించడానికి సిద్ధంగా ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లక్షా 26వేలమంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో 58 శాతం మంది ఉపాధ్యాయులు, 42 శాతం మినిస్టీరియల్ ఉద్యోగులున్నారు. సీపీఎస్‌లో గ్రూప్-1 అధికారుల నుంచి జూనియర్ అసిస్టెంట్ స్థాయివరకు ఉద్యోగులు ఉన్నారు.

పాత పెన్షన్‌కు వీరంతా అర్హులే..

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు, రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్-11, ఆర్టికల్-14 ప్రకారం ఈ ఉద్యోగులు పాతపెన్షన్ విధానానికి అర్హులవుతారని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. కేంద్రం రూపొందించిన చట్టం ప్రకారం నూతన పెన్షన్ విధానం అమలులోకి వచ్చినప్పటికీ కేరళ, త్రిపురలో దీన్ని అమలు చేయడం లేదు. రిటైరయ్యే ఉద్యోగులకు ఆ రెండు రాష్ట్రాల్లో పూర్తిస్థాయిలో గ్రాట్యుటీ చెల్లిస్తున్నారు. తెలంగాణ పరిధిలోని లక్షా 26వేల మంది ఉద్యోగులకు పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్డీఏ)-2013 నిబంధనల ప్రకారం, ఉద్యోగుల మూలవేతనం, డీఏ నుంచి పదిశాతం తీసుకొని, దానికి రాష్ట్రప్రభుత్వం వాటా పదిశాతం కలిపి ప్రతీ ఉద్యోగి పేరిట నేషనల్ పెన్షన్ ట్రస్ట్ (ఎన్పీటీ)లో జమచేస్తున్నది. ఈ నిధులు నేషనల్ సెక్యూరిటీ డిపాజిట్ లిమిటెడ్ (ఎన్నెస్‌డీఎల్) ద్వారా షేర్‌మార్కెట్‌లోకి వెళ్తున్నాయి. ఎస్బీఐ, యూటీఎఫ్, ఎల్ఐసీ వంటి సంస్థలు ఈ షేర్‌మార్కెట్ వ్యాపారాన్ని చేస్తున్నాయి. ఇవి ఒడిదొడుకులకు లోనైతే తమ ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతింటాయని సీపీఎస్ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

ఆవేదనతోనే ఉద్యమాలు

ఉద్యోగుల భవిష్యత్తు ఆందోళనకరంగా మారడం, మరణించిన ఉద్యోగికి కూడా సకాలంలో ఆర్థిక ప్రయోజనాలు అందడంలేదనే ఆవేదనతోనే జాతీయస్థాయిలో ఉద్యమాలకు సిద్ధమయ్యామని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం చైర్మన్ స్థితప్రజ్ఞ పేర్కొన్నారు.. మార్చి 4న హైదరాబాద్‌లో జనజాతర నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో పాతపెన్షన్ విధానాన్ని అమలులోకి తెస్తామని హామీ ఇచ్చే పార్టీలకే మద్దతు తెలియజేస్తామని స్పష్టం చేశారు. నేషనల్ సెక్యూరిటీ డిపాజిట్ లిమిటెడ్‌లో ఉద్యోగులు, ప్రభుత్వాలు చెల్లించిన మొత్తాలు రూ. లక్ష కోట్లకు చేరుకున్నాయని, ఒక్క తెలంగాణ ప్రభుత్వం జమచేసిన మొత్తమే రూ. 9 వేల కోట్లకు చేరుకున్నదని తెలిపారు.

ఉద్యమం తీవ్రం చేస్తాం



నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలన్న డిమాండ్‌తో తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆందోళనలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఉద్యోగులతో కలిపి ఈ ఉద్యమాలను జాతీయ స్థాయి లో రెట్టింపు చేస్తాం, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని ప్రతి ఉద్యోగి సమస్య, తెలంగాణ ఉద్యోగ సంఘా ల జేఏసీ సమస్య. సీపీఎస్ ఉద్యోగుల ప్రయోజనాలు నెరవేర్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది.

\- కారం రవీందర్‌రెడ్డి, చైర్మన్ తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ

చెల్లింపులపై సానుకూలం



రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ ఉద్యోగుల పెన్షన్ చెల్లింపుల పట్ల సానుకూలంగా ఉన్నది. సీఎం కేసీఆర్ సమక్షంలో చర్చలు జరిగాయి. ఆయన దీన్ని ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మకు అప్పగించారు. రిటైరైన 998 ఉద్యోగులకు బెనిఫిట్స్ అందుతాయి. త్వరలో జీవోలు రానున్నాయి. చెల్లింపులు రూ.14 కోట్ల కన్నా ఎక్కువగా ఉండవని అంచనాలకు వచ్చాం.

\- గుండవరపు దేవీప్రసాద్, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్

ఆందోళన వద్దు



రాష్ట్ర ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తున్నది. నూతన పెన్షన్ స్కీంలోని ఉద్యోగులందరికీ పెన్షన్లు అందనున్నాయి. ఉద్యోగసంఘాల జేఏసీ సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి సమస్యలు వివరించాం. నూత న పెన్షన్ స్కీం ఉద్యోగులు ఆందోళన చెందవద్దు.

\- వీ శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే, టీజీవో వ్యవస్థాపక అధ్యక్షుడు

పచ్చబొట్టుంటే 'పని' పోతుంది!

- వైమానిక దళం నిర్ణయానికి ఢిల్లీ హైకోర్టు సమర్థన

న్యూఢిల్లీ, జనవరి 28: టాటూలు (పచ్చబొట్టు) వేయించుకునే అలవాటు ఉందా? అయితే వైమానిక దళంలో మీకు ఉద్యోగం లభించే అవకాశం లేదు. సిబ్బంది శాశ్వతంగా ఉండే పచ్చబొట్లు వేయించుకుంటే ఉద్యోగం నుంచి తొలగించాలని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (ఐఏఎఫ్) తీసుకున్న నిర్ణయాన్ని ఢిల్లీ హైకోర్టు సమర్థించింది. గిరిజనులు తమ సంప్రదాయం ప్రకారం వేయించుకునే కొన్నిరకాల పచ్చబొట్లకు ఎయిర్‌ఫోర్స్ మినహాయింపునిచ్చింది. సడలింపుల కిందికి రాకుండా.. ఎయిర్‌ఫోర్స్ ప్రకటనలో పేర్కొన్నట్లు ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నప్పుడు టాటూ ఫొటోను సదరు ఉద్యోగి సమర్పించలేకపోతే ఉద్యోగం నుంచి తొలగించవచ్చని హైకోర్టు స్పష్టంచేసింది. పచ్చబొట్టు ఉన్నదని ఉద్యోగం నుంచి తొలగించడాన్ని సవాల్ చేస్తూ ఓ ఉద్యోగి కోర్టును ఆశ్రయించారు. పచ్చబొట్టు ఉన్నట్టు ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించానని వాదించాడు. ఎయిర్‌ఫోర్స్ ప్రకటన ప్రకారం పిటిషనర్‌కు సడలింపులు వర్తించనందున నియామకాన్ని రద్దుచేయడంలో తప్పులేదని ధర్మాసనం పేర్కొన్నది.

సహకారశాఖ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడిగా నాగేశ్వర్‌రావు



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: తెలంగాణ సహకారశాఖ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడిగా జీ నాగేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యవర్గ ఎన్నికల్లో అధ్యక్ష ప్రధాన కార్యదర్శి, కార్యవర్గసభ్యులుసహా అన్నిపోస్టులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్ష పదవికి నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్‌రెడ్డి పోటీపడ్డారు. ఎన్నికల అధికారిగా ఆర్ శేషాంజన్ వ్యవహరించారు. ఎన్నికల్లో వెంకట్‌రెడ్డిపై నాగేశ్వర్‌రావు నాలుగు ఓట్ల తేడాతో గెలుపొందారు. చోళ ఓంప్రకాశ్‌తోపాటు ఇతర గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు నాగేశ్వర్‌రావును అభినందించారు.

దివ్యాంగుల పింఛన్‌ను రూ.5వేలకు పెంచాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దివ్యాంగుల భృతిని రూ.1500 నుంచి రూ.5000కు పెంచాలని అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. రాష్ట్రంలో దివ్యాంగుల జనాభా 11 లక్షలు ఉందని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమశాఖను ప్రత్యేకశాఖగా ఏర్పాటుచేసి, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రతి దివ్యాంగుడికి రూ.5లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. దివ్యాంగుల సమస్యలపై ఫిబ్రవరి ఒకటిన హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు.

జైళ్లశాఖలో పదోన్నతి, బదిలీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జైళ్లశాఖలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కే అర్జున్‌రావుకు సూపరింటెండెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ హోంశాఖ ఉత్తర్వులు జారీచేసింది. చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌గా అర్జున్‌రావుకు పోస్టింగ్ ఇచ్చారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎన్ మురళీబాబును వరంగల్ కేంద్ర కారాగారానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

గిరిజన నేతపై మావోయిస్టుల కాల్పులు అమానుషం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భద్రాద్రి- కొత్తగూడెం జిల్లా పినపాక మండలం సుందరయ్యనగర్‌కు చెందిన గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మడావి రమేశ్‌ను శుక్రవారం రాత్రి మావోయిస్టులు కాల్చిచంపడాన్ని ఖండిస్తున్నట్టు గిరిజన విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూక్యా చందునాయక్, శోభన్‌నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాల్పులను సమర్థించుకోవడానికి పోలీస్ ఇన్ఫార్మర్ ముద్రవేస్తున్నారని ఆరోపించారు.

విత్తన నిల్వకు నెదర్లాండ్ సహకారం

- వ్యవసాయ కార్యదర్శి పార్థసారథితో నెదర్లాండ్ ప్రతినిధి బృందం భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విత్తననాణ్యత, ఆహారధాన్యాల పరిరక్షణకు నెదర్లాండ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోనున్నట్టు వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథి పేర్కొన్నారు. ఆదివారం నెదర్లాండ్ ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని విత్తన-సేంద్రియ ధ్రువీకరణ సంస్థను సందర్శించింది. అనంతరం వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారథితో భేటీ అయ్యింది. ఈ సందర్భంగా అఫ్లోటోక్సిన్ రహిత విత్తన నిల్వలపై సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలని నెదర్లాండ్ ప్రతినిధి బృందాన్ని పార్థసారథి కోరగా వారు అంగీకరించారు. అఫ్లోటోక్సిన్ రహిత వేరుశనగ విత్తనాలను ఉత్పత్తి చేసేందుకు వనపర్తిలో ప్రయోగశాలను ఏర్పాటు చేస్తున్నట్టు పార్థసారథి తెలిపారు. విత్తననాణ్యత, ఆహారధాన్యాల పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని నిర్ణయించామని నెదర్లాండ్ ప్రతినిధి బృందం ప్రతినిధి చెరిల్ హ్యారిసన్ తెలిపారు. విత్తన, ఆహార ధాన్యాల నిల్వపై నెదర్లాండ్ ప్రతినిధి బృందం రాష్ట్రానికి ప్రయోగాత్మకంగా సాంకేతిక సహకారాన్ని అందించనున్నది. ఈ పరిజ్ఞానంతో విత్తనం నాణ్యతను కాపాడుకోవడంతోపాటు ఆహారగింజల్లో ఆస్పిన్‌జిల్లస్ అనే శిలీంధ్రాన్ని ఉత్పత్తి చేసే అఫ్లోటోక్సిన్ అనే రసాయనాన్ని నిర్మూలించవచ్చన్నారు. పండించిన విత్తనంలోని నాణ్యతను కాపాడుకోవాలన్నారు. వివిధ దేశాల్లో విత్తన నిల్వ, నాణ్యత పరిరక్షణ పరిశోధనల గురించి డాక్టర్ కే కేశవులు వివరించారు. కార్యక్రమంలో విల్లియమ్. ఎస్ పెరెల్, ఎస్‌ఆర్‌ఎన్ రెడ్డి, విత్తన ధ్రువీకరణ సంస్థ అధికారులు జీ సుదర్శన్, డిప్యూటీ డైరెక్టర్ ప్రదీప్, అంతుల్ పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని విత్తన-సేంద్రియ ధ్రువీకరణ సంస్థలో నెదర్లాండ్ ప్రతినిధి బృందం సభ్యులకు జ్ఞాపికలు అందజేస్తున్న వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి



మల్లన్నకు లష్కర్‌వారం శోభ

చేర్యాల, నమస్తే తెలంగాణ : సిద్దిపేట జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి శ్రీ మల్లికార్జునస్వామి వారి ఆలయానికి లష్కర్‌వారం సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల్లో రెండో వారమైన లష్కర్‌వారానికి రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారి దర్శనం కోసం భారీగా భక్తులు తరలిరావడంతో మల్లన్న ఆలయం కిక్కిరిసింది. శనివారం సాయంత్రం నుంచే భక్తులు కొమురవెల్లి క్షేత్రానికి చేరుకున్నారు. ఆదివారం వేకువజామున కోనేటిలో పవిత్ర స్నానం ఆచరించి నేరుగా స్వామి వారి దర్శనం చేసుకున్నారు. పట్నాలు వేసి, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎం రామకృష్ణారావు, పునరుద్ధరణ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు పాల్గొన్నారు.

పంటల రుణ పరిమితి ఖరారు

2018-19 సీజన్‌కు బ్యాంకు రుణాలపై నిర్ణయం

- వరి, పత్తి, విత్తనోత్పత్తికి రుణ అవకాశం
- రుణ పరిమితిపై నిర్ణయాలు తీసుకొన్న రాష్ట్ర సాంకేతిక కమిటీ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ ఏడాది వానకాలం, యాసంగి పంటల సీజన్‌కు రుణ పరిమితిని రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ (ఎస్సెల్టీసీ) ఖరారుచేసింది. నిరుడు 81 పంటలకు రుణ పరిమితిని నిర్ణయించగా.. ఈ ఏడాది (2018-19) 101 రకాల పంటలకు ఎస్సెల్టీసీ రుణ పరిమితిని వర్తింపజేయనున్నది. వరి, వరి విత్తనోత్పత్తి.. పత్తి, పత్తి విత్తనోత్పత్తికి రుణ పరిమితిని పెంచింది. కూరగాయలు, పండ్లతోటలు, విత్తనోత్పత్తి పంటలకు , పప్పు పంటల సాగుకు రుణ పరిమితి అధికంగా పెరిగింది. విత్తులు లేని ద్రాక్షల సాగుకు రూ.1.20 లక్షల నుంచి రూ.1.25 లక్షల మధ్య రుణం ఇస్తారు. పత్తి విత్తనోత్పత్తి చేసేవారికి ఎకరానికి రూ.94 వేల నుంచి రూ.1.26 లక్షల మధ్య ఉండగా, వరి విత్తనోత్పత్తికి రూ.40 వేల నుంచి రూ.42 వేల మధ్య రుణం లభిస్తుంది. మల్బరీ, పసుపు, టమాట, అల్లం, వెల్లుల్లి, ఉల్లిగడ్డ, క్యారెట్, పుచ్చ సాగుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఎక్కువగా పెంచారు. విత్తనోత్పత్తిని ప్రోత్సహించడంకోసం వచ్చే సీజన్ నుంచి పత్తి, వరి విత్తనోత్పత్తిచేసే రైతులకు కూడా బ్యాంకులు పంట రుణం ఇవ్వాల్సి ఉంటుంది. రానున్న వ్యవసాయ సీజన్ నుంచి పట్టణాల్లో మిద్దె తోటలను సాగుచేసేవారికి బ్యాంకులు పంట రుణం ఇవ్వనున్నాయి. సేంద్రియ కూరగాయల సాగుతోపాటు ఔషధ పంటలకు రుణం పొందే అవకాశం ఉన్నది. సేంద్రియ కూరగాయలకు రూ.37 వేల నుంచి రూ.40 వేల రుణం ఇస్తారు. అర్బన్ హార్టికల్చర్, మిద్దె తోటలను 750 చదరపు అడుగుల విస్తీర్ణంలో సాగుచేసేవారికి మూడుదశల్లో రుణం ఇచ్చేలా పరిమితిని నిర్ణయించారు. మొదట రూ.9 వేల- రూ.10 వేల మధ్య, రెండోదశలో రూ.18 వేల నుంచి రూ.20 వేల మధ్య, మూడోసారి రూ.27 వేల నుంచి రూ.30 వేల వరకు రుణం ఇచ్చేలా నిర్దేశించారు. రానున్న సీజన్‌లో ఔషధ మొక్కలైన అశ్వగంధ, నీలవేణు, కలబంద, తులసి వంటి సాగుకు బ్యాంకులు రుణం ఇవ్వాల్సి ఉంటుంది. వరి, జొన్న, మొక్కజొన్న, కందులు వంటి పంటలకు గత ఏడాదితో చూస్తే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కొంత పెరిగింది. శనగల సాగుకు సాగునీటి వనరులు లేని ప్రాంతాల్లోనే రూ.16 వేల నుంచి రూ.18 వేల మధ్య నిర్ణయించారు. ఆయిల్ పామ్ సాగు పెంచేందుకు రూ.32 వేల నుంచి రూ.35 వేల మధ్య రుణం లభిస్తుంది. ప్రస్తుతం రూ.30 వేల నుంచి రూ.32 వేల మధ్య ఉంది. పత్తికి కూడా రానున్న సీజన్‌కు రూ.30 వేల నుంచి రూ.35 వేల మధ్య, సోయాబీన్‌కు రూ.16 వేల నుంచి రూ.18 వేల మధ్యన రుణపరిమితిని నిర్ణయించారు.

రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ వివిధ పంటలకు నిర్ణయించిన రుణ పరిమితి వివరాలు (2018-19 వానకాలం, యాసంగి సీజన్లకు)

పంట రకం	రుణపరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్)	
వరి	రూ.30,000	- రూ.40, 000
వరి విత్తనోత్పత్తి	రూ.40,000	- రూ.42,000
పత్తి	రూ.30,000	- రూ.35,000
పత్తి విత్తనోత్పత్తి	రూ.94 ,000	- రూ.1.26 లక్షలు
జొన్నలు	రూ.11,000	- రూ.18,000
మొక్కజొన్న	రూ. 25,000	- రూ.28,000
కందులు	రూ.15,000	- రూ.18,000
వేరుశనగ	రూ.21,000	- రూ.23,000
మల్బరీ	రూ.40,000	- రూ.50,000
టమాట	రూ.30,000	- రూ.35,000
అల్లం	రూ.55,000	- రూ.60,000
వెల్లుల్లి	రూ. 25,000	- రూ.28,000
మామిడి	రూ.30,000	- రూ. 35 ,000
సపోటా	రూ. 20,000	- రూ.25,000
స్వీట్‌ఆరెంజ్	రూ.40,000	- రూ. 45,000

మూడేండ్లుగా.. జాడలేదు

విద్య కోసం లండన్ వెళ్లిన విద్యార్థి అదృశ్యం.. ఆచూకీ లభించక కుటుంబీకుల ఆందోళన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉన్నతవిద్య కోసం లండన్ వెళ్లిన ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. మూడేండ్లుగా కొడుకు ఆచూకీ దొరుకకపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. విదేశాంగశాఖను కలిసి విన్నవించినా విద్యార్థి జాడ తెలియకపోవడంతో వారు తల్లడిల్లుతున్నారు. 2010లో ఉన్నతవిద్యనభ్యసించేందుకు లండన్ వెళ్లిన యువకుడు చివరిసారి 2015లో కుటుంబసభ్యులతో మాట్లాడాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లాలోని కాచారం గ్రామానికి చెందిన రాపర్తి వెంకటి, భూమక్క దంపతులకు ముగ్గురు సంతానం. వీరిలో చిన్నకుమారుడైన రమేశ్ 2009 వరకు హైదరాబాద్‌లో చదువుకొని.. ఉన్నత విద్య కోసం 2010 నవంబర్‌లో లండన్ వెళ్లి న్యూపోర్టులో ఉన్న వాలేస్‌యూనివర్సిటీలో ఎంబీఏలో చేరాడు. 2011 డిసెంబర్ నెలలో స్వదేశానికి రావల్సి ఉన్నది. కానీ ప్రాజెక్టు పూర్తి కాలేదు.. మరో ఏడాది లండన్‌లోనే ఉంటానని డబ్బులు పంపించాలంటూ కుటుంబసభ్యులను కోరాడు. దీంతో వారు రెండుసార్లు డబ్బులు పంపించారు. 2015లో జగిత్యాల జిల్లాలో దగ్గరి బంధువు చనిపోగా, ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి, రమేశ్‌ను జగిత్యాలకు రమ్మని కోరారు. ఆ తర్వాత రమేశ్ ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. దీంతో ఆందోళన చెందిన రమేశ్ కుటుంబసభ్యులు గత ఏడాది జూన్‌లో ఎంపీ వినోద్‌కుమార్‌ను కలిసి పరిస్థితి వివరించారు. ఆయన వారిని ఢిల్లీకి తీసుకెళ్లి.. విదేశాంగశాఖలో రమేశ్‌కు సంబంధించిన వివరాలు ఇచ్చి ఆచూకీ కనుక్కోవాలంటూ విజ్ఞప్తి చేశారు. రమేశ్‌కు సంబంధించిన వివరాలు లభించడంలేదని గత ఏడాది ఆగస్టు నెలలో విదేశాంగశాఖ సమాధానమిచ్చింది. దీంతో రమేశ్ కుటుంబసభ్యులు తీవ్రమనోవేదనకు గురయ్యారు. ఇటీవలే జగిత్యాలలో ఓ పోలీసు అధికారిని కలిసి, తమ గోడు వెళ్లబోసుకున్నారు. రమేశ్ ఫొటోను చూపిస్తూ తల్లిదండ్రులు వెంకటి, భూమక్క కంటతడి పెడుతున్నారు. తన తమ్ముడి ఆచూకీ తెలుపాలంటూ రమేశ్ సోదరుడు గణేశ్ కోరుతున్నారు.


లండన్‌లో అదృశ్యమైన రమేశ్(ఫైల్)

ఎన్నికల్లో డబ్బు ప్రభావం ఉండరాదు

- ప్రజాస్వామ్యానికి అవినీతి ప్రమాదకరం
- వారసత్వ రాజకీయాలు మంచివికావు
- ఏ రాజకీయ పార్టీతో అనుబంధం లేదు
- స్వేచ్ఛ పేరుతో ఇష్టం వచ్చినట్టు మాట్లాడకూడదు
- విజయవాడలో జస్టిస్ జాస్తి చలమేశ్వర్

హైదరాబాద్/ అమరావతి, నమస్తే తెలంగాణ: ఎన్నికల్లో డబ్బు కీలకాంశం కాకూడదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ పేర్కొన్నారు. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించడం మంచి పరిణామం కాదని తెలిపారు. దేశంలో అవినీతి పెరిగిపోయిన నేపథ్యంలో ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. ఒక రాజకీయవర్గానికి చెందిన వ్యక్తిగా తనపై సామాజికమాధ్యమాల్లో ప్రచారం చేయడం పట్ల ఆవేదన వ్యక్తంచేశారు. విజయవాడలో ఆదివారం జరిగిన కంఠమనేని రవీంద్రరావు స్మారక ఉపన్యాసానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయమూర్తిగా పదవి చేపట్టిన వెంటనే రాజకీయాలతో సంబంధాలు వదులుకున్నానని, పదవీ విరమణ అనంతరం ప్రభుత్వం దగ్గరికి వెళ్లి మరో పదవి కావాలని కోరబోనని స్పష్టం చేశారు. భావప్రకటనా స్వేచ్ఛ పేరుతో ఏం మాట్లాడినా చెల్లుబాటు అవుతుందనుకోవడం సరికాదని చెప్పిన ఆయన.. రాజ్యాంగంలోని రాజ్యాంగధర్మం, పౌరసమాజం అంశాలపై విస్తృతంగా మాట్లాడారు. 'జడ్జికి వ్యక్తిగత నమ్మకాలు, అభిమానాలు ఉండకూడదు. నేను ఒక రాజకీయపక్షానికి చెందినవాడిని కాబట్టి ముగ్గురు న్యాయమూర్తులతో కలిసి ప్రెస్‌మీట్ పెట్టానని నా మిత్రుడొకరు వాట్సప్ మెసేజ్ పంపారు. ఎవరి అభిప్రాయాలు వారివి. అయితే అవి కొంత హేతుబద్ధంగా ఉండాలి. జాతీయ జ్యుడీషియల్ నియామకాల కమిషన్‌కు సంబంధించి జడ్జిమెంట్లు, డిసెంటింగ్ జడ్జిమెంట్లు రాసినప్పుడు నేను ఏ పార్టీకి చెందినవాడినని ప్రచారం చేశారో ఆ పార్టీకి చెందినవాళ్లే నేను అధికారపార్టీకి చెందినవాడినని.. అందుకే వారికి అనుకూలంగా తీర్పు రాశానని ప్రచారం చేశారు. ఏదో ఓ కారణంతో నాది ఇంకో పక్షమంటున్నారు. ఆ పార్టీ కాదు.. ఈ పార్టీ కాదు.. నాకు ఏ రాజకీయ పార్టీతో అనుబంధముండేదో అందరికీ తెలుసు. జడ్జిని అయిన మరునాడే ఆ పార్టీతో అనుబంధాన్ని వదులుకున్నాను. జడ్జి పదవిలోకి వచ్చేటప్పుడే డిక్లరేషన్ ఇచ్చాను. నా గురించి మాట్లాడే వారిలో ఎంత మంది మహానుభావులు డిక్లరేషన్ ఇచ్చారో కనుక్కోండి' అని ఆయన కోరారు.


ఆదివారం విజయవాడలో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్

రైతులు 24 గంటల కరంటు వద్దంటున్నారు



- ఎంపీ వినోద్‌కుమార్

బోయినపల్లి: రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరాను రైతులు వద్దంటున్నారు.. ఇది సీఎం కేసీఆర్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కోరెంలో 33/11కేవీ విద్యుత్‌సబ్‌స్టేషన్ నిర్మాణం పనులను చొప్పదండి ఎమ్మెల్యే బొడిగ శోభతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా ఇస్తుంటే రైతులు వద్దంటున్నారని కరీంనగర్ జిల్లా పరిషత్ సమావేశంలో ప్రజాప్రతినిధులు చెప్పారని గుర్తుచేశారు. రైతుల సంక్షేమం కోసం టీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. తమది మాటలు చెప్పే ప్రభుత్వం కాదని, క్షేత్రస్థాయిలో పని చేస్తుందని స్పష్టంచేశారు.


వరంగల్ రూరల్ జిల్లా పరకాలలో మాట్లాడుతున్న ఆర్ నారాయణమూర్తి

కేసీఆర్ పాలన భేష్..!

- కోదండరాం సభలో సీఎంను ప్రశంసించిన ఆర్ నారాయణమూర్తి

పరకాల, నమస్తే తెలంగాణ: దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్ష మేరకు పాలన సాగుతున్నదని సినీనటుడు, నిర్మాత ఆర్ నారాయణమూర్తి అన్నారు. రాష్ట్రంలో ఎన్నో సంస్కరణలు చేపట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన భేష్. ఆయనకు నా సెల్యూట్ అంటూ రైతుల హర్షధ్వానాల మధ్య ప్రసంగించారు. వరంగల్ రూరల్ జిల్లా పరకాలలో తెలంగాణ రైతు జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం రైతు ప్రదర్శన, బహిరంగ సభ జరిగింది. జేఏసీ నాయకుడు రాజేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రొఫెసర్ కోదండరాం కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ నారాయణమూర్తి మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో ఎక్కడాలేనివిధంగా రాష్ట్రంలో కేసీఆర్ పాలన సాగిస్తున్నారన్నారు. రైతులకు, తెలంగాణ ప్రాంత ప్రజలకు 24 గంటల కరంటును అందించడం, రూ.4వేల చొప్పున ఎకరాకు పెట్టుబడి అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టడం, నీటి సద్వినియోగానికి ప్రాజెక్టులు, నిర్మాణాలు చేపట్టడాన్ని స్వాగతిస్తున్నానని చెప్పారు. రైతులకు గిట్టుబాటు ధరపై కేంద్రం దోబూచులాడుతుందని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలుచేయాలని డిమాండ్ చేశారు.


నిజామాబాద్‌లో మాట్లాడుతున్న సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి

కవిత్వంతో సామాజిక చైతన్యం

- తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి

నిజామాబాద్ అర్బన్/నమస్తే తెలంగాణ: కవిత్వం మనిషిని కరుణ వైపు నడిపిస్తుందని, కరుణ గుణం మానవత్వానికి ప్రతీక అని, సమాజాన్ని చైతన్య పరిచి ధార్మిక చైతన్యాన్ని కలిగించేవి సాహిత్య రచనలని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి తెలిపారు. నిజామాబాద్‌లోని నిఖిల్ సాయిహోటల్‌లో తేజ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామదాసి రాజారాం మహరాజు స్మారక సాహితీ పురస్కార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మనిషి మనసు నుంచి అహంకారం అనే పొరను తొలిగించుకోవాలని సిధారెడ్డి సూచించారు. ఆధ్యాత్మికవేత్తలు కవిత్వాన్ని గౌరవించి పురస్కారాలు అందజేయడం ఆహ్వానించదగ్గ పరిణామమని, కవిత్వం ఆధ్యాత్మికతలో అంతర్లీనంగా దాగి ఉంటుందన్నారు. అంతకుముందు 'నమస్తే తెలంగాణ' బోధన్ డివిజన్ విలేకరి సాగిరాజు బలరామరాజును నందిని సిధారెడ్డి సన్మానించారు. బోధన్ స్పెషల్ జ్యుడీషియల్ న్యాయవాది భరత్ భూషణ్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులను ఆదరించినవారే దైవత్వాన్ని అర్థం చేసుకోగలుగుతారని, సాహిత సేవ ఉత్తమసేవ అన్నారు. కార్యక్రమంలో తేజ ఆర్ట్స్ అధినేత పోరెడ్డి రంగయ్య, సామాజికవేత్త మూడ నాగభూషణం గుప్తా, తెరసం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఘనపురం దేవేందర్, నరాల సుధాకర్, నరసింహస్వామి, కాసర్ల నరేశ్, త్రివేణి, శారద, కలాగోపాల్ పాల్గొన్నారు. డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ, వేద పండితులు జనగామ చంద్రశేఖర్‌శర్మ, ఏనుగు నరసింహారెడ్డి, ద్యాసం సేనాధిపతి, వీపీ చందన్‌రావు, చరణ్, పాయల్ పురస్కారాలను అందుకున్నారు.

కేంద్రం పరిశీలనలో మేడారం జాతీయోత్సవ అంశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మేడారం జాతరను జాతీయ ఉత్సవంగా గుర్తించే అంశం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నదని కేంద్ర కార్మికశాఖ మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మేడారం జాతరకు కేంద్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి జువాల్ ఓరా, జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ నందకిశోర్, కొందరు కేంద్రమంత్రులు హాజరవుతారని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉన్నదని అన్నారు. ఓబీసీ కమిషన్ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందేందుకు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు జాతీయస్థాయిలో ఒత్తిడి తేవాలని, లేదంటే బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు వారికిఉండదని స్పష్టంచేశారు. రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ సరఫరాకు కేంద్రం రూ.5,658 కోట్లను విడుదల చేసిందని చెప్పారు. నల్లగొండలో బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యను ఖండిస్తున్నామని తెలిపారు.



సండే ఉచిత కాల్స్‌కు బీఎస్‌ఎన్‌ఎల్ గుడ్‌బై

కోల్‌కతా, జనవరి 28: ప్రభుత్వ రంగ టెలికం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్‌ఎన్‌ఎల్).. వచ్చే నెల 1 నుంచి ఉచిత సండే కాల్స్‌కు గుడ్‌బై చెప్పనున్నది. దేశవ్యాప్తంగా ఆదివారాల్లో ల్యాండ్‌లైన్ కస్టమర్లకు అందిస్తున్న ఉచిత వాయిస్ కాల్స్ సదుపాయాన్ని ఇక నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఫ్రీ నైట్ కాలింగ్ ప్రయోజనాలను ఆపేయాలన్న నిర్ణయంలో భాగంగానే ఈ మేరకు ప్రకటన వచ్చింది. కాగా, మరికొన్ని కొత్త ప్లాన్లను ఆలోచిస్తున్నామని కోల్‌కతా టెలిఫోన్స్ (కాల్‌టెల్) చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్పీ త్రిపాఠి పీటీఐకి తెలిపారు.

ముస్లింల విద్యాదీపం


నాంపల్లి ఎగ్జిబిషన్‌లో ఏర్పాటుచేసిన స్టాల్‌లో చిన్నారులకు మైనారిటీ గురుకులాలపై వివరిస్తున్న విద్యార్థిని

మొదటిపేజీ తరువాయి...

తమ పిల్లలను గురుకులాల్లో చేర్పించేలా తల్లిదండ్రులు, బంధువుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు వీలున్న అన్ని ప్రయత్నాలు చేస్తున్నది. ముస్లిం మతపెద్దలతో మసీదులలో, రాజకీయ నేతల ద్వారా బహిరంగసభల్లో, స్వచ్ఛంద సంస్థలతో చైతన్యం తీసుకొస్తున్నది. సంచారవాహనాల ద్వారా గ్రామగ్రామానా ప్రచారం నిర్వహిస్తున్నది.

22 వేల మంది బాలికలు అడ్మిషన్

రాష్ట్రంలో మైనారిటీ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఈ ఏడాది అడ్మిషన్లు పొందినవారి సంఖ్య 48 వేలు. వీరిలో 22వేల మందికిపైగా బాలికలు ఉండటం విశేషం. మైనారిటీ గురుకులాలపై ముస్లిం సమాజంలో క్రమంగా వస్తున్న మార్పునకు దీనిని సంకేతంగా చెప్పవచ్చు. 2018-19 విద్యాసంవత్సరంలో మైనారిటీ గురుకులాల్లో 8, 9తరగతులు కూడా ప్రారంభమవుతుండడంతో వీటిల్లో చదివే విద్యార్థుల సంఖ్య 73 వేల వరకు చేరుతుందని టెమ్రీస్ కార్యదర్శి బీ షఫిఉల్లా తెలిపారు.


ఎగ్జిబిషన్ స్టాల్‌లో ఏర్పాటుచేసిన ఆటస్థలం నమూనా

రెగ్యులర్ టీచర్ల భర్తీ..

మైనారిటీ గురుకులాల్లో నాణ్యమైన విద్యాబోధన కోసం రెగ్యులర్ ఉపాధ్యాయుల ఎంపికకు టెమ్రీస్ కృషిచేస్తున్నది. ఈ గురుకులాల్లో 2,268 మంది ఉపాధ్యాయులను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) ద్వారా ఎంపిక చేయనున్నారు. నెలరోజుల్లో 500 మంది ఉపాధ్యాయుల జాబితా టీఎస్‌పీఎస్సీ నుంచి టెమ్రీస్‌కు అందనున్నట్టు అధికారులు తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి మొత్తం 2,268 పోస్టులు భర్తీ చేయనున్నట్టు షఫీఉల్లా పేర్కొన్నారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న మైనారిటీ గురుకులాలు 2019-20 విద్యాసంవత్సరం నాటికి సొంతభవనాల్లోకి మారనున్నాయి.

ఎగ్జిబిషన్‌లో టెమ్రీస్ స్టాల్

ముస్లింలకు గురుకులాల విద్యపై అవగాహన కల్పించేందుకు లక్షలాదిగా జనం తరలివచ్చే నాంపల్లిలో జరుగుతున్న ఎగ్జిబిషన్‌లో టెమ్రీస్ ప్రత్యేకంగా ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసింది. మైనారిటీ గురుకులాల్లో విద్యాబోధన, పిల్లలకు కల్పించే సౌకర్యాలు, అడ్మిషన్ల విధానం, ఉచిత వసతి, భోజన సౌకర్యాలు, నయాపైసా ఖర్చులేని కార్పొరేట్‌స్థాయి విద్యాబోధన వంటి అంశాలను ప్రతి రోజూ ఒక్కోస్కూల్ విద్యార్థులతో ప్రజలకు వివరిస్తున్నారు.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శ గురుకులం

తెలంగాణలో ఏర్పాటుచేసిన మైనారిటీల రెసిడెన్షియల్ స్కూళ్లు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. అసోం రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శి, ఎమ్మెల్యే భద్రొద్దీన్ అజ్మల్ నేతృత్వంలోని అధికారుల బృందం తెలంగాణలోని గురుకులాలను సందర్శించింది. అసోంలో ఇదే తరహాలో 24 గురుకులాలను ప్రారంభించాలని నిర్ణయించింది. అలాగే పశ్చిమబెంగాల్ మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి నేతృత్వంలో అధికారుల బృందం తెలంగాణలో గురుకులాల నిర్వహణపై కితాబు ఇచ్చింది.



మైనారిటీ గురుకులాల్లో ఉన్న సౌకర్యాలు

- కార్పొరేట్ స్కూళ్ల తరహాలో తరగతి గదులు. రంగు రంగుల ఆకర్షణీయమైన బెంచీలు.
- ఆధునిక సౌకర్యాలతో లైబ్రరీ, అన్నిరకాల పుస్తకాలు, స్టేషనరీ ఉచితం
- కార్పొరేట్ హాస్టళ్ల తరహా డైనింగ్‌హాల్. డైట్, ప్రతిరోజూ ఉదయం విద్యార్థులకు బూస్ట్‌తోకూడిన పాలు
- ప్రతి స్కూలులో ఫిల్టర్ వాటర్ అందించేందుకు ప్లాంట్ ఏర్పాటు
- గురుకులాల్లో 24 గంటలూ అందుబాటులో టీచర్లు, సిబ్బంది
- ఫస్ట్ ఎయిడ్ చికిత్స అందించడానికి వైద్య సిబ్బంది. అన్ని రకాల భద్రత
- బాలికల గురుకులాల్లో సిబ్బంది మొత్తం మహిళలే – విద్యార్థులు నమాజు చేసుకునేందుకు ప్రత్యేక సౌకర్యం
- ఉర్దూ ద్వితీయ భాషగా కంపల్సరి బోధన. ఇంగ్లిష్ మీడియంలో తరగతులు
- స్కూళ్ల నిర్వహణ, పురోగతిపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిక

చదువు, భద్రతలో రాజీలేదు..



మా స్కూలులో మొత్తం 170 మంది బాలికలు చదువుతున్నారు. 5,6,7 తరగతుల్లో రెండేసి సెక్షన్లు ఉన్నాయి. బాలికల స్కూల్ కావడంతో భద్రత విషయంలో ఎక్కడా రాజీపడటంలేదు. ప్రతిరోజూ రాత్రి నర్సు, మహిళా పీఇటీ, మహిళా సెక్యూరిటీ.. మొత్తం ఐదుగురు మహిళలు స్కూలులో అందుబాటులో ఉంటారు. నేను కూడా రాత్రివేళ ఇంటి వద్ద నుంచి మానిటరింగ్ చేస్తుంటాను. సాయంత్రం ఆరు గంటల తరువాత బయటివారు ఎవరువచ్చినా ఎట్టి పరిస్థితుల్లో స్కూల్లోకి అనుమతించం. వచ్చే విద్యాసంవత్సరం కోసం ఇప్పటినుంచే దరఖాస్తులు అందుతున్నాయి.

- రఫియా షాహీన్ (ప్రిన్సిపాల్, బాలికల రెసిడెన్షియల్ స్కూల్-2, బహదూర్‌పుర)

దేవుడు ఇచ్చిన వరం..



అన్ని సౌకర్యాలతో ఏర్పాటుచేసిన గురుకులంలో చదువుకునే అవకాశం లభించడం ఆ దేవుడు ఇచ్చిన వరంగా భావిస్తున్నా. మా నాన్న రోజువారీ పనికి వెళతారు. అమ్మ చిన్న ప్రైవేట్ స్కూల్‌లో పనిచేస్తుంది. ఇప్పటివరకు అదే స్కూల్‌లో చదివాను. రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు కావడంతో ఇక్కడ అడ్మిషన్ తీసుకున్నా. ఉచిత విద్య అందించే ఇలాంటి స్కూళ్లు మాలాంటి వాళ్లకు ఎంతో ప్రయోజనం కలిగిస్తున్నాయి.

-కుబ్రా తహేసీన్ (5వ తరగతి, మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల, చాంద్రాయణగుట్ట)

అన్ని రకాల సౌకర్యాలు..



నాన్న నా చిన్నతనంలోనే చనిపోయాడు. ఒక సోదరుడు, సోదరి ఉన్నారు. నా సోదరి కూడా ఇదే స్కూల్‌లో చదువుతున్నది. గతంలో స్కూల్ ఫీజులు కట్టలేనిస్థితి. ఇక్కడ అంతా ఉచితంగా అందిస్తున్నారు. చదువుకోవడానికి ఇంత చక్కటి వాతావరణం, సౌకర్యాలు ఉన్నాయి.

-నిషాత్ (7వ తరగతి, మైనారిటీ గురుకుల పాఠశాల, రాజేంద్రనగర్)

నా లక్ష్యం ఐపీఎస్ లేదా డాక్టర్..




మాది వికారాబాద్ జిల్లా ఇందూర్ గ్రామం. 6వ తరగతి వరకు ఇందూరు ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా. వికారాబాద్‌లో మైనారిటీల రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయడంతో అక్కడ 7వ తరగతిలో ప్రవేశం తీసుకున్నాను. క్లాస్‌లో 40 మంది ఉన్నారు. మంచి టీచర్లు ఉన్నారు, పాఠాలు బాగా చెప్తున్నారు. బాగా చదివి ఐపీఎస్ లేదా డాక్టర్ కావాలని ఉంది.

-మహ్మద్ సమీరుద్దీన్ (7వ తరగతి, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, వికారాబాద్)

దేశంలో పెరుగుతున్న ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ వ్యాధి

ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పాశ్చాత్యదేశాల్లో సర్వసాధారణమైన 'ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ వ్యాధి (ఐబీడీ) భారతదేశంలో విస్తరిస్తున్నదని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ (ఏఐజీ) చైర్మన్ డాక్టర్ డీ నాగేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గతంలో అమీబియాసిస్, టీబీ వంటి వ్యాధులు ఎక్కువగా ఉండేవని.. కానీ ప్రస్తుతం ఐబీడీ వృద్ధి చెందుతున్నదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ దవాఖాన, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ)ల ఆధ్వర్యంలో 'ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ వ్యాధి (ఐబీడీ)పై హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో మూడు రోజుల సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి 33 దేశాల నుంచి 1400 మంది ప్రతినిధులు హాజరయ్యారు. సరైన వ్యాధి నిర్ధారణ లేకపోవడం వల్ల ఎక్కువ మంది రోగులు అనారోగ్యం బారిన పడుతున్నారని డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఒక్కోసారి ఐబీడీ తీవ్రమై క్యాన్సర్‌కు దారి తీస్తుందని తెలిపారు. రోజురోజుకు ఐబీడీ రోగుల సంఖ్య పెరుగుతుండటంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్టు డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. ప్రఖ్యాత గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మైకేల్ ఏ కామ్ పేగుల వ్యాధులకు కారణాలు, వాటి నివారణ' అంశంపై ప్రసంగించారు. పిల్లలకు యాంటీబయోటిక్స్ వినియోగించకూడదన్నారు. పేగు సంబంధమైన సమస్యలను రాకుండా ఉండేందుకు సేంద్రియ ఆహారం తీసుకోవాలని సూచించారు. నిత్యం వ్యాయామం, యోగా చేయడం ద్వారా జీర్ణకోశ వ్యాధులను దూరం చేసుకోవచ్చని పేర్కొన్నారు.

గత ఏడాది 54 మంది మావోయిస్టుల అరెస్టు

90 శాతం తగ్గిన హింసాత్మక ఘటనలు ■ వెల్లడించిన రాష్ట్ర పోలీస్‌శాఖ వార్షిక నివేదిక- 2017

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలను కట్టడి చేయడంలో పోలీస్‌శాఖ సఫలమవుతున్నది. గతే ఏడాది 54మంది మావోయిస్టులను అరెస్టు చేసింది. మావోయిస్టుల హింసాత్మక ఘటనలు 90 శాతం తగ్గినట్టు పోలీస్‌శాఖ నివేదిక-2017 వెల్లడించింది. పోలీస్‌శాఖ నిర్వహించిన 18 అంతర్రాష్ట జాయింట్ ఆపరేషన్లలో 26 మంది మావోయిస్టులు లొంగిపోయారు. 2017 డిసెంబర్ 25న మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు జినుగు నర్సింహారెడ్డి అలియాస్ జంపన్న, ఆయన భార్య రజిత లొంగిపోవడం పోలీస్‌శాఖ సాధించిన గొప్ప విజయంగా నివేదిక పేర్కొన్నది. మావోయిస్టులు బలోపేతం కాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్టు నివేదికలో వెల్లడించారు. గత ఏడాది మొత్తం 16 ఆయుధాలు, రూ. 20.64 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.


2017 డిసెంబర్‌లో పోలీసుల ఎదుట లొంగిపోయిన జంపన్న దంపతులు(ఫైల్)

పోలాండ్‌లో టీఆర్‌ఎస్ శాఖ ఆవిర్భావం

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: తూర్పు యూరప్‌లోని పోలాండ్ దేశంలో టీఆర్‌ఎస్ శాఖ ఏర్పడింది. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో పాల్గొన్న టీఆర్‌ఎస్ ఎన్నారై కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాలను పోలాండ్‌లోని తెలంగాణవాసులు తమ దేశంలో టీఆర్‌ఎస్ శాఖను ప్రారంభించాలని కోరారు. దీంతో పోలాండ్ వెళ్లిన మహేశ్ బిగాల వారి కోరిక మేరకు టీఆర్‌ఎస్ పోలాండ్ శాఖను ప్రారంభించి, తాత్కాలిక కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా పోలాండ్‌లో పార్టీ ప్రతినిధులకు గులాబీ కండువా కప్పి స్వాగతించారు. అక్కడ ఉన్న కొందరు ఆంధ్ర ప్రాంతానికి చెందిన ప్రజలు కూడా సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై తాము కూడా పార్టీకి అండగా ఉంటామని చేరారు. ఈ సందర్భంగా మహేశ్ బిగాల మాట్లాడుతూ.. పోలాండ్‌లో ఇదివరకు ఎలాంటి సంఘం లేదని, మొట్టమొదటిసారిగా టీఆర్‌ఎస్ శాఖను ప్రారంభించడం ఆనందంగా ఉన్నదని పేర్కొన్నారు. నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవితతో చర్చించి పూర్తిస్థాయి కమిటీని త్వరలోనే ప్రకటిస్తామని వెల్లడించారు. పోలాండ్ టీఆర్‌ఎస్ శాఖ ఏర్పాటుకు కృషి చేసిన శ్యామ్‌బాబు ఆకులకు కృతజ్ఞతలు తెలిపారు. పోలాండ్ ఎన్నారైలు తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించేలా ప్రయత్నిస్తామని కార్యవర్గ సభ్యుడు మహేందర్ బొజ్జ అన్నారు.

టీఆర్‌ఎస్ పోలాండ్ తాత్కాలిక కార్యవర్గం: మహేందర్ బొజ్జ, ఉరవకొండ మహేశ్, బెక్కం సాయికిరణ్, రుషికేశ నామ, కోరికంటి విజయ్, జగదీశ్, నితిన్ సోమోజు, సాయికృష్ణ పడాల, నరసింహారెడ్డి, భరత్ లింగంపల్లి, గూడూరి శరత్‌రెడ్డి.



పోలాండ్‌లో నూతనంగా ఏర్పాటైన టీఆర్‌ఎస్ శాఖ కార్యవర్గాన్ని అభినందిస్తున్న టీఆర్‌ఎస్ ఎన్నారై కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల

2018 ప్రణాళిక అమలుపై డీజీపీ కసరత్తు

- శిక్షణా తరగతులు.. సిబ్బందితో ప్రత్యేక సమావేశాలు




హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ఫలితాలు సాధించడంలో పోలీస్‌శాఖను ముందు వరుసలో ఉంచిన డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి.. అందుకు అనుగుణంగా సిబ్బందిని తయారుచేయడంలో భాగంగా ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశారు. 2018 లక్ష్యం పేరుతో ఆ ప్రణాళికను అమలుచేసేందుకు కసరత్తు మొదలుపెట్టారు. ఎప్పటికప్పుడు సిబ్బందికి దిశానిర్దేశం చేసేందుకు ప్రత్యేకంగా శిక్షణా తరగతులను కూడా నిర్వహిస్తున్నారు. లక్ష్య సాధన కోసం రూపొందించిన ప్రణాళికలో సిబ్బంది, వారు పాటించాల్సిన అంశాలను సూచిస్తూ మార్గదర్శనం చేస్తున్నారు. శిక్షణతోపాటు పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులతో, ఆ తర్వాత దశలవారీగా సిబ్బందితో సమావేశమయ్యేందుకు కసరత్తు మొదలుపెట్టారు. టెక్నాలజీ సహాయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించే విషయంలో సిబ్బందిని సమాయత్తం చేసేందుకు నెలరోజుల నుంచి జిల్లాల పర్యటనలు చేపట్టారు. ఇప్పటివరకు దాదాపు 20 జిల్లాల్లో పర్యటించారు. లక్ష్యం అమలు దిశగా కృషి చేస్తున్న డీజీపీ, సిబ్బంది సమస్యలపై కూడా దృష్టి సారించారు. సిబ్బంది సమస్యలపై ఈ నెల 30న రాష్ట్ర, జిల్లాల పోలీసు సంక్షేమ సంఘాల ప్రతినిధులతో డీజీపీ సమావేశం కానున్నారని తెలిసింది. సంఘం ప్రతినిధుల నుంచి వచ్చే విజ్ఞప్తులను స్వీకరించడంతోపాటు 2018 ప్రణాళిక లక్ష్యాన్ని వివరించాలన్న ఆలోచనలో డీజీపీ ఉన్నట్టు తెలిసింది. నిర్దేశిత ప్రణాళికను అమలు చేయడం ద్వారా దేశవ్యాప్తంగా మొదటి మూడు స్థానాల్లో రాష్ట్ర పోలీసులు నిలువాలని సూచించనున్నారు. పోలీస్‌శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాల్సిన లక్షణాలు, నేర్చుకోవాల్సిన అంశాలను వివరించనున్నారు.

వాణిజ్య

ఐకేఈఏ వ్యవస్థాపకుడు ఇంగ్వర్ కంప్రాడ్ కన్నుమూత

స్టాక్‌హోమ్, జనవరి 28: స్వీడన్‌కు చెందిన ఫర్నీచర్ తయారీ దిగ్గజం ఐకేఈఏ వ్యవస్థాపకుడు, ప్రముఖ వ్యాపారవేత్త ఇంగ్వర్ కంప్రాడ్ కన్నుమూశారు. 91 ఏండ్ల కంప్రాడ్.. స్మాలాండ్‌లో శనివారం అనారోగ్యంతో మృతి చెందినట్లు ఐకేఈఏ ఓ ప్రకటన ద్వారా ఆదివారం తెలియజేసింది. 1926 మార్చి 30న దక్షిణ స్వీడన్‌లోగల అగున్నార్డ్‌లో జన్మించిన ఈయన పసితనం నుంచే కష్టపడుతూ పైకెదిగారు. తన ఐదో యేట నుంచే వ్యాపారంలోకి అడుగు పెట్టడం గమనార్హం. బుడిబుడి అడుగుల ప్రాయంలోనే ఇరుగుపొరుగువారికి అగ్గిపెట్టెలను అమ్మడంతో మొదలైన కంప్రాడ్ వ్యాపార ప్రస్థానం.. అంచెలంచెలుగా అభివృద్ధి చెందింది. క్రిస్మస్ ట్రీ అలంకరణ సామాగ్రి, పెన్సిళ్లు, బాల్-పాయింట్ పెన్లు వంటి వాటిని అమ్ముతూ ముందుకు సాగారు. ఈ క్రమంలోనే 1943లో ఐకేఈఏను కంప్రాడ్ స్థాపించగా, అప్పుడు ఆయన వయసు కేవలం పదిహేడేండ్లే కావడం విశేషం. 1958లో స్వీడన్‌లోని ఆమ్‌హల్ట్‌లో తొలి స్టోర్‌ను ప్రారంభించిన ఐకేఈఏ.. క్రమేణా ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఫర్నీచర్ రిటైలర్‌గా ఉన్న ఐకేఈఏ ప్రస్తుత వార్షిక ఆదాయం సుమారు రూ.3.30 లక్షల కోట్లుగా ఉన్నది. నెదర్లాండ్స్‌లోని లీడెన్ ప్రధాన కేంద్రంగా వ్యాపార కార్యకలాపాలను సాగిస్తున్న ఐకేఈఏ.. నిర్మాణ, ఆహార, సోలార్ తదితర తయారీ రంగాల్లోనూ రాణిస్తున్నది. గతంలో బ్లూంబర్గ్ బిలియనీర్ల జాబితాలో 58.7 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచ టాప్-10 కుబేరుల్లో కంప్రాడ్ 8వ స్థానంలో నిలిచారు. కంప్రాడ్ మరణంపట్ల ఐకేఈఏ గ్రూప్ తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది.



ఇంగ్వర్ కంప్రాడ్

భిన్నమైన బడ్జెట్!



ఒకవైపు కొత్త పథకాలు.. మరోవైపు పన్నుల్లో మార్పులు
జీఎస్టీ అమలు, సార్వత్రిక ఎన్నికలే ప్రధాన కారణం
పన్ను చెల్లింపుదారులకు ఊరట.. వ్యవసాయ రంగానికి పెద్దపీట?

న్యూఢిల్లీ, జనవరి 28:

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ఫిబ్రవరి 1వ తేదీన పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న చివరి పూర్తిస్థాయి సార్వత్రిక బడ్జెట్ గతంలో ఆయన ప్రవేశపెట్టిన నాలుగు పద్దుల కంటే భిన్నంగా ఉండే అవకాశం కనిపిస్తున్నది. దేశంలో గత ఏడాది నుంచి అమలులోకి వచ్చిన వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వలన ప్రభావితమైన పరోక్ష పన్నుల వ్యవస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసేందుకు ఆయన కసరత్తు చేస్తుండటమే ఇందుకు ప్రధాన కారణం. వచ్చే ఏడాది జరిగే పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పూర్తిస్థాయి చివరి బడ్జెట్ ఇదే. ఈ బడ్జెట్‌లో ప్రధానంగా రెండు భాగాలు ఉంటాయి. ఇప్పటికే అమలులో ఉన్న వివిధ పథకాలకు నిధులను కేటాయించడాన్ని, కొత్త పథకాలను ప్రకటించడాన్ని ఈ బడ్జెట్‌లో మొదటి భాగం గానూ, ప్రత్యక్ష, పరోక్ష పన్నులకు సంబంధించి జైట్లీ చేసే ప్రకటనలను రెండవ భాగంగానూ పరిగణించవచ్చు. గతంలో ఉన్న అనేక కేంద్ర, రాష్ట్ర పన్నుల స్థానంలో దేశ వ్యాప్తంగా ఒకే పన్నును అమలులోకి తీసుకురావడం ద్వారా మార్కెట్‌ను ఏకీకృతం చేయాలని ప్రజలు ఎన్నో ఏళ్ల నుంచి కంటున్న కలలు జీఎస్టీ అమలుతో సాకారమైన విషయం తెలిసిందే. దీంతో ప్రస్తుతం జీఎస్టీ పరిధిలో లేని పెట్రోలియం ఉత్పత్తుల్లాంటి కేవలం కొన్ని ఉత్పత్తులను మాత్రమే ఈసారి బడ్జెట్ సందర్భంగా గమనంలోకి తీసుకోవాల్సి ఉన్నది. కనుక జీఎస్టీకి వెలుపల మిగిలిపోయిన ఇటువంటి ఉత్పత్తులపై విధించే కస్టమ్స్, ఎక్సైజ్ సుంకాలు ఈసారి బడ్జెట్‌లో మారడం ఖాయంగా కనిపిస్తున్నది. దేశంలో పన్నుల పరిధి విస్తరించిందన్న (పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరిగిందన్న) వాస్తవాన్ని గమనంలోకి తీసుకుని ప్రత్యక్ష పన్నులను హేతుబద్ధం చేస్తామని ప్రకటించిన జైట్లీ.. పన్ను చెల్లింపుదారులకు ఈసారి ఎంతో కొంత ఊరట కల్పిస్తామని ఇప్పటికే సూచనప్రాయంగా తెలిపారు. అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం సందర్భంగా శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఏడాది క్రితంతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18)లో ఈ నెల 15వ తేదీ నాటికి దేశంలో ప్రత్యక్ష పన్నుల నికర వసూళ్లు 18.7 శాతం పెరిగాయి. 2019లో పార్లమెంట్ ఎన్నికలు జరుగనుండటంతో వచ్చే ఏడాది కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను కాకుండా ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది. కేవలం వ్యయానికి మాత్రమే పరిమితమై ఉండే ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్‌లో ప్రభుత్వం కొత్త పథకాలను ప్రకటించేందుకు గానీ, పన్నుల స్వరూపాన్ని మార్చేందుకు గానీ వీలుండదు. అంతేకాకుండా పార్లమెంట్ ఎన్నికల కంటే ముందు ఈ ఏడాది కొన్ని పెద్ద రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటంతో గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేయడం ఖాయమని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.



మల్టీమోడల్ రవాణా వాహనాలకు
జీఎస్టీలో ఒకే పన్ను విధించాలి
వాణిజ్య శాఖ ప్రతిపాదన

ఆటోమొబైల్ తయారీదారులపై పన్ను భారాన్ని తగ్గించడంతో పాటు దేశంలో లాజిస్టిక్ సేవలను మెరుగుపరిచేందుకు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)లో వివిధ రకాల రవాణా (మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్) వాహనాలను ఒకే పన్నురేటు కిందికి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వానికి వాణిజ్య శాఖ ప్రతిపాదించింది. రైలు, రోడ్డు, సముద్ర మార్గాల ద్వారా సరుకులను చేరవేసే వివిధ రకాల వాహనాలు మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్ కేటగిరీలోకి వస్తాయి. అయితే మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్‌కు జీఎస్టీలో ఇచ్చిన నిర్వచనంలో స్పష్టత లోపించడంతో ఆటోమొబైల్ కంపెనీలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఈ విషయమై ఆటోమొబైల్ పారిశ్రామిక సంఘం సియామ్ (సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్) వాణిజ్య శాఖలోని లాజిస్టిక్స్ విభాగాన్ని ఆశ్రయించడంతో సార్వత్రిక బడ్జెట్‌కు ముందస్తుగా ఆ శాఖ ఈ ప్రతిపాదన చేసిందని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు.

విద్యుత్ వాహనాలకు రాయితీలు?

విద్యుత్‌తో నడిచే వాహనాల (ఎలక్ట్రిక్ వెహికల్స్)ను కొనుగోలు చేసేవారికి కేంద్ర ప్రభుత్వం ఈసారి సార్వత్రిక బడ్జెట్‌లో విస్తృతమైన ప్రోత్సాహకాలను ప్రకటించడం ఖాయంగా కనిపిస్తున్నది. విద్యుత్ వాహనాల కొనుగోలుదారులకు పన్ను రాయితీలు ఇవ్వడంతో పాటు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రేటును తగ్గించడం ద్వారా ప్రభుత్వం ఈ ప్రోత్సాహకాలను అందజేయవచ్చని, పర్యావరణాన్ని కాపాడుకునేందుకు వీలుగా 2030 సంవత్సరం నాటికి దేశంలో నూటికి నూరు శాతం ఎలక్ట్రిక్ వాహనాలను ఉపయోగించేలా చూడాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు లక్ష్యంగా నిర్దేశించుకున్నందున ఈసారి బడ్జెట్‌లో ఇందుకు సంబంధించిన ప్రకటన తప్పకుండా వస్తుందని ఆశిస్తున్నామని ఆ పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. 'దేశంలో ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చే విషయమై ఇప్పటికే ఎంతో మేధోమథనం జరిగింది. కనుక ఫిబ్రవరి 1వ తేదీన పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే 2018-19 బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ



మంత్రి అరుణ్ జైట్లీ ఈ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఏదో ఒక ప్రకటన చేయవచ్చు' అని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఎలక్ట్రిక్ వాహనాలపై ప్రస్తుతం జీఎస్టీలో 12 శాతంగా ఉన్న పన్ను రేటును బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం 5 శాతానికి తగ్గించడంతో పాటు ఈ వాహనాలను కొనుగోలు చేసేవారికి ఆదాయం పన్నులో ప్రయోజనాలను కల్పించే అవకాశం ఉన్నదని ఆ వర్గాలు అంటున్నాయి. అయితే ఎలక్ట్రిక్ వాహన కొనుగోలుదారులకు ఈ బడ్జెట్ ద్వారా పన్ను రాయితీలు ఇవ్వడం సాధ్యమే అయినప్పటికీ, ఈ వాహనాలపై ప్రభుత్వం జీఎస్టీ రేటును తగ్గించాలంటే జీఎస్టీ కౌన్సిల్ నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది.

వైద్య పరికరాలపై దిగుమతి సుంకం పెంపు?

ఇదిలావుంటే, దేశీయంగా వస్తువుల తయారీకి ఊతమివ్వాలని సంకల్పించిన కేంద్ర ప్రభుత్వం వచ్చే బడ్జెట్‌లో కొన్ని రకాల వైద్య పరికరాలపై దిగుమతి సుంకాన్ని పెంచవచ్చని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ఇదే గనుక జరిగితే మోదీ సర్కారు అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు దోహదపడుతుంది. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే వైద్య పరికరాలపై ప్రస్తుతం 0 నుంచి 7.5 శాతం వరకూ ఉన్న కనీస సుంకాన్ని 5 నుంచి 15 శాతం మేరకు పెంచాలని ఏఐఎంఈడీ (అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మెడికల్ డివైజ్ ఇండస్ట్రీ) సహా దేశీయ పారిశ్రామిక రంగం సార్వత్రిక బడ్జెట్‌కు ముందస్తుగా కేంద్రానికి సమర్పించిన విజ్ఞాపన పత్రంలో కోరింది. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం ప్రారంభమై మూడేండ్లు గడుస్తున్నప్పటికీ దేశంలో వైద్య పరికరాల తయారీ రంగం ఇప్పటికీ తీవ్రమైన కష్ట, నష్టాలను ఎదుర్కొంటున్నదని ఏఐఎంఈడీ ఆ విజ్ఞాపన పత్రంలో కేంద్రానికి వివరించింది.

ప్రైవేట్ పెట్టుబడులకు ఊతం?

పార్లమెంట్‌లో సార్వత్రిక బడ్జెట్‌ను ప్రతిపాదించేందుకు రోజులు సమీపిస్తుండటంతో స్తబ్ధుగా ఉన్న ప్రైవేటు రంగ పెట్టుబడులను పునరుద్ధరించేందుకు, తాజాగా మరికొన్ని పన్ను రాయితీలను ఇచ్చేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం మార్గాలను అన్వేషిస్తున్నది. దేశంలో మరిన్ని ఉద్యోగాలను సృష్టించాలంటే తయారీ రంగంలోకి ప్రైవేటు పెట్టుబడులను చొప్పించి, ఆ రంగంలో నెలకొన్న స్తబ్ధతకు తెర దించాల్సిన అవసరం ఏర్పడటంతో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖతో పాటు ప్రధాన మంత్రిత్వ కార్యాలయం (పీఎంవో) వివిధ అవకాశాలను పరిశీలిస్తున్నాయి. ఈ విషయమై వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేష్ ప్రభు కూడా కొన్ని సూచనలు చేసినట్లు తెలుస్తున్నది. ప్లాంట్ అండ్ మెషినరీ రంగంలో తాజాగా పెట్టుబడులు పెట్టే వారికి పన్ను రూపంలో ప్రయోజనాన్ని కల్పించేందుకు 'ఇన్వెస్ట్‌మెంట్ అలవెన్సు'ను ప్రవేశపెట్టాలన్నది ఆయన సూచనల్లో ఒకటి. ఇటువంటి ప్రోత్సాహకాలను కేవలం రెండు మూడేండ్లు కాకుండా దీర్ఘకాలం పాటు అందజేయాల్సిన అవసరం ఉన్నదని, తద్వారా ఈ ప్రోత్సాహకాలకు అనుగుణంగా ఎక్కువ కాలం పాటు ప్రణాళికలు రూపొందించుకునే వెసులుబాటు వ్యాపారులకు కలుగుతుందని సురేష్ ప్రభు స్పష్టం చేశారని అభిజ్ఞ వర్గాలు వెల్లడించాయి. ప్లాంట్ అండ్ మెషినరీలో రూ.100 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడులు పెట్టేవారికి 2013లో అప్పటి యూపీఏ ప్రభుత్వం రెండేళ్ల పాటు ఇదేవిధమైన ప్రయోజనాన్ని కల్పించింది. కొత్త ఆస్తుల కొనుగోలుకు అయ్యే ఖర్చును 15 శాతం తగ్గించడం ద్వారా ఈ ప్రయోజనాన్ని కల్పించింది. ఆ తర్వాత ఈ ప్రయోజనం దుర్వినియోగమవకుండా నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం రక్షణాత్మక నిబంధనలను పొందుపర్చి ఈ పథకాన్ని 2017 మార్చి నెలాఖరు వరకూ పొడిగించడంతో పాటు కనీస పెట్టుబడి పరిమితిని రూ.25 కోట్లకు తగ్గించింది. ఇప్పుడు సురేష్ ప్రభు కూడా ఇదేవిధమైన ప్రతిపాదన చేశారు. దీనిపై ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రతిస్పందించే అవకాశం ఉంది.

హైదరాబాద్‌లో మరో రెండు మలబార్ షోరూమ్‌లు

హిమాయత్‌నగర్, కొండాపూర్‌లలో ప్రారంభించిన తమన్నా భాటియా

హైదరాబాద్, జనవరి 28: ప్రపంచ శ్రేణి ఆభరణాల రిటైల్ స్టోర్లలో ఒకటైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్.. హైదరాబాద్‌లో మరో రెండు నూతన షోరూమ్‌లను అందుబాటులోకి తెచ్చింది. ఆదివారం ఉదయం హిమాయత్‌నగర్‌లో, సాయంత్రం కొండాపూర్‌లో ఈ షోరూమ్‌లను ప్రముఖ సినీనటి తమన్నా భాటియా ప్రారంభించారు. ప్రారంభోత్సవ ఆఫర్‌లో భాగంగా హైదరాబాద్‌లోని తమ అన్ని షోరూంలలో ప్రతీ రూ.30,000 కొనుగోలుపై ఓ బంగారు నాణేన్ని ఉచితంగా అందిస్తున్నామని, ఈ ఆఫర్ వచ్చే నెల 11 వరకు అమల్లో ఉంటుందని సంస్థ వర్గాలు తెలిపాయి. త్వరలోనే కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మంలలో నూతన షోరూంలను ప్రారంభించబోతున్నామ ని సంస్థ ప్రాంతీయ అధిపతి సిరాజ్ పీ కే తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం 209 మలబార్ షోరూంలుండగా, భారత్‌లో 91 ఉన్నాయి. ఈ నెల 12న 6 దేశాలలో 11 షోరూంలను ప్రారంభించగా, అందు లో వరంగల్ షోరూం ఒకటి. మిగతావి యూఏఈ, ఒమన్, ఖతార్, సింగపూర్, మలేషియా దేశాలలో ఏర్పాటయ్యాయి. అమెరికా, శ్రీలంక, బ్రూనే, బంగ్లాదేశ్ తదితర దేశాల్లోనూ మరో 50 షోరూంల ఏర్పా టు దిశగా వెళ్తున్నట్లు సంస్థ అంతర్జాతీయ కార్యకలాపాల ఎండీ షామ్‌లాల్ అహ్మద్ చెప్పారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున కస్టమర్లు, సంస్థ ప్రతినిధులతోపాటు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.




హిమాయత్‌నగర్‌లో మలబార్ షోరూంను ప్రారంభిస్తున్న సినీనటి తమన్నా భాటియా

బిట్‌కాయిన్, క్యాష్ వాల్ట్స్‌లో పెట్టుబడులు పెట్టండి

దావోస్ పర్యటనలో భారతీయ హెచ్‌ఎన్‌ఐలకు ఆఫర్లు

దావోస్/జ్యూరిచ్, జనవరి 28: ప్రపంచ ఆర్థిక సదస్సు (డబ్ల్యూఈఎఫ్) సందర్భంగా బిట్‌కాయిన్లు, క్యాష్ వాల్ట్స్ ఆధారిత సంస్థలు పెట్టుబడులను ఆకర్షించేందుకు విపరీతంగా ప్రయత్నించాయి. స్విట్జర్లాండ్‌లో ఇటీవలే ముగిసిన ఈ అంతర్జాతీయ సదస్సుకు భారత్‌సహా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి పెద్ద ఎత్తున వ్యాపార, పారిశ్రామిక వర్గాలు హాజరైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో దావోస్ సదస్సులో పాల్గొనేందుకు ముందుగానే తమ పేర్లను నమోదు చేసుకున్న బిట్‌కాయిన్ తదితర క్రిప్టోకరెన్సీల కంపెనీలు.. సదస్సుకు హాజరవడం కంటే కూడా సదస్సు బయట తమ వ్యాపారాల కోసం నిధుల అన్వేషణకే మొగ్గుచూపాయి. ముఖ్యంగా భారతీయ అపర కుబేరుల (హెచ్‌ఎన్‌ఐ)కు పెట్టుబడులు పెట్టాలంటూ బోలెడు ఆఫర్లు వచ్చాయి. డబ్ల్యూఈఎఫ్‌కు పెద్ద సంఖ్యలో భారతీయ హెచ్‌ఎన్‌ఐలు, వారి ప్రతినిధులు హాజరైన నేపథ్యంలో క్రిప్టోకరెన్సీ కంపెనీలు, స్విట్జర్లాండ్‌లో విజయవంతంగా నడుస్తున్న క్యాష్ వాల్ట్స్ నిర్వాహకులు వీరిపై దృష్టి సారించారు. దేశీయ హెచ్‌ఎన్‌ఐలూ ఇందుకు ఆసక్తి కనబరుచగా, కొందరైతే కేవలం పెట్టుబడులు కాకుండా భాగస్వాములుగా ఉండేందుకు ముందుకువచ్చారు. రష్యా, జర్మనీ, చైనీయులూ ఈ విషయంలో ముందుండటం గమనార్హం. బంగారం, ఇతరత్రా ఆభరణాలతోపాటు నగదు, విలువైన డాటా, పెయింటింగ్స్, శిల్పాలు తదితర వాటిని భద్రపరిచేందుకు క్యాష్ వాల్ట్స్ ఉపయుక్తంగా ఉంటున్నాయి. భారత్‌లో బ్యాంకులు ఈ తరహా లాకర్ సేవలను అందిస్తుండగా, ఈ రకమైన సేవలకు స్విట్జర్లాండ్‌లో బాగా డిమాండ్ కనిపిస్తున్నది. ఇతరత్రా సంస్థలు వీటిని నిర్వహిస్తుండగా, భారత్‌లోనూ క్యాష్ వాల్ట్స్ విస్తరణకు దావోస్ వేదికగా స్విస్ కంపెనీలు హెచ్‌ఎన్‌ఐల ద్వారా ప్రయత్నించాయి. ఇక బిట్‌కాయిన్ విలువ గడిచిన నాలుగేండ్లలో 12 రెట్లు పెరుగగా, దీనిలో పెట్టుబడులు పెట్టేందుకు గతేడాది అంతా అమితాసక్తిని ప్రదర్శించిన సంగతి విదితమే.



ఈసారి స్టాక్ మార్కెట్ల పయనమెటు?

వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను నరేంద్ర మోదీ సర్కార్ ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్ సమయం దగ్గరపడుతుండటంతో అందరిలోను టెన్షన్ తీవ్రస్థాయికి చేరుకున్నది. ముఖ్యంగా స్టాక్ మార్కెట్ పెట్టుబడి దారుల్లో ఈ ఆందోళన మరింత ఎక్కువగా ఉంది. వరుసగా ఏడేండ్లుగా బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజు భారీగా తగ్గిన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టినప్పుడు మాత్రం 486 పాయింట్లు లాభపడ్డాయి. వరుసగా 2005, 2006లో సానుకూలంగా స్పందించిన సూచీలు అప్పటి ఆర్థిక మంత్రి పీ చిదంబరం బడ్జెట్ ప్రవేశపెట్టిన 2007లో ఏకంగా ఏడు శాతం పడిపోయింది. అప్పటి నుంచి దిగువముఖం పట్టిన సూచీలు 2010లో మాత్రం స్వలంగా లాభపడాయి. ఆ తర్వాత ఎన్డీఏ నేతృత్వం లోని నూతన సర్కార్ కొలువుదీరినప్పటికీ బడ్జెట్ రోజు సూచీల పతనాన్ని ఏ మాత్రం ఆపలేకపోయింది. 2007 వరకు బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజు గరిష్ఠంగా 9 శాతం వరకు పతనం చెందిన సూచీలు..ఆ తర్వాత పదేండ్లలో స్వల్పంగా పెరుగుదల నమోదు చేసుకున్నాయని సర్వేలు వెల్లడిస్తున్నాయి. బడ్జెట్‌లో కేంద్రం తీసుకున్న నిర్ణయాలు.. సున్నిత రంగాలను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నాయి. ఇదే క్రమంలో గతేడాదిలో ప్రభుత్వ రంగ బ్యాంకులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి రూ.10 వేల కోట్ల నిధులను కేటాయించనున్నట్లు ప్రకటించడంతో ఈ రంగ షేర్లలో భారీ కొనుగోళ్లు జరిగాయి. ఫిబ్రవరి 11, 2016న సెన్సెక్స్ 22,951 పాయింట్ల వద్ద ముగియగా, అప్పటి నుంచి ఇప్పటి వరకు 13 వేల పాయింట్లు లేదా 56 శాతం లాభపడింది. అదే నిఫ్టీ విషయానికొస్తే 400 పాయింట్లు లేదా 57 శాతం చొప్పున లాభపడ్డాయి. కాగా, స్టాక్ మార్కెట్లు పతనం చెందుతున్నా.. బడ్జెట్ సమయంలో ఐదు స్టాకులు మాత్రం పెరుగుతుండటం విశేషం. వీటి వివరాలు సంక్షిప్తంగా..

బజాజ్ ఫైనాన్స్: ప్రముఖ నాన్-బ్యాంకింగ్ సేవల సంస్థయైన బజాజ్ ఫైనాన్స్ 2015లో 6.08 శాతం లాభపడగా, 2016లో 2.15 శాతం, 2017లోనూ 2.95 శాతం పెరిగింది.



భారత్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్: రాష్ట్రానికి చెందిన ప్రముఖ సూక్ష్మ రుణాల సంస్థ భారత్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ (గతంలో ఎస్‌కేఎస్) 2015లో 5.07 శాతం 2016లో 2.61 శాతం, గతేడాదిలోనూ అత్యధికంగా 8.93 శాతం పెరిగింది.

మ్యాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్: మ్యాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ కూడా గడిచిన మూడేండ్లుగా భారీగా లాభపడింది. 2015లో 4.46 శాతం, 2016లో 2.81 శాతం, 2017లో 3.09 శాతం పెరిగింది.

ఐసీఐసీఐ బ్యాంక్: దేశంలో అతిపెద్ద ఆర్థిక సేవల సంస్థ ఐసీఐసీఐ బ్యాంక్ సైతం బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజు భారీగా పుంజుకుంటున్నది. మూడేండ్ల క్రితం 3.15 శాతం లాభపడిన బ్యాంక్ షేరు.. 2016లో 2.79 శాతం, 2017లో 4.4 శాతం ఎగిసింది.

హెచ్‌పీసీఎల్: ప్రభుత్వరంగ ఇంధన విక్రయ సంస్థ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కూడా లాభపడిన సంస్థల్లో ఉన్నది. 2015లో 2.66 శాతం లాభపడిన కంపెనీ షేరు, ఆ తర్వాత ఏడాదికిగాను 4.1 శాతం, గతేడాదిలో 3.04 శాతం పెరిగాయి.

బడ్జెట్‌పైనే భారం

- అంచనాలు, ప్రకటనల ఆధారంగా పెట్టుబడులు
- కార్పొరేట్ ఫలితాలపైనా మదుపరుల దృష్టి

న్యూఢిల్లీ, జనవరి 28: దేశీయ స్టాక్ మార్కెట్లను ఈ వారం అత్యధికంగా కేంద్ర బడ్జెటే ప్రభావితం చేయనున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ గురువారం (ఫిబ్రవరి 1) పార్లమెంట్‌లో కొత్త బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో బడ్జెట్ అంచనాలు, ప్రకటనల ఆధారంగా ట్రేడింగ్ కొనసాగుతుందన్న అభిప్రాయాలు నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమలు తర్వాత వస్తున్న ఈ తొలి బడ్జెట్ నిధుల్లో ఏయే రంగాలకు పెద్దపీట దక్కుతుందో, మరే రంగాలకు ప్రోత్సాహకాలుంటాయోనన్నదానిపై మదుపరుల్లో ఆసక్తి ఉంటుందని, వీటి ఆధారంగా ఆయా సంస్థల షేర్ల పెట్టుబడులపై నిర్ణయాలు తీసుకుంటారని మెజారిటీ నిపుణులు చెబుతున్నారు. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలుండటం, ఇదే చివరి పూర్తికాల బడ్జెట్ కావడంతో ఈసారి పన్నుల కోతలుంటాయన్న అంచనాలు విస్తృతంగా వినిపిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో బడ్జెట్‌కు ముందు మార్కెట్లు లాభాల్లో, ఆ తర్వాత అంచనాలకు విరుద్ధంగా జరిగితే నష్టాల్లో కదలాడే వీలుంటుందని పలువురు విశ్లేషకులు చెబుతున్నారు. ఇకపోతే ఈ ఆర్థిక సంవత్సరం (2017-18) మూడో త్రైమాసికానికి (అక్టోబర్-డిసెంబర్)గాను కార్పొరేట్ సంస్థలు ప్రకటించే ఆర్థిక ఫలితాలూ కీలకమేనని పేర్కొంటున్నారు. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఆటో, ఎన్టీపీసీ, ఐవోసీ, టెక్ మహీంద్రా, రిలయన్స్ కమ్యూనికేషన్స్ తదితర సంస్థలు తమ ఆర్థిక ఫలితాలను ప్రకటిస్తున్నాయి. గురువారం విడుదలయ్యే తయారీ రంగం పీఎంఐ గణాంకాలూ సూచీల కదలికలను ప్రభావితం చేయనుండగా, ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులూ ప్రధానమే కానున్నాయి. గత వారం సెన్సెక్స్ 538.86 పాయింట్లు, నిఫ్టీ 174.95 పాయింట్లు లాభపడిన సంగతి విదితమే.



రూ.లక్ష కోట్లు పెరిగింది

గత వారం టాప్-10 కంపెనీల్లో తొమ్మిదింటి విలువ రూ.97,931.85 కోట్లు పెరిగింది. టీసీఎస్ మార్కెట్ విలువ అత్యధికంగా రూ.31,222.03 కోట్లు ఎగబాకి రూ.5,96,846.16 కోట్లకు చేరగా, ఒకానొక దశలోనైతే రూ.6 లక్షల కోట్ల మార్కును తాకింది. ఇక రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) విలువ రూ.22,295.4 కోట్లు పుంజుకుని రూ.6,10,938.21 కోట్లు ఎగిసింది. ఓఎన్జీసీ, ఐటీసీ, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్బీఐ, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీల మార్కెట్ విలువ కూడా పెరుగగా, మారుతి సుజుకీ విలువ మాత్రం రూ.1,333.69 కోట్లు పడిపోయింది.

రూ.18,000 కోట్లు తెచ్చారు

ఈ నెలలో ఇప్పటిదాకా దేశీయ మార్కెట్లలోకి విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐ) తెచ్చిన పెట్టుబడుల విలువ దాదాపు రూ.18,000 కోట్లు (సుమారు 3 బిలియన్ డాలర్లు)గా నమోదైంది. జనవరి 1 నుంచి 25 మధ్య స్టాక్ మార్కెట్లలోకి రూ.11,759 కోట్లు రాగా, రుణ మార్కెట్లలోకి రూ.6,127 కోట్లు వచ్చాయి. గతేడాది మొత్తంగా అటు స్టాక్, ఇటు రుణ మార్కెట్లలోకి వచ్చిన ఎఫ్‌పీఐ పెట్టుబడుల విలువ రూ.2 లక్షల కోట్లుగా ఉన్న విషయం తెలిసిందే.

పీ-నోట్లు ఆకర్షణీయం

గత నెలలో పార్టిసిపేటరీ నోట్ల (పీ-నోట్లు) ద్వారా దేశీయ క్యాపిటల్ మార్కెట్లలోకి వచ్చిన పెట్టుబడులు ఆరు నెలల గరిష్ఠంగా నమోదయ్యాయి. డిసెంబర్‌లో ఈక్విటీ, డెట్, డెరివేటివ్‌లలో రూ.1,52,243 కోట్ల పెట్టుబడులను పెట్టారు. జూన్‌లో రూ.1.65 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా, మళ్లీ ఆ తర్వాత ఇప్పుడే ఆ స్థాయి దరిదాపుల్లో పెట్టుబడులు వచ్చాయి. అంతకుముందు నెల నవంబర్‌లో రూ.1,28,639 కోట్లుగా ఉన్నట్లు మార్కెట్ రెగ్యులేటర్ సెబీ తెలియజేసింది.

ఆ షేర్లతో జాగ్రత్త!

మిడ్-క్యాప్, స్మాల్-క్యాప్ షేర్లతో జాగ్రత్తని ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కొటక్ మదుపరులను హెచ్చరించారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాలకు హాజరైన ఆయన పిటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పైవిధంగా స్పందించారు. దేశీయ ఆర్థిక వ్యవస్థలో కనిపిస్తున్న వృద్ధిదాయక మార్పులతో స్టాక్ మార్కెట్లు రికార్డుస్థాయి లాభాల్లో కదలాడుతున్నాయన్న ఆయన నష్టాలు వస్తే మిడ్-క్యాప్, స్మాల్-క్యాప్ షేర్లు తీవ్రంగా ప్రభావితం కావచ్చన్నారు. ఇది చిన్న మదుపరులకు ప్రమాదమన్నారు. కాబట్టి ఈ బూమ్‌కు దూరంగా ఉన్న ప్రధాన సంస్థల్లో పెట్టుబడులే శ్రేయస్కరమన్నారు.

మహాజాతరకు అద్భుత ఏర్పాట్లు



జంపన్నవాగు వద్ద నిర్మించిన కల్యాణకట్ట

శాశ్వత నిర్మాణాలకే పెద్దపీట

- రూ.6.80 కోట్లతో హరితహోటల్, కాటేజీలు
- రూ.2.45 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్
- మ్యూజియం, కల్యాణకట్టలు, హెలీప్యాడ్లు

జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ: రెండేండ్లకోసారి మేడారంలో జరిగే సమ్మక్క సారలమ్మ మహాజాతరలో భక్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించి శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నది. ఇప్పటికే దాదాపు అన్ని నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటి వల్ల భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందనున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో జాతర జరిగే సమయంలోనే భక్తుల కోసం తాత్కాలికంగా ఏర్పాట్లు చేసేవారు. ఇలా జాతర జరిగిన ప్రతిసారి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడం జరిగేది. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పక్కా నిర్మాణాల ద్వారా శాశ్వత ఏర్పాట్లపై దృష్టి సారించింది. ఇందుకుగాను భక్తులకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నది. తెలంగాణ ఏర్పడిన తరువాత మేడారంలో తొలిసారి సమ్మక్కసారలమ్మ జాతర 2016లో జరిగింది. అప్పట్లోనే శాశ్వత పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.160 కోట్లు వెచ్చించింది. ప్రధానంగా ఈ నిధులతో మేడారం చేరుకునే రహదారులను అభివృద్ధి చేసింది. రోడ్ల విస్తరణతో గత జాతర సమయంలో ట్రాఫిక్ సమస్య తలెత్తలేదు. గతానుభవం మేరకు అధికార యంత్రాంగం ఈసారి జాతరకు భారీ ఏర్పాట్లు చేపట్టింది. ఈసారి ప్రభుత్వం రూ.80.55 కోట్లు మంజూరు చేసింది. రూ.6.80 కోట్లతో హరిత హోటల్‌తోపాటు ఎనిమిది కాటేజీలు నిర్మించారు. సంపన్నులు విడిది చేసేలా రెస్టారెంట్, కాటేజీలను నిర్మించారు. మేడారం సమీపంలో ఎలుబాక వద్ద రూ.30 లక్షలతో రెండు హెలీప్యాడ్లు నిర్మించారు. దీంతోపాటు జంపన్నవాగుపై చెల్పాక వద్ద రూ.కోటి వ్యయంతో రోడ్డు డ్యాం నిర్మాణాన్ని చేపట్టారు. జాతర నిర్వహణకు 10నుంచి 14 మెగావాట్ల విద్యుత్ అవసరం. నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం రూ.2.45కోట్లు వెచ్చించి మేడారంలోనే 33/11కేవీ సబ్‌స్టేషన్ నిర్మించారు. రూ.2కోట్లతో కొత్తగా ట్రైబల్ మ్యూజియం నిర్మించారు. పక్కనే రూ.80 లక్షలతో నిర్మిస్తున్న ఓపెన్ ఎయిర్ థియేటర్ పనులు తుది దశకు చేరాయి. రూ.60 లక్షలతో శానిటేషన్ భవన్ నిర్మిస్తున్నారు. పారిశుద్ధ్య విధులు నిర్వహించే ఉద్యోగులు విశ్రాంతి తీసుకోవడానికి ఈ భవనం ఉపయోగపడనున్నది. జంపన్నవాగు వద్ద రూ.37.50 లక్షలతో రెండు కల్యాణకట్టలు నిర్మించారు. చిలుకలగుట్ట చుట్టూ రూ.40లక్షలతో ఫెన్సింగ్ నిర్మించారు. జంపన్నవాగు వద్ద రూ.56 లక్షలు వెచ్చించి జీ ప్లస్ వన్ పద్ధతిన సులభ్ కాంప్లెక్స్ నిర్మించారు.



మేడారంలో సిద్ధమైన హరిత హోటల్

మేడారంలో జనజాతర

భారీగా తరలివచ్చిన భక్తులు

- అమ్మవార్లను దర్శించుకున్న డిప్యూటీ సీఎం, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- ఏర్పాట్లను పరిశీలించిన కడియం.. రాత్రి బస

జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ:

మహాజాతర దగ్గర పడుతున్న కొద్దీ మేడారానికి భక్తుల తాకిడి పెరిగింది. దాదాపు నెల రోజుల నుంచి భక్తుల రాక మొదలైంది. ఇప్పటివరకు సుమారు 60లక్షల మంది వనదేవతలను దర్శించుకున్నట్టు అంచనా. ఆదివారం ఒక్క రోజే దాదాపు 12 లక్షల మంది వచ్చినట్టు భావిస్తున్నారు. ప్రజాప్రతినిధులు కూడా ఆదివారం పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. డిప్యూటీ సీఎం కడియం శ్రీహరితోపాటు ఎంపీలు గుత్తా సుఖేందర్‌రెడ్డి, బాల్క సుమన్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతారాంనాయక్, పసునూరి దయాకర్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పూల రవీందర్, కొండా మురళీధర్‌రావు, జనగామ, వరంగల్ తూర్పు, మహబూబాబాద్, పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, కొండా సురేఖ, శంకర్‌నాయక్, చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేశ్, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మ, కార్పొరేషన్ల చైర్మన్లు గుండు సుధారాణి, కే రాజయ్యయాదవ్ తదితరులు అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం మేడారంలో డిప్యూటీ సీఎం శ్రీహరి ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. ఉదయం కడియం శ్రీహరి మేడారంలోని జంపన్నవాగు వద్ద పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. బుధవారం నుంచి మహాజాతర ప్రారంభం కానున్నందున జాతర జరిగే పరిసరాల్లో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి కాలినడకన పర్యటించారు. పుణ్యస్నానాలు చేసే జంపన్న వాగులో తాత్కాలిక ఇసుక కట్టల మీదుగా ప్రయాణించి నీటి నిల్వను పరిశీలించారు. జంపన్నవాగు నుంచి మేడారంలోని గద్దెల ప్రాంగణం వరకు అడుగడుగునా భక్తులతో మాట్లాడి జాతర నిర్వహణ కోసం కల్పించిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐటీడీఏ గెస్ట్‌హౌస్‌లో అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. డిప్యూటీ సీఎం కడియం వెంట కలెక్టర్ ఆర్వీ కర్ణన్ తదితరులు ఉన్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు కడియం శ్రీహరి రాత్రి మేడారంలోనే బస చేశారు.



మేడారంలోని వనదేవతల గద్దెల ప్రాంగణంలో ఆదివారం కిక్కిరిసిన భక్తజనం



2న మేడారానికి సీఎం కేసీఆర్

మేడారం మహాజాతరకు ఫిబ్రవరి 2వ తేదీన సీఎం కేసీఆర్ హాజరవుతారని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి తెలిపారు. వన దేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం మేడారం జాతరను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నదని చెప్పారు. భారీగా నిధులు కేటాయించినందున ఏర్పాట్లను పక్కాగా చేపట్టి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

జాతీయ హోదా సాధిస్తాం..

మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతరకు జాతీయ హోదా సాధించి తీరుతామని టీఆర్ఎస్ ఎంపీలు పేర్కొన్నారు. నల్లగొండ, ఖమ్మం, చేవెళ్ల, మెదక్, జహీరాబాద్, పెద్దపల్లి, మహబూబాబాద్, వరంగల్ పార్లమెంటు సభ్యులు గుత్తా సుఖేందర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్, బాల్క సుమన్, సీతారాంనాయక్, పసునూరి దయాకర్ వనదేవతలను దర్శించుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం మహాజాతరను జాతీయ పండుగగా గుర్తించాలని కోరుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిందన్నారు. ఇటీవల డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ సీతారాంనాయక్ తదితరులు రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి మేడారం జాతరకు ఆహ్వానించడంతోపాటు ఈ మహాజాతరను జాతీయ పండుగగా గుర్తించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేసినట్టు తెలిపారు. మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని తాము కేంద్రంపై ఒత్తిడి తెస్తామని, పార్లమెంట్ సమావేశాల్లో కొట్లాడుతామన్నారు. 2020లో జరిగే మేడారం జాతర వరకు జాతీయ హోదాను సాధిస్తామని వారు తెలిపారు. సీఎం కేసీఆర్ తెలంగాణలో జాతరలకు, ఆలయాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు.



వనదేవతలను దర్శించుకుంటున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి



అమ్మవార్ల సన్నిధిలో గంటలు మోగిస్తున్న ఎంపీలు బాల్క సుమన్, గుత్తా సుఖేందర్‌రెడ్డి, బీబీ పాటిల్, విశ్వేశ్వరరెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి



వనదేవతలను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి



జగిత్యాల జిల్లా ఆరపేటలో సబ్సిడీ ట్రాక్టర్‌ను నడుపుతున్న మంత్రి పోచారం. చిత్రంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి

లాభసాటి వ్యవసాయమే లక్ష్యం

మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి

మెట్‌పల్లి/కమ్మర్‌పల్లి, నమస్తే తెలంగాణ: ప్రతి రైతు ఆత్మగౌరవంతో బతకాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ రైతాంగానికి మూడున్నరేండ్లలో అనేక పథకాలు ప్రవేశపెట్టారని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం ఆరపేట శివారులోఉద్యాశాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై యంత్రాలను అందించారు. అంతకుముందు మెట్‌పల్లిలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో కలిసి మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పాలీహౌస్‌కు ఎకరానికి రూ.40 లక్షలు ఖర్చు అవుతుండగా అందులో 75 శాతం ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, ఇప్పటి వరకు 1300 ఎకరాల్లో పాలీహౌస్‌లను మంజూరు చేశామన్నారు. 75శాతం సబ్సిడీ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఒక్క తెలంగాణ మాత్రమేనని తెలిపారు. 70ఏండ్ల పాలనలో జరుగని అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కేవలం 40నెలల్లో సీఎం కేసీఆర్ చేసి చూపించారన్నారు. అంతకుముందు నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం పడగల్ వద్ద ప్రభుత్వం నిర్మిస్తున్న పసుపు పార్కును త్వరగా పూర్తిచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

ఈ-పాస్ ద్వారా ఎరువుల విక్రయాలు

- కేంద్ర వ్యవసాయశాఖ అడిషనల్ కమిషనర్ వందన

వికారాబాద్ టౌన్: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించిన వారిపై చర్యలు తప్పవని కేంద్ర వ్యవసాయశాఖ అడిషనల్ కమిషనర్ వందన దివేది పేర్కొన్నారు. వికారాబాద్‌లోని ఆలంపల్లి రోడ్డులో సురేశ్ ఫెర్టిలైజర్ షాపును ఆదివారం తనిఖీ చేశారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని మోహన్‌రెడ్డి పొలంలో సాగుచేస్తున్న సేంద్రియ వ్యవసాయం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఈ పాస్ మిషన్ ద్వారా ఎరువులు, మందులను అందించాలని దుకాణ యజమానికి తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకొని, అనుమతిని రద్దు చేస్తామని స్పష్టంచేశారు.

కుంటాల జలపాతంలో మునిగి యువకుడి మృతి

నేరడిగొండ: ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం కుంటాల జలపాతం వీక్షించడానికి స్నేహితులతో కలిసి ఆదివారం వచ్చిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నీటిలోపడి మృతిచెందాడు. నేరడిగొండ ఎస్సై వెంకన్న కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని అమెజాన్ కంపెనీలో పనిచేసే ఇంజమమూల్ హక్ (21) పదిమంది స్నేహితులతో కలిసి కుంటాల జలపాతానికి వచ్చారు. ఈత కోసం నీటిలోకి దిగారు. ఇంజమమూల్‌తోపాటు కొందరు లోతైన ప్రదేశంలో మునిగిపోవడం గమనించిన స్థానికులు అందరినీ కాపాడే ప్రయత్నం చేశారు. వారిలో ఇంజమమూల్ మునిగిపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు.



ఆదిలాబాద్‌లో మంత్రి జోగురామన్న సమక్షంలో పార్టీలో చేరిన ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు



ఆర్మూర్ తొలి మున్సిపల్ చైర్మన్ త్రివేణి గంగాధర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ కవిత. చిత్రంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

టీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్ఎస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయి. ఆదివారం కూడా ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఇతర సంఘాల వారు పెద్ద ఎత్తున చేరారు. ఆదిలాబాద్‌లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగురామన్న సమక్షంలో ఎంఐఎం పార్టీకి చెందిన 200 మంది నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరారు. వరంగల్ అర్బన్ జిల్లా కమలాపూర్ మండల టీడీపీ అధ్యక్షుడు ఎర్రం ఇంద్రసేనారెడ్డి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తక్కళ్లపల్లి సత్యనారాయణరావు, సర్పంచ్‌లు రవి, రాజబోసు, తుమ్మల భాగ్య, ఎంపీటీసీ స్వరూపలతోపాటు మాజీ ఎంపీపీ పచ్చిమట్ల రాజయ్య, సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు సుమారు వెయ్యిమంది మంత్రి ఈటల రాజేందర్, కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ తొలి మున్సిపల్ చైర్మన్, పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు త్రివేణి గంగాధర్ (న్యాక గంగాధర్) ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీఆర్ఎస్‌లో చేరారు. గంగాధర్‌కు నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత గులాబీ కండువా కప్పి టీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. వనపర్తి జిల్లా పెద్దమందడి, గోపాల్‌పేట మండలాలకు చెందిన యువకులు, రైతులు, వివిధ పార్టీలకు చెందిన వారు టీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో కాంగ్రెస్‌కు చెందిన వార్డు సభ్యులు మరియమ్మతోపాటు 300 మంది కార్యకర్తలు ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.

తల్లీబిడ్డల క్షేమమే ప్రభుత్వ లక్ష్యం



హుజూరాబాద్‌లో జెండా ఊపి 102 వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఈటల

హుజూరాబాద్‌లో '102' వాహనాల ప్రారంభం: మంత్రి ఈటల రాజేందర్

హుజూరాబాద్, నమస్తే తెలంగాణ/కరీంనగర్ హెల్త్/కరీంనగర్ స్పోర్ట్స్: తల్లీబిడ్డల క్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఎంపీ వినోద్‌కుమార్‌తో కలిసి 'అమ్మఒడి' 102 వాహనాలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు అత్యవసర వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం 102 వాహనాలను ఏర్పాటు చేసిందన్నారు. 15 మంది లబ్ధిదారులకు రూ.6,18,500 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ధన్గర్‌వాడీ ఉన్నత పాఠశాలలో ఎంపీ వినోద్, జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావుతో కలిసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో బేస్‌బాల్ సీనియర్స్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను మంత్రి ఈటల ప్రారంభించారు.

గ్రామీణ క్రీడలకు పెద్దపీట: ఎర్రబెల్లి

పాలకుర్తి: గ్రామీణ క్రీడలకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. జనగామ జిల్లా పాలకుర్తిలో యువ చైతన్య యూత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. నియోజకవర్గంలో క్రీడలకు తగిన వసతులు కల్పిస్తానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన కొద్దిసేపు కబడ్డీ ఆడి అందరిని ఆకట్టుకున్నారు.



క్రీడాకారులతో కలిసి కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు

దొంగనోట్ల ముఠా గుట్టురట్టు

- రూ.4 లక్షల విలువైన నకిలీ నోట్లు స్వాధీనం

కాగజ్‌నగర్ టౌన్: రెండునెలలుగా గుట్టుచప్పుడు కాకుండా దొంగ నోట్లు చెలామణి చేస్తున్న వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కల్మేశ్వర్‌సింగెన్‌వార్ పేర్కొన్నారు. కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. ఆసిఫాబాద్‌కు చెందిన కాంబ్లె రమేశ్, వాంకిడి మండలానికి చెందిన తాండూరి ఉషా, రేపాక నాగభూషణం, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అస్మాఖాన్, షేక్ సలాఉద్దీన్ అలియాస్ సలీం, సయ్యద్ రఫీక్ దొంగనోట్లు చెలామణి చేస్తున్నారని కాగజ్‌నగర్ డీఎస్పీ సాంబయ్య, ఎస్‌హెచ్‌వో వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి శనివారం కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. అక్కడ అనుమానాస్పదంగా కనిపించిన రమేశ్, ఉషాను సోదా చేయగా రూ. 46,000 విలువగల నకిలీ నోట్లు లభించాయి. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా రేపాక నాగభూషణం వద్ద నుంచి నోట్లు తీసుకున్నట్లు చెప్పారు. ఆయన ఇంట్లో తనిఖీలు చేయగా రూ. 24,800, షేక్ సలాఉద్దీన్, అస్మాఖాన్, సయ్యద్ రఫీక్ ఇండ్లలో రూ. 3,35,300 విలువగల నకిలీ నోట్లు లభ్యమయ్యాయి. వీరిని విచారించగా ఆదిలాబాద్‌కు చెందిన కొందరి పేర్లను చెప్పారు. ఆరుగురు నిందితుల నుంచి రూ. 4,06,100 విలువచేసే నకిలీనోట్లు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.

పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో భారీ చోరీ

తాండూరు రూరల్: వికారాబాద్ జిల్లాలోని పెన్నాసిమెంట్ ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో శనివారం రాత్రి భారీ దొంగతనం జరిగింది. తాండూరు మండలం బెల్కటూర్ గ్రామంలోని కర్మాగారంలో గల నివాస సముదాయంలో రూ.30 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు చోరీ జరిగినట్టు పోలీసులు తెలిపారు. 26న గణతంత్ర దినోత్సవం, ఆదివారం వరుసగా సెలవు రావడంతో ఉద్యోగులు సొంత ఊళ్లకు వెళ్లారు. దొంగలు ఇదే అదనుగా భావించి సీజీఎం రెడ్డి నాగరాజు, రాంప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, రాఘవరావు ఇండ్లతోపాటు ఖాళీగా ఉన్న మరో ఇంట్లో చోరీకి పాల్పడ్డారు.

తుఫాన్ వాహనం బోల్తా: 12 మందికి గాయాలు

రామగిరి: మేడారం జాతరకు వెళ్లి తిరిగి వస్తుండగా తుఫాన్ వాహనం బోల్తాపడి 11 మందికి స్వల్పంగా, ఒకరికి తీవ్రంగా గాయాలైనట్టు కామారెడ్డి పోలీసులు తెలిపారు. జిల్లాలోని మోసంపూర్‌కు చెందిన 12 మంది మేడారం జాతరకు తుఫాన్ వాహనంలో వెళ్లి తిరిగి వస్తుండగా వారి వాహనం మంథని-పెద్దపల్లి రహదారి కల్వచర్లలో అదుపుతప్పి బోల్తాపడింది. రామగిరి పోలీసులు క్షతగాత్రులను పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

ముగ్గురు మావోయిస్టు కొరియర్ల అరెస్టు

కొత్తగూడ: ముగ్గురు మావోయిస్టు కొరియర్లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని మహబూబాబాద్ డీఎస్పీ నరేశ్‌కుమార్ తెలిపారు. వారి నుంచి ఓ రివాల్వర్‌తోపాటు తొమ్మిది బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. జిల్లాలోని గంగారం మండలం నర్సిగూడెం గ్రామానికి చెందిన ఈసం నాగేశ్వర్‌రావు, గంగారం మండల కేంద్రానికి చెందిన పర్శక వీరస్వామి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కారేపల్లి మండలం పేరెపల్లికి చెందిన వేమునూరి అశోక్‌కుమార్‌ను అరెస్టుచేసినట్టు తెలిపారు.

10 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

నిజామాబాద్ క్రైం: ఆంధ్రప్రదేశ్ నుంచి నిజామాబాద్ జిల్లాకు గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ముఠాను నిజామాబాద్ డివిజన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10 లక్షలు విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శాంతిభద్రతల విభాగం డీసీపీ శ్రీధర్‌రెడ్డి ఈ వివరాలు వెల్లడించారు. గంజాయి స్మగ్లర్ మునావర్ అలీ సహా ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 88 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కారును సీజ్‌చేసినట్టు తెలిపారు.

నమస్తే తెలంగాణ
ఆట
[హైదరాబాద్]
సోమవారం 29 జనవరి 2018

భారత ఎడమ చేతి పేసర్ జైదేవ్ ఉనద్కట్ ఐపీఎల్ వేలంలో జాక్‌పాట్ కొట్టాడు. రాజస్థాన్ రాయల్స్ ఇతడిని రూ.11.50కోట్లకు దక్కించుకుని రెండో రోజు వేలంలో సంచలనం నమోదు చేసింది. అంతేకాదు దేశవాళీ ఆటగాడు కృష్ణప్ప గౌతమ్‌కు రూ.6.20కోట్ల అత్యధిక ధరను వెచ్చించగా,అండర్-19 పేసర్ శివం మావి (రూ.3కోట్లు, కోల్‌కతా) మెరిసిపోయాడు. ఐపీఎల్-11 కోసం రెండు రోజులుగా బెంగళూరులో జరిగిన వేలం ఆదివారంతో ముగిసింది. మొత్తం 169మంది క్రికెటర్లను 8 ఫ్రాంచైజీలు దక్కించుకోగా..వీరిలో 56 మంది విదేశీ ఆటగాళ్లున్నారు. వీరి కోసం ఆయా ఫ్రాంచైజీలు 431.70కోట్లు ఖర్చు చేశాయి. ఆస్ట్రేలియన్ పేస్ బౌలర్ ఆండ్రూ టైని ఎవరూ ఊహించని విధంగా అత్యధిక ధర (రూ.7.20కోట్లు)కు పంజాబ్‌కు కొనుక్కున్నది. ఆఫ్ఘనిస్థాన్ క్రికెటర్లు ముజీబ్ (రూ.4కోట్లు, పంజాబ్), నబి (రూ.1కోటి, హైదరాబాద్) ఆకట్టుకోగా...నేపాల్ బాబు సందీప్ (రూ.20లక్షలు, ఢిల్లీ) కొత్త ప్రయాణం మొదలుపెట్టాడు. క్రిస్‌గేల్‌ను పంజాబ్ యజమాని ప్రీతిజింతా కరుణించగా.. గతేడాది అత్యధిక ధర (రూ.12కోట్లు) పలికిన తైమల్ మిల్స్‌ను ఈసారి ఎవరూ కొనలేదు. ఇతడితో పాటు కోరె అండర్సన్, హెన్రిక్స్, మోర్గాన్, హెడ్, సిమన్స్ అమ్ముడుపోని క్రికెటర్లుగా మిగిలారు. భారత ఆటగాళ్లలో ఇషాంత్, పుజారను ఎవరూ పట్టించుకోలేదు.

ఆదివారం వేలంలో ఎవరికి ఎంత

సన్‌రైజర్స్ హైదరాబాద్	
సందీప్‌శర్మ	రూ.3కోట్లు
మహ్మద్ నబి	రూ.1కోటి
క్రిస్ జోర్డాన్	రూ.1కోటి
శ్రీవాత్స్ గోస్వామి	రూ.1కోటి
బిల్లీ స్టాన్‌లేక్	రూ.50లక్షలు
సచిన్ బేబి	రూ. 20లక్షలు
తన్మయ్ అగర్వాల్	రూ.20లక్షలు
బిపుల్ శర్మ	రూ.20లక్షలు
మెహ్దీ హసన్	రూ.20లక్షలు

చెన్నై సూపర్ కింగ్స్	
శర్దుల్ ఠాకూర్	రూ.2.60కోట్లు
మురళీ విజయ్	రూ.2కోట్లు
మార్క్ ఉడ్	రూ.1.50కోట్లు
సామ్ బిల్లింగ్స్	రూ.1కోటి
దీపక్ చహార్	రూ.80లక్షలు
మిచెల్ సాంట్నర్	రూ.50లక్షలు
లుంగీ ఎంగ్డీ	రూ.50లక్షలు
ఆసిఫ్ కేఎం	రూ.40లక్షలు
జగదీశన్ నారాయన్	రూ.20లక్షలు
కనిష్క్ సేథ్	రూ.20లక్షలు
ధృవ్ షోరే	రూ.20లక్షలు
క్షితిజ్ శర్మ	రూ.20లక్షలు
చైతన్య బిష్ణోయ్	రూ.20లక్షలు
మోనుసింగ్	రూ.20లక్షలు

ఢిల్లీ డేర్ డెవిల్స్	
షహ్‌బాజ్ నదీమ్	రూ.3.20కోట్లు
ట్రెంట్ బౌల్ట్	రూ.2.20కోట్లు
డేనియల్ క్రిస్టియన్	రూ.1.50కోట్లు
నమన్ ఓజా	రూ.1.40కోట్లు
గురుకీరత్ సింగ్	రూ.75లక్షలు
అభిషేక్ శర్మ	రూ.55లక్షలు
జయంత్ యాదవ్	రూ.50లక్షలు
మన్‌జట్ కార్ల	రూ.20లక్షలు
సందీప్ లమిచ్ఛానె	రూ.20లక్షలు
సయన్ ఘోష్	రూ.20లక్షలు

కింగ్స్ ఎలెవన్ పంజాబ్	
ఆండ్రూ టై	రూ.7.20కోట్లు
ముజీబ్ జర్దాన్	రూ.4కోట్లు
మోహిత్‌శర్మ	రూ.2.40కోట్లు
బరీందర్ శ్రన్	రూ.2.20కోట్లు
క్రిస్ గేల్	రూ.2కోట్లు
బెన్ డ్వారుషిస్	రూ.1.40కోట్లు
మనోజ్ తివారి	రూ.1కోటి
అక్షర్‌దీప్ నాథ్	రూ.1కోటి
మయాంక్ డగర్	రూ.20లక్షలు
ప్రదీప్ సాహూ	రూ.20లక్షలు
మంజూర్ దార్	రూ.20లక్షలు

కోల్‌కతా నైట్‌రైడర్స్	
శివమ్ మావి	రూ.3కోట్లు
మిచెల్ జాన్సన్	రూ.2కోట్లు
వినయ్‌కుమార్	రూ.1కోటి
రింకూ సింగ్	రూ.80లక్షలు
కెమరూన్ డెల్‌పోర్ట్	రూ.30లక్షలు
జవాన్ సీర్లస్	రూ.30లక్షలు
అపూర్వ వాంఖడే	రూ.20లక్షలు

ముంబై ఇండియన్స్	
ఎవిన్ లూయిస్	రూ.3.80కోట్లు
బెన్ కట్టింగ్	రూ.2.20కోట్లు
రాహుల్ చహార్	రూ.1.90కోట్లు
ప్రదీప్ సాంగ్వన్	రూ.1.50కోట్లు
జాసన్ బెహ్రెన్‌డోర్ఫ్	రూ.1.50కోట్లు
జేపీ డుమినీ	రూ.1కోటి
సౌరభ్ తివారి	రూ.80లక్షలు
తజిందర్ ధిల్లాన్	రూ.55లక్షలు
అఖిల ధనంజయ	రూ.50లక్షలు
అదిత్య తరే	రూ.20లక్షలు
శరద్ లంబా	రూ.20లక్షలు
సిద్ధేశ్ లాడ్	రూ.20లక్షలు
మయాంక్ మార్కండే	రూ.20లక్షలు
అనుకూల్ రాయ్	రూ.20లక్షలు
మొహిసిన్ ఖాన్	రూ.20లక్షలు
నిదీష్ దినేషన్	రూ.20లక్షలు

రాజస్థాన్ రాయల్స్	
జయదేవ్ ఉనద్కట్	రూ.11.50కోట్లు
కృష్ణప్ప గౌతమ్	రూ.6.20కోట్లు
ధవల్ కులకర్ణి	రూ.75లక్షలు
జహీర్‌ఖాన్	రూ.60లక్షలు
బెన్ లాఫ్లిన్	రూ.50లక్షలు
దుశ్మంత చమీరా	రూ.50లక్షలు
అనురీత్‌సింగ్	రూ.30లక్షలు
ఆర్యమన్ విక్రమ్ బిర్లా	రూ.30లక్షలు
అంకిత్ శర్మ	రూ.20లక్షలు
శ్రేయాస్ గోపాల్	రూ.20లక్షలు
ఎంఎస్ మిథున్	రూ.20లక్షలు
ప్రశాంత్ చోప్రా	రూ.20లక్షలు
మహిపాల్ లోమ్రర్	రూ.20లక్షలు
జతిన్ సక్సేనా	రూ.20లక్షలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు	
వాషింగ్టన్ సుందర్	రూ.3.20కోట్లు
మహ్మద్ సిరాజ్	రూ.2.60కోట్లు
మురుగన్ అశ్విన్	రూ.2.20కోట్లు
నాథన్ కల్టర్‌నైల్	రూ. 2.20కోట్లు
పార్థివ్ పటేల్	రూ.1.70కోట్లు
మన్‌దీప్ సింగ్	రూ.1.40కోట్లు
పవన్ నేగి	రూ.1కోటి
టిమ్ సౌథీ	రూ.1కోటి
అనిరుద్ధ జోషి	రూ.20లక్షలు
పవన్ దేశ్ పాండే	రూ.20లక్షలు



రెండో రోజు వేలంలో అమ్ముడైన తొలి ఆటగాడు రాహుల్ చహార్... ఇతడి కోసం రాజస్థాన్ రాయల్స్ మొదట బిడ్ వేయగా..ముంబై రేసులోకి వచ్చి రూ.1.90కోట్లకు దక్కించుకున్నది.



జైదేవ్ బిగ్ హిట్

రూ.11.50కోట్లకు రాజస్థాన్ కైవసం ■ గౌతమ్‌కు అనూహ్య ధర
ఆఫ్ఘన్ సంచలనం ముజీబ్‌కు భారీ ధర ■ ఢిల్లీకి నేపాల్ కుర్రాడు
గేల్‌పై పంజాబ్ కరుణ ■ ముగిసిన ఐపీఎల్ వేలం

రెండు రోజులు.. 169 మంది క్రికెటర్లు..431కోట్లు..వెరసి పదకొండో సీజన్ కోసం జరిగిన ఐపీఎల్ వేలం ముగిసింది. భారత యువ పేసర్ జైదేవ్ ఉనద్కట్‌పై ఊహించని రీతిలో కాసుల వర్షం కురిసింది. రెండో రోజు వేలంలో జాక్‌పాట్ ఇతడిదే..ఆఫ్ఘన్ యువకెరటం ముజీబ్ సంచలనం రేకెత్తించగా..నేపాల్ తరపున ఒకే ఒక్కడు సందీప్ అందరినీ ఆశ్చర్యపరిచాడు.. విదేశీ క్రికెటర్ల కంటే దేశీ ధమాకా వైపు ఫ్రాంచైజీలు మొగ్గు చూపిన వేళ.. అండర్-19 ఆటగాళ్లను అదృష్టం వరించింది. చివరగా సునామీ వీరుడు గేల్‌పై పంజాబ్ యజమాని ప్రీతి కరుణ చూపింది..గతంలో హీరోలుగా చెలామణి అయిన మిల్స్ లాంటి ఎందరో ఈసారి జీరోలుగా మిగిలారు.

ఖరీదైన భారత ఆటగాడిగా..

రెండో రోజు వేలంలో జయదేవ్ ఉనద్కట్ అత్యంత ఖరీదైన ఆటగాడిగా సంచలనం సృష్టించాడు. సౌరాష్ట్రకు చెందిన ఈ లెఫ్టార్మ్ సీమర్‌ను దక్కించుకునేందుకు పంజాబ్, చెన్నై సూపర్ కింగ్స్ పోటీపడ్డాయి. ఈ రెండు ఫ్రాంచైజీల మధ్య హోరాహోరీ పోరు నడిచింది. ఆ తర్వాత రాజస్థాన్ రాయల్స్ రంగంలోకి దిగి ఉనద్కట్‌ను అత్యధిక ధర (రూ.11.50కోట్లు)కు దక్కించుకుని రెండో రోజు వేలం లోనూ తమకు తిరుగులేదని నిరూపించింది. ఉనద్కట్ ఐపీఎల్‌లో ఐదో జట్టుకు ప్రాతినిధ్యం వహించబోతున్నాడు. అంతకు ముందు ఢిల్లీ డేర్‌డెవిల్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, రైజింగ్ పూణె సూపర్‌జైంట్స్ తరపున ఐపీఎల్‌లో ఆడాడు.

వెస్టిండీస్ మీడియం పేసర్ జొవన్ సీర్లస్ ఐపీఎల్ పదకొండో సీజన్ వేలంలో అమ్ముడైన చివరి ఆటగాడుగా నిలిచాడు. ఇతడిని కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.30లక్షలకు కొనుక్కున్నది.




గేల్‌పై 'ప్రీతి'

ఐపీఎల్‌లో ఎంతమంది హిట్టర్లున్నా గేల్ ఆడితే వచ్చే మజాయే వేరు. అటువంటిది గేల్‌ను వేలంలో తొలిరోజు ఎవరూ పట్టించుకోకపోవడంతో అభిమానులు కాసింత నిరాశ చెందారు. రెండో రోజు వేలంలోనూ చివరిదాకా ఇతణ్ని ఎవరైనా దక్కించుకుంటారా అని ఆశగా చూశారు. చివరి 15మంది ఆటగాళ్లే ఉన్నారు. వేలంలో లంచ్ విరామం తర్వాత తొలిపేరు క్రిస్‌గేల్‌దే వచ్చింది. అయినప్పటికీ ఇతడిని ఏ ఒక్క ఫ్రాంచైజీ పట్టించుకోకపోవడం విశేషం..ఇక చివరి అవకాశంగా 15మంది అమ్ముడుపోని ఆటగాళ్లను మరోసారి వేలంలో ప్రవేశపెట్టగా..మళ్లీ గేల్ స్క్రీన్‌పైకి వచ్చాడు. అయితే ఈసారి కింగ్స్ ఎలెవన్ పంజాబ్ ఓనర్ ప్రీతిజింతా ఇతనిపై కరుణ చూపింది. వేరే ఫ్రాంచైజీలు పెద్దగా పోటీకి రాకపోవడంతో గేల్ రూ.2కోట్లకు పంజాబ్‌కు అమ్ముడయ్యాడు.



కృష్ణప్ప గౌతమ్ కోసం ఫ్రాంచైజీలు పోటీపడ్డాయి. ఆర్సీబీ బిడ్ వేయగా..కోల్‌కతా, ముంబై రేసులోకొచ్చాయి. ఆ తర్వాత రాజస్థాన్, ఆర్సీబీ మధ్య రసవత్తర పోటీ నడిచింది. చివరికి రాజస్థాన్ ఇతడిని రూ. 6.20కోట్లకు కైవసం చేసుకున్నది.



సిరాజ్..ఆర్సీబీకా రాజ్..

అవకాశాలు కొందరికే వస్తాయి. కానీ ఆ కొందరిలో అతికొద్దిమంది మాత్రమే వాటిని సద్వినియోగం చేసుకుని తమ బంగారు భవితకు బాటలు వేసుకుంటారు. అటువంటి జాబితాలో సిరాజ్ పేరు కచ్చితంగా ఉంటుంది. గత రెండేండ్లుగా క్రికెట్ ప్రపంచంలో కలియతిరుగుతున్న పేరు ఇది. ఒక్కసారి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఒక్కోమెట్టు ఎక్కుతున్నాడు. మధ్య తరగతి కుటుంబ నేపథ్యం..అలుపెరుగని అంకితభావం.. అన్నిటికీ మించి ఆత్మవిశ్వాసం. 140 కిలోమీటర్ల వేగంతో బంతులు వేసే సామర్థ్యం..యార్కర్స్ ఇతని బలం..స్లో బౌన్సర్ వేయడం ఇతని ప్రత్యేకత..ఇంతకు మించి మరేదైనా కావాలా, అంటే అది కచ్చితంగా ప్రోత్సాహమే. 2016-17 రంజీలో 41 వికెట్లు పడగొట్టిన ఇతని ప్రదర్శనకు మురిసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఐపీఎల్ ఆడే అవకాశం కల్పించింది. వీవీఎస్ లక్ష్మణ్, టామ్‌మూడీ శిక్షణ..సహచరుడైన భువనేశ్వర్ సలహాలు సిరాజ్‌లో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. అనూహ్యంగా భారత జట్టు నుంచి పిలుపు రావడం ఈ హైదరాబాదీ కుర్రాడి కెరీర్‌లోనే అద్భుతమైన ఘట్టంగా మిగిలిపోయింది. జాతీయ జట్టుకు ఆడిన తర్వాత సిరాజ్‌కు మళ్లీ ఐపీఎల్ నుంచి పిలుపు వచ్చింది. భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ నడిపిస్తున్న బెంగళూరు తరపున ఆడే అవకాశం దక్కింది. ఆర్సీబీ మెంటార్ భారత దిగ్గజ బౌలర్ నెహ్రా సారథ్యంలో శిక్షణ పొందడం సిరాజ్‌కు మరింత కలిసిరానుంది.

ఒకే ఒక్కడు

ఐపీఎల్ వేలంలో అమ్ముడైన తొలి నేపాల్ క్రికెటర్‌గా సందీప్ లమిచ్ఛానే రికార్డులకెక్కాడు. నేపాల్ తరపున వేలంలో పాల్గొన్నది కూడా ఈ ఒక్కడే కావడం విశేషం. 17 ఏండ్ల ఈ లెగ్ స్పిన్నర్‌ను ఢిల్లీ డేర్‌డెవిల్స్ రూ.20లక్షలకు దక్కించుకోవడంతో అతడు ఆనందోత్సాహంలో మునిగితేలుతున్నాడు. ఢిల్లీ జట్టుకు ట్విట్టర్ ద్వారా ధన్యవాదాలు తెలిపాడు.

సందీప్ రికార్డులు:
2016 అండర్-19 ప్రపంచకప్‌లో ఆడిన ఇతడు ఆ టోర్నీలో అత్యధిక వికెట్లు (14) పడగొట్టిన రెండో బౌలర్‌గా రికార్డు సాధించాడు. అంతేకాదు ఐర్లండ్‌పై హ్యాట్రిక్ సాధించి అండర్-19 ప్రపంచకప్‌లో ఈ ఘనత సాధించిన ఐదో బౌలర్‌గానూ రికార్డుల్లో చేరాడు.

అండర్-19 ప్రపంచకప్‌లో సందీప్ ప్రదర్శనను మెచ్చుకున్న ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ మైకెల్ క్లార్క్.. తనతో కలిసి హాంకాంగ్ టీ20లీగ్‌లో ఆడే అవకాశం కల్పించాడు. స్యాంగ్జాలో పుట్టి పెరిగిన ఇతడు రెండు మూడేండ్లు భారత్‌లోనూ ఉన్నాడు. సచిన్, ద్రవిడ్ వంటి దిగ్గజాల ఆటను చూసి ప్రభావితుడయ్యాడు. ఆసీస్ స్పిన్ దిగ్గజం షేన్‌వార్న్‌ను ఆదర్శంగా తీసుకుని లెగ్‌స్పిన్నర్‌గా రాణిస్తున్నాడు.



16 ఏండ్లు.. 4 కోట్లు

ఐపీఎల్‌లో రూ.4కోట్లు కొల్లగొట్టిన అతిచిన్న (16 ఏండ్ల) ఆఫ్ఘన్ క్రికెటర్‌గా ముజీబ్ జాద్రాన్ రికార్డులకెక్కాడు. పంజాబ్ రూ.4కోట్లతో ఇతడిని కైవసం చేసుకున్నది. ఐర్లండ్‌పై వన్డేల్లో అరంగేట్రం చేసిన ఈ యువ స్పిన్నర్ తన తొలి మ్యాచ్‌లోనే 10 ఓవర్లలో 24 పరుగులకు 4 వికెట్లు పడగొట్టి అందరి దృష్టిని ఆకర్షించాడు.

టాప్-5 విదేశీ వీరులు

ఆటగాడు	ధర	జట్టు
స్టోక్స్	12.50 కోట్లు	రాజస్థాన్
క్రిస్ లిన్	9.60 కోట్లు	కోల్‌కతా
స్టార్క్	9.40 కోట్లు	కోల్‌కతా
మ్యాక్స్‌వెల్	9.00 కోట్లు	ఢిల్లీ
రషీద్‌ఖాన్	9.00 కోట్లు	హైదరాబాద్

టాప్-5 స్వదేశీ హీరోలు

ఆటగాడు	ధర	జట్టు
జైదేవ్	11.50 కోట్లు	రాజస్థాన్
మనీశ్‌పాండే	11.00 కోట్లు	హైదరాబాద్
రాహుల్	11.00 కోట్లు	పంజాబ్
కృనాల్ పాండ్యా	8.80 కోట్లు	ముంబై
శాంసన్	8.00 కోట్లు	రాజస్థాన్

ఎంత మిగిలింది?

చెన్నై	6.50 కోట్లు
ఢిల్లీ	కోటి 60 లక్షలు
పంజాబ్	10 లక్షలు
కోల్‌కతా	0
ముంబై	65 లక్షలు
రాజస్థాన్	కోటి 65 లక్షలు
బెంగళూరు	15 లక్షలు
హైదరాబాద్	65 లక్షలు

ఏ జట్టులో ఎంత మంది?

చెన్నై	25
ఢిల్లీ	25
పంజాబ్	21
కోల్‌కతా	19
ముంబై	25
రాజస్థాన్	23
బెంగళూరు	24
హైదరాబాద్	25

రైనా మళ్లీ జట్టులోకి

దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌కు ఎంపిక




న్యూఢిల్లీ: భారత సీనియర్ బ్యాట్స్‌మన్ సురేశ్ రైనా తిరిగి జట్టులోకి వచ్చాడు. దాదాపు గత ఏడాది కాలంగా జట్టుకు దూరమైన రైనా..దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్ కోసం ఎంపికయ్యాడు. వచ్చే నెల 18న మొదలయ్యే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు జాతీయ సెలెక్షన్ కమిటీ కోహ్లీ కెప్టెన్‌గా 16 మందితో కూడిన జట్టును ప్రకటించింది. 'యో-యో' ఫిట్‌నెస్ పరీక్ష పాస్ కావడంతో పాటు ఇటీవలి సయ్యద్ ముస్తాక్అలీ టీ20 టోర్నీలో సెంచరీతో రాణించడం రైనాకు బాగా కలిసొచ్చింది. మరోవైపు శ్రీలంకతో గత సిరీస్‌కు దూరమైన ధవన్, భువనేశ్వర్, అక్షర్‌పటేల్ తిరిగి జట్టులోకి రాగా, దీపక్ హుడా, మహ్మద్ సిరాజ్, వాషింగ్టన్ సుందర్, బాసిల్ థంపీ జట్టులో చోటు దక్కలేదు. లంకతో సిరీస్‌లో ఆకట్టుకున్న జయదేవ్ ఉనద్కత్, శార్దుల్ ఠాకూర్ తిరిగి ఎంపికయ్యారు.

జట్టు వివరాలు: కోహ్లీ(కెప్టెన్), రోహిత్ శర్మ, ధవన్, రాహుల్, రైనా, ధోనీ, కార్తీక్, హార్దిక్, మనీశ్ పాండే, అక్షర్‌పటేల్, చాహల్, కుల్దీప్, భువనేశ్వర్, బుమ్రా, ఉనద్కత్, శార్దుల్ ఠాకూర్.

రన్నరప్ సైనా

జకార్తా: ఇండోనేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ ఫైనల్లో భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్, చైనీస్ తైపీకి చెందిన తైజు యింగ్ 21-9,21-13తో సైనాపై వరుసగేముల్లో విజయం సాధించింది. తైజు తొలిసారిగా ఇండోనేషియా మాస్టర్స్ టైటిల్ సాధించింది.



నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన విద్యాసంస్థల క్రీడల ఉత్సవాలలో మహిళల టెన్నికాయిట్ ట్రోఫీని సాధించిన సరోజిని నాయుడు వనితా మహా విద్యాలయ విద్యార్థినిలకు ట్రోఫీని బహూకరిస్తున్న ఎగ్జిబిషన్ కార్యదర్శి డాక్టర్ ఎన్ వీఎన్ చార్యులు.

నిఖత్ జరీన్ శుభారంభం

న్యూఢిల్లీ: భారత బాక్సింగ్ ఓపెన్ టోర్నీలో రాష్ట్ర యువ బాక్సర్ నిఖత్ జరీన్‌కు శుభారంభం దక్కింది. ఆదివారం జరిగిన మహిళల 51కిలోల బౌట్‌లో నిఖత్..నీరజ్‌పై విజయం సాధించింది. మాజీ ప్రపంచ జూనియర్ చాంపియన్ అయిన నిఖత్ పదునైన పంచ్‌లతో విరుచుకుపడుతూ ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసింది. క్లీన్ హుక్స్, జాబ్స్‌తో ఆకట్టుకున్న నిఖత్ ఆఖరికి విజేతగా నిలిచింది. మిగతా బౌట్లలో స్టార్ బాక్సర్ మేరికోమ్(48కి) క్వార్టర్సలోకి ప్రవేశించగా, పూజ(69కి) సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. పింకి జాంగ్రా, సవీటి బూర, మనోజ్‌కుమార్, సతీశ్‌కుమార్ ముందంజ వేశారు.

36 ఏండ్ల వయసుతో ఫిట్‌నెస్ తగ్గడంతో ఆడే టోర్నీల సంఖ్యను తగ్గించుకున్నాడు.. ఏడాదిలో ఎన్ని టోర్నీలలో ఆడాలి.. ఫిట్‌నెస్ ఎలా కాపాడుకోవాలి.. గాయాలు వేధించకుండా జాగ్రత్తలు ఎలా తీసుకోవాలి.. ఇలా ప్రతి చిన్న విషయంపై దృష్టి పెట్టాడు.. గతేడాది ఆస్ట్రేలియన ఓపెన్‌తోపాటు యూఎస్ ఓపెన్ చాంపియన్‌గా నిలిచాడు. ఏటీపీ ప్రపంచ మాస్టర్స్ టోర్నీ విజేతగానూ నిలిచాడు.. దిగ్గజ ఆటగాడిగా రికార్డులు నెలకొల్పుతూ.. యువ ఆటగాడిగా కెరీర్‌ను ముందుకు దూకించాడు.. వరుస విజయాలతో మళ్లీ గతేడాది ప్రపంచ నంబర్ 2 ర్యాంకర్‌గా నిలిచి గత వైభవం సాధించాడు..

ఫెదరర్ @ 20

ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత స్విస్ దిగ్గజం
ఫైనల్లో సిలిచ్‌పై పోరాడి గెలిచిన డిఫెండింగ్ చాంపియన్
20 గ్రాండ్‌స్లామ్స్ సాధించిన తొలి ఆటగాడిగా రికార్డు..



రోజర్ ఫెదరర్..వయసై పోయిందన్నారు.. ఇక ఆడలేడన్నారు..రిటైరైతే మంచిదన్నారు..ఎన్నో సలహాలు.. మరెన్నో సూచనలు.. నాలుగేండ్లపాటు గ్రాండ్‌స్లామ్ టైటిల్ అందలేదు.. ఐనా ఆడడం ఆపలేదు..ఎంతో డబ్బు.. అంతులేని కీర్తిప్రతిష్ఠలు..ఆడాల్సిన అవసరం లేదు..అరుదైన కెరీర్ స్లామ్ అందినా.. అత్యధిక గ్రాండ్‌స్లామ్స్ సాధించిన ఏకైక వ్యక్తిగా నిలిచినా.. అతను కోర్టును వీడలేదు.. ఓటమి ఎదురైతే కన్నీళ్లు పెట్టాడు.. ఆటను వీడలేని బాధను వెళ్లగక్కాడు.. ఈ ఏడాది తొలిగ్రాండ్‌స్లామ్ టోర్నీలోనూ మళ్లీ మెరిసాడు. ఐదుసెట్ల పోరాటంలో విజయాన్నందుకుని ఆరో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ అందుకున్నాడు.. 6 టైటిళ్లతో సెర్బియాస్టార్ జొకోవిచ్ రికార్డును సమం చేశాడు.. 16 గ్రాండ్‌స్లామ్ విజయాలతో నాదల్ రెండోస్థానంలో కొనసాగుతుండగా.. ఓవరాల్‌గా 20వ గ్రాండ్ స్లామ్ టైటిల్స్ సాధించిన ఫెదరర్ ఎవరెస్ట్ అంత ఎదిగాడు..

మెల్‌బోర్న్: టెన్నిస్ దిగ్గజం, స్విస్ యోధుడు రోజర్ ఫెదరర్ కొత్త చరిత్ర సృష్టించాడు. రికార్డుస్థాయిలో కెరీర్‌లో 6వ ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ కైవసం చేసుకుని ఓవరాల్‌గా 20 గ్రాండ్‌స్లామ్స్ సాధించిన తొలి టెన్నిస్ ఆటగాడిగా నిలిచాడు. క్రొయేషియా సూపర్‌స్టార్ మారిన్ సిలిచ్‌తో జరిగిన ఐదుసెట్ల హోరాహోరీ పోరాటంలో విజయం సాధించిన డిఫెండింగ్ చాంపియన్ ఫెదరర్ టైటిళ్ల సంఖ్యను 20కి పెంచుకున్నాడు. ఆదివారం రాడ్‌లేవర్ ఎరీనాలో జరిగిన ఫైనల్లో 6-2, 6-7 (5/7), 6-3, 3-6, 6-1 స్కోరుతో సిలిచ్‌ను ఓడించిన డిఫెండింగ్ చాంపియన్ ఫెదరర్ ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను నిలుపుకున్నాడు. ఒక్కసెట్టూ ఓడిపోకుండా ఫైనల్ చేరిన ఫెదరర్‌కు టైటిల్ పోరులో సిలిచ్ గట్టిపోటీ ఇచ్చాడు. తొలిగ్రాండ్‌స్లామ్ టైటిల్ విజేతగా నిలువాలనుకున్న ఆరోసీడ్ సిలిచ్ ఫైనల్ పోరులో 3 గంటల 3 నిమిషాలపాటు పోరాడినా ఫెదరర్‌ను ఓడించలేకపోయాడు. ఈ విజయంతో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఫెదరర్ జయాపజయాల సంఖ్య 94-13గా ఉంది. '20వ గ్రాండ్‌స్లామ్ విజయం కలలా ఉంది. అసాధ్యమనుకున్న 20 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించడం సంతోషంగా ఉంది' అని మ్యాచ్ అనంతరం ఫెదరర్ అన్నాడు. ఈ మ్యాచ్‌లో ఫెదరర్ 24 ఏస్‌లతో పాటు ఆరుసార్లు సిలిచ్ సర్వీస్ బ్రేక్ చేయగా.. 16 ఏస్‌లతో క్రొయేషియా స్టార్ ఫెదరర్‌కు గట్టిపోటీ ఇచ్చాడు. తొలిసెట్‌ను దూకుడుగా మొదలుపెట్టిన ఫెదరర్ ..సిలిచ్ సర్వీసును బ్రేక్ చేసి ఆరంభంలోనే 3-0 ఆధిక్యంలోకి వెళ్లాడు. అదే ఊపులో 6-2తో సెట్ గెలుచుకున్నాడు. ఈ దశలో పుంజుకున్న సిలిచ్ రెండో సెట్‌ను ట్రైబ్రేకర్‌లో దక్కించుకోగా.. మూడోసెట్‌ను 6-3 సోరుతో మళ్లీ ఫెదరర్ గెలిచాడు. నాలుగోసెట్లో విజయంతో సిలిచ్ మ్యాచ్‌ను నిర్ణయాత్మక ఐదోసెట్‌కు మళ్లించగా.. ఫెదరర్ 6-1తో సునాయాసంగా సెట్‌తోపాటు చాంపియన్‌షిప్ సాధించాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ 6 సార్లు, ఫ్రెంచ్ఓపెన్ ఒకసారి, వింబుల్డన్ టోర్నీ 8 సార్లు, యూఎస్ ఓపెన్‌లో 5సార్లు విజేతగా నిలిచిన ఫెదరర్ 20 గ్రాండ్‌స్లామ్స్ సాధించిన తొలి ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు.



మిక్స్‌డ్ డబుల్స్‌లో రన్నరప్‌గా నిలిచిన రోహన్ బోపన్న, టిమియా బబోస్ జోడి. ఫైనల్లో 6-2, 4-6, 9-11తేడాతో డబ్రోస్కి జోడీపై ఓడింది.

ఐదో వన్డేలో ఇంగ్లండ్ గెలుపు

పెర్త్: ఐదు వన్డేల సిరీస్‌ను ఇంగ్లండ్ 4-1తో కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఆఖరి వన్డేలో ఇంగ్లండ్ 12 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాపై ఉత్కంఠ విజయం సాధించింది. ఇంగ్లండ్ నిర్దేశించిన 260 పరుగుల లక్ష్యఛేదనలో ఆసీస్..టామ్ కుర్రాన్(5/35) , మొయిన్ అలీ(3/55) ధాటికి 48.2 ఓవర్లలో 247 పరుగులకు ఆలౌటైంది. స్టోయినిస్(87) అర్ధసెంచరీతో ఆకట్టుకోగా, మ్యాక్స్‌వెల్(34), టిమ్ పైన్(34) ఫర్వాలేదనిపించారు. తొలుత జోరూట్(62), జాసన్ రాయ్(49) రాణింపుతో ఇంగ్లండ్ 47.4 ఓవర్లలో 259 పరుగులు చేసింది. ఆండ్రూ టై(5/46) ఐదు వికెట్లతో అదరగొట్టగా, మిచెల్ మార్ష్(2/24) రెండు వికెట్లు పడగొట్టాడు. ఐదు వికెట్లు తీసిన కుర్రాన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', రూట్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కాయి.

పేస్ @ 25 ఏటీపీ టైటిల్

న్యూఢిల్లీ: భారత వెటరన్ టెన్నిస్ స్టార్ లియాండర్‌పేస్..తన కెరీర్‌లో 25వ ఏటీపీ టైటిల్‌ను ఖాతాలో వేసుకున్నాడు. జేమ్స్ సెరెటనీ జోడీగా న్యూపోర్ట్ బీచ్ ఈవెంట్‌లో పేస్ విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్-అమెరికా ద్వయం పేస్, జేమ్స్ 6-4, 7-5తో డెన్నిస్, ట్రీట్ హ్యూయ్ జోడీపై విజయం సాధించింది. ప్రస్తుతం ఈ విజయం ద్వారా 125 పాయింట్లు దక్కించుకున్న పేస్..టాప్-50లోకి వచ్చే అవకాశముంది.

బ్రిటన్‌కు చేరిన భారత మహిళా నావికా దళ నౌక



లండన్ : మహిళా సిబ్బందితో కూడిన భారత నావికాదళ నౌక (ఐఎన్ఎస్వీ తరుణి) బ్రిటన్ సముద్ర జలాల్లో లంగరు వేసింది. ఫాక్లాండ్ రాజధాని స్టాన్లీ రేవులో ప్రస్తుతం ఈ నౌక ఉన్నది. గోవా నుంచి సెప్టెంబర్10న ప్రారంభమైన ప్రపంచయాత్రలో ఇప్పటివరకు 15,000 నాటికల్ మైళ్ల ప్రయాణాన్ని వారు పూర్తిచేసుకున్నారు. లెఫ్టినెంట్ కమాండర్ వర్తికా జోషి నేతృత్వంలో లెఫ్టినెంట్ కమాండర్లు ప్రతిభాజెంవాల్, పీ స్వాతి, లెఫ్టినెంట్స్ ఎస్ విజయదేవి, బీ ఐశ్వర్య, పాయల్‌గుప్తాతో కూడిన బృందం ఈ నౌకకు సారథ్యం వహిస్తున్నది.

త్వరలో డ్రైవర్ రహిత రిక్షాలు




న్యూఢిల్లీ: త్వరలో డ్రైవర్ రహిత రిక్షాలు ఢిల్లీ వీధుల్లో పరుగులు తీయనున్నాయి. ఇంద్రప్రస్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) విద్యార్థులు విద్యుత్‌తో స్వతంత్రంగా నడిచే ఈ-రిక్షాలను రూపొందిస్తున్నారు. నగరాల్లోని మెట్రో వంటి ప్రజారవాణా వ్యవస్థకు అనుబంధంగా వీటిని నడుపనున్నట్టు చెప్తున్నారు. సెంటర్ సిబ్బందితోపాటు ఐఐఐటీ ప్రొఫెసర్లు, పీహెచ్‌డీ విద్యార్థులు ఇందులో భాగస్వాములుగా ఉన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, 3డీ మ్యాప్‌ల ద్వారా మార్గాన్ని నిర్దేశించుకునేలా వీటిని రూపొందిస్తున్నామని సెంటర్ హెడ్ మయాంక్ వత్స తెలిపారు. 2016లో ఈ ప్రాజెక్టును ప్రారంభించామని త్వరలోనే క్యాంపస్‌లో డ్రైవర్ రహిత ఈ-రిక్షాలను పరుగులు పెట్టిస్తామన్నారు.

99 ఏండ్ల రోగికి దవాఖాన బర్త్ డే పార్టీ

టెక్సాస్: చికిత్స కోసం తమ దవాఖానకు వచ్చిన ఓ వృద్ధురాలికి వైద్యులు, నర్సులు మరిచిపోలేని బహుమతి అందించారు. దవాఖానలో అడుగుపెట్టిన డొరొతీ లోమన్‌కు 99వ పుట్టినరోజు వేడుక జరిపి ఆశ్చర్యపరిచారు. అమెరికాలోని డల్లాస్ నగరంలో శనివారం ఓ హాస్పిటల్‌కు ఆమె వైద్యం కోసం వచ్చారు. అదేరోజు పుట్టినరోజు అని తెలుసుకొన్న వైద్యసిబ్బంది బర్త్ డే వేడుక నిర్వహించి ఆశ్చర్యానికి గురిచేశారు. దీంతో ఆనందంతో ఆమె దవాఖాన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. నెల రోజుల తర్వాత ఆమె గుండె వాటకానికి (వాల్వ్) చికిత్స జరుగనున్నది.

సంపన్న ఎంపీలు వేతనాలు వదులుకోవాలి

బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీ సూచన



న్యూఢిల్లీ: అసమానతల అంతరాయాలను తగ్గించేందుకు సంపన్న పార్లమెంట్ సభ్యులు తమ మిగతా పదవీకాలంలో తమ వేతనాలను త్యాగం చేయాలని బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీ కోరారు. రూ.కోటికి పైగా ఆస్తులు గల ఎంపీలు 449 మంది ఉండగా, వారి కోసం ప్రభుత్వం నెలకు రూ.2.7 లక్షలు ఖర్చు చేస్తున్నది. ఈ నేపథ్యంలో సంపన్న ఎంపీలు వారి వేతనాలు వదులుకునేలా చొరవ తీసుకోవాలని లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు ఆయన ఆదివారం లేఖ రాశారు. సంపన్న ఎంపీలు తమ వేతనాలను వదులుకుంటే వారిపట్ల ప్రజల విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని అన్నారు. ఈ చర్య చేపట్టేందుకు స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. దేశంలోని సామాజిక, ఆర్థిక వాస్తవిక పరిస్థితిపై ఎంపీలు తప్పనిసరిగా ప్రతిస్పందించాలని సూచించారు. తన ప్రతిపాదన కొందరు ఎంపీలకు సమస్యగా మారుతుందన్నారు.

పట్టాలెక్కనున్న ప్రపంచశ్రేణి రైళ్లు

- వేగం, సౌకర్యాల్లో భారీ మార్పులకు చోటు
- జూన్‌నాటికి రానున్న రెండు సెమీ హైస్పీడ్ రైళ్లు
- శతాబ్ది, రాజధాని ఎక్స్‌ప్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా ట్రైన్-18, ట్రైన్-20 రైళ్లు
- 20శాతం ప్రయాణ సమయం ఆదా



న్యూఢిల్లీ, జనవరి 28: సంప్రదాయక భారతీయ రైల్వేలో సరికొత్త అధ్యాయం మొదలుకానున్నది. ప్రపంచశ్రేణి రైళ్లు ఇక మనదేశంలోనూ పరుగులుతీయనున్నాయి. బుల్లెట్ రైలు ప్రాజెక్టు నిర్మాణం ఇంకా ప్రారంభం కాకముందే.. హైస్పీడ్ రైళ్లు తెరపైకి దూసుకురానున్నాయి. దేశంలో తొలిసారిగా రూపొందుతున్న సెమీ-హైస్పీడ్ రైళ్లు ఈ ఏడాది జూన్ నాటికి పట్టాలెక్కనున్నాయి. ఈమేరకు చెన్నైలోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో రెండు రకాల హైస్పీడ్ రైళ్లను తయారు చేస్తున్నారు. రెండు 'ట్రైన్-18' రైళ్లు ఇప్పటికే తయారు కాగా,వాటికి తుదిమెరుగులు దిద్దుతున్నారు. ఇక ట్రైన్-20 తరహా రైళ్లను మరో రెండేండ్లలో తీసుకురానున్నారు. అత్యాధునిక ప్రపంచశ్రేణి సదుపాయాలతోపాటు, అపరిమితమైన వేగంతో ఈ రైళ్లు.. ప్రస్తుత లోకో రైళ్లతో పోల్చిచూస్తే ప్రయాణ సమయాన్ని 20శాతం తగ్గించనున్నాయి. వీటిలో ఆన్‌బోర్డ్ వైఫై సదుపాయంతోపాటు సమాచారం, కార్యక్రమాల డిస్‌ప్లేను నిరంతరాయంగా చూడవచ్చు. ఎల్ఈడీ లైటింగ్‌తోపాటు ఆకట్టుకునే బోగీలు ప్రయాణికులకు అంతర్జాతీయస్థాయి ప్రయాణ అనుభూతిని అందించనున్నాయి. ప్రధాన శ్రేణి నగరాలమధ్య ప్రయాణానికి ప్రస్తుతమున్న శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌ల స్థానంలో ఈ కొత్త ట్రైన్-18 తరహా రైళ్లను పూర్తిస్థాయిలో తీసుకురావాలని రైల్వేశాఖ యోచిస్తున్నది. అలాగే మరింత అత్యాధునిక వసతులతో ట్రైన్-20 రైళ్లను 2020 నాటికి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుత రాజధాని ఎక్స్‌ప్రెస్‌ల స్థానంలో వాటిని ప్రవేశపెట్టనున్నారు. 'మేకిన్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా రూపొందిస్తున్న ఈ రైళ్లను.. అంతర్జాతీయ రైళ్ల వ్యయంలో సగం ఖర్చుతోనే తయారు చేస్తున్నారు.

ట్రైన్-18
- **స్పీడ్:** 160 కి.మీ/గంట ... 16 స్టీల్ బాడీ కోచ్‌లు
- ఏసీ చైర్-కార్ తరహా సీటింగ్ (2 ఉన్నతశ్రేణి, 14 ద్వితీయశ్రేణి)
- వైఫై ఆధారిత సమాచార. కార్యక్రమాల డిస్‌ప్లే
- బోగీ పొడవునా సుదీర్ఘ కిటికీ అద్దాలు
- ఆటోమేటిక్‌గా తెరుచుకునే డోర్లతోపాటు స్టేషన్ల వద్ద ఆటోమేటిక్‌గా తెరుచుకుని మూసుకునే ఫుట్ స్టెప్స్
- ఆకట్టుకునే రూపుతో ఆధునిక బయోటాయ్‌లెట్లు

ట్రైన్-20
- **స్పీడ్:** 160 కి.మీ/గంట
- **టెస్టింగ్ స్పీడ్:** 176 కి.మీ/గంట
- బోగీ లోపలివైపు అల్యూమినియం గోడలు
- ఏసీ చైర్‌కార్, స్లీపర్ తరహా సీట్ల ఏర్పాటు
- 20 స్లీపర్ బోగీలు, 1ఏ, 2ఏ, 3ఏ ఏసీ బోగీలు
- ఇందులోనూ ట్రైన్-18 తరహా ప్రపంచశ్రేణి సదుపాయాలు

తప్పించుకున్నాడు.. తిరిగొచ్చాడు.. దొరికిపోయాడు!

కొలరాడో, జనవరి 28: మద్యంపై ఆశతో జైలునుంచి తప్పించుకున్న జాషువా హన్‌సేన్ అనే ఖైదీ తిరిగి జైల్లోకి వెళ్తూ అధికారులకు దొరికిపోయాడు. దీంతో 27 నెలల శిక్షకు మాత్రమే గురైన ఆయన జైలు నుంచి తప్పించుకున్నందుకుగాను మరికొంత కాలం కటకటాలు లెక్కించాల్సినపరిస్థితి ఏర్పడింది. ఈ ఘటన అమెరికాలోని కొలరాడో రాష్ట్రం, జెఫర్సన్ కౌంటీ జైలులో జరిగింది. జైలు తిండికి మొహం మొత్తిన ఆయన ఈనెల 25న తప్పించుకున్నాడు. ఇంటిభోజనం తిని, కొన్ని సీసాల మద్యం, చిరుతిండితో మరుసటిరోజు జైలుకు బయల్దేరిన జాషువాను పోలీసులు మధ్యలోనే పట్టుకున్నారు.

నెమ్మదిస్తున్న కాస్‌గంజ్

కాస్‌గంజ్ (యూపీ): అల్లర్లతో రగిలిపోయిన ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో క్రమంగా సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఘర్షణలకు కారణమని భావిస్తున్న 80 మందికి పైగా అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేశారు. రాపిడ్ యాక్షన్ ఫోర్స్, పీఏసీ బలగాలను భారీగా మోహరించారు. రాత్రి 10 గంటల వరకు ఇంటర్నెట్ సర్వీసులు నిలిపివేశారు. పోలీసు సోదాల్లో కొంత పేలుడు పదార్థాలనూ స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై 'జాతీయ భద్రతా చట్టం' కింద కేసులు నమోదు చేసినట్లు డీజీపీ ఓపీ సింగ్ తెలిపారు.

ఏఎఫ్ఎస్పీఏపై చర్చించే సమయం రాలేదు

సైనికాధిపతి జనరల్ బిపిన్ రావత్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: సైనిక బలగాల ప్రత్యేకాధికారాల చట్టం (ఏఎఫ్ఎస్పీఏ)పై పునరాలోచించడానికి, నిబంధనల సడలింపుపై చర్చించడానికి ప్రస్తుత సమయం సరైంది కాదని సైనికాధిపతి జనరల్ బిపిన్ రావత్ చెప్పారు. జమ్ముకశ్మీర్ వంటి రాష్ట్రాల్లో మానవ హక్కుల పరిరక్షణకు అవసరమైన ముందస్తు చర్యలన్నీ తీసుకుంటున్నామని పీటీఐకి తెలిపారు. 'ఏఎఫ్ఎస్పీఏ'పై రక్షణ, హోంశాఖల మధ్య ఉన్నతస్థాయిలో పలు దఫాలు చర్చలు జరిగిన నేపథ్యంలో రావత్ వ్యాఖ్యకు ప్రాధాన్యం ఏర్పడింది. కల్లోలిత ప్రాంతాల్లో పరిస్థితిని చక్కదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు సైన్యానికి ప్రత్యేకాధికారాలు దఖలు పరుస్తూ ఈ చట్టం చేశారు. దీన్ని ఉపసంహరించాలని సుదీర్ఘ కాలంగా డిమాండ్ నెలకొంది. కశ్మీర్ లోయలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాద చర్యలను నిరోధించే విషయమై నేరుగా స్పందించని బిపిన్ రావత్.. పలు ఆప్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

సీసీటీవీ కెమెరా నిఘాలో రైల్వే!

అన్ని స్టేషన్లలో ఏర్పాటుకు వచ్చే బడ్జెట్‌లో రూ.3 వేల కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైల్వే ప్రయాణికుల భద్రతకు వచ్చే బడ్జెట్‌లో కేంద్రం పెద్దపీట వేయనుంది. అన్ని రైళ్లు, రైల్వేస్టేషన్లలో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం 2018-19 బడ్జెట్‌లో సుమారు రూ. 3వేల కోట్లు కేటాయించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 395 రైల్వేస్టేషన్లు , 50 రైళ్లలో మాత్రమే సీసీటీవీ కెమెరాల వ్యవస్థ ఉంది. ఇకపై ప్రీమియర్, సబర్బన్ సహా 11వేల రైళ్లతోపాటు దేశవ్యాప్తంగా 8,500 రైల్వేస్టేషన్లలో వీటిని ఏర్పాటుచేయనున్నారు. అలాగే ఒక్కోకోచ్‌లో మొత్తం 8 కెమెరాల చొప్పున ఏర్పాటు చేస్తారు. రెండేళ్లలో రాజధాని, శతాబ్ది, దురంతోసహా అన్ని ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్లలో ఈ నూతన వ్యవస్థ అందుబాటులోకి రానున్నది. ఈసారి బడ్జెట్‌లో రైల్వే భద్రతకు పెద్దపీట వేయనున్నట్టు సమాచారం. దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం 4,943 మానవ రహిత లెవెల్ క్రాసింగ్‌లను తొలిగించడంతో పాటు, పాత పట్టాలను మార్చడం, పట్టాలను మరింత బలోపేతం చేసే దిశగా బడ్జెట్ కేటాయింపులు చేయనున్నట్టు సమాచారం. 2020 నాటికి అన్ని మానవరహిత లెవెల్ క్రాసింగ్‌లను తొలగించాలని రైల్వేశాఖ లక్ష్యంగా పెట్టుకున్నది.

ఐసీఏఆర్‌లో అగ్రికల్చర్ సైంటిస్టులు

విద్య, ఉద్యోగ సమాచారం

న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రిసెర్చ్ (ఐసీఏఆర్) ఆధ్వర్యంలోని అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఏఎస్ఆర్‌బీ) సైంటిస్ట్ పోస్టుల భర్తీకి అగ్రికల్చరల్ రిసెర్చ్ సర్వీస్ (ఏఆర్ఎస్) ఎగ్జామినేషన్-2017 (ప్రిలిమినరీ) , వివిధ వ్యవసాయ యూనివర్సిటీల్లో లెక్చరర్/అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల అర్హతకు నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్-I)-2018 ఉమ్మడి పరీక్ష రాయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

ప్రిలిమినరీ ఏఆర్ఎస్-2017, నెట్ (I)-2018 కంబైన్డ్ పరీక్షను హైదరాబాద్‌తో సహా దేశవ్యాప్తంగా 23 కేంద్రాల్లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఏఆర్ఎస్-2017 మెయిన్ పరీక్షను 12 కేంద్రాల్లో నిర్వహిస్తారు.


- **పోస్టు:** సైంటిస్ట్
- **మొత్తం ఖాళీల సంఖ్య -195** (జనరల్-103, ఓబీసీ-48, ఎస్సీ-23, ఎస్టీ-21)
- **విభాగాలవారీగా ఖాళీలు :** అగ్రికల్చరల్ (బయోటెక్నాలజీ-6, ఎంటమాలజీ-1, మైక్రోబయాలజీ-6), జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్-18, ప్లాంట్ బయోకెమిస్ట్రీ-9, ప్లాంట్ పాథాలజీ-8, ప్లాంట్ ఫిజియాలజీ-3, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ-2, యానిమల్ బయోటెక్నాలజీ-2, యానిమల్ జెనెటిక్స్ అండ్ బ్రీడింగ్-4, యానిమల్ ఫిజియాలజీ-2, లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్-4, వెటర్నరీ (మెడిసిన్-1, ఫార్మకాలజీ-1, పబ్లిక్ హెల్త్-1), ఫిషరీస్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్-6, అగ్రికల్చరల్ (కెమికల్స్-5, మెటీరియాలజీ-1), ఆగ్రోఫారెస్ట్రీ-4, ఆగ్రానమీ-8, సాయిల్ సైన్సెస్-10, అగ్రికల్చరల్ ఎకనామిక్స్-16, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్-6, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్-9, ఫామ్ మెషినరీ అండ్ పవర్-9, కంప్యూటర్ అప్లికేషన్ అండ్ ఐటీ-22, ల్యాండ్ అండ్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్-8, బయోఇన్ఫర్మాటిక్స్-11, అగ్రికల్చరల్ స్ట్రక్చర్ అండ్ ప్రాసెస్ ఇంజినీరింగ్-12
- **అర్హతలు:** అగ్రికల్చర్ రిసెర్చ్ సర్వీస్ (ఏఆర్ఎస్)-2017 కోసం గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ/తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. 2018 జూన్ 24 నాటికి డిగ్రీని పూర్తిచేసి ఉండాలి. నెట్ (I)-2018 కోసం సంబంధిత స్పెషలైజేషన్‌లో మాస్టర్ డిగ్రీని 2018 జూన్ 24లోపు పూర్తిచేయాలి.
- **వయస్సు:** ఏఆర్ఎస్ పరీక్షకు 21 నుంచి 32 ఏండ్ల మధ్య ఉండాలి. నెట్ పరీక్షకు కనిష్ఠంగా 21 ఏండ్లు, గరిష్ఠ వయోపరిమితి లేదు.
- **పే స్కేల్:** రూ. 15,600-39,100 + రిసెర్చ్ గ్రేడ్ పే రూ. 6,000/-
- **ఎంపిక:** ఆన్‌లైన్ రాతపరీక్ష ద్వారా
- **దరఖాస్తు ఫీజు:** ఏఆర్ఎస్ పరీక్షకు రూ. 500/-. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళలకు ఎటువంటి ఫీజు లేదు. నెట్ 2018 పరీక్షకు జనరల్ అభ్యర్థులు రూ. 1000/-. ఓబీసీ అభ్యర్థులు రూ. 500/-ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళలకు 250/-, ఏఆర్ఎస్, నెట్‌లకు (రెండింటికి) అప్లయ్ చేసేవారు
  జనరల్ అభ్యర్థులు రూ. 1500/-
  ఓబీసీ అభ్యర్థులు రూ. 1000/-
  ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళలకు రూ. 250/-
- **ఎన్నిసార్లు పరీక్ష రాయవచ్చు:** జనరల్ అభ్యర్థులు ఆరుసార్లు, ఓబీసీ అభ్యర్థులు తొమ్మిదిసార్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు (గరిష్ఠ వయోపరిమితి లోపల) ఎన్నిసార్లయిన పరీక్ష రాయవచ్చు. నెట్ పరీక్ష రాయడానికి ఎలాంటి పరిమితులు లేవు.
- **పరీక్ష కేంద్రాలు:** దేశవ్యాప్తంగా మొత్తం 23 సెంటర్లలో పరీక్షను నిర్వహిస్తారు
- **ఎంపిక:** ప్రిలిమినరీ, మెయిన్, వైవా ద్వారా
- ఏఆర్ఎస్-2017 ప్రిలిమినరీ(ఆబ్జెక్టివ్ టైప్)-150 మార్కులు, మెయిన్ (డిస్క్రిప్టివ్ టైప్)-240 మార్కులు, వైవాకు 60 మార్కులు.
- ప్రిలిమినరీ పరీక్షకు 2 గంటలు, మెయిన్ పరీక్షకు 3 గంటలు పరీక్ష సమయాన్ని కేటాయించారు.
- ప్రతి తప్పు సమాధానానికి 1/3 మార్కులను తగ్గిస్తారు.
- ఏఆర్ఎస్-2017 మెయిన్ పరీక్షకు అర్హత సాధించడానికి ప్రిలిమినరీ పరీక్షలో జనరల్ అభ్యర్థులు 45 శాతం, ఓబీసీ అభ్యర్థులు 40 శాతం, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు 35 శాతం కనీస అర్హత మార్కులను తప్పనిసరిగా సాధించాలి.
- వివిధ యూనివర్సిటీల్లో లెక్చరర్/అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల అర్హతకు నిర్వహించే నెట్ (I)-2018 పరీక్షలో జనరల్ అభ్యర్థులు 75 శాతం, ఓబీసీ అభ్యర్థులు 45 శాతం, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు 40 శాతం కనీస అర్హత మార్కులను తప్పనిసరిగా సాధించాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష:** 2018 ఏప్రిల్ 6 నుంచి 13
- **ఏఆర్ఎస్ మెయిన్ పరీక్ష:** 2018 జూన్ 24
- **చివరితేదీ:** 2018 మార్చి 2
- **వెబ్‌సైట్:** www.asrb.org.in

టీఎంసీలో జేఆర్ఎఫ్

ముంబైలోని టాటా మెమోరియల్ సెంటర్ (టీఎంసీ) లైఫ్ సైన్సెస్ విభాగాల్లో ఖాళీగా ఉన్న జేఆర్ఎఫ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ పరిధిలో పనిచేస్తున్న స్వయం ప్రతిపత్తిగల సంస్థ.



- జూనియర్ రిసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)
- **అర్హత:** ఎమ్మెస్సీ (అప్లయిడ్ బయాలజీ, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, బయోఇన్ఫర్మాటిక్స్, బయోఫిజిక్స్, బాటనీ, లైఫ్ సైన్సెస్, మైక్రోబయాలజీ, మాలిక్యులర్ బయాలజీ, జువాలజీ), ఎంటెక్ (బయోఇన్ఫర్మాటిక్స్/బయోటెక్నాలజీ), ఎంవీఎస్సీ లేదా ఎంఫార్మసీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- **స్టయిఫండ్:** రూ. 25,000/ + 30 శాతం హెచ్ఆర్ఏ (అదనంగా) చెల్లిస్తారు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 500/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా
- **చివరితేదీ:** ఏప్రిల్ 20
- **రాతపరీక్ష:** మే 27
- **వెబ్‌సైట్ :** www.actrec.gov.in

ఐఐటీ హైదరాబాద్‌లో

హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో ఖాళీగా ఉన్న జేఆర్ఎఫ్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **పోస్టు పేరు:** జేఆర్ఎఫ్-2
- **అర్హత :** బయోమెడికల్, బయోటెక్నాలజీ, నానో/కెమికల్ ఇంజినీరింగ్, ఎంఎస్ (ఫార్మా) లేదా తత్సమాన బయోసైన్సెస్ డిగ్రీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- **పే స్కేల్ :** రూ.25,000/-
- **ఎంపిక:** ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు:** ఈ మెయిల్ ద్వారా
- **చివరితేదీ:** ఫిబ్రవరి 4
- **వెబ్‌సైట్:** www.iith.ac.in

పీఎన్‌బీలో స్పోర్ట్స్ కోటా

పంజాబ్ నేషనల్ బ్యాంక్ స్పోర్ట్స్ కోటా(హాకీ) విభాగంలో ఖాళీగా ఉన్న క్లరికల్ క్యాడర్ పోస్టుల భర్తీకి అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **పోస్టు పేరు:** క్లరికల్ క్యాడర్
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 9
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదోతరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. నేషనల్/స్టేట్ లెవల్ స్థాయిలో హాకీ క్రీడలో పాల్గొని ఉండాలి.
- **వయస్సు:** 18 నుంచి 26 ఏండ్ల మధ్య ఉండాలి.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 300/- ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ. 50/-
- **పే స్కేల్ :** రూ. 11,765-31,540/- అదనంగా డీఏ, హెచ్ఆర్ఏ తదితర సదుపాయాలు ఉంటాయి



- **ఎంపిక:** స్పోర్ట్స్ ట్రయల్స్, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఫిబ్రవరి 3
- **వెబ్‌సైట్:**www.pnbindia.in


ఎన్ఐటీటీటీఆర్‌లో ప్రొఫెసర్లు

భోపాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రెయినింగ్ అండ్ రిసెర్చ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల (రెగ్యులర్/కాంట్రాక్టు ప్రాతిపదికన) భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఎంహెచ్ఆర్‌డీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఒక అటానమస్ ఇన్‌స్టిట్యూషన్.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 25 (ప్రొఫెసర్-5, అసిస్టెంట్ ప్రొఫెసర్-10, రిసెర్చ్ అసోసియేట్-10)
- **పోస్టు పేరు :** ప్రొఫెసర్స్/అసిస్టెంట్ ప్రొఫెసర్
- **అర్హతలు:** బీఈ/బీటెక్‌తోపాటు ఎంఈ/ఎంటెక్, పీహెచ్‌డీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీ, సైన్స్‌లో పీజీ, ఎంఈడీ / ఎంఏ ఎడ్యుకేషన్, పీహెచ్‌డీ, నెట్/స్లెట్, సెట్‌లో ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి. రిసెర్చ్ ఫెలో పోస్టుకు బీఈ/బీటెక్ తోపాటు ఎంఈ/ఎంటెక్‌లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత. గేట్‌లో ఉత్తీర్ణత సాధించాలి.
- **పే స్కేల్:** ప్రొఫెసర్-రూ. 37,400-67,000 + అకడమిక్ గ్రేడ్ పే రూ. 10,000/-




- అసిస్టెంట్ ప్రొఫెసర్-రూ. 15600-39,100 + అకడమిక్ గ్రేడ్ పే రూ. 6,000/-
- రిసెర్చ్ ఫెలో రూ. 25,000/- రెండో ఏడాదికి రూ. 28,000/-, మూడో ఏడాది రూ. 38,000/-
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 1000/-
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **వెబ్‌సైట్:** http://nitttrbpl.ac.in

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీలో

ఉత్తరాఖండ్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న రిసెర్చ్ సైంటిస్ట్, జేఆర్ఎఫ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 23
- డిప్యూటీ ప్రాజెక్టు లీడర్-1, డొమైన్ ఎక్స్‌పర్ట్-2, జీఐఎస్/రిమోట్ సెన్సింగ్ స్పెషలిస్ట్-1, సాఫ్ట్‌వేర్ స్పెషలిస్ట్-2, జూనియర్ రిసెర్చ్ ఫెలో-8, రిసెర్చ్ సైంటిస్ట్-1, రిసెర్చ్ అసోసియేట్-4, ప్రాజెక్ట్ అసిస్టెంట్-3, స్టూడెంట్ ఇంటర్న్‌షిప్-1
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో డాక్టరేట్ (సైన్స్/ఇంజినీరింగ్), పీజీ (ఇంజినీరింగ్), ఎంఈ/ఎంటెక్ (హైడ్రాలజీ, వాటర్ రిసోర్సెస్ ఇంజినీరింగ్, హైడ్రాలిక్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్, రిమోట్ సెన్సింగ్, జీఐఎస్, జియోఇన్ఫర్మాటిక్స్, ఎంసీఏ, బీటెక్(కంప్యూటర్ సైన్స్, ఐటీ), పీజీ (బేసిక్ సైన్స్, ఎర్త్ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, కెమిస్ట్రీ) లేదా తత్సమాన డిగ్రీలో ఉత్తీర్ణత. నెట్ లేదా గేట్‌లో ఉత్తీర్ణత సాధించాలి.



- **వయస్సు:** 35 ఏండ్లకు మించరాదు.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **ఇంటర్వ్యూతేదీ:** ఫిబ్రవరి 12, 15
- **వెబ్‌సైట్:** www.nihroorkee.gov.in

మైక్రోబయాలజిస్టులు

నేషనల్ హెల్త్ మిషన్ - తెలంగాణ ఆర్ఎన్‌టీసీపీ ప్రోగ్రామ్‌లో ఖాళీగా ఉన్న మైక్రోబయాలజిస్ట్ (తాత్కాలిక ప్రాతిపదికన) పోస్టుల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **పోస్టు:** మైక్రోబయాలజిస్ట్ (ఐఆర్ఎల్, ఈక్యూఏ, సీ అండ్ డీఎస్‌టీ ల్యాబ్)
- **అర్హతలు:** ఎమ్మెస్సీ (మెడికల్/అప్లయిడ్ మైక్రోబయాలజీ), మైక్రోబయాలజీలో ఎండీ, పీహెచ్‌డీ (మెడికల్ మైక్రోబయాలజీ)లో ఉత్తీర్ణత.
- **దరఖాస్తు :** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 31
- **వెబ్‌సైట్:** https://cgg.gov.in